ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2010 Q4 అక్టోబరు - డిసెంబరు ఆర్టికల్స్
# (పిడిఎఫ్ రూపంలో)
# విషయసూచిక


**ఇంతోటి తీర్పుకు ఇరవై యేళ్లా?- 1-7**
**గాంధీ భవనూ-గబ్బిలాలూ-1-5**
**ఇంతా చేసి ఓ బెంచి కోసమా...?**
**కుప్పిగంతులూ-కుళ్లమోత్తనాలూ**
**పేరులో పెన్నిధా? పెన్నిధికోసం పేరా?**
**సగోత్రికుల మధ్య వివాహాలు**
**ఆంధ్రప్రదేశ్ ఆయుర్దాయం ఏభై నాలుగేళ్లేనా?-1-4**
**జై సమైక్యం అంటే టిడిపికి నష్టమా..?-1**
**జై సమైక్యం అంటే టిడిపికి నష్టమా..?-1-4**
**వార్నీ, ఆంధ్రులనుకున్నా..**
**జగన్ అబ్సెస్డ్ మీడియా**
**ఈ కిరణం పధ్నాలుగు నెలలు లేటు...**
**తెలంగాణాకు ఆశా 'కిరణం'..? -1-4**
**పాచిక విసిరిన జగన్ - 1-4**
**పరధర్మో భయావహః**
**అధిష్టానం ఓ అత్తగారు - 1-9**
**జగన్, కెవిపి.. మధ్యలో ఓ లేఖ - 1-3**
**దమ్మిడీకి మూడు దీక్షలు...1-6**


**2010 అక్టోబరు 01** **ఎమ్బీయస్: ఇంతోటి తీర్పుకు ఇరవై యేళ్లా?- 1**

అయోధ్య తీర్పు వెలువడింది. వెలువడే రోజు రోడ్ల మీద జనాలంతా కొట్టుకు చచ్చిపోతారని పాలకులు అదలి చచ్చారు. వాయిదా వేయమని సుప్రీంకోర్టు దాకా వెళ్లాడు ఓ గడుగ్గాయి. రాజీ ప్రయత్నాలు చేయాలట. ఆయన వుంటే మంగలాడెందుకున్నట్టు ఆ రాజీతత్వమే వుంటే కోర్టులో యిన్నాళ్ల పాటు కేసెందుకు నలుగుతుందన్న ఆలోచన లేకుండా సుప్రీంకోర్టు స్టే యివ్వడం జరిగింది. ఇలా చేసి, అలా చేసి కామన్‌వెల్త్ గేమ్స్ అయ్యేదాకా తీర్పు బయటకు రాదన్న పుకార్లు వచ్చేశాయి. ఇటు చూస్తే సెంట్రల్ ఫోర్సు అయోధ్యకు వచ్చేసి కూచుంది. అప్పటిదాకా గోళ్లు గిల్లుకుంటూ కూచోడం ఎందుకని వాళ్లు లోకల్‌గా రేపులు అవీ మొదలెడితే...? అన్న సందేహం వచ్చింది నాకు.

నాలాటి సందేహమే సుప్రీంకోర్టు జడ్జీలకీ వచ్చిందేమో స్టే క్లియర్ చేసేశారు. (అదీ ఏకగ్రీవంగా కాదనుకోండి. ..విప్రా: బహుధా వదన్తి - (మేధావులు పలురకాలుగా చెప్తారు) అన్న సూక్తి వంటబట్టించుకున్న మన గౌరవనీయులైన న్యాయమూర్తులెప్పుడూ మరొకరితో గళం కలపరు. తీర్పు లన్నిటిలోనూ ఓ హైఫన్ రాక తప్పదు. 2-1 తీర్పు అనో 3-2 తీర్పు అనో ఏదో ఒకటి) 'నువ్వు ఏ తీర్పు యిచ్చినా ఎటుతిరిగి మా దగ్గరకు వచ్చేదేగా, సరే, కానీ' అనుకుని ఎట్టకేలకు వాళ్లు యిచ్చేయ్ అన్నారు.

హైకోర్టువాళ్లు యిచ్చేశారు. 60 యేళ్లనాటి కేసు, వేలాది పేజీల డాక్యుమెంట్లు, వందలాది సాక్షులు... తీర్పు అద్దిరిపోతుందనుకుని ఉగ్గబట్టుకుని ఎదురుచూశాం. తీర్పు కూడా వేలాది పేజీలుంది, సినాప్సిస్ యిస్తున్నాం అని ఓ మూడు నాలుగు పేజీలు యిచ్చారు. అది విన్నాక తక్కిన తీర్పు చదవాలని కూడా ఎవరికీ అనిపించినట్టు లేదు. మూడోరోజుకి అరపేజీ కేటాయించి వూరుకున్నాయి పత్రికలు.

తీర్పు వెలువడగానే మతవర్గాలు కలహించేస్తాయని బెంగపెట్టుకున్న వారందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంయమనం

పాటించినందుకు నాయకవర్గాలు మతవర్గాలను అభినందించాయి. బడాయి చూడండి! వాళ్లు రెచ్చగొట్టకపోతే రెచ్చిపోయే మతవర్గాలు ఏమున్నాయి కనుక? ఈ అయోధ్య యిస్యూ వట్టిపోయిన గొడ్డు, ఓట్లు రాల్చలేదని రాజకీయపక్షాలు గుర్తించాయి. గొడవ చేసినా లాభం లేదు అనుకున్నాయి. కిట్టుబాటు కాదు కాబట్టి గిల్లలేదు. వాళ్లు గిల్లలేదు కాబట్టి మతవర్గాలు విని ఊరుకున్నాయి. గిల్లి చూదామనే సరదా మీడియాకి వున్నా చావగొట్టి చెవులు మూస్తామని ప్రభుత్వం గట్టిగా చెప్పడంతో మీడియా నోరు మూసుకుంది. ఏతావాతా తేలేదేమిటంటే తలచుకుంటే మతకలహాలు ప్రభుత్వం ఆపగలదు.

ఈ కలహాల మాట పక్కన పెట్టండి. తీర్పు మీకెలా తోచింది? ఈ పాటికి మొత్తమంతా చల్లారి పోయి సెంట్రల్ ఫోర్స్‌లు కూడా గూటికి చేరాయి కాబట్టి అప్పొజిషన్‌వారు, పొజిషన్‌వారు రాజకీయలబ్ధికోసం కారుకూతలు కూసి పరిస్థితి వేడెక్కించడం లేదు కాబట్టి కాస్త నిజాయితీగా మనసు విప్పి మాట్లాడుకోవచ్చు. నా మట్టుకు నాకు తీర్పు వినగానే ఇదేదో మర్యాదరామన్న తీర్పులా అనిపించింది. మా పిల్లల పేచీల పట్ల నేనిచ్చే తీర్పులా అనిపించింది.

''నా బొమ్మ అన్న విరక్కొట్టాడు'' అంటుంది మా అమ్మాయి. ''లేదు, నా బొమ్మే నేను విరక్కొట్టుకున్నాను'' అంటాడు అబ్బాయి. ''వాడి బొమ్మ వాడెప్పుడో విరక్కొట్టుకున్నాడు. నాది లాక్కుని యిప్పుడు విరక్కొట్టాడు'' అంటుంది అమ్మాయి. ''నా పుస్తకం చింపినపుడు నీకు వచ్చి చెప్పిందా, యిప్పుడు చెప్తోంది కానీ'' అంటాడు అబ్బాయి. ''పుస్తకం ముట్టుకున్నానంతే, దానంతట అదే చిరిగిపోయింది. దానికీ దీనికీ పోలికేమిటి? న్యాయం చెప్పు'' అని రాగం లంకించుకుంటుంది అమ్మాయి. ''న్యాయాలేమిటి దీనిలో? నేను పెద్దవాణ్ని. ప్రతీ చిన్నదానికీ యిలా ఏడ్చి సాధించుకుంటుంది. నువ్వు జాలిపడుతున్న కొద్దీ యిలా ఏడుస్తూనే వుంటుంది'' అంటూ నన్నే తప్పుపడతాడు వీడు. ఆదివారం నాటి పేపరు త ృప్తిగా చదువుకుంటూ ఓ చెవితో వీళ్ల గోల వింటున్న నాకు చికాకు వేస్తుంది. ''పోయినవి పోయాయిలే, చెరో కొత్త బొమ్మా కొనిస్తాను పొండి'' అంటాను.

వినరు. బొమ్మ సంగతి వదిలేయ్, న్యాయం చెప్పు అది చాలు అంటూ యిద్దరూ కలిసి ముక్తకంఠంతో అరుస్తారు. ఏడవకపోతే కేసు పోయేట్టుందనుకుని అబ్బాయి కూడా ఏడవడం మొదలుపెడతాడు. ఈ ఏడుపులు, పెడబొబ్బలతో తన పూజ సాగటం లేదని మా ఆవిడ వంటింట్లోంచి కేకలు పెడుతుంది. ఊరుకున్నకొద్దీ రచ్చ పెరుగుతోందనుకుని నేను పిల్లలిద్దరికీ చెరోటి తగిలించి ఓ గదిలోకి తీసుకెళ్లి పడేసి గొళ్లెం పెట్టేసి, 'ఇక్కడే కొట్టుకు చావండి, ఎవరికి ఏం కావాలో  మీరే తేల్చుకోండి' అంటాను. నా పేపరు, మా ఆవిడ పూజ అయాక గొళ్లెం తీసి చూస్తే యిద్దరూ బిక్కచచ్చి చెరోమూల పడివుంటారు. ''రండి భోజనం చేదురుగాని. అన్నా చెల్లెలన్నాక కలిసి  మెలసి వుండాలి.'' అని బుజ్జగిస్తూ, హితబోధలు చేస్తూ వంటింట్లోకి తీసుకెళతాం. వాళ్లూ ఆకలిమీద వుంటారేమో ఏమీ మాట్లాడరు. ఇవాళ్టి సంఘటన వచ్చే ఆదివారం పేచీకి ఎరువుగా (అబద్ధాలు చెప్పి అన్యాయంగా నీచేత కొట్టించింది/కొట్టించాడు) వాడుకుందామన్న ప్లాను వాళ్లది!

కోర్టు తీర్పు ఏమంది? తీర్పుకోరి వచ్చిన మూడుపార్టీలను మూడు ముక్కలు చేసి తీసుకోమంది. ప్రస్తుత పరిస్థితుల్లో విజ్ఞత కనబరచిన తీర్పు, శభాష్ అన్నారు కొందరు. దీనిలో విజ్ఞత కంటే కామన్‌సెన్సు ఎక్కువ కనబడుతోంది. రాజకీయ నాయకులకు యిబ్బంది కలగకుండా చూసిన చతురత కనబడుతోంది. ఈ ముక్క చెప్పడానికి లావులావు (ఆ పుస్తకాల అట్టలే వుంటాయి, మణుగు బరువు) న్యాయశాస్త్రగ్రంథాలు చదవనవసరం లేదు. శిథిలాలు శోధించనవసరమూ లేదు. ఈ తెలివితేటలు సోలమన్ రాజు ఎప్పుడో చూపించాడు. ఓ యిద్దరు తల్లులు యీ బిడ్డ నాదంటే నాదని వాదులాడుకుంటూ ఆయన దగ్గరకు వచ్చారు. బిడ్డను రెండు ముక్కలు కోసి చెరో సగం యిచ్చేయండి అన్నాడు సోల్మన్. ఆ మాట వినగానే కన్నతల్లి గుండెలు బాదుకుని 'కావాలంటే ఆ మహాతల్లి దగ్గరే వుండనివ్వండి నా బిడ్డను, ఎక్కడో అక్కడ బతికుంటే చాలు' అంది. ఠక్కున 'ఈవిడే అసలు తల్లి' అని పట్టేశాడు సోలమన్.



అలాగే యిప్పుడు కూడా ఆ స్థలాన్ని మూడుముక్కలు చేసుకోండి అనగానే 'మా రాములారు పుట్టినచోటుని ముక్కలు చేస్తే సహించలేం, కావాలంటే వాళ్లనే వుంచుకోమనండి' అని ఓ కక్షిదారు, 'మా మసీదును చెక్కలు చేస్తే చూడలేం, కావాలంటే వాళ్లనే అక్కడ ఉట్టో, ఉయ్యాలో కట్టుకుని వూరేగమనండి' అని అవతలి కక్షిదారు అనేస్తారని కోర్టు వాళ్లు ట్రిక్కేమైనా వేశారేమో ననుకున్నా కాస్సేపు. వీళ్లు మాత్రం 'చెప్పావులే మహ, పైవాడు ఢిల్లీలో వున్నాడు నీ పని పట్టడానికి' అనేసి వూరుకున్నారు తప్ప త్యాగాల జోలికి వెళ్లలేదు. రాముడు రాజ్యత్యాగం చేయవచ్చు, హుస్సేన్ ప్రాణత్యాగం చేయవచ్చు కానీ వాళ్ల అనుసరిస్తున్నామని చెప్పుకునేవాళ్లు మాత్రం కాసింత భూమిని వదులుకోలేరు. సుప్రీంకోర్టు యింకో రెండేళ్లు తీసుకుంటే 1992 లో బాబరీ మసీదు కూల్చి యిరవై యేళ్లవుతుంది లెక్కగా!

అయినా యీ తీర్పు వాళ్లకు ఎలా నచ్చుతుంది చెప్పండి. వాళ్లు అడిగినదేమిటి? కోర్టు చెప్పినదేమిటి? ఈ భూమికి హక్కుదారులం మేమా? వాళ్లా చెప్పండి అని అడిగారు. మా గుడో గోపురమో వుండేది దాన్ని వాళ్లు ఆక్రమించుకున్నారు, పడగొట్టారు. మీరు నిజానిజాలు విచారించి అది మాదే అని చెప్పండి అని ఆస్తిహక్కు గొడవగా వెళ్లారు. కోర్టువాళ్లు ఏం చెప్పారు? ఎవరిదైతేనేం ఉన్నది పంచేసుకుంటే పోలా? అన్నారు. ఆ మాట చెప్పడానికి యిన్నేళ్ల లిటిగేషన్ ఎందుకు? పంచాయితీ పెద్దల దగ్గరకి వెళ్లి వుండేవాళ్లంగా

అంటారు కక్షిదారులు.

ఆస్తి గొడవ ఏమిటి? 1992లో మన కళ్ల ఎదురుగానే బాబరీ మసీదు అనే ఓ పెద్ద కట్టడాన్ని కూల్చేశారు. కొంతమంది దుండగీడుతనం అనండి, ప్రభుత్వం అసమర్థత అనండి ఏవో కారణాల వలన అలా జరిగింది. మామూలు పరిస్థితుల్లో అలా కూలగొట్టేసిన కేసుల్లో ఆ కూల్చేసిన బిల్డింగ్ మళ్లీ తెచ్చి యివ్వలేకపోయినా ఆ బిల్డింగు వున్న స్థలమైనా వాళ్లకి యిచ్చేయాలి. ఇది సామాన్య న్యాయం. అయితే యిక్కడ లిటిగేషన్ ఏమిటి? ఇది ఒకప్పటి మా దేవుడి గుడి వుండే స్థలం. దాన్ని పడగొట్టి నువ్వు మసీదు కట్టావు కాబట్టి చెల్లుకు చెల్లు, మా గుడి మాకు తెచ్చి యివ్వలేవు కాబట్టి కనీసం స్థలమైనా మమ్మల్ని తీసేసుకోనీ అంటాడు ఓ కక్షిదారు. ఇక్కడ గ్రహించవలసినది మొదటిది 18 ఏళ్ల క్రితం జరిగింది, రెండోది 480 ఏళ్ల క్రితం జరిగిందని చెప్పబడుతోంది. పైగా దానికి రుజువులు లేవు.

అక్కడ వున్న రాములారి గుడిని పడగొట్టి బాబరు మసీదు కట్టించాడు కాబట్టి బాబరీ మసీదు అని దానికి పేరు వచ్చిందని ప్రచారం. బాబర్ జీవితచరిత్రను రాసిన 'బాబరునామా'లో యిలా పడగొట్టించిన విషయం ఏమీ లేదు. సిగ్గుపడి రాయలేదనుకోలేం. ఎందుకంటే యిలా గుళ్లు పడగొట్టడం వాళ్లకు సిగ్గుమాలిన పనేమీ కాదు. అదో పెద్ద ఘనతగా రాసుకుని వుండేవారు. శత్రురాజులను ఎలా తుదముట్టించాడో చెప్పుకోవడం మధ్యయుగపు రాజులకు మహా సంతోషదాయకమైన విషయం. శత్రురాజుల పీకలు పుచ్చకాయలు కోసినట్టు కోశాడని, శత్రురాజులు ఛస్తే వాళ్ల భార్యలు గుండెలు బాదుకుని ఏడుస్తూ వుంటే వారి వక్షోజాలు ఎగిరెగిరి పడ్డాయని – యిలాటి వర్ణనలు మన కావ్యాల్లోనూ చాలాచోట్ల కనబడతాయి. బాబరే గుడి కూలగొట్టి వుంటే తప్పకుండా దగ్గరుంచి తన జీవితచరిత్రలో రాయించి రెడ్డింక్‌తో అండర్‌లైన్ చేయించేవాడు. మరి అలాటప్పుడు బాబర్ పేరు ఎందుకు వచ్చింది?

ఇప్పుడు రాజీవ్ గాంధీ ఎయిర్‌పోర్టులో దిగి, రాజీవ్ రహదారి లోని రాజీవ్ పెట్రోలు బంకులో పెట్రోలు పోయించుకుని, అక్కడున్న రాజీవ్ పే అండ్ యూజ్ సౌకర్యాలను వినియోగించుకుని, రాజీవ్ ఫ్లయిఓవర్ మీద నున్న రాజీవ్ విగ్రహాలను దాటుకుని, రాజీవ్ అకాడమీ పక్క వీధిలో తిరిగి రాజీవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మీదుగా రాజీవ్ యూనివర్శిటీకి వెళుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ వాహనాలను తప్పించుకుంటూ, రాజీవ్ ఆసుపత్రి లోని రాజీవ్ బ్లాక్‌లోని రాజీవ్ కాన్ఫరెన్సు హాలులో రాజీవ్ పురస్కార గ్రహీత యిచ్చే రాజీవ్ స్మారక ఉపన్యాసానికి వెళుతున్నామా...

ఇవన్నీ రాజీవ్ గాంధీ దగ్గరుండి కట్టించాడా? చేయించాడా? రేపోదో సూపర్ కంప్యూటర్ తయారవుతే దానికీ అతని పేరే పెడతారు. అ కంప్యూటర్ మొహం కూడా చూడలేదు రాజీవ్. అలాగే బాబర్ పేర వున్న కట్టడం అతనే కట్టాలని లేదు. అతని సేనానో, వారసుడో, అతని వలన ఉపకారం పొందిన మరో సైన్యాధికారో, అతనిచ్చిన విరాళంతో ఏర్పడిన ఓ ట్రస్టో – ఎవరైనా ఆ పేరు పెట్టి వుండవచ్చు.

అది ఎప్పుడు కట్టారు అన్నది కూడా తేలలేదు. అక్కడున్న గుడి కూల్చి కట్టారో, కూలిన గుడిపైన కట్టారో చెప్పలేం అంటున్నారు. ఏదైనా జరిగివుండవచ్చు. ఇప్పుడు కాళహస్తి రాజగోపురం పడిపోయినట్టే అప్పట్లోనూ భూకంపాలకో, పిడుగుపాటుకో, ఆయుర్దాయం తీరిపోయో, నిర్మాణంలో లోపాల వలనో గుడి పడిపోయివుండవచ్చు. మన పల్లెటూళ్లలో నిర్లక్ష్యం వలన కూలినవి బోల్డు కనబడతాయి. లేదా గుడి కూల్చి కట్టినా అబ్బురమేమీ లేదు. ముస్లిము పాలకులకు అదేమీ కొత్త విషయం కాదు.

ఒకవేళ అదే జరిగి వుంటే యించుమించు అదే కాలంలో అదే ప్రాంతంలో వున్న తులసీదాసు గ్రంథస్తం చేసి వుండాలి కదా అని పాయింటు లాగుతారు కొందరు. కవిగారు కవిత్వం రాస్తారు తప్ప చరిత్రను అక్షరబద్ధం చేయరు. రామదాసు రాముడిగురించి కీర్తనలు రాశాడు, భద్రాచలంలో గుడిలో నీకు అవి చేయించాను, యివి చేయించాను అని రాసుకున్నాడు కానీ తానీషాగారు మా మామయ్య మాదన్నకు పెద్ద పదవి యిప్పించాడు ఆయనేమో నాకు ఉద్యోగం యిప్పించాడు, అసలు తానీషా చిన్నల్లుడైనా పదవి ఎలా దక్కిందంటే... అని చరిత్ర రాశాడా?



రాములారి గుడో, మరొకరి గుడో, లేకపోతే మరొకటో ఏదో ఒకటి వుండేది అని ఆర్కియాలిజీ వాళ్లు చెప్పారు. (దానిలోకూడా వివాదం వుందనుకోండి) ఆశ్చర్యం లేదు. మొత్తానికి ఆ వూళ్లో వాళ్లకు అక్కడ రాములవారు పుట్టారన్న నమ్మకం అయితే వుండేది. పుట్టినచోట కట్టిన గుడిని పడగొట్టి యీ మసీదు కట్టారన్న పుకారూ వుండేది. దాన్ని ఆధారం చేసుకుని జస్టిస్ శర్మగారు యిప్పుడు అది ఇస్లాం పద్ధతులకు విరుద్ధంగా కట్టినది కాబట్టి మొన్నటిదాకా వున్నది మసీదే కాదు పొమ్మన్నాడు. ఇది హాస్యాస్పదంగా వుంది.

గుళ్లు పడగొట్టినచోట కట్టిన మసీదులు మసీదులే కావంటే దేశంలో చాలా మసీదులు ఆ కేటగిరీలోకి చేరిపోతాయి. అయినా 400 ఏళ్ల పాటు అక్కడ ప్రార్థనలు చేసి దాన్ని మసీదుగా భావించి, రికార్డుల్లో కూడా మసీదు మసీదు అంటూంటే యీయన వచ్చి అబ్బే అది మసీదు కాదంటే ఒప్పుతుందా? సుప్రీంకోర్టులో యీ పాయింటు తప్పకుండా వీగిపోతుంది.

మన గుళ్లు సాధారణంగా ఆగమశాస్త్రం ప్రకారం కడతారు. కానీ కొన్నిచోట్ల విపర్యాలు కూడా వుంటాయి. దానికి ఓ కథ కల్పించి దాన్ని 'రెగ్యులరైజ్' చేసేస్తారు. ఒక్కో విగ్రహంలో శంఖుచక్రాలు తారుమారుగా వుంటాయి. ఇదేమిటి? అని అడిగితే

'భక్తుడిని అనుగ్రహించడానికి పరుగు పరుగున వస్తూ తొందరలో ఉల్టాపల్టాగా ధరించేశాడు' అని స్థలపురాణం చెప్తారు. ఓహో అని మనం వూరుకోవాలి కానీ ఈయన విష్ణువే కాదని వాదిస్తే చెప్పుచ్చుకుంటారు.

మనం ఏదో యిల్లు కడతాం. కుడీ ఎడమా ఇంతింత వదలాలని గవర్నమెంటు రూలు. ఏవీ ఫర్వాలేదంటూ మేస్త్రి మనం చెప్పినా వినకుండా చోటు వదలకుండా కట్టేస్తాడు. గవర్నమెంటు యింకో రెండేళ్లకు వచ్చి అది చూపించి డబ్బు కట్టించుకుని రెగ్యులరైజ్ చేశాం ఫో అంటుంది. అంతేకాని ఇది ఇల్లే కాదు అనదు. అలాటి కాలంలో వున్న కోర్టులో ఇస్లాము సూత్రాలకు విరుద్ధంగా కట్టారు కాబట్టి మసీదు కాదంటే కుదురుతుందా? పోయినది మసీదు కాబట్టి ఓ కక్షిదారు బెంగపెట్టుకోనక్కరలేదని ఆయన భావమేమో!

ఈయనలాగే ఆ కూలిపోయినదాన్ని సమాధి అనడానికి యిచ్చగించని ఓ వ్యక్తి అందరికీ తెలుసు. ఆయన పేరు అద్వానీ. ఆయన బాబరీ మస్‌జిద్ అని ఛస్తే అనడు. బాబరీ ఢాంచా అంటాడు. ఇంగ్లీషులో మాట్లాడినా అంతే... ఆ ఢాంచాను యింగ్లీషులోకి అనువదించడు. మసీదు అంటే చాలు ఎక్కడ అనృతదోషం పట్టుకుంటుందోనన్న భయం ఆయనది.

ఇదివరకు ఘంటాసురుడు అనే రాక్షసుడు వుండేవాడట. విష్ణుద్వేషి. ఒళ్లంతా గంటలు కట్టుకుని విష్ణువు పేరు ఎవరైనా ఉచ్చరిస్తే అది వినబడకుండా వెంటనే గంట వాయించేవాడట. రోజంతా చెవులు రిక్కించుకుని విష్ణువు పేరు ఎప్పుడు వినబడుతుందా ఎదురు చూసేవాడట. ఒరిజినల్ విష్ణుభక్తులకు కూడా అంత ధ్యాసవుండేది కాదని గ్రహించిన విష్ణువు వాడు చచ్చాక వైకుంఠం యిచ్చాడట. అలాగ అద్వానీగారు ఎక్కడ మస్‌జిద్ అని వినబడుతుందోనని నిరంతరం దాని ధ్యాసలోనే వుంటారు. (ఈయనను అల్లా కరుణిస్తాడనే అనుకుంటున్నాను) డిస్కషన్‌లో అవతలివాడు బాబరీ మస్‌జిద్ అనగానే యీయన బాబరీ ఢాంచా అనేవాడు.

అది మసీదు కాదనే అనుకుందాం ఢాంచానో ఢాబానో అనుకుందాం. కూల్చేశాం కదా. మళ్లీ కట్టి యివ్వడమో, కనీసం స్థలం వదిలిపెట్టి పోవడమో చేయాలి కదా! అబ్బే, అక్కడ తిష్ట వేశారు అద్వానీ గారి అనుయాయులు. ఎందుకురా అంటే కొన్ని వందల ఏళ్ల క్రితం మా గుడిని పగలకొట్టి మీరు మసీదో, ఢాంచానో మరేదో కట్టారు కనుక అంటున్నారు. ఇలా గతాన్ని తవ్వుకుంటూ పోతే ఎక్కడికి తేలతాం? ఒకప్పుడు బౌద్ధం, జైనం దేశమంతటా వర్ధిల్లాయి. గుళ్లు, ఆరామాలు, చైత్యాలు యిలా అనేక పేర్లతో కట్టారు. ఏవీ అవన్నీ? మతకల్లోలాలలో నాశనమయ్యాయి. దిబ్బ చేశారు. వాటిని హిందూదేవాలయాలుగా మార్చారు.

ఇది దేశమంతటా జరిగింది. ఆంధ్రదేశంలో మహారాజులు, మహారాణులు కూడా బౌద్ధ, జైన మతావలంబులు. మరి వాటి ఆనవాళ్లు ఎక్కడ మిగిలాయి? ఎన్ని మిగిలాయి? కాకతీయ రాజ్యంలో జైనాలయాలనే వీరభద్రాలయాలుగా మార్చారంటారు. బౌద్ధులో, జైనులో వచ్చి మా ఆలయాల్ని మాకు కక్కండి అంటే హిందువులం ఏం చేస్తాం? పాస్ట్ యీజ్ పాస్ట్ బ్రదర్ అంటాం. మూడు నాలుగు తరాలుగా ఫ్యాక్షనిజం సాగుతున్న రాయలసీమ కుటుంబాలకే సుద్దులు చెపుతున్నాం – కక్షలు, కార్పణ్యాలూ మరచి, ఒకరింటికి మరొకరు వియ్యమంది గొడవలు కట్టిపెట్టండి అని. మరి యీ విషయంలో యింత రచ్చ చేయడమేల? వదిలేస్తే దేవుడు దండిస్తాడా? మర్యాదా పురుషోత్తముడు రాముడు మనకు నేర్పిన మర్యాద యిదేనా? మనకున్న ఏకైక ఆలయం అదేనా ఏమిటి పెద్ద!

అసలు వున్న ఆలయాలను సంరక్షించుకోవడం లేదు మనం. ఆలయమాన్యాలన్నీ అన్యాక్రాంతమే. మిగిలినవాటిపై ఏడాదికి వెయ్యి రూపాయల అయివేజు కూడా యివ్వరు. సింహాచలం అప్పన్న ఆలయభూములను వేలం వేసైనా దేవస్థానానికి డబ్బు సమకూర్చుదామని ఈఓ ప్రయత్నిస్తే ఆక్రమించి సాగు చేసుకునేవారు ఆడవారితో సహా వచ్చి ఈఓను తన్నబోయారు మొన్న. అనేక గుళ్లలో దీపాలు పెట్టే దిక్కు లేదు. అదేదో సామెత చెప్పినట్టు మూలవిరాట్టులే ముష్టెత్తుకోవాల్సిన పరిస్థితి కల్పించాం.

మన తెలుగునాటే యిలా వుంటే ఉత్తరాదిన మరీ ఘోరం. అసలు అక్కడి గుళ్లకు వెళ్తే దేవుడిమీద నమ్మకం పోతుంది. సినిమాల్లో అండర్‌వరల్డ్ డాన్ డెన్‌కు వెళితే ఎలా ఫీలవుతామో ఆ గుళ్లలోకి వెళితే అలా ఫీలవుతాం. ఎటుచూసినా పండాల పేరుతో గూండాలు. పైసా దో పైసా దో అని పిశాచాల్లా పీక్కు తింటారు. కర్మకొద్దీ మనకు ముఖ్యమైన గుళ్లన్నీ అక్కడే వున్నాయి. కాశీ, ప్రయాగ, గయ, కలకత్తా, పూరీ.. ఏ గుడిలోకి వెళ్లినా ప్రశాంతత అనేది కనబడుతుందేమో కాగడా పెట్టి చూడండి. అసలు వాళ్లకు దేవుడిమీద భక్తి కూడా వున్నట్టు కనబడదు.

కాశీ విశ్వేశ్వరుడి గుళ్లో అంతా కశ్మలం. ఒక పద్ధతి లేదు, పాడు లేదు. గంగానదిని పాడు చేసి వదులుతాం. ఎంత అసహ్యంగా వుంటుందంటే మునగడానికే రోత పుడుతుంది. నేనైతే ముట్టుకోను కూడా ముట్టుకోలేదు. హృషీకేశ్ వెళ్లి అక్కడ స్నానం చేశాను. అక్కణ్నుంచి ఆ నదిని భ్రష్టు పట్టించి పట్టించి నానా ఛండాలం చేస్తూ వచ్చిన గంగాపరీవాహక ప్రజలకు అసలు పవిత్రత గురించి, ఆలయాల గురించి మాట్లాడే హక్కు వుందా అని నా సందేహం.

## 4

అయోధ్యలో కొత్త గుడి కట్టేస్తాం, దానికోసం యిటికలు పంపండి అంటూ నానా హడావుడి చేసినవారు వున్న గుళ్లను ఉద్ధరిస్తే శతకోటి తరాలు తరిస్తాయి. వీళ్లకు నిజంగా భక్తిప్రపత్తులు వుంటే వున్నవాటిని కాపాడుకోవాలి. బాగా మేన్‌టేన్ చేయాలి. అది చేతకాదు. చేతవచ్చిన దేమిట్రా అంటే ఎప్పుడో వందల ఏళ్ల క్రితం అన్యాక్రాంతం అయిందంటూ అయోధ్యలో ఎదటివాడిది ఆక్రమించడం. దాన్ని స్వాధీనం చేసుకుని మళ్లీ గుడి కట్టాలన్న ఆక్రోశం. అదొక ఉద్యమంలా అప్పుడప్పుడు నడుస్తూ వుండేది. కోర్టులో కేసులు

వేసుకున్నారు. 1885లో ఇలాగే ఓ హిందూ పూజారి కేసు వేస్తే అప్పటి బ్రిటిషు కోర్టులు యింత తాత్సారం చేయకుండా ఏడాదిన్నరలో మూడు స్థాయిల కోర్టుల్లో విచారించి 'శతాబ్దాలుగా ముస్లిముల హక్కుభుక్తములో వున్నందున యిప్పుడున్న పరిస్థితిని కొనసాగించవలెను' అని చెప్పి కేసు క్లోజ్ చేసి పారేశాయి.

దానితో తృప్తి పడని అక్కడి హిందువులు 1949లో ఒక ఘోరమైన పని చేశారు. బాబరీ మసీదు పక్కనే ఓ తొమ్మిది రోజులపాటు భజనలతో హోరెత్తించేసి అర్ధరాత్రి అందరూ నిద్రపోతూ వుండగా మసీదులో దూరి దొంగతనంగా విగ్రహాలు పెట్టేశారు. అక్కణ్నుంచి దాన్ని గుడి అనడం మొదలెట్టారు. ఇంతకంటె వింత ఏమైనా వుందా? ఏదైనా బొమ్మ పెట్టగానే అది గుడి అయిపోతుందా? అలా అయితే దేవుడి విగ్రహాలు చెక్కే శిల్పి యిల్లంతా దేవాలయమే నన్నమాట!

గుడిలో విగ్రహప్రతిష్ఠాపన అంటే బోల్డు తంతు వుంటుంది. ఓ క్రతువు వుంటుంది. హోమాలు చేస్తారు, ధ్వజస్తంభం పెడతారు, బలిపీఠం పెడతారు. విగ్రహపీఠం ముందు చక్రం వేయిస్తారు. రోజుల తరబడి పూజలు చేయిస్తారు. పీఠాధిపతో, మఠాధిపతో ఎవరో పూజ్యుణ్ని తీసుకుని వచ్చి కుంభాభిషేకం చేయిస్తారు. అన్నశాంతి చేస్తారు. అప్పుడు అది దేవుడి గుడి అవుతుంది. ఇవన్నీ ఎంత బాగా జరిగితే ఆ గుడికి అంత పవర్ అంటారు. అక్కడ ఎంతమంది మహానుభావులు తపస్సు చేస్తే అంత క్షేత్రమహిమ పెరుగుతుందనుకుంటాం. మీ యింటి పక్కన వెంకటేశ్వరుడి గుడి వున్నా తిరుపతికే వెళుతున్నారెందుకంటె మీరు అదే చెప్తారు.

అసలు యివన్నీ వదలండి, మామూలుగా యింట్లో గణపతి పూజ చేసుకున్నా ఆ స్థలాన్ని బాగా శుభ్రం చేసుకుని, ముగ్గులేసి తోరణాలు కట్టి అప్పుడు దేవుణ్ని ఆవాహన చేస్తాం. మంత్రం చెప్పుకుంటూ మనమీద మనం నీళ్లు చల్లుకుంటూ పవిత్రులమయ్యామని అనుకున్నాకనే పూజ చేస్తాం. మరి శతాబ్దాలుగా మ్లేచ్ఛులు పూజ చేసుకునే స్థలంలో ఎంత ప్రక్షాళన చేయాలి, ఎంత పుణ్యాహవచనం జరపాలి? అదేమీ లేకుండా ఎవడో దొంగతనంగా మూడు బొమ్మలు పెట్టేస్తే అది గుడి అయిపోతుందా? వాడేమైనా భక్త కన్నప్పా – ఎంత అనాచారంగా చేసినా భగవంతుడు సహించడానికి?

గుడి అంటే కాంప్లెక్సో, మల్టీప్లెక్సో కట్టినట్టు కాదు. దానికో శాస్త్రం, ఆగమశాస్త్రం వుంటుంది. గర్భగుడి గట్రా వుంటాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో తీరు. కానీ ఏ ప్రాంతంలోనైనా అరుగుమీద విగ్రహాలు పెట్టి అదే గుడి అంటే కుదరదు.

కాదు, కుదురుతుంది అన్నారు విజ్ఞులైన మన న్యాయాధీశులు. 1949లో దొంగతనంగా విగ్రహాలు పెట్టారని ఒప్పుకుంటూనే (పోలీసు రికార్డులున్నాయి మరి) అలా దొంగతనంగా, పద్ధతీ పాడూ లేకుండా పెట్టేసిన విగ్రహాలను రామ్‌లాలాగా (బాలరాముడు) గుర్తించి, ఆయనకు మూడోవంతు ఆస్తిని దఖలు పరచారు. రామ్‌లాలాని ఓ వ్యక్తిగా గుర్తిస్తే ఆయన దొంగలాగ ఆ కట్టడంలో దూరితే ఆయనకు దొరతనం కట్టబెట్టారన్నమాట వీళ్లు. రఘువంశ సుధాంబుధి చంద్రుడికి యింత కంటె ఘోరమైన కళంకం వుండదు. అందరూ ముక్తకంఠంతో చెప్పినా రాజ్యాన్ని వదిలిపెట్టి యవ్వనాన్ని అడవులపాలు చేసుకున్న త్యాగమూర్తికి యింతకంటె అవమానం యింకెవరూ చేయలేరు.

1949 లో విగ్రహాలు దొంగతనంగా పెట్టడం ఒక తప్పయితే అక్కడ విగ్రహాలు వున్నాయి కాబట్టి ముస్లిములు ప్రార్థనలు చేసుకోవడానికి వీల్లేదంటూ వారికి ప్రవేశం నిషేధించడం మరొక తప్పు. మీ యింట్లో ఎవరైనా దొంగసొమ్ము పట్టుకుని వచ్చి పడేసి, ఆ కేసు తేలేవరకూ నువ్వు ఆ యింట్లోకి వెళ్లకూడదనడం ఎంత అన్యాయం! అదే చేశారు.

అయితే ముస్లిములు దాని గురించి కేసు వేసి వూరుకున్నారు. మరీ గొడవలు చేయలేదు. అసలే విభజన, మతకల్లోలాలు జరిగిన కొత్తరోజులు. మతకలహాలతో విసిగిపోయి వుండి వుంటారు. దీని గురించి పేచీ ఎందుకులే అనుకుని వుంటారు. ఇది అలుసుగా తీసుకునే అద్వానీ 40 ఏళ్లగా ప్రార్థనలు జరపలేదు కాబట్టి అది మసీదు కాదన్న వాదన మొదలెట్టాడు. హంపి, బేలూరు, హలెబేడు వంటి వూళ్లలో దేవాలయాలు కొన్ని శతాబ్దాలపాటు మట్టిదిబ్బల కింద కూరుకుపోయి వున్నాయి. బయటపడిన తర్వాత వాటికి పూజలు జరపడం మొదలెట్టారు తప్ప గుడి కాదని వాటిని సత్రాల కింద వాడటం లేదు.

నిజానికి ముస్లిములకు బాబరీ మసీదు స్థలం మీద పెద్ద ప్రేమ ఏమీ లేదు. హిందువులకైతే అది రామజన్మభూమి అన్న నమ్మకం వుంది కాబట్టి ప్రత్యేకమైన శ్రద్ధ వుంది. ముస్లిములకు వేలాది మసీదుల్లో అది ఓ మసీదు.. అంతే. అక్కడ ఏ మహమ్మద్ ప్రవక్త వెంట్రుకో వుందంటే అప్పుడు వాళ్లకు సెంటిమెంటు వుండేది. బాబరు కట్టించాడనుకున్నా బాబరు వాళ్లకు దేవుడు కాదు, ప్రవక్త కాదు, ఏమీ కాదు. ఆ మసీదుతో వాళ్లకు ఏ అనుబంధాలు ముడిపడి లేవు.

అందుకే ఆ మసీదును అల్లరిమూకలు కూల్చేసినపుడు బాధపడ్డారు కానీ తిరగబడలేదు. మొన్న తీర్పు తర్వాత కూడా దేశంలోని మామూలు ముస్లిములు ఎంత శాంతంగా వున్నారో, కూల్చివేత సమయంలోనూ అలాగే వున్నారు. అయితే పరదేశంలోని ముస్లిం ఉగ్రవాదులు మాత్రం దాన్ని ఒక సాకుగా తీసుకుని ఉగ్రవాద చర్యలు చేపట్టి డిసెంబరు 6 ను ఒక బ్లాక్ డే గా గుర్తుంచుకునేట్టు చేశారు. వారి ప్రభావానికి గురైన కొంతమంది దేశీయ ముస్లిములు వారితో చేతులు కలిపారు తప్ప సాధారణ ముస్లిము మరీ ఆందోళనకు గురి కాలేదు.

నిజంగా ఆందోళనకు గురయినది సాధారణ హిందువు. పరమత సహనం యితరులకంటె హిందువులకు ఓ పాలు ఎక్కువ అని గర్వించే హిందువులందరం ఆనాడు తల వంచుకున్నాం. వాజపేయి వంటి నాయకులు కూడా సిగ్గుపడ్డారు, బాధపడ్డారు. సభ్యసమాజంలో మధ్యయుగాల ఆటవిక ప్రవృత్తిని కనబరచినందుకు క్షోభించాం. ముస్లిములకు నచ్చచెప్పి స్థలాన్ని తీసుకుని గుడి కట్టి వుంటే అందంగా వుండేదని అనుకున్నాం. పక్కపక్కన గుడి, మసీదు కూడా వుండవచ్చు కదా అనుకున్నాం. కానీ భజరంగదళ్, విశ్వ హిందూ పరిషత్, బిజెపి యివేవీ దానికి ఒప్పుకోలేదు. పరిక్రమ లోపున (అంటే గుడికి 5 కి.మీ.ల రేడియస్‌లో) మరే కట్టడమూ వుండకూడదని పట్టుబట్టారు. అలా అంటే ఆత్మగౌరవం వున్నవాడెవడైనా రాజీకి వస్తాడా?

బిజెపి దీనివలన రాజకీయలబ్ధి పొందింది కానీ దీనికంతటికీ మూలకారకుడు రాజీవ్ గాంధీ. షా బానో కేసులో ఛాందస ముస్లిములను బుజ్జగించాక హిందువులందరూ ఛీ కొట్టారు. దానికి విరుగుడుగా హిందువులను బుజ్జగించడానికి అంటూ ఎప్పుడో తాళాలు వేసి మూసేసి వున్న గుడిని అప్పటికప్పుడు తెరిపించాడు. హిందువులంతా పండగ చేసుకుని కాంగ్రెస్‌కు ఓట్లేసేస్తారని ఎవరో చెప్పివుంటారు పాపం.

కానీ బిజెపి దాన్ని అందిపుచ్చుకుంది. పార్లమెంటులో రెండే రెండు సీట్లతో కునారిల్లుతున్న ఆ పార్టీ జై శ్రీరామ్ అంటూ రథానెక్కింది. గుడి కట్టేస్తున్నాం, శంకుస్థాపన (శిలాన్యాస్) చేసేశాం అంది. ఆ శిలాన్యాస్ రోజునే బిజెపి నినాదం యిచ్చింది – 'శిలాన్యాస్ హోగయా, కాంగ్రెస్‌కా సత్యానాశ్ హోగయా' అని. నిజంగానే కాంగ్రెస్ సత్యానాశ్ అయింది. ఆ అయోధ్య గుడి యిచ్చిన ఊపిరితో బిజెపి పది పదిహేనేళ్లు లాక్కు వచ్చింది. ఇప్పుడు ఆ ఆవిరి యిగిరిపోయింది. ఇకపై ఆ అంబ పలికేట్టు లేదు. అందుకనే చప్పచప్పగా రియాక్టయ్యారు.

ఇరవై యేళ్ల క్రితం వున్న భావోద్వేగాలు యిప్పుడు కనిపించడం లేదు. హిందువులు కానీ, ముస్లిములు కానీ రోజెలా గడుస్తుందానే బెంగ పెట్టుకున్నారు తప్ప గుడి కడతారా, బడి కడతారా అని వర్రీ కావడం మానేశారు. ఇది మనబోటి వాళ్ల ఎకడమిక్ డిస్కషన్‌కే పనికి వస్తోంది. ఆ డిస్కషన్‌లో భాగమే కోర్టు తీర్పు గురించి యింత ఆలోచన.

ముగ్గురికీ మూడు ముక్కలు చేసి యిచ్చేసి – లీగల్ సెన్సు మాట ఎలా వున్నా – మంచి కామన్‌సెన్సు చూపించింది కోర్టు అని పైకి చూడడానికి అనిపిస్తుంది. హిందువులకు, ముస్లిములకు చెరోసగం యిచ్చేస్తే అలా అనుకోవచ్చు. కానీ యిక్కడ మూడో పార్టీ నిర్మోహి అఖాడాకి కూడా వాటా యిచ్చింది కోర్టు. అది చాలా ఘోరంగా కనిపిస్తోంది. అసలు వాళ్లెవరు దీనిలో దొరబడడానికి? మసీదు కట్టించినపుడు ఆ కాలంలో వాళ్లున్నారా? ఆ స్థలం వాళ్లదా? అబ్బే! లేదా అంతకుముందు గుడి వుండే కాలంలో వాళ్లు ధర్మకర్తలా? అబ్బే! మన తిరుమలను గుడిని మిరాశీదారులు నిర్వహించినట్టు అసలు ఆ గుడిని వాళ్లెప్పుడైనా నిర్వహించారా? లేదే! మరి వాళ్ల లోకో స్టాండీ ఏమిటి? 'గుడి నిర్వహణ సరిగ్గా లేదు, మాకు యివ్వండి మేం బాగా నిర్వహిస్తాం' అని కేసులో జొరబడ్డారు. వాళ్లూ ఒక పార్టీ అంది కోర్టు. మూడో వంతు ముక్క యిచ్చేసింది.

నేను మీకు ఓ సలహా యిస్తాను. 'టిటిడి నిర్వహణ లోపభూయిష్టంగా వుందని మీడియా ద్వారా నాకు తెలిసింది, అందువలన మా సంస్థ ద్వారా నేను చక్కగా నిర్వహిస్తాను' అని మీరు యిప్పుడే తిరుపతి కోర్టులో ఓ కేసు వేసుకుని కూచోండి. ఎప్పుడో ఒకప్పుడు తిరుమల కొండల గురించి ఏదో ఒక వివాదం రాకపోదు. ఏ ఏభై యేళ్లకో, అరవై ఏళ్లకో యిటువంటి మేధావులైన జడ్జీలు మళ్లీ ఉద్భవిస్తే మీకూ ఓ ముక్క పడేస్తారు. బతికుంటే మీరూ, లేకపోతే మీ వారసులు మీ పేరు చెప్పుకుని తరతరాలు బతికేస్తారు.

ఇక్కడో పిట్టకథ. ఒకింటికి ఒకాయన అతిథిగా వచ్చాడు. హాల్లో కూచున్నాడు. వంటింట్లో పొయ్యి మీద వుడుకుతున్న పులుసు గిన్నె కనబడుతోంది. అత్తగారు అటుగా వెళుతూ కాస్త ఉప్పు వేసి వెళ్లింది. కాస్సేపటికి పెద్దకోడలు యిటుగా వెళుతూ కాస్త ఉప్పు వేసి వెళ్లింది. ఇంకాస్సేపటికి చిన్న కోడలు కాస్త ఉప్పు, ఆవిడెళ్లాక కూతురు కూడా కాస్త ఉప్పు వేశారు. భోజనాల వేళ పులుసన్నం నోట బెట్టి యింటాయన 'అబ్బ ఉప్పు' అన్నాడు. 'సరిగ్గానే వేశానే అంది భార్య. 'అదేమిటి అత్తయ్యా, మీరూ వేశారా, నేనూ వేశానే' అంది పెద్దకోడలు. త్వరలోనే నలుగురూ తలో కాస్త ఉప్పు వేశారని తేలింది. 'నలుగురు వేసినా యింత ఉప్పగా వుండదే' అన్నాడు ఇంటాయన సాలోచనగా. అప్పుడు అతిథి గొంతు సవరించుకున్నాడు 'అందరూ ఉప్పు వేసి వెళుతూంటే యిది ఆనవాయితీ కాబోలనుకుని నేనూ కాస్త ఉప్పు వేశానండి' అన్నాడు.

అలా వుంది ఈ నిర్మోహి అఖాడా సంగతి. ఎలాగో కొట్టుకు ఛస్తున్నారు కదా, మనమూ ఓ చెయ్యేసి చూద్దాం అన్నట్టు ఓ కక్షిదారై పోయింది. నిజానికి యిలా దూరమని హిందూ సంఘాలే ప్రోత్సహించి వుంటాయి. చివరికి ముగ్గురికీ అన్నా మూడింట రెండు వంతులు హిందూ సంఘాలకే దక్కింది. తీర్పు వెలువడగానే హిందూ మహాసభ లాయరు అదే అన్నాడు. మూడింట రెండు వంతులు హిందువులకు, ఒక వంతు మాత్రమే ముస్లిములకు అని. అయినా వాళ్లు తృప్తి పడలేదు. సుప్రీంకోర్టుకి వెళ్లి మొత్తమంతా రాబడతారట. కానీయండి. ఇంకా ఎన్ని వింతలు చూడాలో మనం!

నిజానికి దీనిలో ముస్లిముల నష్టం తక్కువ. వాళ్లు యిక్కడ కాకపోతే మరో చోట నమాజు చేసుకుంటారు. ఎక్కడైనా వాళ్లకి ఒక్కటే. రైల్వే ప్లాట్‌ఫాం మీద కూడా గుడ్డ పరుచుకున్నా వాళ్లకి అది ప్రార్థనాస్థలమే. ఇక్కడ పోతున్నది హిందువుల కున్న యిమేజి! తరతరాలుగా అన్ని జాతులను, వర్గాలను మనలో కలుపుకుంటూ వచ్చిన ధర్మస్రవంతికి యిలా విఘాతం కలిగింది. అక్కడ రామాలయం కడితే కట్టనీయండి. అసలు ఉత్తరాదిన రామాలయాలు వుండవట. (మనకు కూడా భద్రాచలం తప్పిస్తే రామాలయం ఎక్కడుంది? రామ భజనమందిరాలు వున్నాయంతే. తమిళనాడులో అన్ని గుళ్లున్నాయి కానీ నాకు తెలిసి రాముడికి ఎక్కడా లేదు. కర్నాటకలో మాత్రం! సరే కేరళలో అసలే లేవు. విష్ణువు రూపాలలో మనకు గుళ్లున్నది వేణుగోపాలుడికి, రంగనాథుడికి, నరసింహస్వామికి. (శ్రీకూర్మం వంటిది విశేషం) అందుకే ఆ కాలంలో రామాలయం వుందని నమ్మడానికి లేదన్నారు చరిత్రకారులు.

కాదు వుండేది, రాముడు ఉన్నాడు, యిక్కడే పుట్టాడని మేం నమ్ముతున్నాం అన్నారు ఇద్దరు జడ్జీలు. ఆధారాలు లేకపోయినా ఎలా నమ్ముతున్నారు అని మనం అడగలేం. అది నమ్మకానికి సంబంధించిన విషయం. డిబేటబుల్ యిస్యూ కాదు. వాళ్లు నమ్మారు, గుడి కట్టుకోండి, అని పర్మిషన్ యిచ్చేశారు. 'పోనీ అప్పుడు లేకపోయినా యిప్పుడు కట్టమనండి. బాగా మేన్‌టేన్ చేయమనండి. అది బాగా వుందంటే వెళ్లి చూసి వస్తాం' అనుకుందాం.

మాటవరసకి అంటున్నాగానీ గుడి తయారయ్యేదాకా నాకూ నమ్మకం లేదు. ఈ తీర్పులో మూడోవంతు భాగం బాలరాముడికి యిచ్చారు కదా. ఆయన ప్రతినిథులం మేమంటే మేమని అంతా కొట్టుకు ఛస్తారు చూడండి. గుడి కట్టిద్దామని పివి నరసింహారావుగారు చేసిన ప్రయత్నాలను పివిఆర్‌కె ప్రసాద్‌గారు తన 'అసలేం జరిగిందంటే..'లో గ్రంథస్తం చేశారు. దానిలో విశేషాలు చెప్తాను వినండి.

రాహుల్ గాంధీ 'మా కుటుంబం పాలిస్తూ వుండి వుంటే అయోధ్యలో బాబరీ మసీదు కూలేదే కాదు' అన్నాడు. పివి నరసింహారావును బలిపశువు చేయడానికి సోనియమ్మ కుట్రలో భాగం తప్ప యిది మరేమీ కాదు. రాహుల్ అప్పుడప్పుడు యిలాటి ప్రవచనాలు వల్లిస్తూ వుంటాడు. మొన్ననే ఒకటి అన్నాడు – సిమికి, ఆరెస్సెస్‌కి తేడా లేదని. ఆరెస్సెస్‌కి సిమి వంటి ఉగ్రవాద చరిత్ర లేదు కదా, నిషిద్ధ సంస్థ కాదు కదా అని విలేకరులు ప్రశ్నిస్తే నా ద ృష్టిలో ఆ తేడా గణించదగ్గది కాదన్నాడు. ఆరెస్సెస్‌ను మతావేశం ఎక్కువున్న సంస్థగా వర్ణించవచ్చు తప్ప బొత్తిగా సిమితో పోలికేమిటి? మతి లేకపోతే! ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరక్కపోతే యిలాటి ముదురు బెండకాయ కబుర్లే వస్తాయి. అలాటి కబురే పివిని నిందించడం.

నిజానికి పివిగారు మాత్రం ఏం చేస్తారు చెప్పండి. అయోధ్యలో ఆ రోజు ఏమీ జరగదు, కేవలం శాంతియాత్రగా ముగుస్తుంది, కరసేవ మాత్రం జరుగుతుంది అని అప్పటి ప్రతిపక్ష నాయకులు వాజపేయి, అడ్వానీ, యుపి ముఖ్యమంత్రి కళ్యాణ్ సింగ్ స్వయంగా వచ్చి పివికి హామీ యిచ్చారు. నమ్మబలికారు. అబ్బే అది నమ్మకుండా వుండాల్సింది. కళ్యాణ్ సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాల్సింది అని తర్వాత ఎన్నయినా కబుర్లు చెప్పవచ్చు.

ఏ సంఘటనా జరగకముందే అలా చేస్తే అప్పుడు పివిని తప్పుపట్టేవారు. సుప్రీంకోర్టుకి ముఖ్యమంత్రి హామీ యిచ్చాడు కదా ఏం జరిగేది కాదు ఉత్తినే ప్రశాంతంగా వున్న హిందువులను రెచ్చగొట్టడానికే యిలా చేశాడని అనేవారు. పైగా ఆ రోజు ఏదో కాస్త గొడవ జరుగుతుందని దేశమంతా అనుకున్నారు కానీ సాయంత్రానికల్లా అంత పెద్ద కట్టడమూ మాయం చేసేస్తారనీ ఎవరూ అనుకోలేదు. అది ఆ రోజు కళ్యాణ్ సింగ్, అడ్వానీ, మురళీమనోహర్ జోషి తదితర హిందూ సంస్థలు కలిసి సంయుక్తంగా పన్నిన కుట్ర!

1993లో నాలుగు ఉత్తరాది రాష్ట్రాలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో రామాలయ నిర్మాణం ఎన్నికల ఎజెండాగా చేసుకోవడానికి బిజెపి వేసుకున్న ప్రణాళిక ప్రకారం 1992 డిసెంబరు 6 న దీన్ని కూల్చేశారు. అనర్థం జరిగాక పివి దీనికి విరుగుడుగా ఏం చేయాలా అని ఆలోచించారు. అక్కడ రామమందిరం కట్టాలి, దానికి బిజెపి క్రెడిట్ తీసుకోకూడదు – ఇదీ ఆయన ప్లాను. మరి కట్టేవారెవరు? ఒక హిందూ సంస్థను ట్రస్టుగా తయారుచేయాలి. దానిలో హిందూమతంలోని అన్ని శాఖలవారు ప్రతినిథులుగా వుండాలి. ఈ పనిని పివిఆర్‌కె ప్రసాద్ గారికి పివి అప్పగించారు.

ఇక్కడ యిబ్బంది ఏమిటంటే దీనికి ఏ రాజకీయ పార్టీకి ప్రాతినిథ్యం వహించకూడదు. అప్పటికే కొన్ని పీఠాలు విశ్వహిందూ పరిషత్‌కు అనుబంధంగా తయారయ్యాయి. వారిని బయటకు లాక్కుని వచ్చి దీనిలో చేయాలి. ఇది కాంగ్రెస్ పార్టీ తరఫున జరుగుతోంది అన్న విషయం బయటకు రాకూడదు. అందుకని ప్రసాద్‌గారికి అప్పగించారు. ఆయన టిటిడిలో పనిచేయడం మూలాన పీఠాధిపతులతో మంచి పరిచయాలున్నాయి. ఆ పలుకుబడి వుపయోగించి పని సాధించాలి.

ఇక ఆయన రంగంలోకి దిగిన తర్వాత ఎదుర్కున్న అవస్థల గురించి ప్రసాద్‌గారు రాసుకొచ్చారు. ఈ పీఠాధిపతులలో ఒకరంటే మరొకరికి పడదు. కొంతమందికి రాజకీయ నాయకులతో పరిచయాలు, మొహమాటాలు.

కంచి పీఠాధిపతికి బిజెపి, విహెచ్‌పిలతో సంబంధబాంధవ్యాలున్నాయి. వీటికి దూరంగా వుండే శృంగేరి పీఠాధిపతిని కదలేశారు. ఆయన ఆలోచిస్తానన్నారు. శ ృంగేరి పీఠాధిపతులను ఢిల్లీలో నాలుగు నెలల పాటు బస చేయించి ఉత్తరాది వారితో పరిచయాలు చేయించారు. ప్రసాద్‌గారి టీము చాలామంది మఠాధిపతులను, మహంతులను, పీఠాధిపతులను, సన్యాసులను కలిశారు. టీము లేకుండా ప్రసాద్‌గారు ఒక్కరూ కంచి, బెంగుళూరు, ఉడుపి, పూరీ ఎన్నోసార్లు వెళ్లారు.

పివి గారు చెప్పిన మీదట అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ తన విమానంలో ప్రసాద్‌గారిని తీసుకుని అలహాబాద్, బెనారస్, జైపూర్‌లకు తీసుకెళ్లి కొందరు స్వామీజీలను పరిచయం చేసి వాళ్లను ఒప్పించడంలో సాయం చేశారు. కొన్ని రోజులైన తర్వాత "నేను ముఖ్యమంత్రి పదవి కూడా చూసుకోవాలి కదా! నన్ను వదిలేయండి, విమానం కావాలంటే యిస్తాను" అనేశారు.

7

ద్వారకా శంకరాచార్యులకు విశ్వహిందూ పరిషత్‌కు పడదు కాబట్టి ఆయన్ను లాగుదామనుకున్నారు. కానీ నేనే అధ్యక్షుడిగా వుంటానంటాడాయన. చేరడానికి ఉత్సాహం వుంది కానీ నాయకత్వం నాకే కావాలంటాడాయన. 'నేను ఈ ఉద్యమంలో మొదటినుండీ వున్నాను. విశ్వహిందూ పరిషత్‌తో ఒంటరిపోరాటం చేశాను. ఈ విషయంలో దక్షిణాది స్వామీజీలకు అవగాహన లేదు. ఇతర పీఠాధిపతులను ఆకట్టుకోవడం శృంగేరీ పీఠాధిపతులకు తెలియదు. ఆ విద్య నాకే తెలుసు' అన్నారు.

కానీ ఆయనకు కాంగ్రెస్ వాదిగా ముద్ర వుంది కాబట్టి ఆయనకు లీడర్‌షిప్ యివ్వకూడదు. శృంగేరీ ఆయన ఆధిపత్యం అయితే తనకు పడదని ఆయన మొండికేశాడు. ఆయన పాయింటు కరెక్టే గానీ ఆయన నాయకత్వం వహిస్తే విశ్వహిందూ పరిషత్ సానుభూతి పరులైన పీఠాధిపతులు యిందులోకి రారు. ఇది ప్రభుత్వం ఎత్తుగడ అని భావించే ప్రమాదం వుంది. ఒప్పించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. చివరకు దిగ్విజయ్ సింగ్ ద్వారా ఆయనను లొంగదీశారు. అదీ ఒకటికి రెండు సార్లు మాట్లాడాక, చివరకి ప్రధానమంత్రి స్వయంగా దిగి వచ్చాక ఆయన దిగి వచ్చాడు.

దిగ్విజయ్ సింగే ఉత్తరాది వైష్ణవ మఠాలలో మంచి పేరు, జనబలం వున్న వారణాసి శ్రీమఠం స్వామీజీని కూడా ఒప్పించారు. కంచి పీఠాధిపతులు ఒక పట్టాన యిష్టపడలేదు. శృంగేరీ వారితో వారికి మొదటినుండీ స్పర్ధ. విహెచ్‌పితో మొహమాటం వుంది. అలా అని పివి మాట కొట్టేయలేరు. ఆయనతోనూ సంబంధాలు వున్నాయి. అందువలన పదిసార్లు తిప్పించుకుని చివరకు సరేనన్నారు.

పెజావరు మఠాధిపతి రామాలయ వుద్యమంలో విహెచ్‌పికి మంచి మద్దతుదారు. జైలుకి కూడా వెళ్లి వచ్చారు. ఆయనను అడిగితే పివితో మాట్లాడాక ఏ విషయం చెప్తానన్నారు. తర్వాత 'పివిగారు చిత్తశుద్ధితోనే వున్నారు. ఎవరివల్లనైతే నేమి రామాలయం ఏర్పడడమే నా ధ్యేయం. విహెచ్‌పి వారితో సంబంధాలు తెంచుకోకుండా మీకు సాయపడతానన్నారు. బిహార్‌లో ఓ ఐపియస్ అధికారి ద్వారా కొందర్ని ఒప్పించారు.

ఇలా అందర్నీ కలుపుకుంటూ వచ్చినా పూరీ శంకరాచార్య, అయోధ్యలో మహంతులు మాత్రం కొరుకుడు పడలేదు. చంద్రస్వామి చెపితే వింటారని చెప్పారు. చంద్రస్వామి వివాదాస్పద వ్యక్తి. పని చేస్తాడు కానీ తనకు ప్రచారం కల్పించుకునే ప్రయాసలో అందర్నీ అప్రతిష్టపాలు చేస్తాడు. అయినా ఆయన కలగజేసుకోకపోతే అయోధ్యవాళ్లు సయోధ్యకు వచ్చేట్టు లేరు అని కొందర్ని కదలేస్తే "హనుమాన్ గడి మహంతు చంద్రస్వామి బలంతోనే అధికారానికి వచ్చాడు. అందుచేత మాట వింటాడు. కానీ చంద్రస్వామి శ్రీమఠం స్వామీజీకి పోటీగా యింకో స్వామిని పీఠాధిపతిగా ప్రోత్సహించి అయోధ్యలో ఓ పోటీ మఠం పెట్టాడు. ఇప్పుడు చంద్రస్వామి యిన్‌వాల్వ్ అయ్యాడని తెలిస్తే అయోధ్యలో యిప్పటిదాకా ఒప్పుకున్నవాళ్లు తప్పుకుంటారు. పైగా చంద్రస్వామికి, ద్వారకా శంకరాచార్యులకు పడదు' అని చెప్పారు.

చివరకు గత్యంతరం లేక చంద్రస్వామిని దీనిలో దూర్చారు. ఆయన ఇద్దరు మహంతులతో చెప్పి సంతకాలు పెట్టించాడు. ఇలా 1993 నుండి 1995 వరకు రెండేళ్లపాటు నానా అవస్థలు పడి, రామాలయ నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి రిజిస్టర్ చేయించారు. అంతలో 1996 వచ్చేసింది, ఎన్నికల వేడి ప్రారంభమై పోయింది. పివిగారు బిజీ అయిపోయారు. 'ఈ ఎన్నికల సమయంలో ఏం చేసినా అది విపరీత పరిణామాలకు దారి తీయవచ్చు. మళ్లీ అధికారంలోకి వచ్చాక అప్పుడు గుడి నిర్మాణం ప్రారంభిద్దాం' అన్నారు పివి.

రాముడికి యీ గుడి యిష్టం లేదులా వుంది. పివి గార్ని మళ్లీ ప్రధాని చేయలేదు. ఈ కథ ద్వారా తెలిసేదేమిటంటే ప్రధాని ప్రోద్బలంతో యింతమంది శ్రమిస్తే యీ స్వామీజీలను ఒక తాటిపైకి – అదైనా ఓ సత్కార్యానికి – రెండేళ్లు పట్టింది. ఇలాటివారు అంతా ఓ ఛత్రం కింద జతకట్టి గుడి కడతారా? ఐ డౌట్!

అయినా రాముడు గుడిలో లేడు. రామాయణం – రాముడు నడిచిన బాట మనకు ఆదర్శప్రాయం కాబట్టి రాముడు మన జీవనవిధానంలో వున్నాడు. కశ్మీరు నుండి కన్యాకుమారి వరకు రామనామాన్ని జపిస్తారు. రామనామాన్ని జపించే ఆంజనేయుణ్ని ఆరాధిస్తారు. ప్రతి తల్లి రాముడి వంటి బుద్ధిమంతుడైన కొడుకు కావాలని కోరుకుంటుంది.

అలాటి రాముణ్ని గుడి పేరిట వివాదాల పాలు చేసిన రాజకీయ పక్షాలను రామబాణం వదులుతుందనుకోను. ఈ తరంలో వివాదం రేపెట్టిన రాజీవ్ గాంధీ పదవీభ్రష్టత పొంది పరలోకానికి వెళ్లిపోయాడు. నానా హంగామా చేసిన బిజెపి అరణ్యవాసం చేస్తోంది. కాంగ్రెస్ కంటె విభిన్నమైన పార్టీ అన్న పేరు పూర్తిగా పోగొట్టుకుంది. కర్నాటకలో నాటకం చూశాక ' ఏ పార్టీ అయితేనేమి..' అన్న నిర్వేదం కలిగింది. ఇప్పట్లో దానికి పట్టాభిషేకం జరిగే సూచనలు కనబడటం లేదు.

దీనివలన నీతి ఏమనగా – మతంతో, ముఖ్యంగా సుగుణధాముడైన రాముడితో గేమ్స్ ఆడవద్దు! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**అక్టోబరు 08** **ఎమ్బీయస్: గాంధీ భవనూ-గబ్బిలాలూ-1**

రాష్ట్రకాంగ్రెస్ బహిష్కరణల పర్వాన్ని యిలాగే కొనసాగిస్తూ పోతే గాంధీభవన్‌లో గబ్బిలాలే మిగులుతాయి అన్నారు అంబటి రాంబాబు. అబ్బే గబ్బిలాలనే తరిమేస్తున్నాం అన్నారు సీనియర్లు. పాతకాలపు యిళ్లలో చూరు పట్టుకుని వేళ్లాడుతూ లోకాన్నంతా తలకిందులుగా చూస్తుంది గబ్బిలం. దానివలన యింటికి ఏ ప్రయోజనమూ వుండదు. గబ్బిలాలు వచ్చి చేరాయంటే కొంప పాడుబడ్డట్టే అన్న ప్రచారం జరిగిపోవడం తప్ప! కాంగ్రెస్ సీనియర్లలో చాలామందికి ఆ వర్ణన నప్పుతుంది. వాళ్లు ఎప్పటినుండో పార్టీనుండి అంటిపెట్టుకుని వుంటారు. ఎప్పుడైనా అలిగి బయటకు వెళ్లి వేరే పార్టీ పెట్టినా ఏడాది తిరక్కుండా గోడకు కొట్టిన బంతిలా తిరిగి వచ్చేస్తారు.

వాళ్ల వలన భవనం నిలబడదు. వాళ్లే భవనం చూరు పట్టుకుని వేళ్లాడుతూ వుంటారు. ఆ చూరు ఏమిటంటే హై కమాండ్ భజన. వాళ్లకు లోకమంతా వాళ్ల స్వార్థప్రయోజనాల అద్దాల లోంచే కనబడుతుంది. వాళ్లకు రాష్ట్రపతో, గవర్నరు గిరీయో, ఓ కార్పోరేషన్ చైర్మన్ గిరీయో, అధమం ఓ నామినేటెడ్ పోస్టో పడేస్తే అంతా ఫస్ట్‌క్లాస్‌గా కనబడుతుంది. లేకపోతే అంతా అస్తవ్యస్తంగా కనబడుతుంది. 'నిన్న గాక మొన్న వచ్చినవాళ్లు పదవులు ఎగరేసుకుని పోతున్నారు. జెండా భుజాన మోసిన మాలాటి కార్యకర్తలకు గుర్తింపేది?' లాటి ఆర్తనాదాలు చేస్తూ వుంటారు.

గబ్బిలం ఎప్పుడూ పాత యిళ్లలోనే వుంటుంది. దానికి భాష వస్తే నేను వున్న యిల్లు యింత పాతది, అంత పాతది అని గొప్పలు చెప్పుకుంటుందేమో మరి. మన గబ్బిలాలకు మాత్రం మన కర్థమయ్యే భాష వచ్చు కాబట్టి కాంగ్రెస్ నూటపాతికేళ్ల వయసున్నది అని చెప్పుకుంటారు. సో వాట్? ఆఫ్రికా ఖండంలో జనావాసానికి లక్షల ఏళ్ల వయసుంది. అందుకని ఆఫ్రికాను గౌరవించేస్తున్నామా? మీ యింట్లో ముసలివాళ్లను నెత్తిన పెట్టుకుని వూరేగుతున్నారా? లేదా? 'ప్రతీదానికీ తగుదునమ్మా అని తలదూరుస్తాడు. నోరు మూసుకుని కూచోవచ్చుగా' అని విసుక్కుంటాం.

పాతకాలం వాళ్లకి పాతకాలపు భావాలు వుండడం సహజం. ఆ ఆలోచనల బూజు దులుపుకుని కొత్త తరంతో కదం కలిపినవారినే మెచ్చుతాం. మన్‌మోహన్ సింగ్ వృద్ధులే కావచ్చు. కానీ ఆయన ఆలోచనలు నూతనమైనవే. అందుకే ఆయనను గౌరవిస్తాం. కానీ మన రాష్ట్రంలో వున్న వృద్ధనాయకులున్నారు చూశారూ, వీళ్లకు పాతకాలపు సామంతరాజుల స్వభావం వదలలేదు. హై కమాండ్ అంటే ఎక్కడో దివ్యలోకాలనుండి దిగి వచ్చినవాళ్లలా మాట్లాడతారు. వాళ్లంత గొప్పవాళ్లే అయితే అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎందుకు ఓడిపోతున్నట్టు? అంటే వాళ్ల ఆలోచనలూ, పథకాలూ అప్పుడప్పుడు చీదేస్తూంటాయన్నమాట. అది గుర్తెరిగి విధేయంగా వుంటూనే నిజాయితీగా వుండాలి.

ఎమర్జన్సీ కాలంలో కొందరు జర్నలిస్టుల ప్రవర్తనను విమర్శిస్తూ అద్వానీ ఓ సారి అన్నారు – 'వాళ్లను వంగోమంటే ఏకంగా పాకేశారు' అని. పార్టీ అన్నాక ఓ పద్ధతి వుంటుంది, ఓ క్రమశిక్షణ వుంటుంది. దానికి లొంగి వుండాలి, లేదా బయటకు పోవాలి. క్రమశిక్షణ కలిగి వుండడంతో బాటు పైవాళ్లు చేసే పొరబాట్లను ఎత్తి చూపే ధైర్యం కూడా వుండాలి. అన్ని వ్యాపార సంస్థలలోనూ యిది వుంటుంది. దేనిమీదనైనా చర్చ జరిగినపుడు తమ తమ అభిప్రాయాలు చెప్తారు. ఫైనల్‌గా బాస్ ఏ నిర్ణయం తీసుకున్నారో దాన్ని అమలు చేస్తారు. ప్రభుత్వ సంస్థల్లో కూడా యిటువంటి చర్చలు, వాదోపవాదాలు జరుగుతాయి. బాస్ కూడా తక్కినవారి మాట వింటూ అభిప్రాయాలు ఏర్పరుచుకుంటూ, అవసరమైనప్పుడు మార్చుకుంటూ, తన నిర్ణయంలోని సహేతుకతను సహోద్యోగులకు వివరిస్తూ టీమ్ లీడర్‌గా ఎదుగుతాడు.

కాంగ్రెస్ పార్టీ లీడర్లు ఢిల్లీకి వెళ్లి ఏం చర్చిస్తారో మనకు తెలియదు కానీ అక్కణ్నుంచి రాగానే ఏవేవో క్లెయిమ్ చేస్తారు. నేను చెప్తే సరేనన్నారు, అంతకన్నానా అన్నారు.. అంటూ. తీరా చూస్తే వీళ్లు చెప్పినదేదీ జరగదు. అంటే వీళ్లు చెప్పనేలేదా? వాళ్లు విననేలేదా? ఆకాడికి వీళ్లు యిక్కడకు రాగానే మీడియాను పిలిచి మీటింగెట్టి మాట్లాడడమెందుకు? నోరుమూసుకుని కూచుంటే పరువైనా నిలిచేదిగా. ఇలా పరువు తీసేవాళ్లపై అధిష్టానం చర్య తీసుకోదెందుకు? అని మీరూ నేనూ అనుకుంటాం. వాళ్ల స్ట్రాటజీ వాళ్లకి వుంటుందో, లేక స్ట్రాటజీ లేకపోవడమే ఓ స్ట్రాటజీయో మనకు అర్థం కాదు.

అయినా మనకు ఒక ధోరణి స్పష్టంగా కనబడుతోంది. జగన్‌ను ఎంతైనా తిట్టు, హై కమాండ్ ఏమీ అనదు. అపోజిషన్ వాళు చేయాల్సిన ఆరోపణలన్నీ నువ్వే చేయి. ఆధారాలు చూపకుండానే ఇంత తినేశాడని, అంత తినేశాడని, అసలు వైయస్ కుటుంబమే అవినీతిలో కూరుకుపోయిందని, జగన్ కోసం వచ్చే జనమంతా అద్దెకు తెచ్చిన జనమనీ – నీ యిష్టం. ఏం కూసినా 'అదేమిటి, మన కాంగ్రెస్ ఎంపీని, మాజీ ముఖ్యమంత్రిని అన్ని మాటలంటే అది మనకే దెబ్బ కదా' అనైనా మందలించరు.

ఇలా అనేవాళ్లను విమర్శిస్తూ 'ఏది ఏమైనా సరే, జగన్ వెంటనంటి వుంటాం. ఆయనను అడ్డుకోవడం తప్పు' లాటి స్టేటుమెంట్లు యిచ్చావో – అంతే, క్రమశిక్షణ చర్యలు తప్పవు. అసలీ క్రమశిక్షణ హై కమాండ్‌కి లేదు. ఓ కోడ్ ఆఫ్ కాండక్టు నిర్వచించి, దానికి వ్యతిరేకంగా మాట్లాడినవారందరిపై చర్య తీసుకుంటూ పోతే యీ పరిస్థితి వచ్చేది కాదు.

రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడు పనేమిటంటే – 'చూస్తూ వూరుకోం' అని అప్పుడప్పుడు స్టేటుమెంట్సు యివ్వడం. అధిష్టానం చెపితే

జగన్ వర్గీయులపై చర్యలు తీసుకోవడం. అంబటి రాంబాబు లాటి వాళ్లు 'నన్ను బహిష్కరించినట్టు యిన్ రైటింగ్ ఇయ్యి చూదాం' అని కవ్వించినా మెదలకుండా వూరుకోవడం.

2

అసలు చర్యంటూ తీసుకోవాలంటే తెలంగాణా కాంగ్రెస్‌వారిపై తీసుకోవాలి. వాళ్లు తెరాసను మించిపోయిన మిలిటన్సీ కనబరుస్తున్నారు. ఆంధ్రప్రాంతీయులను తిట్టడంలో పెచ్చుమీరిపోతున్నారు. గ్రూపు 1 పరీక్షలలో కూడా వీరిదేగా హడావుడి. సెప్టెంబరు 17 విమోచన దిన(మా? విలీనదినమా?) ఉత్సవాలలో కూడా వీళ్లే పేట్రేగిపోయారు. ఇక హైకోర్టు లాయర్ల ఆందోళన సమయంలో ఏకంగా గీతారెడ్డినే తిట్టేసారు. తమ స్వంతపార్టీ వాళ్లను తిట్టగలరు కానీ కెసియార్ వీళ్లను అమ్మనాబూతులు తిట్టినా నోరెత్తరు. కెసియార్ చూపిన బాటలోనే సాగుతూ, అతన్నే అనుకరిస్తూ అతనికంటె ఓవరాక్షన్ చేయడానికి సమకడుతున్నారు.

ఇదంతా చూస్తే ఏం తోస్తోంది? తెలంగాణా కాంగ్రెస్ నాయకులు చేసేది హై కమాండ్‌కు సమ్మతమైనది, జగన్ చేసేది సమ్మతం కానిది అని. ఈ ధోరణిలో కాస్త ముందుకు వెళ్లి ఆలోచిస్తే మన లైన్ ఆఫ్ థింకింగ్ కరక్టో కాదో తేల్తుంది.

తెలంగాణా కాంగ్రెస్ నాయకులు యింత మితిమీరడానికి కారణం ఏమిటి? రేపుమర్నాడు తెలంగాణా ఏర్పడితే ఆ క్రెడిట్ కెసియార్‌కు పోకుండా తామే తీసుకోవాలని. తెలంగాణా అంటూ ఏర్పడితే మొదటి ప్రభుత్వం తెరాసదే అనుకుంటున్నాం. కాదూ మాదే అని కాంగ్రెస్‌వారి ధీమా. ఆ మేరకు వాళ్లు హై కమాండ్‌కు హామీ యిచ్చేసి వుంటారు. సరే కానీయండి ఏ మేరకు చేస్తారో చూదాం అని వాళ్లు అనడంతో వాళ్లకు వచ్చిన రీతిలో నిర్వాకం చేసేస్తున్నారు. అందుకే వాళ్లు తమ పార్టీవాళ్లనే తిట్టినా, తిమ్మినా హై కమాండ్ వూరుకుంటోంది.

అంటే దీని అర్థం ఏమిటి? తెలంగాణా రావాలని, దానికి తన పార్టీ నాయకత్వం వహించాలని హై కమాండ్ అనుకుంటోంది. దీన్నే యింకోలా చెప్పాలంటే తన పార్టీ నాయకత్వం వహించబోతుంది అనుకుంటేనే తెలంగాణా రావాలనుకుంటోంది అనడం సబబం.

కృష్ణ కమిటీ రిపోర్టు ఎలా యిచ్చినా కాంగ్రెస్ పార్టీ తనకు కావలసిన నిర్ణయం తాను తీసుకోగలదు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణాకు సై అన్నంత మాత్రాన దేశంలోని యితర పక్షాలన్నీ సై అంటాయని అనుకోవడానికి లేదు. యుపిఏ భాగస్వాములే ఠక్ వల్ల కాదనేశారు. డిఎంకె, ఎన్‌సిపి, తృణమూల్, శివసేన .. యిలా అనేక పక్షాలు మీరు తెలంగాణా యిస్తే మాకు మా రాష్ట్రాలలో తలకాయనొప్పి అంటూ అడ్డుపడ్డారు. కాంగ్రెస్ వాళ్లను ఒప్పించాలంటే చాలా తిప్పలు పడాలి. ఇంత కష్టపడినదాకా వుండి తెలంగాణాలో తమ పార్టీ గెలవకపోతే యీ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరే! మీరు తెలంగాణా యిస్తాననండి చాలు మేం దున్నుకొచ్చేస్తాం అని తెలంగాణా కాంగ్రెస్‌వాళ్లు హై కమాండ్‌ను ఊదరగొట్టేస్తున్నారు. ఉపయెన్నికలలో మీ ప్రతాపం చూశాంగా అని హై కమాండ్ పెదవి విరవకుండా సరే ప్రయత్నించి చూడండి అన్నట్టుంది.

నా అనుమానం డిసెంబరు 31 వరకు వీళ్లకు గడువు వున్నట్టుంది. ఆ లోగా తెలంగాణాలో కాంగ్రెస్ నాయకత్వం లీడ్ పొజిషన్‌లో వుంటేనే కాంగ్రెస్ తెలంగాణా యివ్వడానికి సుముఖం అవుతుంది. ఈలోగా వాళ్లకు ఫ్రీ గ్రౌండ్ యిచ్చినట్టున్నారు. అందుకే తెలంగాణా అమరవీరుల కుటుంబాలకు నష్టపరిహారాలు, రేపు అక్టోబరు 15 న తెలంగాణా జండాల రెపరెపలు, జిల్లాల వారీ సమావేశాలు, వాటిల్లో ఆంధ్రప్రాంతీయులపై కూతలు.. యివన్నీ అనుమతిస్తున్నారు. నవంబరు 1 ని బ్లాక్ డే గా నిర్వహిస్తాం అనుమతి యివ్వండి అని అడిగినా కాంగ్రెస్ హై కమాండ్ యిచ్చివేయవచ్చు. ఇక తెలంగాణా కాంగ్రెస్‌వారు తమ స్వంత ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలే బహిష్కరించి తెరాసను మించిన యోధులమని చూపుకోవడానికి తంటాలు పడవచ్చు.

తెలంగాణాలో కాంగ్రెస్ తెరాసను వెనక్కి నెట్టేసి నాయకత్వాన్ని తన చేతిలోకి తీసుకోగలదా? కాంగ్రెస్ ప్రణాళిక ప్రకారం మొదటగా టిడిపిని తెరాస ద్వారా తుడిచి పెట్టేసి, తర్వాత తెరాసను మట్టు పెట్టేయాలని. నువ్వొందుకు పోస్తే నేను మరోదానికి తాగుతున్నాను అన్నట్టు కెసియార్ కాంగ్రెస్‌తో చేతులు కలిపి టిడిపిని తుదముట్టించడానికి చూస్తున్నారు.

తెలంగాణా అంశంపై కాంగ్రెస్, టిడిపి ఇద్దరూ దోషులే. ఇద్దరూ ఒకే పాలసీ అవలంబిస్తున్నారు. కాంగ్రెస్ కంటె టిడిపి ఒక దశలో ఒక్క రవ్వ ముందుకు వెళ్లి ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ యిచ్చింది. కాంగ్రెసయితే అదీ లేదు. అయినా కెసియార్ కాంగ్రెస్‌ను ఏమీ అనడు. తెల్లవారి లేచిన దగ్గర్నుంచి టిడిపి మీదనే ధ్యాసంతా. వాళ్లను యిరకాటంలో పెట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాడు. టిడిపి నాయకులను అడ్డుకుంటున్నారు. ఏకంగా బాబుమీదనే భౌతికమైన దాడులు జరుగుతున్నాయి. అత్యంత హేయమైన రాజకీయం నడుస్తోంది.

టిడిపి తిప్పికొడదామని చూస్తోంది. కాంగ్రెస్‌ను అడగవేం? అంటోంది. వినిపించుకునేవాడెవడు? 'టిడిపికి ఆంధ్ర నాయకత్వం, ఆంధ్రనాయకత్వం కింద పని చేయడానికి సిగ్గులేదా?' అని టిడిపి కార్యకర్తలను కవ్విస్తున్నారు. మరి కాంగ్రెస్ వారి ఇటాలియన్ నాయకత్వం పనికి వచ్చింది కానీ టిడిపి వారి ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు వారి నాయకత్వం పనికి రాదా? తెరాస పనికి రాదనే అంటుంది.

మొత్తానికి కెసియార్ టిడిపిని అణిచేసిన తర్వాత అప్పుడు ఆయనను కాంగ్రెస్‌లోకి తీసుకుని రావడమో, లేదా ఎదుర్కోవడమో చేస్తామని తెలంగాణా కాంగ్రెస్ నాయకుల ఉద్దేశం. ఇది చేయలేకపోతే మాత్రం కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణా యిచ్చే విషయంలో సందిగ్ధంగా వుండవచ్చు.

3

అసలు కాంగ్రెస్ హై కమాండ్ తెలంగాణా విషయంలోను, జగన్ విషయంలోను ఎప్పుడూ సందిగ్ధంలోనే వుంటోంది. తెలంగాణా విషయంలో డిసెంబరు 9 నాటి ప్రకటన యిప్పించడం ఒక ధోరణిని సూచిస్తే, డిసెంబరు 23 నాటి ప్రకటనను యిప్పించడం మరొక ధోరణిని సూచిస్తుంది. మాటవరసకి, డిసెంబరు 9 నాటి ప్రకటన వెనకాల రాహుల్ ఉన్నాడనుకుందాం. ప్రకటన చిదంబరం చేయవచ్చు. కానీ ఆయన వెనుక ఓ బలమైన శక్తి లేనిదే ఆయన అలా చేయలేడు కదా! అది రాహుల్ అనుకుందాం.

రాహుల్ వంటి గట్టి నాయకుడి మద్దతు లేకుండా చిదంబరానికి అంత ధైర్యం వుండదు. సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒక ప్రకటన చూపించి మరొక ప్రకటన చేసేటంత దమ్ముందా ఓ మంత్రికి? మన్‌మోహన్ విదేశాలలో వున్నపుడు ఆయనకు మాటమాత్రం చెప్పకుండా, ట్రబుల్ షూటరైన ప్రణబ్ ముఖర్జీనైనా సంప్రదించకుండా యింతటి నిర్ణయాన్ని ప్రకటించేటంతటి ధైర్యం ఆయనతో పనిచేసే మంత్రికి వుంటుందా? అందుకే ఆ నిర్ణయం సోనియాదైనా కావాలి, రాహుల్‌దైనా కావాలి. రాహుల్‌దే కావచ్చు.

రాహుల్‌కి తెలంగాణాలో యింట్రస్టు ఏమిటి? 2014 నాటికి తను ప్రధాని కావాలంటే కాంగ్రెస్‌కు యిప్పటికంటె ఎక్కువ సీట్లు రావాలి. ముఖ్యంగా నిర్ణయాత్మకమైన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుండి అత్యధికంగా రావాలి. వైయస్ పోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను మొత్తంగా పాలించే శక్తి వున్న కాంగ్రెస్ నాయకుడు కనబడటం లేదు. చంద్రబాబును వైయస్‌కు ఆల్టర్నేటివ్‌గా ఓటర్లు భావిస్తే యుపిఏ కొంప మునిగిందే!

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్లు అన్ని ప్రాంతాలలోను ఒకేలా ఓటేస్తారు. 42 పార్లమెంటు సీట్లలో వస్తే 30 ప్లస్. పోయినా 30 ప్లస్సే! త్రాసు ఒక్కసారిగా అటు మొగ్గిపోతుంది. అలా జరగకుండా చేయాలంటే రెండు చిన్నవాటిగా విడగొట్టాలి. ఒకటి పోయినా మరోటి రావచ్చు. ఇదీ రాహుల్ ప్లాను. చిదంబరంగారికి చెప్పి వుంటాడు. ఆయనగారికి చిన్న రాష్ట్రాలను చేసి పాలించి చూస్తే ఎలా వుంటుందో చూడాలన్న ఉబలాటం వుంది. రాహుల్ గ్రీన్ సిగ్నల్ యివ్వడంతో రెచ్చిపోయాడు. తెలంగాణా యిచ్చేస్తామనీ, విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామనీ పబ్లిగ్గా చెప్పేశాడు. హైదరాబాదును కూడా తెలంగాణాకు యిచ్చేయాలని ఆయన శాఖలో ఫైలు కూడా తయారవసాగిందని ఆ శాఖ కార్యదర్శి పిళ్లయ్‌గారు చెప్పేశారు కూడా.

ఒకసారి ప్రకటన వెలువడ్డాక ఆంధ్రప్రాంతంలో వచ్చిన బ్యాక్‌లాష్‌తో సోనియా ఉలిక్కిపడింది. ఎవర్నీ సంప్రదించకుండా, ఏ చర్చలూ జరపకుండా తెలంగాణా యిచ్చేసి కాంగ్రెస్ ఆంధ్రప్రాంతాన్ని ముంచింది అన్న టిడిపి లైను ఊపందుకోవడంతో భయం వేసింది. తెలంగాణాలో తెరాసను దాటుకుని వస్తామో రామో కాని ఆంధ్రప్రాంతంలో మాత్రం ఓడడం ఖాయం అని గ్రహించింది. ఇక దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది.

తల్లి అన్నాక యిటువంటివి తప్పవు. 1983లో ఈ రాహుల్ తండ్రి రాజీవ్ ఇప్పటి రాహుల్ లాగానే తెరవెనుక రాజకీయాలు నడిపే రోజుల్లో అరుణ్ నెహ్రూ సలహాతో కశ్మీర్‌లో ఫరూఖ్ అబ్దుల్లా పార్టీలో ముసలం తెచ్చి అతని ప్రభుత్వాన్ని కూలదోశాడు. అక్కడి విజయంతో మత్తెక్కి ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాదెండ్ల సహాయంతో ఎన్టీయార్‌ను గద్దె దించేశారు. కశ్మీర్‌లో విజయవంతమైన ప్లాను ఆంధ్రకు వచ్చేసరికి చీదేసింది.

ఎన్టీయార్ వెనుక ప్రజాబలం చూసి ఇందిర దడిసింది. కొడుకుని మందలించి, ఎన్టీయార్‌కు పదవి మళ్లీ కట్టబెట్టింది. అది డైరక్టుగా యిచ్చేస్తే బాగుండదు కాబట్టి, నాదెండ్లకు అనువుగా వ్యవహరించిన గవర్నరును వెనక్కి రప్పించి పెద్దమనిషి అయిన శంకర్ దయాళ్ శర్మను గవర్నరుగా పంపించి నెల్లాళ్లలో నాదెండ్ల తన బలాన్ని నిరూపించుకోలేక పోయాడు కాబట్టి.. అని చెప్పి నాదెండ్ల ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్టీయార్‌ను మళ్లీ వెనక్కి పిలిచారు.

1983లో ప్రజాస్పందన చూసి ఇందిర దడిసి కొడుకు చర్యను సవరించినట్లే, 2009లో ఆంధ్రప్రాంతంలో వచ్చిన స్పందన చూసి సోనియా దడిసి కొడుకు చేష్టలను సవరించబోయింది. 1983లో పరిస్థితిని తనకు అనువుగా మలచుకున్న చంద్రబాబే యిప్పుడూ వున్నారు. తెరాసవారు ఆరోపించినట్టు రాజీనామాల పథకాన్ని రచించింది ఆయనే కావచ్చు. కాంగ్రెసు వ్యతిరేకత ప్రబలుతున్న సమయంలో టిడిపివారి ఆలోచన లగడపాటికి చేరి వుండవచ్చు. అధిష్టానాన్ని ధిక్కరించినట్లుగా పైకి కనబడుతూనే లగడపాటి సోనియా సలహా మేరకే రాజీనామా చేసి వుండవచ్చు. ఆ వెంటనే జెసి దివాకరరెడ్డి, మరొకరు.. టిడిపికి దీటుగా రాజీనామాలు చేస్తూ ఆ స్పందనోద్యమం టిడిపి చేతుల్లోకి పోకుండా జాగ్రత్త పడ్డారు.

అత్తతో అమ్ముతూ, కోడలితో కొనడం కాంగ్రెస్‌కు కొత్త కాదు. 1969లో ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో కానీ, 1972 జై ఆంధ్రా ఉద్యమంలో కాని ఉద్యమించేవాళ్లు కాంగ్రెస్‌వాళ్లే, దాన్ని అదుపు చేసేవారూ కాంగ్రెస్‌వారే.

అలా పరిస్థితిని అదుపులోకి తెచ్చుకున్నాక డిసెంబరు 23 ప్రకటన సోనియా ఆధ్వర్యంలో వెలువడిందనుకోవచ్చు. దానిలో

డిసెంబరు 9 కి పూర్వస్థితిని తెచ్చేశారు. వెంటనే యిటు తెలంగాణాలో ప్రతిఘటన వచ్చింది. దాన్ని మళ్లీ చేజారనీయకూడదు. అందుకని జానారెడ్డిని జాక్‌లో చేరమన్నారు. తెలంగాణా శాసనసభ్యుల చేత రాజీనామాలు చేయించారు. ఇలా కొంతకాలం నడిపించాక కమిటీ వేద్దామనే ఉద్దేశానికి వచ్చి దాని విధివిధానాలు నిర్ణయించినపుడు టోటల్లీ బాలన్స్‌డ్‌గా వ్యవహరించారు. ఉద్యమం ప్రారంభమైన నాటి స్థితికి తెచ్చేశారు. అసలు తెలంగాణాకు అన్యాయం జరిగిందా లేదా? అన్యాయం జరిగితే ఎలా సవరించాలి? సమైక్యరాష్ట్రం కొనసాగించవచ్చా? యిత్యాది మౌలికప్రశ్నలను సైతం కమిటీని చూడమన్నారు.

అవి చూడగానే కెసియార్ గుండె జారిపోయింది. ఇవన్నీ తవ్వితే తమ వాదన బలహీనపడుతుందన్న భయం వేసింది. అందుకే వెంటనే తమ శాసనసభ్యుల చేత రాజీనామా చేయించారు. కానీ కమిటీని నిర్లక్ష్యం చేయలేమని గ్రహించి అందరి కంటె ముందు కమిటీ ఎదుట హాజరై తమ వాదన వినిపించారు.

4

కమిటీ ధర్మమాని అనేక యధార్థాలు బయటకు వచ్చాయి. నివేదిక బయటకు వచ్చేసరికి ఏ ప్రాంతం వెనుకబడిందో, దానికి ఎవరు కారణమో కూడా అందరికీ తేటతెల్లమౌతుంది. అయితే కమిటీ సూచన ఒక సిఫార్సు మాత్రమే. రాజకీయ నిర్ణయమే ప్రధానం. తెలంగాణా యిచ్చేస్తే తాము యిక్కడా అక్కడా అధికారంలోకి వస్తామా? కనీసం ఒక్కచోటైనా పూర్తి పార్లమెంటు సీట్లు గెలుచుకుంటామా? అన్నది కాంగ్రెస్ ఎదుట నున్న ప్రశ్న.

ఉపయెన్నికల ఫలితాలు చూసాక, తెరాసపై కనీసం కొన్ని నియోజకవర్గాలలో సింపతీ బాగా వుందని తెలిసింది. తెలంగాణాలోని అన్ని రాజకీయపక్షాల వారు తమ తమ ప్రయోజనాలకోసం తెరాసతో చేతులు కలుపుతున్నారని అర్థమైంది. ఈ పరిస్థితిలో తెలంగాణాలో కాంగ్రెస్ నిలదొక్కుకోవడం ఎలా? కాంగ్రెస్ పక్షాన కెసియార్‌తో తూగే బలమైన నాయకుడు వున్నాడా? అన్నది కాంగ్రెస్ ముందున్న ప్రశ్న.

మీరే చెప్పండి. కెసియార్‌ను ఎదుర్కోగల నాయకుడు కాంగ్రెస్‌లో ఎవరున్నారు? ఈ జానారెడ్డి, జీవన్‌రెడ్డి, గీతారెడ్డి, సురేష్‌రెడ్డి, డి శ్రీనివాస్ వీళ్లంతా జిల్లా నాయకులే. తెలంగాణా అంతా బలంగా వున్న నాయకుడు ఎవరు? ఈ మధు యాష్కీ, వి హనుమంతరావు, శంకరరావు, పాల్వాయి, కాకా, కేకే.. వీళ్లంతా కాగితం పులులు. మీడియా ముందే వీళ్ల ప్రతాపం. తెలంగాణా ఏర్పడలేదు కాబట్టి ఆంధ్రప్రాంతీయులను తిడుతూ ఎంటర్‌టైన్ చేస్తున్నారు. రేపు తెలంగాణా ఏర్పడ్డాక ఆ అవసరం వుండదు. ప్రజల గుమ్మంలోకి వెళ్లి ఓట్లడగాలి.

సోనియా ఫోటో పెట్టుకున్నంత మాత్రాన ఓట్లు రాలవు. అలా అయితే అన్ని రాష్ట్రాలలోనూ కాంగ్రెస్సే గెలవాల్సి వుండింది. కాంగ్రెస్ బ్యానర్ వల్ల ఓ 30% ఓట్లు వస్తే సరిపోదు. అదీ ప్లస్ సంథింగ్ అంటే లోకల్ లీడర్ కరిష్మా వుండకపోతే గద్దె ఆమడ దూరంలో వుండిపోతుంది. ఈ విషయం గ్రహింపుకి రాగానే ఈ కేకే, యాష్కీ, సర్వే వీళ్లంతా తెరాసలో చేరిపోయినా మీరు ఆశ్చర్యపోవద్దు.

అందువలన తెలంగాణాలో తమ పార్టీ తరఫున మొదట ఓ నాయకుణ్ని తయారుచేయవలసిన తక్షణ కర్తవ్యం కాంగ్రెస్ ముందు వుంది. 2011 లో ఒకవేళ రాష్ట్రవిభజన ప్రకటన చేస్తే పంపకాల సమయంలో తెలంగాణా ఛాంపియన్‌గా వ్యవహరించి కెసియార్‌ని మించిన బలమైన నాయకుడిగా అతన్ని తీర్చిదిద్దాలి. అందువలననే ఆ మధ్య జైపాల్‌రెడ్డిగార్ని సిఎంగా వుండమని అడిగారని, గీతారెడ్డిని ఢిల్లీకి పిలిచి సంప్రదించారని వార్తలు వచ్చాయి. ఇక్కడ యింకో విషయం కూడా వుంది.

కమిటీ సిఫార్సులు ఎలా వున్నా తెలంగాణా రాష్ట్రం హైదరాబాదుతో సహా యిచ్చేస్తే ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్ శంకరగిరి మాన్యాలు పట్టడం ఖాయం. పైగా అడిగినవారికి అడిగినవన్నీ యిచ్చేయడం లోకంలో ఎక్కడా లేని విషయం. అందువలన ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేసి, హైదరాబాదు మాత్రం విడిగా యుటిగానో, ఉమ్మడి రాజధానిగానో చేసి వ్యాపారవర్గాలలో భయం కలగకుండా చూసి పారిశ్రామికవృద్ధి తగ్గకుండా చూసే ప్రయత్నం చేయవచ్చు.

ఇది రాహుల్ మార్గానికి, సోనియా మార్గానికి నడుమ ఓ మధ్యేమార్గం కావచ్చు. రాష్ట్రం చీల్చిన ఆనందం రాహుల్‌కి దక్కుతుంది, దాని కారణంగా ఆంధ్రప్రాంతంలో పార్టీ నష్టపోకుండా చూసుకున్న తృప్తి అమ్మగారికి మిగులుతుంది.

'మేం చేసే సిఫార్సు అందరికీ ఆమోదయోగ్యంగా వుంటుంది' అని కమిటీ సభ్యులు విడివిడిగా, కలివిడిగా పదేపదే చెప్తున్న దాని అర్థం యిదే కావచ్చు. అందరికీ ఆమోదయోగ్యం అంటే తమకు ఆమోదయోగ్యం కాదని కెసియార్‌కు తెలుసు. అందుకనే డిసెంబరు 31 తర్వాత అంతర్యుద్ధం, భూకంపం, సునామీ, అగ్నిపర్వత విస్ఫోటనం, గాంధీ విప్లవం, ఉల్కాపాతం, ఉపగ్రహపతనం.. యిలాటివన్నీ తెప్పిస్తానని ఆయన బెదిరిస్తున్నారు.

తెలంగాణా యిచ్చి దానికి హైదరాబాదు యివ్వకపోతే తెలంగాణా అంతా అల్లర్లు చెలరేగడం ఖాయం. కానీ అవి ఎంతకాలం వుంటాయి? మూణ్నెళ్లు? ఆర్నెల్లు? ఎప్పటికో అప్పటికి చల్లారక తప్పదు. ఎందుకంటే తెలంగాణా రాజధానిగా ప్రకటించే జిల్లావాళ్లు, దాన్ని చుట్టుముట్టి వున్న జిల్లాల వారు క్రమంగా ఉద్యమంలో నుండి తప్పుకుంటారు. ఎంతసేపూ హైదరాబాదే బాగుపడాలా, మా ప్రాంతాన్నైనా బాగుపడనీ అనుకుంటూ.

కొత్త రాజధాని అనగానే దాని నిర్మాణానికి కొన్ని వేల కోట్ల బజెట్ వుంటుంది. రోడ్లు, భవనాలు, విమానాశ్రయాలు అంటూ బోల్డు కాంట్రాక్టులు... దీనికి ఒడంబడితే సగానికి సగం బొక్కేయవచ్చు హైదరాబాదే కంటిన్యూ అయితే మనం బావుకునేది ఏముంది అనుకున్న రాజకీయనాయకులు, కాంట్రాక్టర్లు ఉద్యమంలోంచి జారుకుంటారు. ఆంధ్రప్రాంతంలోనూ యిలాటి వాతావరణమే వుంటుంది. సమైక్యాంధ్ర అని యిన్నాళ్లూ గొంతు చించుకున్నవాళ్లూ చల్లబడతారు.

అయితే యీ నిర్ణయం తీసుకోగానే ఓ ఆర్నెల్లపాటు మాత్రం శాంతిభద్రతల సమస్య వుండి తీరుతుంది. దాన్ని అదుపు చేయడానికి రోశయ్యగారికి అలివి కాదని అనిపిస్తోంది. అనారోగ్యం ఒకటే కాదు, కాబినెట్ కూడా కలిసి రావడం లేదు. ఎడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహారాలు చూడడం ఒక ఎత్తు, పొలిటికల్ పవర్‌తో అవతలివాళ్లని అదిలించడం మరో ఎత్తు. రోశయ్యగారు మొదటిదానిలో ఘటికుడే కానీ రెండో దానిలో పాస్ మార్కులు కూడా రావు.

అలాటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించి గవర్నరుగారికి పాలన అప్పగించడం ఒక పద్ధతి. అందుకే కాబోలు నరసింహన్ లాటి వారిని తీసుకుని వచ్చి కూచోబెట్టారు. ఇక రెండో ఆప్షన్ – ఎవరైనా తెలంగాణా వారిని ముఖ్యమంత్రి చేయడం. తెలంగాణాకు అన్యాయం జరుగుతోందన్న నినాదం వున్నపుడు ఆంధ్రప్రాంతపు ముఖ్యమంత్రి వుండడం కంటె తెలంగాణా ముఖ్యమంత్రి వుండడం బెటరు కదా! 'కనీసం విభజన సమయంలో గడసరులైన ఆంధ్రుల వలన మన ప్రాంతానికి అన్యాయం జరగకుండా చూస్తాడు' అన్న ధీమా తెలంగాణా ప్రజల్లో వుంటుంది కదా!

ఈ లాజిక్‌తోనే జయపాల్ రెడ్డిగారిని ముఖ్యమంత్రిగా వుండమని సోనియా కోరి వుంటారు. తెలంగాణా కోసం నాకు తెరవెనుక రాజకీయాలు నడపడం తప్ప ప్రత్యక్షంగా రాష్ట్రాన్ని నడపలేను అని ఆయన చెప్పివుంటారు. అయినా ఆయన ముఖ్యమంత్రి అవుతారన్న పుకారు రావడంతో ఆయన హైదరాబాదు వచ్చినపుడు ఆంధ్రప్రాంతపు నాయకులు కూడా వచ్చి కలిశారు. అదేవిధంగా గీతారెడ్డిని ఢిల్లీ పిలిచి మాట్లాడారు. సోనియా నామినేషన్‌పై సంతకం చేయడానికి అని చెప్పుకున్నారు. ఈవిడ వెళ్లి చేయకపోతే సోనియా కాంగ్రెస్ అధ్యక్షురాలు కావడం మానేస్తుందా ఏమన్నానా?

5

రేపు రోశయ్యగారు ఢిల్లీ వెళుతున్నారు. కాబినెట్ విస్తరణ మాట ఎలా వున్నా యీ విషయం తప్పకుండా ప్రస్తావనకు వస్తుందని నేననుకుంటున్నాను. 'మీకు ఓపిక తగ్గింది. మీరు నెంబర్ టూకి తగ్గి తెలంగాణా ముఖ్యమంత్రి కింద పనిచేయండి' అని చెప్పవచ్చు. అసలు కొత్త ముఖ్యమంత్రికి వెసులుబాటు కల్పించడానికే రోశయ్యగారికి కాబినెట్ విస్తరణకు యిన్నాళ్లూ అనుమతి యివ్వలేదేమో!

ఏది ఏమైనా తెలంగాణానుండి కాంగ్రెస్ ఓ బలమైన నాయకుణ్ని తయారుచేసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. ఆ నాయకుడు తయారైతే యీ వృద్ధ నాయకులందరూ కనుమరుగై అప్పుడప్పుడు గాంధీభవన్‌లో కనబడవచ్చు. ఆ నాయకుడు తయారు కాకపోతే తెలంగాణా తెరాస పరమై, అప్పుడు గాంధీభవన్‌లో రాంబాబు అన్నట్టు గబ్బిలాలే మిగలవచ్చు. తెలంగాణాపై కాంగ్రెస్ సందిగ్ధ పరిస్థితి గురించి విపులంగా చర్చించాం కాబట్టి, యిక జగన్ విషయంలో సందిగ్ధం గురించి మాట్లాడుకుందాం.

జగన్ విషయంలో హై కమాండ్ చాలా కఠినంగా వ్యవహరిస్తోంది, సస్పెండ్ చేయడం ఇవాళో, రేపో అన్న ధోరణిలో తెలంగాణా సీనియర్లు చెప్పడం, మన మీడియా నమ్మి ప్రచారం చేయడం జరిగాయి. చివరకు ఏమైంది? ఏదో వెర్రిపిల్లాడు, నాన్న పోయిన దు:ఖంలో మతిభ్రమించి, ఊరికే ఎండలో పడి తిరిగితే తిరగనీ అని వదిలేశారు. సాక్షి పత్రిక, టీవీ తప్ప అతన్ని పట్టించుకోవడం మానేశాయి. ఊళ్లలో తిరుగుతున్నాడు, జనం వస్తున్నారు. వీళ్లంతా ఓట్లేస్తారో లేదో తెలియదు. జనం నా వెంట వున్నారని జగన్ అనుకుంటున్నాడు. ఎంతో కొంత మేర ప్రజాదరణ వున్నవాడు అని అందరూ ఒప్పుకుని అంతటితో నిలిచారు.

ఎమ్మెల్యేలు మొదట్లో అతని వెంట పరుగులు పెట్టారు. హై కమాండ్ ఆగమంది. ఆగారు. జగన్ వెంట గట్టిగా నిలిచినవాళ్లు ముగ్గురో, నలుగురో. హై కమాండ్ తృప్తి పడింది. తమ అథారిటీ నిలబడింది కదాని. ఆ తర్వాత అతని అస్త్రాన్ని స్వంతం చేసుకోబోయింది. ఆ ఓదార్పేదో మేమే చేస్తామంది. వైయస్ సంవత్సరీకాలు కూడా అయ్యాక యీ ఆలోచన వచ్చింది పాపం. పోయినవాళ్లెందరంటే జగన్ అంకెకు దాదాపుగా దగ్గరకు వచ్చింది. మరి ఆ పనేదో ముందే చేస్తే యింత అల్లరి అయ్యేది కాదు కదా! వైయస్ చావు వలన ఎవరూ చావలేదు అని స్టేటుమెంటు యిచ్చి వి హనుమంతరావు నాలిక కరుచుకునే పరిస్థితి వచ్చేది కాదు కదా.

తెలంగాణా సమస్యలాగానే యిక్కడా రెండు ధోరణులు స్పష్టంగా కనబడుతున్నాయి. ఒకటి రాహుల్ స్కూల్ ఆఫ్ థాట్. ఇవాళ జగన్ని ఎదగనిస్తే రేపు పొద్దున్న మరో రాష్ట్రంలో మరొకడు తయారవుతాడు. మేం పేరిగాడు రాజంట అంటే అందరూ రాజే అనాలి కానీ మరో వీరిగాడు నేనూ రాజునవుతా అంటే కుదరదు – అన్న ధోరణి. రాహుల్ అండ చూసుకునే వీళ్లంతా – అంటే తెలంగాణా విషయంలో రాహుల్ మద్దతు పొందుతున్న వారందరూ – పేట్రేగిపోయారు. వాళ్లకి జగన్‌పై ప్రత్యేకమైన కోపం. ఎందుకంటే యావత్తు కాంగ్రెస్ నాయకుల్లో సమైక్యవాదం కోరుతూ పార్లమెంటులో ప్లకార్డు పట్టుకున్న మొనగాడు అతను. వైయస్ పేరు చెప్పి అతనికి తెలంగాణాలోను అనుయాయులున్నారు. తెలంగాణలో అతను యాత్ర చేస్తే జనం వస్తే అది సమైక్యవాదానికి బలం అన్న ప్రచారం సాగే భయం వుంది. అందుకని జగన్ తెలంగాణాలో అడుగుపెట్టకూడదని వాళ్ల ఉద్దేశం.

రాహుల్ మన వెనక్కాల వున్నాడన్న ధైర్యంతో వీళ్లు అతనిపై, అతని కుటుంబంపై అవినీతి ఆరోపణలు తెగ గుప్పించేశారు – అవన్నీ తమకే తగులుతాయన్న స్పృహ లేకుండా. వీళ్లు ఏం చేసినా అటు జగన్‌కి జనం తగ్గలేదు. వస్తూనే వున్నారు. చిరంజీవికీ వచ్చారు జనం, జూనియర్ ఎన్టీయార్‌కీ వచ్చారు అని తీసి పారేయవచ్చు. కానీ జగన్ గ్లేమర్ వున్న నటుడు కాదు. సరిగ్గా ఉపన్యాసం యివ్వడం కూడా రాదు. ముఖంలో భావాలు కూడా సరిగ్గా పలకటం లేదు. నాయకుడికి వుండాల్సిన బాడీ లాంగ్వేజ్ లేదు. అయినా జనం వస్తున్నారు. వైయస్ కుమారుడన్న యిమేజ్‌తో బాటు ప్లస్ సంథింగ్ కూడా వుందేమోనన్న అనుమానం వచ్చినట్టుంది సోనియా గాంధీకి.

అందుకే ఆవిడ ట్రాక్ మార్చింది. రాహుల్ విధానానికి సవరణలు చేసింది. జగన్ చుట్టు వున్నవారిని కట్ చేస్తోంది కానీ జగన్‌ను అంటుకోవడం లేదు. తామే ఓదార్పు చేస్తానంటోంది. ఆ విధమైన రాజీపడే ధోరణితో వేచి చూస్తోంది. ఇది అనుభవజ్ఞులైన రాజకీయ నాయకుల లక్షణం. రేపు రాష్ట్రం విడిపోతే ఆంధ్రప్రాంతంలో కాంగ్రెస్‌కు సరైన నాయకుడు ఎవరూ దొరక్కపోతే జగన్‌నే ప్రమోట్ చేసినా చేయవచ్చు. చిరంజీవిని పార్టీలోకి తీసుకుని వచ్చి, జగన్‌కి పోటీగా నిలబెడతారన్నది అనేక పథకాల్లో ఒక పథకం మాత్రమే. చిరంజీవికి అనుకున్నంత స్టామినా లేదని 2009 ఎన్నికలలో తేలిపోయింది. ఇక పార్టీలోకి రావాలంటే చిరంజీవి ఎన్ని డిమాండ్లు చేస్తారో తెలియదు. చిరంజీవికి మీడియా సపోర్టు లేదు. మీడియా సపోర్టు దండిగా వున్న బాబును ఎదుర్కోవాలంటే 'సాక్షి' చేతిలో వున్న జగనే సమర్థుడు.

పైగా రాజకీయాల్లో ఎందుకు వచ్చి పడ్డానురా దేవుడా అన్నట్టు వుంటారు చిరంజీవి. ఆయన చూస్తే కార్యకర్తలకు ఏం ఉత్సాహం వుంటుంది? జగన్‌కు రాజకీయాల్లో వెలగాలని పట్టుదల. ఆ పట్టుదలే జనాల్ని అతనికి దగ్గర చేస్తుంది. ప్రజానాయకుడు కావడానికి అవకాశాన్నిస్తుంది. ఈ విషయం కాంగ్రెస్‌కు అర్థమైన కొద్దీ జగన్‌ను వదులుకోక పోవచ్చు. ఇది రాహుల్ గాంధీకి రుచించకపోవచ్చు. కానీ జగన్‌కి ప్రత్యామ్నాయం అతను కూడా చూపించాలి కదా. ఆంధ్రప్రాంతంలో యువనాయకుడు ఎవరున్నారు?

జగన్‌ను ముట్టుకోకపోయినా అతని వ్యాపారాలను కట్టడి చేయాలని, అతని అనుయాయుల తోక కత్తిరించాలని మాత్రం తల్లీ కొడుకూ యిద్దరూ అనుకున్నట్టున్నారు. మైనింగ్ మాఫియాను దేశమంతా ఆపాలని రాహుల్ కంకణం కట్టుకున్నారు. శుభం. వైయస్ హయాంలో జరిగిన అక్రమాలన్నీ బయటకు లాగి చూపిస్తున్నారు. మరీ సంతోషం. కానీ ఎపిఐఐసి–ఎమ్మార్ వివాదంలో 2004 నుండి మాత్రమే విచారణ జరపడం నా కర్థం కాలేదు. వ్యవహారం అంతకు ముందే ప్రారంభమైందిగా! ఏ కారణాల వలన క్షాళన జరిగినా మంచిదే!

రెండు రకాల అధికార కేంద్రాలు వున్నపుడు హై కమాండ్ సందిగ్ధం యిలా సాగుతూనే వుంటుంది. సంయమనం పాటిస్తే జగన్‌కు యిప్పట్లో హై కమాండ్ నుండి యిబ్బంది లేదు. ఇబ్బంది వస్తే గిస్తే అది అతని అనుయాయుల వలననే వస్తుంది. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్**

**అక్టోబరు 27** **ఎమ్బీయస్: ఇంతా చేసి ఓ బెంచి కోసమా...?**

గుంటూరులో హైకోర్టు బెంచి కోసం అక్కడి న్యాయవాదులు రోడ్డు కెక్కారు. న్యాయవ్యవస్థను బెంచెక్కించి, కోర్టులకు తాళాలేసి హైకోర్టులో ఆందోళన చేసిన తెలంగాణా న్యాయవాదుల బాట పడుతున్నారు. రేపో మాపో న్యాయాధీశులపైకి లంఘించినా ఆశ్చర్యపడనక్కరలేదు. నవంబరు 10 దాకా ఆందోళన చేసి తీరతారట. పక్క జిల్లాల్లో కూడా ముఖ్యంగా కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో కూడా సంఘీభావం వ్యక్తమవుతోంది. నిరాహారదీక్షలు, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనాలు యిత్యాది దినసరి కార్యక్రమాలకు ఏ లోటూ లేకుండా చూస్తున్నారు.

డిమాండ్ చూడబోతే అభ్యంతరకరంగా అనిపించదు. ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణాన్ని దృష్టిలో పెట్టుకున్నా, రాజధానిలో నిత్యం పెరుగుతున్న కాస్ట ఆఫ్ లివింగ్‌ను దృష్టిలో పెట్టుకున్నా కేసులకోసం యింతదూరం రావడం దండగ. అసలు కోర్టు కేసులంటేనే ఏళ్లూ పూళ్లూ పడతాయి. చీటికి మాటికి వాయిదాలు అడుగుతూంటారు. అలాటప్పుడు ఎక్కడో ఇచ్ఛాపురం నుండి కేసుకోసం వచ్చి హైదరాబాదులో ఒక్కో వాయిదాకి మూడేసి రోజులుండడం ఘోరం. అందువలన డీ సెంట్రలైజ్ చేయడం న్యాయమే. పైగా ఎక్కువ కేసులు ఆంధ్రప్రాంతం నుండి వుంటున్నపుడు అక్కడే ఓ బెంచ్ పెట్టేస్తే అవస్తలు తగ్గుతాయి కదా.

అయితే మరి యిన్నాళ్లనుండి ఈ డిమాండ్‌పై ఎందుకు పట్టుబట్టలేదు? ఇప్పుడే ఎందుకు పడుతున్నారు? అన్న ప్రశ్న వస్తుంది. 'అబ్బే 50 ఏళ్లగా అడుగుతున్నాం' అంటారు. నాకు చటుక్కున ప్రత్యేక తెలంగాణా డిమాండ్ వయసు అర్ధశతాబ్ది అంటే ఎంత నవ్వు వస్తుందో అంత నవ్వు వస్తుంది. ఓ సారి అడిగేసి, చతికిలపడి, ఆ పై పదేళ్లకో ఇరవై ఏళ్లకో ఒకళ్లిద్దరు ఓ మహజరు పెడితే సరిపోయిందా?

ఆంధ్రవాళ్లు గొప్ప (అతి)తెలివైనవాళ్లని, తెలంగాణాకు రావలసిన నీళ్లు, నిప్పులు(కరంటు), ఉద్యోగాలు, సద్యోగాలు అన్నీ ఎత్తుకుపోతున్నారని యిక్కడ తెలంగాణాలో చెప్పుకుంటూ వుంటే యిదేమిటి – వాళ్లకు రావలసినవి కూడా వాళ్లు అడగలేనంత అప్రయోజకుల్లా వున్నారు!?

1956లో గుంటూరులోని హైకోర్టు ఎత్తుకుపోయి హైదరాబాదులో పెట్టేసారని యిన్నాళ్లకు గుర్తుకు వచ్చిందా? ఇప్పుడు రోశయ్య దిష్టిబొమ్మ ఎందుకు తగలేయడం? మీ గుంటూరు వారే, పైగా లాయరుగారైన బ్రహ్మానందరెడ్డిగారు దశాబ్దం పాటు రాష్ట్రాన్ని ఎదురులేకుండా పాలించారు కదా, అప్పుడు అడగలేదేం? హైకోర్టు సరే, ఆయన హయాంలోనే ఇసిఐయల్ హైదరాబాదులో పెడుతూంటే గుంటూరులో పెట్టమని అడగలేదేం?

బిఎచ్‌యిఎల్ తమిళనాడులో రాజధానిలో పెట్టలేదు. తిరుచ్చిలో పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చేసరికి అనేకానేక డిఫెన్సు లాబ్స్‌తో బాటు అదీ రాజధానిలోనే పెట్టారు. మీ స్వంత జిల్లాలో పెట్టలేదేం అని బ్రహ్మానందరెడ్డిగారిని అడిగారా గుంటూరు జిల్లావారు? 1972లో జై ఆంధ్ర ఉద్యమంలో గుంటూరు మంచి ఫోర్సుగా పాల్గొంది. ఉద్యోగాల విషయంలో ఆరుసూత్రాల పథకం పెట్టి చల్లార్చారు. సరే, మరి కోర్టుల విషయమో? దాని విషయం నాలుగు దశాబ్దాల తర్వాతగానీ గుర్తుకు రాలేదా? ఆంధ్రప్రాంతం నుండి కేసులు ఎక్కువ కావడం యిప్పుడే కాదుగా, మొదటినుండీ పరిస్థితి అదేగా! మరి ఎప్పుడూ యింత హుషారు రాలేదేం?

పోనీ గుంటూరుజిల్లావారు నోరూ, వాయి లేనివారా? కృష్ణా, గుంటూరు జిల్లావారు రాష్ట్రంలో ఆర్థికంగా బలవంతులేగా, రాజకీయంగా చక్రం తిప్పగలిగేవారేగా! పల్లెపల్లెనా రాజకీయచైతన్యం వెల్లివిరిసేవారేగా! ఇన్నాళ్లూ ఎందుకు ఊరుకున్నారట? పోనీ ఊరుకున్నవారు రాష్ట్రం విడిపోయేదాకా ఆగవచ్చుగా! అప్పుడు కెసియార్ అన్నట్టు ఏకంగా హైకోర్టే అడిగేయవచ్చు. ఇంకెంత, డిసెంబరు 31 ఇంకో రెణ్నెల్లలో వచ్చేస్తుంది. నివేదిక ఎలా యిచ్చినా రాష్ట్రంలో యిక్కడో అక్కడో ఒకచోట గోల జరగకమానదు. సమైక్యరాష్ట్రం అంటే '....మాకు హైకోర్టు బెంచ్ యిస్తేనే' అని పట్టుబట్టండి, సరిపోతుంది. ఈ మాత్రం దానికి కోర్టు విధులు ఎగ్గొట్టి మిమ్మల్ని నమ్ముకుని కూచున్న క్లయింట్లను యిబ్బందిపాలు చేయడం దేనికి?

ఇదంతా చూస్తూవుంటే ఏదో అనుమానం కలుగుతోంది కదూ! ముఖ్యంగా టైమింగ్ గురించి!

నా మట్టుకు నాకు ఇది రాజధాని సాధించుకోవడానికి రిహార్సల్ అనుకుంటున్నాను. డిసెంబరు 31 తర్వాత రాష్ట్రవిభజన జరగవచ్చని గట్టిగా అనుకుంటున్నారు. (..హైదరాబాదు విషయం ఏమవుతుందో చెప్పలేరు గానీ) ఆంధ్రరాష్ట్రం అంటూ ఏర్పడితే రాజధాని ఎక్కడ అని ప్రశ్న వెంటనే వస్తుంది. రాయలసీమవారు మాకు రాజధాని కావాలి అంటారు. ఇప్పుడు గుంటూరువారు మా నుండి ఎత్తుకుపోయిన హైకోర్టు మాకు మళ్లీ యిచ్చేయండి అని అడిగినట్టు రాయలసీమవారు మా కర్నూలు రాజధానిని మళ్లీ మాకు యిచ్చేయండి అని మొదలెడతారు. లేకపోతే 'కోస్తావారిని నమ్మం. మా ప్రత్యేక సీమ మాకు యిచ్చేయండి' అంటారు.

వైజాగ్ వారి క్లెయిమ్ ఎలాగూ వుంది. రాయలసీమ కంటె వెనుకబడి వున్నాం. మా పక్కన రాజధాని యిస్తే మేం బాగుపడతాం. ఇవ్వండి అంటారు. వైజాగ్‌లో పోర్టు వారి భూములు చాలా వున్నాయిట. అందువలన వైజాగ్ రాజధాని చేయడం కష్టం, అని ఓ మాట. పైగా వైజాగ్ ప్రజాప్రతినిథులలో చాలామంది అక్కడివాళ్లు కారు. నెల్లూరు, ఒంగోలు, కృష్ణా ఏ జిల్లాలోనైనా నాయకులు ఎక్కువ, సీట్లు తక్కువ అయితే వైజాగ్‌కు తోలేయవచ్చు, అక్కడివాళ్లు స్థానికులకే ఓట్లేస్తామని పట్టుబట్టరు పాపం. అక్కడ నెగ్గినా, వాళ్ల తమ జిల్లా పాలిటిక్స్‌కే ఎక్కువ సమయం వెచ్చిస్తారు. వైజాగ్ కోసం త్యాగాలూ గట్రా చేసేయరు. అందువలన వైజాగ్‌కు రాజధాని వచ్చే ఛాన్సులు చాలా పూర్.

అయితే ఆ సమస్యకు పరిష్కారం చూపడానికి బొత్స సత్యనారాయణగారు ముందుకు వస్తారు. 'విజయనగరంలో రాజధాని పెట్టేయండి, ముఖ్యమంత్రి కుర్చీ నేను మా యింటినుండే తెచ్చుకుంటాను. కాబినెట్‌లో మా బంధుగణమే వుంటారు కాబట్టి కావాలంటే అన్ని కుర్చీలూ నేనే సప్లయి చేస్తాను' అంటారు.

డిసెంబరు 31 తర్వాత విభజన జరిగే పక్షంలో ఆంధ్ర రాజధాని ఎక్కడ అన్నదానిపై పోరాటాలు తప్పవు. కృష్ణా-గుంటూరు జిల్లాలవారు రాజధానికోసం గట్టిగా పట్టుబడడం ఖాయం. ఈ హైకోర్టు బెంచ్ ఆందోళన దానికి శాంపుల్ మాత్రమే. ఇప్పుడు బెంచ్ సాధించుకుంటే రేపు రాజధాని గురించి పట్టుబట్టడానికి వాళ్ల కేసు స్ట్రాంగ్ అవుతుంది. తెలుగువాళ్లందరం ఒకటే కదా, రాజధాని ఎక్కడుంటే ఏం? అని తక్కిన జిల్లాలవారు ఊరుకుంటారనుకోవద్దు.

ఇప్పుడు హైదరాబాదు సంగతి చూశాం కదా, రాజధాని అనగానే అన్ని శోభలూ అక్కడే! మిగతావాళ్లు నోట్లో వేలేసుకుని చప్పరిస్తూ కూచోవాలి. అందువలన ప్రతి ప్రాంతం రాజధాని మాకంటే మాకంటారు. కానీ ఒక్కరికే దక్కుతుందని అందరికీ తెలుసు. ఒకవేళ అది విజయవాడ-గుంటూరు వాళ్లకు దక్కిందంటే మాత్రం అందరూ హతోస్మి అంటారు.

కృష్ణా-గుంటూరు బెల్టు వాళ్లంటే తక్కినవాళ్లందరికీ అడలు. వాళ్లలో చురుకుతనం ఎక్కువ. ఆర్థికంగా, రాజకీయంగా, వ్యాపారపరంగా, కళలపరంగా - అన్ని రకాలుగా వాళ్లు ముందుంటారు. కాస్త సందిస్తే చాలు చొచ్చుకుపోతారు. ప్రభుత్వ నిర్ణయాలను శాసించగలరు, మీడియా వాళ్లదే కాబట్టి ఆ నిర్ణయాలను సమర్థిస్తూ వ్యాసాలూ రాయించగలరు. ఏ కొత్త ప్రాంతమైనా సరే నదురు బెదురు లేకుండా వెళ్లిపోయి జెండా పాతగలరు. వాళ్లే అంత చలాకీగా వున్నపుడు వేరేవాళ్లు అక్కడకు వచ్చి ఏం సాధించగలరు? అసలు దూరేటంత ఖాళీ వదిలితే కదా!

1953లో మద్రాసు రాష్ట్రం నుండి తెలుగువాళ్లు విడిపోయి ఆంధ్రరాష్ట్రం కావాలన్నపుడు రాజధాని గురించి యిలాగే తగాదా పడ్డారు. కృష్ణా వాళ్లు విజయవాడ రాజధాని చేయాలని చాలా పెద్ద ఆందోళన చేశారు. చివరకు ప్రకాశం గారు కర్నూలును రాజధానిగా ప్రకటించగానే విజయవాడలో వున్న ప్రకాశంగారి విగ్రహాన్ని పగలగొడతామని ప్రకటించారు. ఆ విషయం చెపితే

ప్రకాశంగారు తొణకలేదు. "నేనేమైనా పెట్టమని అడిగానా? వాళ్లే పెట్టుకున్నారు. వాళ్లే కూల్చుకోనీ.." అని కొట్టిపారేశారు.

చివరకి విరగకొట్టలేదనుకోండి. చెప్పవచ్చేదేమిటంటే ఏ ఊళ్లోనూ జరగనంత అలజడి అక్కడే కనబడింది. ఎందుకంటే విజయవాడ ఆంధ్రప్రాంతానికి సెంటర్లో వుంది. లలితకళలకు, రాజకీయాలకు , వ్యాపారాలకు పెట్టింది పేరు. రాజధాని యిక్కడ కాకపోతే యింకెక్కడ వస్తుంది అని వారి ఆలోచన.

అప్పట్లో విజయవాడను రాజధాని చేయకపోవడానికి కారణం అది కమ్యూనిస్టుల కంచుకోట కావడం అనే వాదన కూడా వుంది. రాజధాని కమ్యూనిస్టుల స్థావరంగా వుండడం కాంగ్రెస్ నాయకులకు రుచించ లేదట. అందువలననే విజయవాడను తప్పించారట. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. విజయవాడ నుండి కమ్యూనిస్టు వ్యతిరేక బిజెపి ఎమ్మెల్యే (కోట శ్రీనివాసరావు) ఎంపికయ్యారు కూడా. అయితే క్రమేపీ విజయవాడ కులాల కురుక్షేత్రంగా మారిపోయింది. కమ్మ-కాపు గొడవలు అందరూ అసహ్యించుకునే స్థాయికి దిగజారాయి.

కె ఎల్ రావు గారి వంటి ఘనత వహించిన ఇంజనీర్లు ప్రజాప్రతినిధులుగా వుండే కాలం పోయి రౌడీ షీటర్లు ప్రజానాయకులుగా, ప్రజా ప్రతినిధులుగా చెలామణీ అయ్యే కాలం వచ్చింది. కుమ్ములాటల్లో వారు మరణించారు కదా అని గట్టిగా వూపిరి పీల్చుకునే లోపున వారి వారసులు ముందుకు వచ్చి ఆ వారసత్వాన్ని కొనసాగించి తీరతామని గర్వంగా చెప్పుకుంటున్నారు. రాయలసీమవారు ఫ్యాక్షనిజానికి స్వస్తి పలుకుతూంటే విజయవాడవారు వంశాలవారీ హింసకు మొగ్గుతున్నారు. రాష్ట్రానికి రాజధాని కావాలంటే యీ గొడవల వాతావరణంలోంచి విజయవాడ నాయకులు బయటపడాలి.

ఆ ప్రయత్నం చేయకుండా హైకోర్టు బెంచ్ పేరుతో ఆందోళనలు చేస్తున్నారు వారు. డిసెంబరు 31 కు తర్వాత రాజధాని కోసం చేయాల్సిన పోరాటానికై తమ సైన్యాన్ని తయారుగా వుంచుకోవడానికి తొందరపడి ముందే కూస్తున్నారు. ఇక్కడ తెలంగాణాలో కెసియార్ చేస్తున్నదీ అదే. డిసెంబరు 31 తర్వాత అంతర్యుద్ధం అంటే అప్పటికప్పుడు సైన్యం తొట్రుపడవచ్చు. అందుకని పల్లెబాట అని, రాష్ట్రావిష్కరణ బహిష్కరణ అనీ, ఏదో పేరు చెప్పి కార్యకర్తలను చురుగ్గా వుంచుతున్నారు. ఇవి సరిపోవనుకుంటే ఎమ్మెల్యేల చేత మళ్లీ రాజీనామా చేయించవచ్చు కూడా. ఏదో ఒకటి చేస్తూ వార్తల్లో వుండేట్లుగా చూసుకోవాలి.

గుంటూరు వాళ్లు కూడా ఇదే పంథాలో పోతున్నారు. నిరాహారదీక్షలు, నిరసనలు, ధర్నాలు, మారువేషాలు, దిష్టిబొమ్మలు, బూట్ పాలిష్ చేయడాలు, రక్తదానాలు, రోజు కూలీ చేసి విరాళాలు పోగేయడాలు, పాటలు కట్టడాలు... యిలా ఏవో ఒకటి చేస్తూ వార్తల్లో వుంటూ ఆంధ్రరాష్ట్రం ప్రకటించగానే ఉవ్వెత్తున వుద్యమించేస్తారన్నమాట.

ఈ పథకం రాయలసీమవారికీ అర్థమైనట్లుంది. అందుకే వాళ్లు తిరుపతికి బెంచ్ అంటూ మొదలెట్టారు. తిరుపతి నిజానికి రాష్ట్రానికి ఒక కొనలో వుంది. రాయలసీమకు కూడా మధ్య కాదు. అయినా వాళ్లు బెంచ్ అడిగారు. అక్కడి ఎమ్మెల్యేగా చిరంజీవి మద్దతు తెలిపారు. బెంచ్ అక్కడ యిచ్చినా యివ్వకపోయినా ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే రాజధాని మాకు అంటూ ఆందోళన చేయడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పడుతోందన్నమాట.

నవంబరు నెలలోకి అడుగుపెట్టేసరికి ఆంధ్రప్రాంతమంతా మాకో బెంచ్, మాకో బెంచ్ అన్న నినాదాలు వినవచ్చినా ఆశ్చర్యపడవద్దు. ఇన్నాళ్లు నాయకులు కుర్చీలకోసం పోట్లాడుతూ వచ్చారు. ఇప్పుడు బెంచీలకోసం పోరాడతారు. నేను యిందాకే చెప్పినట్టు కృష్ణా, గుంటూరువాళ్లు ఎప్పుడూ అగ్రగాములు, మార్గదర్శకులే! ఈ విషయంలో కూడా...! **- ఎమ్బీయస్ ప్రసాద్**

**అక్టోబరు 35**

## ఎమ్బీయస్: కుప్పిగంతులూ-కుళ్లుమోత్తనాలూ

హనుమంతరావుగారు సాక్షి మీద అలిగారు. మెహబూబ్‌నగర్‌లో జరిగినది వక్రీకరించి రాశారని అభియోగం! "సాక్షి" వారికి ఆ విద్య రాదని నేనేమీ వకాల్తా తీసుకోవడం లేదు కానీ, అవేళ జరిగినది అందరూ కవర్ చేశారు. గల్లీ నాయకుడిని ఢిల్లీ పంపితే ఏమవుతుందో అందరికీ కళ్లకి కట్టినట్టు కనబడింది. మరి హనుమంతరావు "సాక్షి"ని మాత్రం విడిగా చూస్తున్నారెందుకు? అది వైయస్‌కు సంబంధించిన పత్రిక కాబట్టా? చూడగా చూడగా హనుమంతరావుగారికి వైయస్ ద్వేషం తప్ప మరేమీ మిగిలేట్టు లేదు. అవేళ మీటింగులోనూ అంతే "వైయస్ కావాలా? తెలంగాణా కావాలా?" అన్న ప్రశ్న వేశారు, ఏదో పెద్ద వరాలిచ్చే దేవుళ్లా.

అయినా అదేం ఛాయిస్? మాటవరసకి తెలంగాణా వద్దులే కానీ, వైయస్‌ని పట్టుకుని రా అంటే పైకి వెళ్లి వెంటపెట్టుకుని రాగలడా? పోనీ వైయస్ ఎలాగూ పోయాడు కాబట్టి తెలంగాణా ఇయ్యి అంటే రేపటికి తెలంగాణా యివ్వగలడా? 'నేను పోయి జెప్పిన. అమ్మ యిస్తది' అంటూ పాట పాడతారు. 'పోనీ తెలంగాణా వచ్చేవరకు నాకు రాజ్యసభ సీటు వద్దు' అంటూ బెట్టు చేసి వుంటే యిచ్చేదేమో! అమ్మో వద్దనడమా!? మరేమైనా వుందా?

వైయస్ కంటె సీనియర్ని అని చెప్పుకుంటాడు. అయితే ఏమిటంట? వైయస్ బతికున్నంతకాలం ఆయన్ని ఎదిరించగలిగాడా? డబ్బివ్వండి, జనాల్ని తీసుకుని వస్తా అంటూ పదేపదే అని తననూ, జనాలను చులకన చేస్తున్నాడాయన. జనమంతా డబ్బుకోసమే వస్తారని నమ్మేవాడికి యింకేం చెప్తాం? మధ్యతరగతి వాళ్లకు కూడా డబ్బిస్తున్నారంటారా? కొంతమందైనా నిన్ను చూడడానికి రారా? అయితే నువ్వేం నాయకుడివి?

అధిష్టానం వద్ద యీయన పరపతి ఎంతవరకు వుందంటారు? తనకో సీటు తెచ్చుకునే వరకే ఆ పరపతి పరిమితి. అంతకు మించి ఎవ్వరికీ టిక్కెట్లు యిప్పించే లెవెల్ కూడా ఉందనుకోను. సోనియా గాంధీ యీయనను సలహాలు అడుగుతుందనుకోను. ఏదో వెళితే రానిస్తుందంతే. ఎందుకంటే యీయన వలన ఓట్లు పెరిగేది లేదు, తరిగేది లేదు. ఈయన మీడియా దృష్టిలోనే నాయకుడు, సీనియరు, అధిష్టానానికి అంతేవాసి. మామూలు జనాలని యీయన యిన్‌స్పయిర్ చేయగా నేనెన్నడూ ఎరగను. ఎన్నోసార్లు ఎన్నికలలో ఓడిపోయాడు. (వివరాలు కావాలంటే న్యూస్ జాటింగ్స్‌లో గోనె ప్రకాశరావు స్టేటుమెంటు చూడండి). అయినా అధిష్టానం ఏదో ఒకటి పడేస్తూ వుంటుంది. దానికి ప్రతిగా యీయన అధిష్టానం తరఫున కావలివాడిలా యిక్కడ ప్రవర్తిస్తూ వుంటాడు. వాళ్లకు నచ్చుతుందనుకున్నవన్నీ చేస్తాడు. జగన్ అంటే అధిష్టానానికి కోపం అని అనుకుని తెగ రెచ్చిపోయాడు. తీరా వాళ్లేమీ చర్య తీసుకోకపోవడంతో కంగు తిన్నాడు.

తెలివైనవాడైతే అక్కడితో ఆగాలి. ఆగటం లేదు. వైయస్‌పై, వైయస్ అవినీతిపై తెగ మాట్లాడేస్తున్నాడు. అదంతా అల్టిమేట్‌గా సోనియాకే తగులుతుందన్న యింగితం లేదు. వైయస్ లంచాలు భోంచేస్తూ వుంటే సోనియా ఏం చేస్తోందట? తన కంచంలోనూ వడ్డించుకుందా? అని అడుగుతారేమోనన్న జంకు లేదు. వైయస్ బతికుండగానే నోరెత్తలేదేం? అని జనాలు నిలదీస్తారన్న ఆలోచన రాదు. బతికున్నంతకాలం వైయస్‌ను ఆకాశానికి ఎత్తేసి యిప్పుడు యిలా మాట్లాడితే ఊరుకుంటారా?

హనుమంతరావు తన ఎజెండాను అర్జంటుగా మార్చేసుకోవచ్చు. కానీ సామాన్యప్రజలు ఓ పట్టాన మార్చుకోరు. వాళ్ల గురించి పట్టించుకుని ఏ కొద్దిపాటి మేలు చేసినా వాళ్లు గుర్తుంచుకుంటారు. ఆరాధిస్తారు. వాళ్లకు వ్యతిరేకంగా ఏదైనా అంటే ఊరుకోరు. ఇందిరా గాంధీ గురించి మీకూ నాకూ ఒక రకమైన ఎసెస్‌మెంట్ వుండవచ్చు. కానీ పేదప్రజల దృష్టిలో ఆమె ఒక దేవత, దట్సాల్! మీరనవచ్చు – బాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు వంటివి ఆమె తన రాజకీయప్రయోజనాల కోసం చేసిందని, ఒకసారి పదవిలో స్థిరపడ్డాక సోషలిజాన్ని అటకెక్కించిందని, 'గరీబీ హఠావో' అనే నినాదంలో చిత్తశుద్ధి లేదనీ... కానీ వాళ్లు నమ్మరు.

ఇందిరా గాంధీ నియంత. స్వార్థపరురాలు. దేశం మొత్తంలో నాయకుడు అన్నవాణ్ని ఎదగనీయకుండా చేసింది. తన పదవి కాపాడుకోవడానికి ఎమర్జన్సీ విధించి, ప్రజాస్వామ్యాన్ని కాలరాచింది. తన కొడుకు సంజయ్‌ను మన నెత్తిపై రుద్దింది. 1977 ఎన్నికలలో ఓడిపోయాక జనతా పార్టీ తనను అరెస్టు చేయబోతే నాటకాలాడి సింపతీ సంపాదించాలని చూసింది. జనతాలో విభేదాలను తనకు అనువుగా మలచుకుని, చరణ్ సింగ్‌కు ఆశలు చూపి, నమ్మకద్రోహం చేసి ఆ ప్రభుత్వాన్ని కూలదోసింది.

1980 ఎన్నికలలో ఘనవిజయం సాధించగానే మరింత నియంతగా మారి రాష్ట్రప్రభుత్వాలను రద్దు చేసింది. సంజయ్ మరణంతో రాజీవ్‌ను రంగంలోకి దింపి తన కుటుంబపాలనను స్థిరపరచుకుంది. కేంద్రప్రభుత్వ అధికారాలను దుర్వినియోగం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం మతంతో ఆటలాడి దేశానికి చిచ్చు పెట్టింది....ఇవన్నీ వాస్తవాలు. కానీ సామాన్యప్రజలు యివేవీ పట్టించుకోరు. ఇందిరమ్మ మనకేదో చేసింది అన్న ఫీలింగ్ వాళ్లకు పాతుకుపోయింది. ఆమెనే కాదు, ఆమె కొడుకుని, కోడల్ని, మనవణ్ని కూడా ఆదరిస్తున్నారు.

ఎన్టీయార్ గురించి కూడా చదువుకున్నవాళ్లకు కొన్ని అభిప్రాయాలున్నాయి. మంచి ఆశయాలున్నా, పరిపాలన చేతకాదనీ, ఆచరణయోగ్యంకాని ప్రయోగాలు చాలా చేశాడనీ, నియంతలా వ్యవహరించాడని, తిక్కవేషాలు చాలా వేసి నవ్వుల పాలయాడనీ, ... కానీ ప్రజలు అలా అనుకోలేదు. మాకోసం మనస్ఫూర్తిగా ఏదో చేశాడు అనుకున్నారు. ఆరాధించారు. ఎన్టీయార్ పోయినప్పుడు పదవిలో లేకపోయినా జనాలు విరగబడి వచ్చి అంజలి ఘటించారు. పోయి 14 ఏళ్లయినా ఇప్పటికి కూడా ఎన్టీయార్ బొమ్మ ఓట్లు రాలుస్తూనే వుంది. బాలకృష్ణ వెళ్లినా, పురంధరేశ్వరి వెళ్లినా, జూ. ఎన్టీయార్ వెళ్లినా – జనం చూడడానికి వస్తున్నారంటే కారణం, ఆనాటి అభిమానం చెక్కు చెదరకపోవడమే.

వైయస్ కూడా ఆ కోవకు చెందిన వ్యక్తే అని గుర్తించకపోవడం యీ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న పొరబాటు. అతని అజ్ఞానం గురించి, ఫ్యాక్షనిజం గురించి, అవినీతి గురించి మీరెంతైనా చెప్పండి, ఏమైనా రాసుకోండి. కానీ ప్రజల హృదయాలలో పాతుకుపోయాడని గుర్తించండి. వైయస్ మరణానంతరం తెలంగాణా అంశం ఉవ్వెత్తున ఎగసిపడి రాష్ట్రమంతా అల్లకల్లోలం కావడంతో ప్రతీ తెలుగువాడు అంటున్నాడు – 'వైయస్ వుంటే యిలా వుండేది కాదు' అని. దానితో అతని పట్ల మరింత ఆరాధన పెరుగుతోంది. జగన్‌కు యింత ప్రజాదరణ రావడం వెనుక కిటుకు అదే. అది చూసైనా యీ కాంగ్రెస్ నాయకులు తగ్గాలి. ప్రజలలో వైయస్ కున్న గుడ్‌విల్‌ను వీళు ఎన్‌క్యాష్ చేసుకోవాలి.

జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి అదలెత్తి, వైయస్ యిమేజికి బురదపూయాలనుకోవడం తెలివితక్కువ పని. సోనియా, రాహుల్‌లకు 'గాంధీ' అనే తోక లేకపోతే, వాళ్లు ఇందిరా గాంధీ వారసులని చెప్పుకోకపోతే వీళ్లంతా వాళ్ల భజన చేసేవారా? అదే లాజిక్ యిక్కడెందుకు ఉపయోగించడం లేదు? ఇందిరా బతికుండగా, చనిపోయాక కూడా ఆమెతో పనిచేసినవారు చాలామంది ఆమెకు వ్యతిరేకంగా ప్రజలకు నచ్చచెప్పబోయారు. అదే ఎన్టీయార్ విషయంలోనూ జరిగింది. కానీ ఏం లాభం? ప్రజలు వినలేదు.

మీరు ఎమ్మార్ ప్రాపర్టీస్ కాదు, జలయజ్ఞం కాదు, గనులు కాదు – దేనిలోనైనా అవినీతి తవ్వి తీయండి. వాళ్లను దండించండి, జగన్‌కు అండదండలు లేకుండా చేయండి. కానీ వైయస్ యిమేజిని దిగజార్చే పని చేశారో, ప్రజలకు దూర మవుతారు. 'వాళ్లు అజ్ఞానులు, వైయస్ మంచివాడనుకునే భ్రమలో వున్నారు, వాళ్లను ఎడ్యుకేట్ చేసేసి గట్టున పడేయాలి' అనుకోకండి. వాళ్లు వినరు.

గాంధీ, నెహ్రూ, బోసు, పటేల్ – వీళ్లందరి గురించి కరక్టుగా ఎసెస్ చేసి, వాళ్లు చేసిన పొరపాట్లేమిటో మీరు వ్యాసాలు రాయవచ్చు. అవి మీకూ నాకూ నచ్చుతాయి. అవి చదివేసి సామాన్యప్రజలు తమ అభిప్రాయాలు మార్చేసుకుని గాంధీ గారిని మహాత్ముడు అనడం మానేస్తారని మాత్రం ఆశ పెట్టుకోకండి. స్వాతంత్ర్యపోరాట సమయంలోనే కాంగ్రెస్ నాయకులు యీ విషయాన్ని గుర్తించారు. గాంధీ విధానాలు నచ్చకపోయినా నోరుమూసుకుని వెంట నడిచారు. ఎందుకంటే సామాన్యజనులు గాంధీగారిని దేవుడి స్థానంలో కూర్చోబెట్టాడు మరి. గాంధీ చెప్పినది ఏదీ చేయకపోయినా, చనిపోయాక కూడా కాంగ్రెస్ గాంధీ బొమ్మను వాడుకోవడానికి కారణం యిదే!

రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు కూడా వైయస్ యిమేజిని దిగజార్చకుండా, పొగుడుతూ ఓట్లు రాల్చుకునేవారే – జగన్ అనే వైయస్ వారసుడు లేకుండా వుంటే! జగన్ రాజకీయాల్లోకి రాకపోతే! వచ్చినా అర్జంటుగా ముఖ్యమంత్రి అయిపోవాలని ఆరాటపడకపోతే! అతను ముఖ్యమంత్రి కాదు కదా సహాయమంత్రి కావడం కూడా రాహుల్‌కి యిష్టం లేకపోయింది. ప్రభుత్వంలోనే కాదు, పార్టీలో కూడా ఓ చిన్న పదవైనా ఉండకూడదని అతని పట్టుదల. ఓ పక్క తాను వారసత్వపు హక్కులు అనుభవిస్తూ మరో పక్క ఆ హక్కులు జగన్‌కు దక్కకూడదని అతని ఆరాటం.

అది గ్రహించిన రాష్ట్ర నాయకులు దానికి తాళం వేస్తున్నారు. 'జగన్ ఓపిక పట్టాలి, ఓపిక పట్టాలి' అంటున్నారు. ఓపిక పడితే జనాలు మర్చిపోతారన్న భయం జగన్‌ది. అందుకే ఓదార్పు యాత్ర మొదలుపెట్టారు. దానికి వచ్చినచోట జనం వస్తున్నారు, రానిచోట రావడం లేదు. వీళ్లంతా ఓట్లు వేస్తారన్న నమ్మకం లేదు.

కానీ జనం వున్నచోట తను వుండాలని నాయకుడు కోరుకుంటాడు. జగన్ పాప్యులారిటీ అనేది వుంటే గింటే తనకు అనువుగా వాడుకోవాలని నాయకులు చూస్తారు. యాత్ర జరుగుతుంటే వెళ్లి ఓ దండ వేసినంత మాత్రాన లాభం వుంటే వుండవచ్చు కానీ నష్టం లేదు. ఆ మాటకొస్తే మఠాధిపతి దగ్గర్నుంచి సినిమా యాక్టరు దాకా ఎవరు వచ్చినా నాయకుడు అక్కడ వాలిపోయి తనూ వున్నాననటాడు. అందుకే మొదట్లో వెళ్లారు.

కానీ క్రమేపీ యీ హనుమంతరావు వంటి నాయకుల వలన యాత్రలో పాల్గొంటే సోనియాకు వెన్నుపోటు పొడిచినట్లే అని కలర్ రావడంతో వాళ్లు భయపడసాగారు. హై కమాండ్ రోశయ్యగారికి స్పష్టంగా చెప్పిందో లేదో తెలియదు కానీ రోశయ్యగారు ఎమ్మెల్యేలకు జాగ్రత్త అని సందేశాలు యివ్వసాగారు. దాంతో వాళ్లు వెళ్లడం మానేశారు. లోపల గుబులుగానే వుంటుంది, తప్పకుండా. ఎన్నికలు దగ్గర పడ్డాక అప్పటి అవసరం బట్టి ఏదో ఒకటి చేయవచ్చులే, యీ లోపున జగన్ యాత్రలో పాల్గొనకుండా వుంటే సరిపోయింది అనుకున్నారు. అదే సమయంలో జగన్‌కి వ్యతిరేకంగా మాట్లాడుకుండా వుంటే – రేపు అవసరం పడితే – అతని క్యాంపులో దూరడానికి అనువుగా వుంటుంది అనుకున్నారు.

కానీ హనుమంతరావు, కేకే వంటి నాయకులకు ఆ యింగితం లేదు. డబ్బిస్తే నాకైనా జనం వస్తారంటూ అధికప్రసంగం చేయడం, వైయస్‌ను తిట్టడం యివన్నీ చేశారు. వాళ్లు గ్రహించవలసినది ఏమిటంటే జగన్‌కు పాప్యులారిటీ వుందని అధిష్టానం ఫీలైతే అతన్ని చేరదీయడానికి ఏమాత్రం సంకోచించదు. ఎందుకంటే జగన్‌ను పార్టీ నుండి బహిష్కరిస్తే ఎన్నికలలో జగన్ వర్గం రాష్ట్రమంతా అభ్యర్థులను నిలపడం ఖాయం. వాళ్లలో ఎంతమంది నెగ్గుతారో లేదో తెలియదు కానీ కాంగ్రెస్‌వాళ్లు నెగ్గకుండా చాలామంది చూడగలరు. అవతల బలమైన ప్రత్యర్థి టిడిపి వుండగా ప్రతీ ఓటూ కాంగ్రెస్‌కు ముఖ్యమే. గ్రాస్‌రూట్ లెవెల్లో జగన్ వర్గం బలమెంత వుందో తేలందే (స్థానిక ఎన్నికలు జరిగినప్పుడు కొంతవరకు అవగాహన వస్తుంది) అధిష్టానం ఏ అడుగూ వేయదు. అది గ్రహించకుండా హనుమంతరావు, కేకే యిలా ప్రేలుతుంటే అధిష్టానం సంతోషించిందో లేదో తెలియదు కానీ జనాలు మాత్రం అసహ్యించుకున్నారు. మొన్న మెహబూబ్‌నగర్ మీటింగులో ఆ అసహ్యాన్ని ప్రదర్శించారు కూడా.

ఇప్పటికి కూడా జ్ఞానోదయం కలగకపోతే యీ నాయకులను చూసి మనం జాలిపడాలంతే! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**అక్టోబరు 37** **ఎమ్బీయస్: పేరులో పెన్నిధా? పెన్నిధికోసం పేరా?**

లలిత కళాతోరణం పేరు విషయంలో సుబ్బరామిరెడ్డిగారు వెనక్కి తగ్గారని ఇవాళ్టి వార్త. ఈయన చేస్తున్న అతి చూసి తెలుగువాళు _ రాజీవ్ పేరు మీదే అసహ్యం పెంచుకుంటున్నారని సోనియాగారు గ్రహించారట. అక్కడ ఆగు బాబూ అన్నారట. ఈయన దాని జోలికి వెళ్లను అని రోశయ్యగారికి చెప్పడం, రోశయ్యగారు జీవో రద్దు చేయడం జరుగుతున్నాయట. పనిలో పనిగా రాజీవ్ పేరు పెట్టడంపై ఓ ఆర్నెల్లు మారటోరియం విధిస్తే చాలా బాగుంటుంది.

ప్రజలు సకాలంలో స్పందిస్తే అనర్థాలను ఎలా నివారించవచ్చో దీనిలో రుజువైంది. మంచికో, చెడుకో ఓ పేరు పెట్టినపుడు దానిని కొనసాగించడంలో విజ్ఞత వుంది. ముఖ్యంగా దానికి ఓ చారిత్రక నేపథ్యం వున్నపుడు, ఓ సెంటిమెంటు వున్నపుడు!

సుబ్బరామిరెడ్డిగారు రాజీవ్ గాంధీ అనగానే ప్రజలు భగ్గుమన్నారు. అది చల్లార్చడానికి 'తెలుగు' పదం చేర్చారు. కానీ కెసియార్‌గారికి అది రుచించి వుండదు. 'మేం అధికారంలోకి రాగానే దాన్ని 'తెలంగాణా' అని మార్చేస్తాం' అనుకుని వుంటారు. తెలుగుతల్లి ఎవరు? ఎవనికి తల్లి? అని ప్రశ్నించిన ఘనుడాయన. రాజీవ్ వద్దు కానీ కాళోజీ పేరు పెట్టండి అని తెలంగాణా జాగృతివారు అడిగారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవం గురించి గొడవ కూడా వచ్చి పడింది కాబట్టి పనిలో పనిగా పక్కనే వున్న తెలుగు యూనివర్శిటీలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని భగ్నం చేశారు కొందరు.అసలు ఆ యూనివర్శిటీకి కొమరం భీమ్ పేరు పెట్టాలన్న డిమాండ్ కూడా వుంది. (అవునూ, భీమ్‌కి తెలుగు వచ్చా!?)

సుబ్బరామిరెడ్డిగారి మాట మనం ఎందుకు వినాలి? ఆయన డబ్బు యిస్తున్నాడు కాబట్టి అంటోంది ప్రభుత్వం. అంటే పెన్నిధి కోసం పేరు మారుస్తారన్నమాట. పెన్నిధి అని ప్రాసకోసం అనడం తప్ప, అది పెద్ద నిధి కానే కాదు. జలయజ్ఞం కాంట్రాక్టర్లకు యిచ్చిన అడ్వాన్సులలో పదోవంతు కూడా లేదు. పోనీ నువ్వూ నేనూ అది కూడా యివ్వలేదు, ఆయన యిచ్చాడు కాబట్టి ముచ్చట తీర్చాలి అంటారా? డబ్బు యిచ్చినంత మాత్రాన వాళ్లు ఏం చెపితే దానికి తందాన తాన అని ఆడాలా?

మాటవరసకి నేను ఓ ఆలయంలో మండపం కట్టడానికి డబ్బిచ్చి దానికి గజనీ మొహమ్మద్ మండపం అని పెట్టమంటాను. పెడతారా? అదేం పోలిక అంటారా? అవునండి, ఎవరైనా ఏదో ఒక సంబంధం వుంటేనే పేరు పెడతారు. అది లలిత కళా తోరణం. తెలుగు లలితకళలను వృద్ధి చేయడానికి పెట్టినది. రాజీవ్‌కు తెలుగు కళలు తెలుసా? కావాలంటే సైన్సు అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌కి రాజీవ్ పేరు పెట్టుకోమనండి. కాస్తో కూస్తో సంబంధం వుంది. ఏరోనాటికల్ కాలేజీకి పెట్టుకోమనండి, మరీ వుంది. కానీ లలితకళల కేమిటండి బొత్తిగా? వాళ్ల కుటుంబంలో ఎవరికైనా లలితకళలతో సంబంధం వుందంటే ఒక్క నెహ్రూగారికి వుంది.

పేరు పెట్టాలంటే ఔచిత్యం వుండాలి. ఓ తెలుగు గ్రంథాలయం వుందనుకోండి. కృష్ణదేవరాయలు పేరు పెడతాం. అంతేగానీ విజయనగర సామ్రాజ్యం వాళ్లే కదాని హరిహరరాయలు, బుక్కరాయలు పేరు పెట్టం. మహిళాశక్తి సంఘం వుంటే రుద్రమదేవి పేరు పెడతాం. లేదా కాంగ్రెస్ వాళ్లయితే ఇందిరా గాంధీ పేరు పెట్టవచ్చు. ఘంటసాలగారు గొప్ప గాయకుడే అయినా ఓ డాన్సింగ్ స్కూలుకి ఆయన పేరు పెడితే నప్పదు. సిద్ధేంద్రయోగి పేరు పెట్టాలి.

కానీ కాంగ్రెస్ భజనపరులకు యివేమీ తోచవు. పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్టు రాజీవ్ తారకమంత్రంతోనే మెట్లెక్కాద్దామని చూస్తున్నారు. నాలుగు రోజులు పోతే సోనియా తండ్రి పేరు కూడా పెడతానంటారు.

పేరు గురించి యింత రాద్ధాంతమా? అనకండి. కలకత్తాలో అమెరికన్ ఎంబసీ ఓ వీధిలో వుంది. జ్యోతి బసు అధికారంలోకి వచ్చుక అమెరికా వాళ్లను ఏడిపించాలనుకున్నాడు. అప్పుడు వాళ్లు వియత్నాంతో యుద్ధంలో వున్నారు. వియత్నాం తరఫున విప్లవ వీరుడు హొ చి మిన్ అమెరికాను ముప్పుతిప్పలు పెడుతున్నారు. జ్యోతి బసు యింకే రోడ్డూ దొరకనట్టు, యింకే పేరూ దొరకనట్టు అమెరికన్ ఎంబసీ రోడ్డుకి 'హొ చి మన్ సరణి (వీధి)' అని పెట్టారు.

ఏదో పోనీ పిల్లాటల్లే అని అమెరికన్ ప్రభుత్వం వదిలేయలేదు. వెంటనే అటువైపు గుమ్మం మూసేసి, మరోవీధిలోకి తెరుచుకునే గుమ్మం తెరిచి ఇకపై మా అడ్రసు యీ వీధినుండే అంది. చెప్పవచ్చేదేమిటంటే పేరుకి అంత ప్రాముఖ్యత యిస్తారు అందరూ.

అసలు అక్కడున్న ఓపెన్ ఎయిర్ థియేటర్ స్ట్రక్చర్‌ను మార్చవలసిన పనేముంది? కాకతీయుల నాటి ఆంఫి థియేటర్ మోడల్‌లో ఎన్టీయార్ కట్టించారని చెప్పుకున్నారు. దాని అందం దానిది. అది చెడగొట్టడానికి వీళ్లు చెప్పే కారణం – అది ఎవరూ బుక్ చేయడం లేదట. ఏడాదిలో చాలారోజులు ఖాళీగానే వుంటోందట. ఖాళీగా ఉంటోందంటే కారణాలేమిటో తరచి చూసి సమస్యల్ని పరిష్కరించాలి. రేటు ఎక్కువగా వుంటే తగ్గించాలి, క్వాలిటీ పెంచాలి. ఏర్పాట్లు సరిగ్గా చేయాలి.

అయినా యీ ప్రభుత్వ ఆడిటోరియాలలో బుక్ చేయడం లేదంటే సవాలక్ష కారణాలుంటాయి. ఈ మధ్య జరిగిన ఓ సంఘటన చెప్తాను వినండి. మా స్నేహితులు ఒకాయన ఓ పుస్తకం రాసి ఆవిష్కరణ కై రవీంద్రభారతిలో ఓ సాయంత్రం బుక్ చేశారు. కొన్ని నెలల కితం కన్‌ఫమ్ అయింది. ఇన్విటేషన్ కార్డుల ప్రింటింగ్ కూడా అయాక ఓ కవిగారి శతజయంతి అదే రోజున, అదే సాయంత్రం జరుపుతామంటూ ఆయన వారసులు హాలు అడిగారు.

మామూలుగా అయితే పొమ్మనేవారే కానీ ఆయన దళితుడు. బతికుండగా ఆయన దళితకార్డు ఎప్పుడూ ఉపయోగించుకోని మహానుభావుడు కానీ ఆయన వారసులు మాత్రం దళితకవి శతజయంతి జరుపుకోనివ్వరా? అని పోట్లాటకు దిగారు. శతజయంతి అనేది ఎన్నో ఏళ్లకు ముందే తెలుస్తుంది కదా. సరిగ్గా నాలుగు రోజుల క్రితమే ఫంక్షన్ పెట్టాలా? పెట్టేరే అనుకో, అదే హాలులో కావాలని పట్టుదల ఎందుకు? ఇవన్నీ అడగగలిగేవాడెవడు?

ముందుగా బుక్ చేసుకున్నా వీళ్లను పక్కకు పడేసి వాళ్లకు యిచ్చేశారు. వీళ్లు ఏమీ చేయలేక అదే హాల్లో మధ్యాహ్నానికి 2 గం॥లకి బుక్ చేసుకుని ఆ విషయాన్ని ఓ కాగితంపై ప్రింటు చేసి ఇన్విటేషన్ మధ్యలో పెట్టి అందరికీ పంపించారు. అయితే దానికీ అవాంతరం వచ్చింది. గవర్నరుగారు అతిథిగా వస్తున్నారు కాబట్టి సెక్యూరిటీవాళ్లు మధ్యాహ్నం నుంచి హేండోవర్ చేసుకుంటారు కాబట్టి మధ్యాహ్నం కూడా కుదరదన్నారు. వీళ్లను పొమ్మన్నారు. వీళ్లు చివరకి తెలుగు యూనివర్శిటీ ఆడిటోరియంలో సభ పెట్టుకోవలసి వచ్చింది. ఈ కథ విన్నాక రవీంద్రభారతి బుక్ చేసే సాహసం మీకుంటుందా? ఇంకోసారి మరో నిర్వాహకుడికి ముస్లిం వాళ్లు అడ్డు వచ్చారు. వాళ్లు మైనారిటీ కార్డు బయటకు తీశారు.

ఇదే కాదు, అశోక్ నగర్ సిటీ సెంట్రల్ లైబ్రరీ హాలు కథ కూడా వినండి. అది బుక్ చేయడమంటే యిదివరకు అతి సులభం. వెళ్లి అడిగితే ఖాళీ వుందో లేదో ఓ క్లర్క్ చెప్పేసేవాడు. డబ్బు కట్టేస్తే బుక్ చేసేసేవాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పద్ధతి క్లిష్టం చేసేశారు. హాలు బుక్ చేయాలంటే అక్కడి ఓ పెద్ద తలకాయను కలవాలి. ఆయన రాజకీయ పార్టీ పరంగా నియమించబడినవాడు.

రోజులో ఎప్పుడు వస్తాడో ఎప్పుడు రాడో తెలియదు. ఆఫీసుకి సెలవు పెట్టి వెళ్లినా దొరుకుతాడన్న నమ్మకం లేదు. అక్కడున్న బంట్రోతు చేతులు తడిపితే కాగితంపై సంతకం పెట్టిస్తాడు. 3, 4 సార్లు తిరగాలి. ఇంతా చేసి ఒకే రోజు యిద్దరు ముగ్గురికి యిచ్చేస్తున్నారు. డబ్బు తీసుకుని రసీదు యివ్వటం లేదు. మా హాసం క్లబ్ మీటింగులు అక్కడ పెట్టి పెట్టి విసిగిపోయి త్యాగరాయ గానసభ మినీహాలుకి మారిపోయాం, అద్దె ఎక్కువైనా సరే అని.

ప్రభుత్వం ఆడిటోరియంలు కట్టగానే సరికాదు, వాటిని సవ్యంగా మేన్‌టేన్ చేయాలి. అప్పుడే ఆదరణ వుంటుంది. ఇలాటి సమస్యలు తీర్చాలి. న్యాయంగా వుండాలి. ఇవేమీ చేయకుండా ఉన్నదాన్ని చెడగొడతాం అనడమెందుకు? ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను క్లోజ్‌డ్ డోర్ చేసి వీళ్లు బావుకునేదేముంది? అసలు ఓపెన్ ఎయిర్‌లో వున్న అందం క్లోజ్‌డ్ డోర్‌లో వుందా? సినిమాహాలులో సినిమా ఎంజాయ్ చేయడానికి నాకు యిప్పటికీ నిర్వచనం – మా టౌన్‌లో సినిమాహాల్లో బాల్కనీ సీటులో కూచుని పక్కన వరండా దాటి కనబడే అశోకవృక్షాగ్రాల మీదుగా వచ్చే గాలిని అనుభవిస్తూ పెద్ద తెర మీద సినిమా చూడడం! ఎసి థియేటర్ అని చెప్పి సినిమా మొదట్లోను, చివరిలోనూ ఇంత ఫ్యాన్ గాలి మొహం మీద బయ్యిమని కొట్టి తక్కిన టైమంతా ఎసి ఆఫ్ చేసి చెమటలో ముంచెత్తటం కాదు. నన్నడిగితే సినిమాహాలు విశాలంగా వుండాలి. వేలాదిమంది మధ్య కూర్చుని సినిమా చూడాలి. మల్టీప్లెక్స్ అంటూ అగ్గిపెట్టెల్లో దూరి, వందల రూపాయల టిక్కెట్టు కొని తెరకు ఆరడుగుల దూరంలో మెడ నొప్పి పుట్టేలా చూస్తే అది సినిమా ఎంజాయ్ చేసినట్టే కాదు.

లలితకళా తోరణ ప్రాంగణంలో మరో రవీంద్రభారతి కట్టడమెందుకు? జిల్లా కొక రవీంద్రభారతి కడతాం అంటూ వచ్చే ప్రభుత్వ ప్రకటనలు నా హైస్కూలు రోజుల్నించి వింటున్నాం. ఇప్పటిదాకా కట్టలేదు. హైదరాబాదులోనే వున్న రంగారెడ్డి జిల్లాకు కూడా రవీంద్రభారతి వంటి ఆడిటోరియం లేదు. సుబ్బిరామిరెడ్డిగారు రవీంద్రభారతి సమీపంలోనే మరోటి కట్టే బదులు ఊరి శివార్లలో కట్టవచ్చుగా? లలిత కళాతోరణం మీదే అంత ప్రేమ (లేదా కసి) ఎందుకు?

పోనీ ప్రేమో, కసో ఏదో వుంది కాబట్టే క్లోజ్‌డ్ డోర్ ఆడిటోరియం కడతానంటున్నారు. దానికి రాజీవ్ గాంధీ పేరెందుకు పెడుతున్నట్టు? రాజీవ్ అంటే పనికి రాదా? గాంధీ పేరు కూడా చేర్చాలా? పేరు పెట్టగానే సుబ్బిరామిరెడ్డిగారికి కావలసిన గుర్తింపు, దక్కవలసిన భాగ్యం దక్కేస్తే ఆయన యిక దాని గురించి పట్టించుకోవడం మానేస్తారు. త్యాగరాయ గానసభ ఎసి ఆడిటోరియం హాలు గతి చూడండి. తన పేరే పెట్టించుకుని కూడా ఎసి పనిచేస్తోందో లేదో పట్టించుకోరు. హాల్లో ఈ మూల నుండి ఆ మూలదాకా తన పేర ఓ బోర్డు పెట్టించేసుకున్నారు. ఇచ్చిన విరాళం ఆ బోర్డు ఖర్చుకే సరిపోయిందేమో మరి! ఎసి కొన్నట్టు, కొన్నా పని చేయించినట్టు తోచదు. త్యాగరాయ గానసభ మెయిన్‌హాల్‌కు వెళితే ఉక్కి ఉక్కి ఛస్తాం. అంతకంటె మినీ హాలు మేలు.

త్యాగరాయ గానసభను ఆ విధంగా ఉద్ధరించేసిన సుబ్బిరామిరెడ్డి యిప్పుడు లలిత కళాతోరణంపై పడ్డారంటే దాని వెనుక రహస్యమేమిటన్న ఆలోచన అందర్నీ తొలిచేసింది. పెన్నిధి పెట్టి పేరు పెట్టిస్తున్నారా? పేరు పెట్టి పెన్నిధి కొట్టేస్తున్నారా? అని సందేహించి విరుచుకుపడ్డారు. కావాలంటే ఆయన మహేశ్వరి, పరమేశ్వరి థియేటర్లకు రాజీవ్, సోనియా ల పేర్లు పెట్టుకోమని సలహా యిచ్చారు. జూబిలీహిల్స్‌లో కట్టబోయే హోటల్‌కు వాళ్ల కుక్కల పేర్లు పెట్టుకోమని సలహా యిచ్చారు. ఆయన గాయత్రీ కన్‌స్ట్రక్షన్స్ పేరు గురించి ఎవరికీ గుర్తు రాలేదు కానీ లేకపోతే దాన్నీ ప్రియాంకాగా మార్చమనేవారు. సిపిఐ నారాయణగారు సులభ్ కాంప్లెక్స్‌లకు రాజీవ్ పేరు పెట్టమన్నారు. మీరు పోయి చూపించండి, మీ పేరే పెడతాం అని కాంగ్రెస్‌వారు అన్నారు.

అంతటితో ఆగలేదు. రాజీవ్ అనే పేరు స్టేడియంకు ఎలా సూటబుల్లో రాజీవ్ స్పెల్లింగ్ తీసుకుని పొంగులేటి విశదీకరించారు. ఆర్ (రాగం) ఎ (ఆర్ట్), జె (జానపదం), ఐ (ఇన్‌స్ట్రుమెంటల్), వి (వోకల్) ట. సగం ఇంగ్లీషు పదాలు, సగం తెలుగు పదాలు కలిపి యింత క్రియేటివిటీ చూపినందుకు ఆడిటోరియంకు పొంగులేటి పేరు పెడితే బాగుండేదని నా అభిప్రాయం. అయితే దానికి ముందు ఆయన కాస్త ఎక్సర్‌సైజ్ చేయాలి. గాంధీకి కూడా యిదే తరహాలో ఏవో ఒకటి కిట్టించాలి. నా సూచన – జి (గార్దభస్వరం), ఎ (అపశ్రుతి), ఎన్ (నక్కఊళలు), డి(డెఫనింగ్), ఎచ్(హాహాకారాలు), ఐ (ఇరిటేటింగ్)

మొత్తానికి సుబ్బరామిరెడ్డిగారి ఓంకార ఘీంకారాలు 'రాజీవ్ గాంధీ తెలుగు లలిత కళాతోరణం'లో వినబడవనన్నమాట. సంతోషం. ప్రభుత్వం వారు వేరే చోట స్థలం యిస్తే అక్కడ క్లోజ్‌డ్ డోర్ ఆడిటోరియం కడతారట. దానికి తన కిష్టమైన పేరే పెడతారట (అంటే యింకేముంది? రాజీవ్ లేదా రాహుల్) పెట్టనీయకపోయినా, స్థలం యివ్వకపోయినా కట్టరట. హమ్మయ్య, ఆ మాట మీదే వుండండి సుబ్బిరామిరెడ్డిగారూ. – ఎమ్బీయస్ ప్రసాద్

**అక్టోబరు 39**

## ఎమ్బీయస్: సగోత్రీకుల మధ్య వివాహాలు

ఈ అంశం చాలా పాతదే. కానీ యిటీవల కాలంలో ఉత్తర భారతంలో సగోత్రీకులైన అబ్బాయి, అమ్మాయి పెద్దల అనుమతి లేకుండా పెళ్లి చేసుకోవడం, వాళ్లకు గ్రామపెద్దలు క్రూరమైన దండన విధించడం వార్తల్లో వస్తున్నాయి. అసలు గోత్రం ఎలా ఏర్పడింది, సగోత్రీకుల మధ్య వివాహాలు ఎందుకు వద్దన్నారు? అని తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలగడం సహజం.

ప్రతీ గోత్రానికి ప్రవర ఉంటుంది. ప్రవరలో వున్న ఋషులే గోత్రం గల వంశానికి మూలపురుషులని అంటూంటారు. అంటే

గౌతముడు అనే ఋషి వున్నాడంటే గౌతమగోత్రీకులందరికీ అతడే మూలపురుషుడనీ, గౌతమస గోత్రంలో పుట్టిన అబ్బాయి, అమ్మాయి వరుసకు అన్నా చెల్లెలు అవుతారని అంటారు. తల్లీ కొడుకూ వరుస కూడా కావచ్చు. తండ్రీ కూతురూ వరుస కూడా కావచ్చు. అందువలన పెళ్లి నిషిద్ధం అంటారు.

రక్తబంధువుల మధ్య పెళ్లిని ఉత్తరాదివారు ఒప్పుకోరు. దక్షిణాదిన మేనరికాలున్నాయి. మహారాష్ట్రలో కూడా. కానీ దక్షిణాదిన మేనమామను పెళ్లాడడం వుంది కానీ మహారాష్ట్రలో అది కూడదు. రక్తబంధువుల మధ్య పెళ్లి నిషిద్ధం కాబట్టి ఏకగోత్రీకులమధ్య పెళ్లిని ఉత్తరాదివారు ఒప్పుకోకపోవడంలో ఔచిత్యం వుంది. కానీ దక్షిణాదిన ఓ పక్క రక్తసంబంధీకులతో పెళ్లిళ్లు ఆమోదిస్తూ సగోత్రీకుల మధ్య పెళ్లి వద్దనడంలో కారణం యీ అన్నా-చెల్లెలు వరసే.

మన గోత్రం కలిసే కుటుంబాలన్నిటితోనూ మనకు సంబంధం వుండకపోవచ్చు. అసలు వాళ్లు వున్నారని కూడా మనకు తెలియకపోవచ్చు. వాళ్లదీ మనదీ ఒకే భాష కాకపోవచ్చు కూడా. అయినా మనం బంధువులమై పోతామా? అందునా అన్నా-చెల్లెలు!? ఆశ్చర్యంగా వుంది కదూ! గోత్రం కలిసింది కదాని వాళ్లు మనను బంధువులుగా స్వీకరించరు, మనమూ వాళ్ల జోలికి పోము. కానీ పెళ్లి సంబంధం వస్తే మాత్రం తిరస్కరిస్తాం.

ఇది కాక యింకో అనుమానం వస్తుంది. గౌతమస గోత్రం కలవారు లక్షలాది మంది వున్నారనుకోండి. వీళ్లందరూ గౌతముడనే ఋషికి పుట్టినవారేనా? ఎన్ని తరాలు వెనక్కి వెళ్లినా, ఆ గౌతముడికి వేలాది సంఖ్యలో సంతానం వుంటే అది సాధ్యం కాదు. ఎంత ఋషి అయినా మహా అయితే ఓ యిరవై మందిని కనవచ్చు తప్ప మరీ యింతమందిని కని వుంటారా?

ఈ అనుమానం నన్నెపుడూ దొలిచేస్తూ వుండేది. ఆ మధ్య "గౌతమ ధర్మసూత్రాలు" అనే 1990 లో ప్రచురించబడిన పుస్తకం చదివాను. రాసినది రాంషా. ఈయన కవి, పండితుడు. "అభిసారిక" పత్రిక ప్రారంభించి తెలుగు ప్రజల్లో శాస్త్రీయంగా లైంగిక విజ్ఞానం పెంపొందించిన ఉద్యమకారుడు. ఈయన గౌతముడు రాసిన ధర్మసూత్రాలను వ్యాఖ్యాన సహితంగా తెలుగులో అందించారు. మనువు రాసిన మానవ ధర్మశాస్త్రం తర్వాతనే గౌతమ ధర్మసూత్రాలు వచ్చాయిట.ఆ పుస్తకంలో గోత్రం గురించి ఏం రాశారో మీకు చెప్తున్నాను -

'గోత్రం అంటే ఆవులదొడ్డి అని అర్థం. అర్థాత్తూ బరి అన్నమాట. గౌతముడికి ముందు సూత్రాలు ఏర్పరచిన శాంఖాయణుడు, అశ్వలాయనుడు, పరాస్కరుడు, గోభిలుడు, ఆపస్తంభుడు - ఎవరూ గోత్రప్రవరలకు ప్రాధాన్యత యివ్వలేదు. ఒక్క హిరణ్యకేశిని మాత్రం భిన్నగోత్రానికి చెందిన అమ్మాయిని పెళ్లాడమన్నాడు. గౌతముడి కాలానికి సమానప్రవర (సగోత్రం) విషయంలో నిషేధం ఏర్పడింది. అది ఎందుకు వచ్చిందో చూదాం.

ఆంగీరస, అంబరీష, యౌవనాశ్వులు ముగ్గురూ ప్రవరలు (మూల ఋషులు). వీరి సిద్ధాంతాలను వేరు వేరు విధాలుగా అనువచనం చేసినవారు - హరిత, కుత్స, పింగ, శంఖ, దర్భ, హైమకభవులు. కనుక వీరు గోత్రకారులయ్యారు. (అంటే హరితస గోత్రీకుల ప్రవర ఆంగీరస, అంబరీష, యౌవనాశ్వులు). ఈ కారణం చేతనే కొందరి గోత్రాలలో ఋషులు కామన్‌గా వుంటారు.

ఆయా గోత్రాలలో (పాఠశాలలు) చదువుకున్న విద్యార్థులంతా ఆ గోత్రాలకి చెందినవారే. వారి మతాలు ఆంగీరస, అంబరీష, యౌవనాశ్వులవే. గౌతముని కాలం నాటికి స్త్రీలు పురుషులతో సమంగా ఉపనయనాన్ని పొంది, విద్యాసముపార్జన చేయటం, స్నాతకులవటం జరిగేది. యజ్ఞోపవీతానికి బదులుగా మగవాళ్లకు కండువాలు, స్త్రీలకు పమిటలు కాలాంతరంలో సంభవించాయి.

ఒకే గోత్రంలో (పాఠశాల) విద్య నభ్యసించే యువతీయువకులు కఠినబ్రహ్మచర్యవ్రతులై పరస్పరం సోదరభావంతో మసలవలెనన్న నియమం వున్నది కావున వారి మధ్య వివాహం నిషేధించబడింది. సమాన ప్రవరకు చెందిన స్త్రీని వివాహం చేసుకోరాదన్న నియమం సహాధ్యాయినిని వివాహం చేసుకోరాదన్న నియమమే! గౌతముడు ఏ కారణం చేత యీ నిషేధం విధించాడో అది యీనాడు వర్తించదు. మనం గురుకులాలకు వెళ్లటం లేదు. గురువుగారి యింట్లో కలిసి మెలిసి చదువుకోవడం లేదు. కానీ గోత్రం విషయంలో ఆ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. ఇందాకా చెప్పినట్టు హరితస గోత్రీకులందరూ హరితసుడనే ఆయన వద్ద ఆంగీరస, అంబరీష, యౌవనాశ్వుల సిద్ధాంతాలు అధ్యయనం చేసినవారే...'

అంటే హరితసుడి గురుకులంలో చదివిన వారందరూ హరితస గోత్రీకులన్నమాట. ఇప్పటి అన్వయంలో చెప్పాలంటే రామకృష్ణ మిషన్ పాఠశాలల్లో చదివిన వారందరూ రామకృష్ణ గోత్రీకులవుతారు. పిల్లలనైతే పదిమందినో యిరవై మందినో పుట్టించగలరు కానీ పాఠాలు చెప్పడం వేలాదిమందికి చెప్పవచ్చు. అలా నేర్చుకున్న వేలాదిమంది యింకో వేలాదిమందికి చెప్పవచ్చు. అందువలన హరితస గోత్రీకులందరిలోనూ హరితసుని రక్తం పారుతోందని అనుకోవడం పొరబాటు. అందువలన అన్నా చెల్లెలు రక్తసంబంధం ఏర్పడదు.

గౌతముడు వివాహం విషయంలో ఇంకో నియమాన్ని గట్టిగా విధించాడు. నీ తండ్రి తరఫున ఏడు తరాలు, తల్లి తరఫు ఐదు తరాలు లోపు బంధువుల్ని పెళ్లి చేసుకోకూడదని చెప్పాడు. దూరపు వ్యక్తుల మధ్య వివాహం వలన వేర్వేరు ప్రాంతాల కుటుంబాలతో బాంధవ్యం ఏర్పడి జాతివ్యాప్తికి దోహదం చేస్తుందన్న దృష్టితో గౌతముడు దగ్గర బంధువుల మధ్య వివాహాన్ని నిషేధించాడని అంటారు. ఈ లెక్కన తండ్రి వంశంలో 2016 మంది, తల్లి వంశంలో 105 గురూ వివాహానికి నిషిద్ధం అయ్యారని ధర్మసింధువు నిర్ణయించింది. మొత్తం 2121 మంది నిషిద్ధ బాంధవ్యంలోకి రావడంతో పెళ్లి కూతురే దొరకని పరిస్థితి వచ్చింది. కనుక అనంతర

శాస్త్రకారులు ఫస్ట్ కజిన్స్‌ను, సెకండ్ కజిన్స్‌ను వదిలేస్తే చాలన్నారు. కానీ మన దక్షిణభారతీయులం ఫస్ట్ కజిన్స్‌నే చేసేసుకుంటున్నాం. అంటే గౌతముడి సగోత్ర నిషేధాన్ని పాటించి, యీ నిషేధాన్ని వదిలేశాం.

అన్నీ అనువుగా వుండి గోత్రం కారణంగా సంబంధం వదులుకోవడం యిష్టం లేని కొంతమంది మేనమామ చేత కన్యాదానం చేయిస్తారు. మేనమామది వేరే గోత్రం కాబట్టి ఫర్వాలేదని సిద్ధాంతం. బెంగాల్‌లో ఓ పద్ధతి చూశాను. సగోత్రమైతే కన్యను మొదట శివుడికి యిచ్చి పెళ్లి చేస్తారు. అప్పుడు ఆ అమ్మాయి గోత్రం మారిపోయి శివుడి గోత్రీకురాలై పోతుంది. అప్పుడు వేరే గోత్రీకుడైన యీ పెళ్లికొడుకు పెళ్లి చేసుకుంటాడు.

ఇది చదివితే గోత్రం గురించి మనం అనవసరంగా జుట్టు పీక్కుంటున్నామని తెలుస్తుంది. ఇవన్నీ ఆలోచించే తీరిక మనకు లేదు. విడమర్చి చెప్పేవారూ లేరు. ఏదో అలవాటుగా పెద్దలు చెప్పారు కదాని గుడ్డిగా వెళతాం. సగోత్రానికి ఒకవేళ మనం ఒప్పుకున్నా అవతలివాళ్లు ఒప్పుకోకపోవచ్చు. ప్రయోగాలెందుకు, ఏ పుట్టలో ఏ పాముందో అనుకుని ఒక పంథాలో పడిపోతాం.

ఇది చదివాక ఏమైనా సందేహాలుంటే నాకు రాయకండి. ఇంతకుమించి నాకేమీ తెలియదు. కావాలంటే ఎవరైనా విజ్ఞుల్ని అడగండి. లేకపోతే గ్రంథాలు చదవండి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 01** **ఎమ్బీయస్: ఆంధ్రప్రదేశ్ ఆయుర్దాయం ఏభై నాలుగేళ్లేనా? –1**

ఇవాళ నవంబరు ఒకటి. ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవం. వచ్చే ఏడాది నవంబరు ఒకటికి ఆంధ్రప్రదేశ్ అనేది వుంటుందో లేదో, దీనికి షష్టిపూర్తి అయ్యే యోగం వుందో లేదో తెలియని పరిస్థితి. తుపాకుల మధ్య అవతరణోత్సవం జరుపుకుంటున్న యీ రోజు కూడలిలో నిలబడి గతాన్ని కాస్త సమీక్షించుకుని, రాష్ట్ర మనుగడ విషయంలో భవిష్యత్తు ఎలా వుంటుందో ఒక్కసారి ఊహించి చూదాం. పోలీసుల దగ్గర్నుంచి రియల్ ఎస్టేటు వారి దాకా అందరూ డిసెంబరు 31 కోసం ఎదురు చూస్తున్నారు – ఆ రోజున ఏదో బ్రహ్మాండం బద్దలవుతుందన్నట్టు! బద్దలవుతుందా? ఆలోచించి చూడబోతే...

డిసెంబరు 31 న కమిటీవారు తమ నివేదిక కేంద్రానికి అందచేస్తారు. వారు ఆప్షన్స్ యిస్తారు తప్ప రికమెండేషన్స్ చేయరని తెలుగు మీడియా ఎంత కన్‌ఫ్యూజ్ చేస్తున్నా, సిఫార్సు చేయడం తథ్యమని దుగ్గల్‌గారు చెప్పారు. నివేదిక సినాప్సిస్ మీడియాకు యిస్తామని ఆయన హామీ యివ్వలేదు. పరిస్థితి సున్నితంగా వుంది కాబట్టి వద్దని కూడా అనుకోవచ్చు. కేంద్రం ఓ మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పరచి నివేదికను చదివి యాక్షన్ ప్రోగ్రాంను తయారుచేయమని అడుగుతారు.

ఆ ఉపసంఘానికి అధ్యక్షుడిగా మనకు చిరపరిచితుడైన ప్రణబ్ ముఖర్జీగారినే వేస్తారు. సర్వరోగములకు జిందా తిలిస్మాత్‌లా, సర్వ కమిటీలకు ప్రణబ్‌గారే కాబట్టి ఆయనకి టైము తక్కువ కాబట్టి కనీసం రెండు, మూడు నెలలు తీసుకోవడంలో అబ్బురం ఏమీ లేదు. ఆ తర్వాత వాళ్లు తీసుకున్న నిర్ణయాన్ని తక్కిన యుపిఏ భాగస్వాములతో చెప్పి ఒప్పించడం ప్రారంభం అవుతుంది.

నా అనుమానం ఏమిటంటే – కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవిభజనకు సై అని ప్రకటించి తక్కిన పార్టీలతో సంప్రదింపులు ప్రారంభించి తనమీద నెపం లేకుండా చూసుకుంటుందని. యుపిఏ భాగస్వామ్య పక్షాలేవీ తెలంగాణా ప్రతిపాదనకు అనుకూలంగా లేవని యిదివరకే స్పష్టమైంది. ఇక్కడ వాళ్లకు ఓటుబ్యాంకులేవీ లేవు. పైగా ఇక్కడ యిస్తే తమ రాష్ట్రాల్లోనూ అర్జంటుగా ఉద్యమాలు ప్రారంభమై తమ చాప కింద నీళ్లు వస్తాయన్న భయాలు వాళ్లవి. తెలంగాణాకు సై అంటున్న అజిత్ సింగ్‌కు వున్న బలమెంత కనుక?

బిజెపి మాత్రం తెలంగాణాకు ఒప్పుకుంటుందనుకుందాం. బిజెపి మాట నమ్మి యుపిఏ ప్రభుత్వం బిల్లు ప్రవేశ పెడుతుందా? కర్నాటకలో తాము చేసినదానికి బదులు తీర్చుకోవడానికి బిజెపి కావాలని ఆఖరి నిమిషంలో బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తే అన్న భయం కాంగ్రెస్‌కు వుండదా?

పైగా ఆరెస్సెస్‌కి తెలంగాణా అంశంపై శ్రద్ధ లేదని, గడ్కరీ అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత బిజెపి తెలంగాణా గురించి ఆసక్తి తగ్గిందన్న రిపోర్టులు వున్నాయి. తెలంగాణా యిస్తే విదర్భ అంశం పైకి వస్తుందన్న భయం వుంది, అంతేకాదు తెలంగాణానుండి బిజెపి ఒక్క ఎంపీ సీటు గెలుస్తుందన్న ధైర్యమూ లేదు. ప్రస్తుతం కెసియార్‌దే హవా అనీ ఆయన కాంగ్రెస్‌తో అంటకాగుతున్నారనీ అందరికీ తెలుసు. తెలంగాణా బిల్లు సమర్థించి లాభపడేదేముందన్న ఆలోచన బిజెపిలో వుండదా? ఆ ఆలోచన బిజెపిలో వుందేమోనన్న సందేహం కాంగ్రెస్ కుండదా? ఈ పరిస్థితుల్లో పార్లమెంటులో బిల్లు పెట్టి కాంగ్రెస్ రిస్కు తీసుకుంటుందా?

అందువలన కాంగ్రెస్ తెలంగాణా యివ్వడం ఆలస్యం చేయవచ్చు. విభజన ఎనౌన్సు చేసేసి తెలంగాణాలో తమ ఓటుబ్యాంకు కాపాడుకోవచ్చు. యుపిఏ భాగస్వాముల మీదకు నెట్టేసి వచ్చేసారి మాకు పూర్తి మెజారిటీ యిస్తే దీన్ని అమలు చేస్తామనవచ్చు. అలా చెప్పి తెలంగాణాలో పూర్తి మెజారిటీకై ప్రాతిపదిక ఏర్పరచుకోవచ్చు. బిజెపివాళ్లు రామాలయం విషయంలో చేసింది యిదేగా! ఎన్‌డిఏలో తక్కినవారు ఒప్పుకోవటం లేదు, మాకు ఫుల్ మెజారిటీ యివ్వండి, తడాఖా చూపిస్తాం అంటారు యిప్పటికీ.

అసలు కాంగ్రెస్ తెలంగాణా యివ్వడం ఎందుకు ఆలస్యం చేయాలి అన్న ప్రశ్నకి వస్తే – రాజకీయ పార్టీ ఏదైనా పని చేస్తే తమకు ప్రయోజనం వుండేట్లు చూసుకుంటుంది. ప్రస్తుత పరిస్థితిలో తెలంగాణాలో వాళ్లకు సరైన లీడరు లేదు. తెలంగాణా ఏర్పడితే కెసియార్‌దే మొదటి ప్రభుత్వం అని అందరూ నమ్ముతున్నాం.

గెలిచాక ఆయన కాంగ్రెస్ పక్షాన నిలుస్తాడో లేదో ఎవరికీ తెలియదు. 2009లో మూడో ఫ్రంట్‌తో కలిసి పోటీ చేసి ఫలితాలు రాకుండానే ఎన్‌డిఏవైపు ఫిరాయించిన పెద్దమనిషి ఆయన. ఆయనను నమ్ముకుని తెలంగాణా యివ్వడం చాలా రిస్కీ. కెసియార్‌తో దీటైన నేత కోసం కాంగ్రెస్ వెతుకుతోంది. వెతికి, ముఖ్యమంత్రిని చేసి, వాళ్ల పేరు తెలంగాణా అంతా మారుమ్రోగేట్లా చేశాకనే విభజన అమలు చేయవచ్చును. గీతారెడ్డికి ఆ ఛాన్సు వుంది అనుకున్నాం. (తెలంగాణా న్యాయవాదుల వాటా విషయంలో సంబంధిత మంత్రి కాకపోయినా ఆవిణ్ని అందుకే యిన్వాల్వ్ చేశారనుకుంటా)

హరీశ్ రావు కూడా అలాగే అనుకున్నారులా గుంది. అందుకనే నవంబరు 1 నాడు యింకెవరూ లేనట్టు ఆవిడ యింటిపై పడ్డారు. ఆవిడ తెలంగాణా ద్రోహి అని తెలంగాణా ప్రజలందరి మెదడులో పొజిషన్ చేయడానికి సర్వవిధాల ప్రయత్నించారు. తెరాసకు వత్తాసు పలికే గుత్తా సుఖేందర్ రెడ్డి వంటి కాంగ్రెస్ నాయకులు అప్పుడే ఆమెను రాయలసీమ కోడలు కాబట్టి తెలంగాణాకు ద్రోహం చేస్తోందని ఆరోపించారు.

ఓ పక్క టిడిపిని మట్టుపెడుతూ మరో పక్క కాంగ్రెస్ పక్షాన తెలంగాణా నేత అనేవారు లేకుండా చేయడానికి తెరాస శతవిధాల ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ తలచుకుంటే తెలంగాణా యివ్వడానికి అరనిమిషం పట్టదని కెసియార్ ఎప్పణ్నుంచో నూరి పోస్తున్నారు. ఉపయెన్నికలలో కూడా కాంగ్రెస్‌కు శృంగభంగం జరిగింది. పిసిసి అధ్యక్షుడు గారు రెండో సారి – అదీ ఏ మాత్రం బలం లేని బిజెపి కాండిడేటు చేతిలో ఓడిపోయారు.

ఇలాటి పరిస్థితిలో కాంగ్రెస్ తెలంగాణారాష్ట్రంలో సీట్లు తెచ్చుకోగలదా?

2

తెలంగాణా పోతే పోయింది, ఆంధ్రరాష్ట్రంలో నెగ్గుతాం అనుకునే ధైర్యం కాంగ్రెస్ కుందా? అక్కడ మాత్రం టిడిపిని ఎదుర్కోగల కాంగ్రెస్ నాయకుడు ఎవరున్నారు? చిరంజీవిని కలుపుకుని ఆయన్ను ప్రొజెక్టు చేద్దామంటే, ఆయన కాస్సేపు సినిమా అంటారు, కాస్సేపు రాజకీయం అంటారు. సినిమాలకి తిరిగి వెళ్లినా మళ్లీ బ్లాక్ బస్టర్లు వస్తాయో రావో, తన పాప్యులారిటీ మరింత పెరుగుతుందో, తరుగుతుందో ఆయనకే తెలియదు. ఆయనకే దిక్కు తోచకుండా వుంటే ప్రజలకేం దిక్కు చూపిస్తారు?

కాంగ్రెస్ నాయకులలో బొత్స ఉత్తరాంధ్రకు పరిమితమైన నాయకుడు. రాజగోపాల్ అప్పుడప్పుడే మెరుస్తారు. ఆంధ్రరాష్ట్రమంతా ఆయనకు క్యాడర్ వున్నట్టు తోచదు. రాయలసీమ నాయకుల పరపతి రాయలసీమకే పరిమితం. అన్ని జిల్లాలలోనూ తెలిసిన పేరు జగన్‌దే. వైయస్ కారణంగా. జగన్‌ను కలుపుకుని పోవాలంటే అధిష్టానం చాలా మెట్లు దిగి రావాలి. జగన్ కూడా.... అహం దిగమింగి పార్టీకోసం అధిష్టానం, జగన్ దిగుతారా? తెలియదు. ఆ రాజీలు కుదిరేవరకు రాష్ట్రవిభజన అమలు కాదు.

మరి యిలా తాత్సారం చేస్తే ప్రజలు ఊరుకుంటారా? అసలు ప్రజల మూడ్ ఎలా వుంది? అదీ ఒకసారి సమీక్షించి చూద్దాం.

క్రితం నవంబరు 1 నుండి యీ నవంబరు 1 లోపున కెసియార్ బలపడ్డారు. దానికి కారణం ఆయన అనుచరులు యిబ్బడిముబ్బడిగా పెరిగిపోవడం, ఆయన పదేళ్లగా చెపుతున్నదానికి జనామోదం రావడం కాదు. ఆయన ఆమరణ నిరాహారదీక్ష చేస్తే పట్టుమని పదిమంది తప్ప తొంగి చూసినవాడు లేడు. ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తే మరీ అన్యాయం. తెరాస కార్యకర్తలు లేక నక్సలైటు ఆర్గనైజేషన్సుని బతిమాలుకోవలసి వచ్చింది. వాళ్లే కాస్త అడావుడి చేసి వ్యాన్లు ఎక్కారు.

ఇదంతా చూసి నిస్పృహతో కెసియార్ బత్తాయిరసం తాగేశారు. విద్యార్థుల బెదిరింపుతో దీక్ష కొనసాగించవలసి వచ్చి, నిమ్స్‌కి వచ్చిపడినా ఊళ్లోనూ అదే పరిస్థితి. ఏదో కాస్త జనం వస్తూ పోతూ వున్నారు. అలాటి కెసియార్ యీనాడు త్రివిక్రముడయ్యారంటే అదంతా ఢిల్లీ తాయత్తు మహిమ. ఆనాడు లండన్‌వారు దేశవిభజనకు పుణ్యం కట్టుకున్నట్టే యీనాడు ఢిల్లీవారు రాష్ట్రవిభజనకు పుణ్యం కట్టుకున్నారు.

రాహుల్ గాంధీ (సోనియా కూడా కావచ్చేమో, చరిత్రే చెప్పాలి) ఆశ(ల)యసిద్ధికోసం చిదంబరంగారు డిసెంబరు 9 ప్రకటన చేసి రాష్ట్రంలో అగ్గి రాజేశారు. ఇక్కడ జనంలో స్వయంగా నాలుగు ఓట్లు రాల్చుకోలేని నాయకమ్మన్యులు ఢిల్లీలో చేరి అక్కడివాళ్లను యింప్రెస్ చేసి వాళ్ల వంతు కృషి వాళ్లు చేశారు. ఇలాటివారి మాటలు విని కర్ణాటకలో కాంగ్రెస్ బిజెపి సర్కారును కూలదోయబోయి, భంగపడి అప్రతిష్టపాలయింది. అలాగే బెంగాల్‌లో మమతా బెనర్జీతో పొత్తు కుదుర్చుకోకుండా విడిగా నిలబడి దెబ్బ తింది.

ఇక్కడి ప్రజలు ఏమనుకుంటున్నారు అన్నది కాకుండా తమ ప్రయోజనాలకు అనుగుణంగా అక్కడ చెవులు కొరికి వాళ్లను తప్పుదోవ పట్టిస్తుంటారు యీ ఢిల్లీ నాయకులు. కెసియార్ మృత్యుముఖంలో వున్నట్టు నాటకమాడి (గోనె ప్రకాశరావు నిమ్స్ రికార్డులు బయటపెడితే అసలు పరిస్థితి తెలుస్తుంది), అది సాకుగా చూపి సంబంధిత వ్యక్తులెవర్నీ యిన్వాల్వ్ చేయకుండా ప్రకటన చేయించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒక రకమైన డ్రాఫ్టు చూపించి, మరో రకమైన డ్రాఫ్టును ఆయన విమానం ఎక్కి దిగే లోపున అప్పటికప్పుడు విడుదల చేయించారు. మాట్లాడితే దేశంలో పరిణామాలకు ప్రధానమంత్రిని బాధ్యుణ్ని చేస్తారు. ఆయనకు మాటమాత్రం చెప్పలేదు. తెలంగాణా అంశాన్ని మొదటినుండి కూలంకషంగా అధ్యయనం చేస్తున్న ప్రణబ్ ముఖర్జీని తప్పించారు.

డిసెంబరు 9 తర్వాత రాష్ట్రంలో అల్లకల్లోలం ఏర్పడింది. ఏ విధమైన సంప్రదింపులు లేకుండా రాష్ట్రవిభజనకు కేంద్రం తలవూపింది అన్న విషయం అర్థం కాగానే సమైక్యంగా వుందామనుకున్న వారందరూ ఉలిక్కిపడ్డారు. దానికి తోడు 'తెలంగాణాకు హైదరాబాదు రాజధానిగా వుండబోతోందిగా' అని హెూం శాఖ కార్యదర్శి పిళ్లయిగారు అనేయడంతో మరింత మండిపడ్డారు. (నిజానికి ఆయన తప్పేం లేదు, ఫైలు అలా తయారుచేయిస్తున్నారు మరి!) చిదంబరంగారు ఎవరూ కోరకుండానే కెసియార్‌పై కేసులు, విద్యార్థులపై కేసులు ఎత్తేస్తున్నట్టు ప్రకటించడం, కెసియార్ ప్రాణం కాపాడడానికే రాష్ట్రం చీల్చేస్తున్నామన్న బిల్డప్ యివ్వడంతో యిదంతా ఏకపక్షంగా నడుస్తోందన్న భావం కలిగింది. వెంటనే ఆంధ్రప్రాంతంలో నిరసనలు, అల్లర్లు, రాజీనామాలు పుట్టుకుని వచ్చాయి.

సోనియా వెంటనే పరిస్థితి అవగతం చేసుకున్నారు. డిసెంబరు 23 నాటి ప్రకటన తెచ్చారు. శ్రీకృష్ణ కమిటీ వేసి డిసెంబరు 9 కంటె పూర్వస్థితికి తెచ్చారు. తెలంగాణా అంశం లేవనెత్తిన పదేళ్ల తర్వాత సీరియస్‌గా దానిపై దృష్టి సారించారు. ఇదంతా మంచిదే కానీ యీ లోపునే – గుండెపోటు వచ్చినపుడు మందు తీసుకోవడం ఆలస్యమైతే గుండె డ్యామేజి అయిపోయినట్టు – తెలంగాణా గుండె కూడా డ్యామేజి అయిపోయింది.

తెలంగాణా అభివృద్ధి చెందిందో, మోసపోయిందో సామాన్యుడికి గణాంకాలు తెలియవు. మోసపోయిందని ఆరోపిస్తూ కెసియార్ ఉద్యమం మొదలుపెట్టగానే అప్పుడు అధికారంలో వున్న చంద్రబాబు – ఏ కుళాయిలో ఎన్ని నీళ్లు వస్తాయో చెప్పగల కంప్యూటర్ తన చేతిలో వున్నా – కెసియార్ వాదనను సహేతుకంగా ఖండించలేదు. టిడిపిని ఎలాగైనా గద్దె దింపాలని మహా కుతూహలంగా వున్న కాంగ్రెస్ అవును తెలంగాణాకు అన్యాయం జరిగింది, దానికి కారణం టిడిపియే అంది. చిన్నారెడ్డి చేత మహజరు యిప్పించింది. తర్వాత అప్పోజిషన్‌కి వచ్చాక అదే పాట టిడిపి అందుకుంది – తెలంగాణాకు అన్యాయం జరిగింది, దానికి కారణం కాంగ్రెస్సే అని.

3

దానాదీనా తెలంగాణా ప్రజలకు ఏదో అన్యాయం జరిగిపోయిందని ఫీలింగు మనసులో మెదలసాగింది. (రాష్ట్రావతరణ తర్వాత తెలంగాణా తక్కిన ప్రాంతాల కంటె ఎక్కువగా అభివృద్ధి చెందిందని యిప్పుడు కమిటీ వాళ్లకు యిచ్చిన నివేదికలు తెలుపుతున్నాయి. అఫ్‌కోర్స్, అవంతా తప్పని నివేదికలూ వెళ్లాయనుకోండి. ఫైనల్‌గా కమిటీవారు నిగ్గు తేల్చేదాకా ఏదీ కన్‌ఫమ్ కాదు) ఆ ఫీలింగు వున్నా వారు తెరాసను ఆదరించలేదు. తెలంగాణాలో వున్న అసెంబ్లీ సీట్లలో 10% మాత్రం యిచ్చి కూచోబెట్టారు.

డిసెంబరు 9 న ఉవ్వెత్తున లేచిన సమైక్యాంధ్ర ఉద్యమంతో తెలంగాణాలో మెదలిన భయాలు నాటుకున్నాయి. ఆంధ్రప్రాంతీయులకు ఏదో ప్రయోజనం లేకపోతే వాళ్లు మనను ఎందుకు వదిలి పెట్టటం లేదు? అన్న సందేహం కలిగింది. మన నోటికాడ కూడును ఎందుకు లాక్కున్నారు? అన్న కోపం వచ్చింది. ఇన్నాళ్లూ తెలంగాణా తెచ్చుకునే విషయంలో ఎటూ తేల్చుకోలేక వూగిసలాడే వారికి కూడా ఏమైతే అయింది, తెలంగాణా వచ్చి తీరాల్సిందే అన్న పంతం వచ్చింది.

ప్రజలలో యీ మూడ్ గమనించిన తెలంగాణా నాయకులు యిప్పుడేదో చేయకపోతే వెనుకబడిపోతామన్న భయంతో రంగంలోకి దిగిపోయారు. డిసెంబరు 9 స్టేటుమెంటును ఆధారం చేసుకుని తెలంగాణా వచ్చేస్తోందన్న ఆశ పుట్టడంతో అన్ని పార్టీల వాళ్లు ఒకరిని మించి మరొకరు ఆంధ్రప్రాంతం వారిని తిట్టడంలో మిలిటన్సీ చూపడం మొదలుపెట్టారు. వీళ్లంతా తర్వాత వచ్చినవారే, తన నిరాహారదీక్ష కారణంగానే యింత కదలిక వచ్చిందన్న అహం కెసియార్‌లో వుంది. తెలంగాణా పేటెంట్ తన వద్దనే వుండాలనే కోరికతో జాక్‌ను ముక్కలు చెక్కలు చేశారు. ఎవరినీ సంప్రదించకుండా ఉప యెన్నికలు తెచ్చిపెట్టారు.

వారిని నెగ్గించకపోతే తెలంగాణా వాదాన్ని గుర్తించరన్న భయంతో ఓటర్లు వారికి ఘనవిజయాన్ని కట్టబెడుతూ తక్కిన పార్టీలను తిరస్కరించారు. ఉపయెన్నికలు జరిగినది తెరాసకు పట్టున్న నియోజకవర్గాలలోనే. తెలంగాణా అంతా అదే పరిస్థితి వుంటుందని ఎవరూ చెప్పలేరు. పైకి ఏం చెప్పినా కెసియార్‌కు ఆ విషయం తెలుసు కాబట్టే టిడిపిని తెలంగాణా నుండి తరిమేద్దామని చూస్తున్నారు. కాంగ్రెస్ దానికి సహాయపడుతూ కెసియార్‌ను పెంచుతోంది.

అయితే కెసియార్ వ్యవహారశైలి నచ్చనివారి సంఖ్య దినదినం పెరుగుతోంది. విడివిడిగా దుకాణాలు పెట్టుకునే వారి సంఖ్య కూడా. ఏ ఉద్యమానికైనా బాలనాయకత్వం, బహునాయకత్వం పనికి రావంటారు. తెలంగాణా ఉద్యమానికి బాల (విద్యార్థి) నాయకత్వం, బహు (ఎటు చూసినా జాక్‌లే) నాయకత్వం రెండూ వున్నాయి. కానీ వీటన్నిటికీ మూలవిరాట్టు తనే కాబట్టి తన చేతిలోంచి ఉద్యమం చేజారకూడదని కెసియార్ డిసెంబరు 31 తర్వాత అంతర్యుద్ధం అని ప్రకటించి దానికి ప్రిపేర్ చేయడానికి పల్లెబాట అనీ, మరోటనీ కార్యక్రమాలు పెట్టారు. అవేవీ సవ్యంగా నడుస్తున్నట్లు లేవు. కెసియార్ నవంబరు 1 నాడు బయట ఎక్కడా మొహం చూపించలేదు. మరి యిలాటి నాయకుడు ప్రజాగ్రహాన్ని ఛానెలైజ్ చేయగలరా?

టిడిపి నాయకులు ఎంత గింజుకున్నా తెలంగాణా ప్రజలు వారిని నమ్మటం లేదు. బాబు ఆంధ్రా బాబే అని బాగా తలకెక్కించి వదిలిపెట్టారు టిడిపి వ్యతిరేకులు. ఇక కాంగ్రెస్‌వారి డబుల్ స్టాండర్డ్స్ తెలియనివి కావు. వాళ్లు పదవులు వదలరు, రాజీనామాలు చేయరు. అడావుడి చేయడం, ఢిల్లీ నుండి నిదానించండి అన్న సూచన వస్తే ఆగిపోవడం. ఒకప్పుడు జానారెడ్డి ఎంత హంగామా చేశారు! ఇప్పుడు కనబడుతున్నారా? ఉప్పునూతల ఎక్కడ? సత్యనారాయణ రావు ఎక్కడ? నలుగురు ఎంపీలు మాత్రం (గుత్తా,

మందా, సర్వే, యాష్కీ) మీడియా ఎదుట విన్యాసాలు చేస్తున్నారు. ప్రజలను మొబిలైజ్ చేయడానికి అది సరిపోతుందా?

ఇక గద్దర్ అంటారా? ఆయన పాటగాడు. రాజకీయవేత్త కాదు. మీటింగుకి జనాల్ని పోగేయగలరు కానీ ఎత్తుగడలు వేయగల అనుభవం లేదు. పైగా మావోయిస్టు ముద్ర. ఆయన వెనుకనున్న మేధావులంటారా.. వాళ్లంతా కాగితం పులులే. ప్రజల్లోకి వెళితే కౌన్సిలర్‌గా నెగ్గుతారో లేదో కూడా డౌటే. తెలంగాణా ఇంద్రధనుస్సులా మెరవడం మొదలవగానే రకరకాల వాదాలు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ ఆర్గనైజేషన్లు పుట్టుకొస్తున్నాయి. ఫలానావిధంగా చేస్తేనే తెలంగాణాకు సమ్మతిస్తాం లేకపోతే లేదు అని పట్టుబడతారు.

ఇలాటి పరిస్థితిలో తెలంగాణా వస్తే మంచిదో, రాకపోతే మంచిదో తేల్చుకోలేని స్థితిలో వున్నాడు తెలంగాణా ఓటరు. అందువలన తాత్సారం జరుగుతున్నా చూస్తూ కూచోవచ్చు తప్ప కార్యోన్ముఖుడు కాకపోవచ్చు.

విభిన్న ధోరణులను సమన్వయం చేసి, ఉద్యమాన్ని ఏకోన్ముఖం చేయగల నాయకుడు కెసియార్ ఒక్కరే. కానీ ఆయనకు అంత చిత్తశుద్ధి, ఓర్పు వున్నాయా అన్నది ప్రశ్న. 2009 ఎన్నికలలో మహాకూటమి భాగస్వాములతో ఆయన వ్యవహరించిన తీరు, 2010 జనవరిలో జాక్ భాగస్వాములతో వ్యవహరించిన తీరు చూస్తే ఆయనపై నమ్మకం కుదరడం కష్టం. కెసియార్ కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం బలపడిన కొద్దీ ఆయన క్రెడిబిలిటీ తగ్గిపోతుంది. కాంగ్రెస్‌కు కావలసినది అదే. తెలంగాణాపై తమ స్ట్రాటజీని అడ్డుకునే సత్తా కెసియార్‌కు లేకుండా చేయడమే కాంగ్రెస్‌కు కావాలి.

తెలంగాణాలో తమకు వ్యతిరేకత రాకుండా తెలంగాణాకు తాము అనుకూలమే అని ఓ పక్క ఎనౌన్సు చేసి, తమ తరఫు నాయకులు సిద్ధమయ్యేదాకా అది అమలు కాకుండా చూడడమే కాంగ్రెస్ స్ట్రాటజీ అనుకుని ఆ తోవలో కాస్త ఆలోచిద్దాం. అమలు కాకుండా చూడాలంటే వారి దగ్గరున్న ఉపాయం – హైదరాబాదును యిస్యూ చేయడం. హైదరాబాదును ఉమ్మడి రాజధాని చేయడం, లేదా యూనియన్ టెర్రిటరీ చేయడం, లేదా ప్రత్యేకరాష్ట్రం చేయడం గురించి ఆలోచిస్తున్నామంటారు. ఆ అంశంపై రాష్ట్రప్రజలు జిల్లాల వారీగా విడిపోతారు. వాదించుకుంటారు. చర్చించుకుంటారు. నాయకుల్ని తయారు చేసుకోవడానికి కాంగ్రెస్‌కు కాస్త వ్యవధి చిక్కుతుంది. ఈ లోగా యుపిఏ భాగస్వాములను కూడా ఒప్పిస్తున్నామని ప్రజలకు నచ్చచెపుతూ వుంటారు.

4

నిజానికి డిసెంబరు 9 నాడు ఉవ్వెత్తున లేచిన సమైక్యాంధ్ర కెరటం యిప్పుడు లేదనే అనిపిస్తోంది. తెలంగాణా నాయకుల నిందలు పడిపడి ఆంధ్రప్రాంత ప్రజలకు 'ఇన్ని మాటలు పడుతూ కలిసి వుండాలా?' అన్న ఫీలింగ్ వచ్చేసినట్టుంది. పైగా ఈ 10 నెలల్లో ఆ ప్రాంతంలో స్థలాలకు గిరాకీ వచ్చింది. కాసిని పరిశ్రమలు హైదరాబాదు నుండి వైజాగ్‌కు తరలి వెళ్లాయి.

'ఇప్పుడు సమైక్యం అంటే మళ్లీ ఈ ప్రగతి ఆగిపోతుంది. రేట్లు తగ్గిపోతాయి. ఎన్నేళ్లయినా హైదరాబాదునే పట్టుకు వేళ్లాడాలి. మళ్లీ పదేళ్లకు మంత్రి పదవి దక్కని మరొహాడు జెండా పట్టుకుంటే మన గతి ఏమిటి? మనం బావుకునేదేముంది?' అన్న ఆలోచనా ధోరణి ప్రబలింది. హైదరాబాదులోని ఆత్మీయులను, ఆస్తులను, వెళ్లి స్థిరపడే సౌలభ్యాన్ని కాపాడితే చాలు. తక్కిన ప్రాంతాల్లో ఆంధ్రప్రాంతీయులు వాళ్లని వాళ్లే కాపాడుకుంటారు అనేదానికి మెంటల్‌గా రాజీ పడుతున్నారు.

అందువలన రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేస్తే ఆంధ్రప్రాంతీయులలో చాలామందికి అభ్యంతరం వుండకపోవచ్చు. హైదరాబాదు, పరిసర ప్రాంతాలలో చాలామందికి కూడా అభ్యంతరం వుండకపోవచ్చు. హైదరాబాదులో ప్రత్యేకవాదులకు యిప్పటివరకు బలం లేదు. డిసెంబరు 9 తర్వాత హైదరాబాదులో ఎన్నికలు జరగలేదు కాబట్టి వాళ్లు పుంజుకున్నారో లేదో తెలియదు.

అందువలననే హైదరాబాదుకి చెందిన ముకేశ్ గౌడ్, దానం నాగేందర్ యిత్యాదులు హైదరాబాదు ప్రత్యేక ప్రతిపత్తి గురించి మాట్లాడుతున్నారు. తలసాని శ్రీనివాస యాదవ్, తీగల కృష్ణారెడ్డి వంటి టిడిపి నాయకులు ప్రత్యేక తెలంగాణా గురించి పెద్దగా మాట్లాడరు. ఈ హైదరాబాదు ప్రతిపాదన తెలంగాణావాదులకు మాత్రం అంగీకారం కాదు. హైదరాబాదు లేకపోతే తక్కిన తెలంగాణా అనవసరం అని వారి ఉద్దేశం.

తెలంగాణా యిచ్చి హైదరాబాదు యివ్వరేమోనన్న ఫీలర్లు వదలడంలో మన్‌మోహన్ హస్తం వుందని కెసియార్ అనుమానం. మన్‌మోహన్ కాకపోయినా సోనియా హస్తమైనా వుండవచ్చు. ఈ ఫీలరు ద్వారా ఆంధ్రప్రాంతీయులలో ఆందోళన తగ్గించాలని చూస్తున్నారేమో. అదే సమయంలో తెలంగాణా వాదుల్లో కూడా మీరు అడిగినవన్నీ యిచ్చేయడం లేదు సుమా అన్న సూచన కూడా చేస్తున్నారేమో.

నిజానికి ఏ ఆందోళనలోనూ అడిగినవన్నీ యివ్వరు. కాస్త తీసుకోవాలి, కాస్త వదులుకోవాలి. 'అలా వదలాలంటే భద్రాచలం వదిలేస్తాం తప్ప హైదరాబాదు వదలం' అని కెసియార్ అనవచ్చు. కానీ హైదరాబాదుయే యిస్యూ అని అందరికీ తెలుసు.

కాంగ్రెస్ ఆలోచనా ధోరణి గ్రహించే కెసియార్ డిసెంబరు 31 తర్వాత అంతర్యుద్ధం, భూకంపం, సునామీ.. అని మాటిమాటికీ అంటున్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం అని కృష్ణ కమిటీ అంటున్నారంటే అర్థం అది కెసియార్‌కు ఆమోదయోగ్యం కాదనేగా! అందుకే ఆ పరిష్కారం తనకు ఎలాగూ నచ్చదు కాబట్టే అంతర్యుద్ధం మాట వస్తోంది కెసియార్ నోట.

ఆ పరిష్కారం తెలంగాణా యివ్వం అని కావచ్చు, లేదా తెలంగాణా యిస్తాం – కానీ హైదరాబాదు లేకుండా.. అని కావచ్చు.

కెసియార్ ద్వారా ఏదో గొడవ వస్తుందన్న ఆలోచన చేతనే పోలీసులను తెప్పించి పెడుతున్నారు. హైదరాబాదు యివ్వం అనగానే తెలంగాణాలో తప్పక అల్లర్లు జరుగుతాయి. కానీ ఎంతకాలం? చెప్పలేం.

1953 నాటి పరిస్థితులు గుర్తుకు తెచ్చుకోండి. విభజనవాదుల కోరికపై ఆంధ్రరాష్ట్రం యిస్తామన్నారు కానీ మద్రాసు యివ్వం అన్నారు పాలకులు. చాలా నెలల పాటు దీనిపై చర్చలు జరిగాయి. పొట్టి శ్రీరాములు గారి నిరాహారదీక్ష జరిగింది. ఆయన పోయారు. అల్లర్లు జరిగాయి. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడింది. కానీ మద్రాసు రాలేదు. చివరకు వేరే చోట రాజధాని పెట్టుకోవలసి వచ్చింది.

1969లో జై తెలంగాణా ఉద్యమం చూశాం, 1972లో జై ఆంధ్ర ఉద్యమం చూశాం, నెలల తరబడి స్కూళ్లు, ఆఫీసులు మూతబడ్డాయి. అప్పట్లో ప్రజల్లో ఆవేశం ఎక్కువ వుండేది. అయినా కొంతకాలానికి చల్లారాయి. ఈ రోజుల్లో అంతటి ఆవేశాలు లేవు. దేశం కోసం పోరాడే తత్వమూ లేదు. కాలేజీ మూసేస్తే నాకు ఉద్యోగావకాశం వెనక్కి పోతుందే అన్న చింత వుంది. బంద్ చేస్తే రోజుకూలీ పోతోందన్న ఆగ్రహం వుంది. గతంలో నాయకులు చెప్తే గుడ్డిగా వినేవారు. ఇప్పుడు తెలివి తెచ్చుకున్నారు. నాయకులను నమ్మి మోసపోయే లక్షణం బాగా తగ్గింది. టీవీల్లో చూడండి, సామాన్యజనం సైతం పరిపాలకులను ఎలా చెరిగేస్తున్నారో! కృష్ణ కమిటీ ముందు వీళ్లంతా ధైర్యంగా గళం విప్పినవారే కదా! ఏ నాయకుడు ఎంత వెనకేశాడో మనకు మీడియా చెప్తూనే వుంది. ఇలాటి పరిస్థితిలో అల్లర్లు ఎక్కువకాలం కొనసాగే అవకాశం తక్కువ. ముఖ్యంగా నరసింహన్ వంటి గవర్నరు వుండగా!

అల్లర్లు పెచ్చుమీరితే రాష్ట్రపతి పాలన రావచ్చు. తెలంగాణాలో అడుగడుగునా నాయకులు పుట్టుకు వచ్చి ఉద్యమాన్ని నీరసింపచేయవచ్చు. మార్కెట్లో డిమాండ్ కంటె సప్లయి ఎక్కువై పోతే వస్తువు గిరాకీ పడిపోతుంది. తెలంగాణా విషయంలో అదే జరిగింది. నాయకులు ఎక్కువై పోయారు, తెలంగాణాకు గిరాకీ తగ్గుతోంది. కెసియార్ అలసి పోవచ్చు. ప్రజలూ అలసి పోవచ్చు. తెలంగాణా వస్తే ఎంత? రాకపోతే ఎంత? మన బతుకుల్లో మార్పు వస్తే కదా అనుకోవచ్చు. ఈ లోగా ప్యాకేజీ ఏదో ప్రకటించి అమలు చేయడం మొదలుపెడితే మెత్తపడవచ్చు. తెలంగాణాలో ఫలానా చోట రాజధాని పెడతామని ఎనౌన్సు చేస్తే ఆ ప్రాంతపు ప్రజలు ఉద్యమంలో నుండి జారుకోవచ్చు. కానీ హైదరాబాదు అంశం నెలల తరబడి నలుగుతూనే వుండవచ్చు.

పరిస్థితి దీనికి విపర్యంగా కూడా జరగవచ్చు. అప్పుడు మెజారిటీ యుపిఏ భాగస్వాములందరూ అంగీకరించేవరకు యీ ఉద్యమం సాగుతూనే వుండాలి. పోరాట పటిమ తగ్గకూడదు. ముఖ్యంగా అప్పటికి కాంగ్రెస్ పక్షాన అటూ యిటూ సిఎం కాండిడేట్లు తయారు కావాలి.

ఇదంతా జరిగేసరికి 2011 నవంబరు 1 వచ్చేసిందనుకోండి. అప్పుడు ఆంధ్రప్రదేశ్ ఆయుర్దాయం మరో ఏడాది పెరిగినట్లే...
**(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 05** **ఎమ్బీయస్: జై సమైక్యం అంటే టిడిపికి నష్టమా..?-1**

చంద్రబాబు గారిని చూస్తే జాలి వేస్తోంది. వైయస్ పోయాక ఆయనే నిలుస్తాడనుకున్నాం. ఆయన సాటి లీడరు రాష్ట్రంలో లేడనుకున్నాం. కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎదగకుండా చూస్తుంది కాబట్టి, రాష్ట్రంలో వైయస్‌కు వారసుడు లేడనీ, బాబు భుజాల వరకు కూడా వచ్చే పోటీదారుడు లేడని అనుకున్నాం. వచ్చే ఎలక్షన్ల వరకు ఆగనక్కరలేదు, ఉపయెన్నికలలో కూడా టిడిపిదే విజయమని, కాంగ్రెస్‌లో అటూయిటూగా వున్న నాయకులందరూ బాబు పంచన చేరతారని అనుకున్నాం. కానీ యీ రోజు పరిస్థితి అలా లేదు. కారణం – తెలంగాణా అంశం!

తెలంగాణా అంశం బాబును ఘోరంగా దిగజార్చింది. ఆయన తెలంగాణాలో స్వేచ్ఛగా తిరగలేరు. ఆయన ఎక్కడకి వెళ్లినా ఒక పథకం ప్రకారం తెరాస శ్రేణులు అల్లరి పెడుతున్నాయి. తెలంగాణాపై మీ అభిప్రాయం చెప్పండి అంటూ పిటిషన్ చేతికిస్తారు, మీటింగు పెడితే ప్లకార్డులు ప్రదర్శిస్తారు. నినాదాలు యిస్తారు. ఆయన కారుకి అడ్డంగా పడుకుంటారు. వీళ్లంతా తిప్పి తిప్పి కొడితే ఓ ఏభై మంది వుండరు. టిడిపి కార్యకర్తలు తలుచుకుంటే వాళ్లను చావగొట్టి చెవులు మూయగలరు. కానీ కార్యకర్తలు చేసినదాన్ని బాబు నెత్తిన రుద్ది గోల చేయడానికి అవకాశం యిచ్చినట్టవుతుంది. ఆయన తెలంగాణాకు సై అనకపోగా తెలంగాణా వీరులను కొట్టిస్తున్నాడు, హింసిస్తున్నాడు అని యాగీ చేయడానికి అవకాశం యిచ్చినట్టవుతుంది.

ఈ గోలంతా ఎందుకని ఆయన స్వయంగా వెళ్లకుండా తన పార్టీలో నాయకులను తోలుతున్నారు. పార్టీకి సర్వం సహా అధికారి అయివుండి కూడా తన పార్టీ కరపత్రాల్లో తన ఫోటో వేయించుకోలేని దుస్థితిలో వున్నారు బాబు. ఇంతకన్నా దురదృష్టం వుందా? తెలంగాణావాదులు నన్ను తిట్టినా, తిమ్మినా మీరేం నోరెత్తడం లేదు, స్పందించడం లేదు, తిరిగి సమాధానం చెప్పడం లేదు అని తన అనుచరుల వద్ద వాపోవడం ఎంతటి ఖర్మ!

నిజానికి బాబు పార్టీలో ఎవర్నీ ఖాతరు చేయరు. తనే పార్టీ కర్త, కర్మ, క్రియ. తనకే అన్నీ తెలుసు. తను చెప్పినట్టు వినడమే తప్ప సహచరులు తమ స్వంత బుర్రలు ఖర్చు పెట్టకూడదు. ఎన్టీయార్‌నుండి పార్టీ కైవసం చేసుకున్న దగ్గర్నుంచి ఆయనది యిదే తరహా. అటువంటి నాయకుడు యీ రోజు నా తరఫున నిలిచి పోట్లాడండయ్యా అని అనుచరులను కోరడం – ఓ మాదిరిగా బతిమాలడం

కిందే లెక్క – ఎంత విడ్డూరం! ఎంత కలికాలం!!

నిజానికి 'వీళ్లందరినీ – అంటే నాగం, కడియం, ఎర్రబెల్లి, రేవంత్ – నా తరఫున వెళ్లి రమ్మంటున్నాను కానీ అసలు వీళ్లంతా కడదాకా నా వెంట నిలుస్తారో లేదో, తెలంగాణావాదం బలంగా వుంటే నన్ను విడిచి వెళ్లిపోతారేమో'నన్న భయం ఆయనకు మనసులో మెదలుతూండవచ్చు. అనధికారిక నెంబర్ టూ పొజిషన్ యిచ్చినా దేవేందర్ గౌడ్ పార్టీ మారిపోయినట్టు, రేపు తెరాస బలపడుతున్నారంటే వీళ్లంతా పార్టీ మారిపోతే..? అన్న సందేహం బాబు మదిలో మెదులుతూ వుండవచ్చు.

ట్రెండ్ బట్టి గాలికోడిలా దిక్కులు మార్చడం రాజకీయ నాయకులందరికీ సహజమే. బాబు కూడా కొంతకాలం లెఫ్ట్‌తో వూరేగి యునైటెడ్ ఫ్రంట్ నడిపారు. తర్వాత పూర్తి వ్యతిరేక దిశలో వెళ్లి బిజెపిని వాటేసుకున్నారు. ఆ తర్వాత దాన్ని తుంగలో తొక్కి మళ్లీ థర్డ్ ఫ్రంట్ అంటూ ఎడమకి తిరిగారు. టిడిపి ప్రభుత్వంలో అన్ని రకాల పదవులూ అనుభవించి చివరకు పార్టీ ఫిరాయించేటప్పుడు దేవేందర్ గౌడ్ ఏమన్నారు? 'టిడిపి నాయకత్వం ఒత్తిడి వలన తెలంగాణాకు ఏమీ చేయలేకపోయాను. క్షమించండి. ఉక్కిరిబిక్కిరై పోయి బయటకు వచ్చేస్తున్నాను.' అన్నారు. రేపు టిడిపిలో వున్న తెలంగాణా నాయకులు యిదే స్టేటుమెంటును కాపీ-పేస్ట్ చేయవచ్చు.

వాళ్లు అలా ఎందుకు చేయాలి అంటారేమో! వాళ్లకు ఏమీ కలిసి రావటం లేదు. బాబ్లీ ప్రాజెక్టుకై వెళ్లి దెబ్బలు తిని వచ్చాం అని చెప్పుకున్నా తెలంగాణాలో దాని ప్రభావం ఏమీ లేకపోయింది. అయ్యో మన నీళ్లకోసం వీళ్లు వెళ్లి వచ్చారే అన్న సింపతీ కూడా లేకుండా ఉపయెన్నికలలో ప్రజలు వీళ్లను బాదేశారు. నిజానికి అవన్నీ ఒకప్పుడు టిడిపి కంచుకోటలు. ప్రత్యేక తెలంగాణా కోసం రాజీనామా చేశారన్న సానుభూతితో తెరాస, బిజెపి కాండిడేట్లను నెగ్గించేరే అనుకోండి, మరీ అంత చేటు మెజారిటీతో నెగ్గించాలా? కొందరైనా యిటు ఓట్లు వేయకూడదూ!? అబ్బే. టిడిపి నైతిక స్థయిర్యం పూర్తిగా చితికిపోయేట్లు ఘోరంగా ఓడించారు.

ఇక యీ మధ్య జరిపిన ఢిల్లీ యాత్ర పుల్లయ్య వేమవరమే అయింది. సోనియా యింటి ఎదురుగా ధర్నా అన్నారు మరోటన్నారు. చివరకు జంతర్ మంతర్ వద్ద కాస్సేపు గలభా చేసి వచ్చారు. పాటలు పాడారు, బతుకమ్మ ఆడారు అంటే జంతర్‌మంతర్ వద్ద రోజూ ఎవరో ఒకరు చేసే తతంగమే అది. గట్టిగా మాట్లాడితే రోజుకి రెండు, మూడు టీములు కూడా చేస్తాయి. నేషనల్ మీడియా కూడా పెద్దగా పట్టించుకోదు. వీళ్లు వెళ్లినపుడు తెలంగాణా సమర్థించే నాయకులు కానీ, టిడిపితో స్నేహం నెరపే పార్టీలు కానీ ఎవ్వరూ రాలేదు. మన్‌మోహన్‌గారు దేశంలోనే లేరు. సోనియా వీళ్లకేసి కన్నెత్తికూడా చూడలేదు.

ఈ ఫ్లాప్ షోకు కారణం చంద్రబాబే! ఆయన వచ్చి వుంటే కథ వేరేలా వుండేది. నేషనల్ మీడియా వచ్చి బాగా కవర్ చేసేది. కానీ ఆయన దీని తాలూకు కరపత్రం మీద కూడా తన ఫోటో వేయించలేదు. తనకి సంబంధం లేని వ్యవహారం అన్నట్టు ప్రవర్తించారు. బాబ్లీ విషయంలో కూడా బాబు స్ట్రాటజీ ఎవరికీ అర్థం కాలేదు. ఎన్నికల కోసమే యీ డ్రామా, తన స్వార్థానికై తెలుగు, మరాఠీ ప్రజల మధ్య చిచ్చు పెట్టారు అని పొరుగురాష్ట్ర పాలకుల చేత కూడా మాటపడ్డారు. వ్రతం చెడ్డా ఫలం దక్కిందా అంటే అదీ లేదు. ఎన్నికలలో దీన్ని యిస్యూగా వాడుకోను అన్నారు. ఆ కాడికి సరిగ్గా అప్పుడే ఎందుకు ప్రయాణం కట్టారో తెలియలేదు. ఎవరూ నమ్మలేదు. చివరకు ఎన్నికలలో దీన్ని ప్రస్తావించనూ లేదు.

2

ఆయన స్ట్రాటజీ ఏమిటో ఆయన సహచరులకు అస్సలు అంతు పట్టటం లేదు. వెళ్లండి వెళ్లండి టీవీ చర్చల్లో పాల్గొనండి అని ఆయన వీళ్లందరినీ ముందుకు తోస్తారు. అవతలి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వీళ్లు నోళ్లు వెళ్లబెడతారు. చూస్తే చాలా జాలి వేస్తుంది. తెరాస వారు వీళ్లనే ఊదరగొడతారు – 'తెలంగాణాపై మీ వైఖరి చెప్పండి, చెప్పండి' అని. 'తెలంగాణా తెచ్చే, యిచ్చే స్థితిలో మేం లేము. అందుకని మా అభిప్రాయం చెప్పడం అనవసరం' అంటారు వీళ్లు.

ఆ మాటకొస్తే ఎమ్మార్ ప్రాపర్టీస్ నిలవరించే స్థితిలోనూ లేరు, మైక్రో ఫైనాన్సు కంపెనీలకు ముకుతాడు వేసే స్థితిలోనూ లేరు, బాబ్లీ ప్రాజెక్టును ఆపే స్థితిలోనూ లేరు, అమెరికాతో అణు ఒప్పందాన్ని రద్దు చేసే స్థితిలోనూ లేరు, ఎరువుల సరఫరా మెరుగు పరచలేరు. ధరలు అదుపు చేసే స్థితిలో లేరు.. యిలా శతకోటి విషయాలపై వాళ్లకు కంట్రోలు లేదు – అధికారంలో లేరు కాబట్టి. అయినా వీటన్నిటిపైనా టిడిపి తన అభిప్రాయాన్ని బల్లగుద్ది చెపుతుంది. ఆందోళనలు చేస్తుంది.

కానీ తెలంగాణా విషయంలో మాత్రం మౌనం. అంతెందుకు, ఇవిఎంల వాడకంపై తన అభ్యంతరాలను తెలిపి, పోరాడి, చివరకు ఎలక్షన్ కమిషన్ చేత వీటి వాడకంలో మార్పుల గురించి పునరాలోచిస్తాం అనిపించింది. రాష్ట్రవిభజనపై స్పష్టమైన అభిప్రాయం వుంటే దానిలో పోనీ సగం పోరాటం చేయవచ్చుగా! ఏం ఇవియంల పాటి చేయలేదా తెలంగాణా?

మనం హెల్మెట్ లేకుండా వెళుతుంటే ట్రాఫిక్ కానిస్టేబుల్ పట్టుకున్నాడనుకోండి. 'అదిగో ఆ ఎర్ర చొక్కా వాడికీ లేదుగా, ఆ బాబ్డ్ హెయిర్ అమ్మాయికీ లేదుగా, ఆ బట్టతలాయనకీ లేదుగా.. వాళ్లను పట్టుకోకుండా నన్నే పట్టుకున్నావేం?' అని వాదిస్తే వింటాడా? 'వాళ్లు దూరంగా వున్నారయ్యా, నువ్వు యీ చివర్లో వున్నావు, దొరికావు. వాళ్ల సంగతి మా ఎస్సయి చూసుకుంటాడులే. అయినా ఆ గొడవ ఎందుకు, నువ్వు ట్రాఫిక్ ఎఫెన్సు చేశావా లేదా, ఒప్పుకో అది చాలు' అంటాడు. ఇది మనందరికీ తెలుసు. కానీ టిడిపి మాత్రం తెలియనట్టు నటిస్తుంది. అందువలననే తెలంగాణావాదులు తమను తేల్చి చెప్పమని అడిగినప్పుడు 'మీరు కాంగ్రెస్‌ను

అడగటం లేదు కానీ, మమ్మల్నే అడుగుతారేం?' అంటున్నారు.

తెరాసకు ఫస్ట్ టార్గెట్ టిడిపియే అన్న సంగతి అందరికీ తెలుసు. కాంగ్రెస్ పని తర్వాత పడతారో లేదో తెలియదు కానీ టిడిపిని ప్రస్తుతం యిరకాటంలో పెడుతున్నారు. సమాధానం చెప్పలేక వీళ్లు గిజగిజ లాడుతున్నారు. ఎంత లావు టిడిపి నాయకుడైనా సరే టీవీ చర్చల్లో యీ ప్రశ్న వచ్చినపుడు డిఫెన్సివ్‌లో పడిపోతున్నారు. 'ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ యిచ్చాంగా' అంటారు. 'ఆ లేఖే కృష్ణ కమిటీకి యివ్వచ్చుగా' అంటే నోరెత్తరు. 'తెలంగాణాకు అనుకూలంగా తీర్మానం చేసి 2009 ఎన్నికల ఎజెండాలో పెట్టాంగా' అంటే 'ఆ తీర్మానాన్ని సమర్థించిన మీ ఆంధ్ర నాయకులు డిసెంబరు 10 నుండి రాజీనామాలు చేశారుగా' అని కౌంటర్ యిస్తే సమాధానం లేదు.

కాంగ్రెస్సూ యింతేగా అనే సమాధానం వినడానికి ఎబ్బెట్టుగా వుంటుంది. సూర్యుడు ఎటువైపు ఉదయిస్తాడన్న విషయం దగ్గర్నుంచి అన్నిటిలోను వ్యతిరేకించే అధికారపక్షం, ప్రతిపక్షం యీ విషయంలో మాత్రం ఒకేలా మాట్లాడితే ఎంత ఫన్నీగా వుందో చూడండి. కాంగ్రెస్ బాటే మాది అంటే మరి మీరు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం ఎలా అవుతారు? దొందూ దొందే అని అనిపించుకున్నాక వాళ్లను తీసేసి మిమ్మల్ని గెలిపించవలసిన అవసరం ఏముంది?

మీరేం చేయలేదు, మీరేం చేయలేదు అని కాంగ్రెస్‌వాళ్లు, టిడిపి వాళ్లు తలపడినపుడు కాంగ్రెస్‌వాళ్లు 'మేం డిసెంబరు 9 ప్రకటన చేయించాం' అని గొప్పగా చెప్పుకుంటారు. టిడిపికి అలా చెప్పుకునే ఛాన్సు లేదు. 'కానీ డిసెంబరు 23 ప్రకటన చేసి చక్రాన్ని వెనక్కి తిప్పారుగా' అని టిడిపి వెక్కిరించబోతే 'అది మీ కారణంగానే..' అంటున్నారు కాంగ్రెస్‌వారు. 'మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రిజైన్ చేశారుగా...' అంటే 'అవును మీ ప్రజాప్రతినిథులు యీ గేమ్ మొదలుపెట్టడంతో మా ఆంధ్రనాయకులకు గతిలేకుండా పోయింది' అని తెలంగాణా కాంగ్రెస్‌వారు తప్పించుకుంటున్నారు.

మొత్తానికి అటు చేసి, యిటు చేసి డిసెంబరు 10 నాడు ఆంధ్రప్రాంతంలో లేచిన కల్లోలానికి బాబుని బాధ్యుణ్ని చేసేశారు. ఈయనే టిడిపి భవన్‌లో కూచుని రాజీనామాల ప్రహసనాన్ని రచించారని, డబ్బు పంపి ఉద్యమాన్ని లేవగొట్టారని డప్పు కొట్టేశారు. దీనిలో నిజానిజాల మాట ఎలా వున్నా తెలంగాణాలో యీ ప్రచారం బాగా నాటుకుంటోంది. ఇది నిజంగా దురదృష్టకరం.

నిజానికి తెలంగాణాకు టిడిపి ఎంతో చేసింది. ముఖ్యంగా బిసి వర్గాలనుండి నాయకులు ఉద్భవించడానికి ఎన్టీయారే కారణం. దానినే చంద్రబాబు కొనసాగించారు. ఇప్పుడు ఆయన హఠాత్తుగా 'ఆంధ్ర బాబు' అయిపోయారు. 'ఆ ఆంధ్రబాబుకి ఊడిగం చేయడానికి మీకు సిగ్గు లేదా? అని మాటలు పడుతున్నారు టిడిపి కార్యకర్తలు. టిడిపి కాంగ్రెస్ కొంగు చాటున దాక్కోవడం వారు అర్థం చేసుకోలేక పోతున్నారు.

సోనియా అంటే ఎక్కడో విదేశీ వనిత. ఆవిడకు యిక్కటి సెంటిమెంట్స్ అర్థం కాదు. మరి యిక్కడ పుట్టి పెరిగిన బాబుకి ఏమైంది? సోనియాకు దేశమంతా చూసుకోవాలి. బాబుకి యిక్కడి వ్యవహారాలు చూస్తే చాలు. గట్టిగా ఆలోచించి ఏదో ఒక పక్కా నిర్ణయం తీసుకోకుండా యీ దాగుడు మూతలెందుకు అని కన్ఫ్యూజ్ అవుతున్నారు. అందుకే ఒకరొకరూ తెరాసవైపు మళ్లుతున్నారు. కార్యకర్తలు కదిలాక యిక నాయకులు ఎంతకాలం వుండగలరు? వాళ్లూ క్రమంగా యినాక్టివ్ అయిపోవచ్చు. లేదా పార్టీ ఫిరాయించవచ్చు.

3

గద్దర్ కొత్త ఫ్రంట్ పెట్టినపుడు కెసియార్‌ను అడ్డుకోవడానికి బాబే వెనకాల వుండి యిది పెట్టించారు అన్నారు. టిడిపి శాసనసభ్యుడు ఒకరు వెళ్లి అడావుడిగా ఆ ఫ్రంట్‌తో టిడిపి కలిసి పనిచేస్తుందని ప్రకటించారు కూడా. తర్వాత చల్లబడ్డారు. కెసియార్ వ్యతిరేకులందరూ గద్దర్ ఫ్రంట్‌కు మద్దతుగా నిలబడ్డారు. కానీ ఎన్ని సున్నాలు కలిస్తే ఒకటి అవుతుంది? పైగా ఆ సున్నా కూడా రెండు అరసున్నాలు అయ్యాయి. విమలక్క ఫ్రంట్ అంటూ మరోటి ఏర్పడింది.

గద్దర్‌కు రాజకీయాలు రావు. ఎన్నికలలో నిలబడం, ఉద్యమం అంటూ పాటలు పాడతాం అంటే ఎవరికి ఉత్సాహం? నాయకులు వచ్చేది ఎన్నికలలో గెలవడానికే. గద్దర్ కయితే పాటలు వచ్చు. ఆయన వెనకాల నిలబడిన నాయకులు ఏం చేయాలని ఆయన వుద్దేశం? తాళం వేయాలా? కెసియార్ ఉధృతిని గద్దర్ ఫ్రంట్ ఆపలేకపోతోందనే అనిపిస్తోంది. ఇంకోపక్క తెరాస జగన్నాథరథ చక్రాల కింద టిడిపి నలిగిపోతూ క్యాడర్‌ను అర్పించుకుంటోంది.

తెలంగాణాలో క్యాడర్ యిలా ఊడ్చుకుపోతూ టిడిపి వీక్ అయిపోతూంటే కనీసం ఆంధ్రప్రాంతంలోనైనా బలపడుతోందా అంటే అదీ లేదు. తెలంగాణా సమస్య యింత బలంగా రావడానికి కారణం బాబే అనే మంట చాలామందికి వుంది. రెండు రూపాయలకు కేజీ బియ్యం, మద్యనిషేధం వంటి ఎన్టీయార్ సిద్ధాంతాలన్నీ తిరగదోడారు బాబు. అవన్నీ ఆర్థికపరమైనవి. కానీ తెలుగుదేశం పేరు పెట్టుకుని, తెలుగుజాతి ఒకటి అన్న నినాదంపై, తెలుగువాడి ఆత్మగౌరవం అనే పతాకంపై ఉద్భవించిన పార్టీ మౌలిక సిద్ధాంతం నుండి తప్పించిన పాపం బాబుదే! ప్రాంతీయ విభేదాలకు అతీతంగా వ్యవహరించి, 1969లోనే తెలుగు జాతిని ముక్కలు చేయవద్దని ధైర్యంగా చాటిన ఎన్టీయార్‌కు రాష్ట్రవిభజనకై తీర్మానం చేసిన బాబు వారసుడెలా అవుతారు?

బాబును వైయస్‌తో పోల్చి చూడడం మనకు పరిపాటి. వైయస్ సమైక్యవాది. ప్రతిపక్షంలో వున్నా, అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ హై కమాండ్ మాట కాదనలేక తలవొగ్గుతూనే రాష్ట్రవిభజనకు ససేమిరా అన్నారు. సోనియా చెప్పడంపై తెరాసను కాబినెట్‌లోకి తీసుకున్నా వారిని చులకన చేసి 'అయితే ఏంటంట?' అంటూ బయటకు నడిచేట్లా చేశారు. తెరాసను రెండుగా చీల్చారు. 2009 నాటికి తను బలపడగానే తెరాసతో ఎన్నికల పొత్తుకి అస్సలు ఒప్పుకోలేదు. తెలంగాణా కాంగ్రెస్ నాయకుల లాబీయింగ్‌కు లొంగిన హై కమాండ్ తనపై ఒత్తిడి చేయబోతే 'అయితే నేను బెంగుళూరు వెళ్లి కూచుంటాను, ఎన్నికల సంగతి మీరు చూసుకోండి' అని బ్లాక్‌మెయిల్ చేసి తన మాట నెగ్గించుకుని రాష్ట్రసమైక్యతను కాపాడారు. తన పార్టీలోని తెలంగాణా నాయకులను ఓ పక్క, తెరాసను మరో పక్క మేనేజ్ చేస్తూ తనను సమైక్యవాదని ఎందరు నిందిస్తున్నా పడుతూనే 2009 ఎన్నికలలో తెలంగాణాలో 50 సీట్లు గెలుచుకుని వచ్చి రాష్ట్రాన్ని చీల్చనక్కరలేదని ఢిల్లీని కన్విన్స్ చేసిన ఘనసమైక్యవాది.

మరి బాబు? వైయస్ పీల్చి పిప్పి చేసి, ఓ మూల కూచోబెట్టిన కెసియార్‌తో 2009లో ఎన్నికల పొత్తు పెట్టుకుని ఊపిరిలూది లేపి కూచోబెట్టిన ఘనకార్యం బాబుదే! కాంగ్రెస్‌ను ఎలాగైనా ఓడించాలన్న పట్టుదలతో, ముందుచూపు లేకుండా, కెసియార్‌తో తలగోక్కున్నారు. ఆ పొత్తుకి తన ఆంధ్రప్రాంతపు నాయకులను ఒప్పించడానికి ఎర్రం నాయుడు కమిటీ అంటూ ఓ తూతూ మంత్రపు (ఆ ముక్క ఎర్రం నాయుడే చెప్పారు డిసెంబరు 2009లో) కమిటీ వేసి, వాళ్ల చేత రాష్ట్రవిభజనకు సై అనిపించి, ఆ మేరకు తీర్మానం చేశారు. ఆ తీర్మానం కాపీ తో ప్రణబ్ కమిటీకి లేఖ యిచ్చి సమైక్యవాది వైయస్‌ను, విభజనకు అంగీకరించని కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టానని మురిసిపోయారు.

ఎన్నికలలో తెరాసతో పొత్తు పెట్టుకుని వాళ్లపై సొడ్డేశాననుకున్నారు. పొత్తు పెట్టుకుని బాబు బావుకున్నదేమీ లేదు. కెసియార్ ఆయన్ను ముప్పుతిప్పలు పెట్టారు. సరే ఎన్నికలలో ఓడిపోవడం అసహజమేమీ కాదు, ఎవరికైనా జరుగుతుంది. అయితే బాబు తెలంగాణా తీర్మానం చేసేటప్పుడు 'కేంద్రం ఏదైనా మేజర్ స్టెప్ తీసుకునేటప్పుడు తమ అభిప్రాయం తీసుకునే చేస్తారనే' ధీమాతో వున్నారు. అందుకే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలంటూ డిసెంబరులో 2009లో అఖిలపక్షం తీర్మానంపై కూడా సంతకం పెట్టేశారు – 'ఇదంతా ఉత్తుత్తినే' అనుకుంటూ. కానీ ఢిల్లీ నాయకులు యిది బేస్ చేసుకుని హఠాత్తుగా తెలంగాణా ప్రకటించేసరికి దిమ్మెరపోయారు.

ఎంతో మేధావి అనుకున్న బాబు స్ట్రాటజీ యిలా చీదేసేసరికి ఆంధ్రప్రాంతపు వారికి బాబు నాయకత్వపటిమపై విశ్వాసం పోయింది. వైయస్ సమైక్యవాదాన్ని ఎదిరించి బాబు సాధించినదేముంది? అన్న ఆలోచన బలపడింది. ఇప్పుడు రాష్ట్రం చీలిపోవచ్చు. హైదరాబాదులో ఆంధ్రప్రాంతీయుల రక్షణ విషయంలో గ్యారంటీ లేదు. మహా కూటమిలో చిన్న భాగస్వామి అయిన కెసియార్ యిప్పుడు టిడిపికి సింహస్వప్నం అయి, బాబుని తెలంగాణాలో ఎక్కడికీ కదలకుండా దిగ్బంధం చేయగలుగుతున్నారు. బాబు గోడకు వీపు పెట్టి పోరాడుతున్నారు. ఇది ఆయన చేతులారా తెచ్చిపెట్టుకున్న అవస్థ అని ఆంధ్రప్రాంతీయులందరూ ఫీలయ్యేదే.

ఇప్పుడు కేంద్రం రాష్ట్రాన్ని చీల్చడానికి నిశ్చయించి చీల్చేసిందనుకోండి. రెండు ముక్కలయాక నేను సమైక్యవాదిని అని చెప్పుకుంటూ ఆంధ్రలో తిరిగితే ఏం లాభం? 'జగనంత దమ్ము లేదు నీకు, అతను ఓ పార్టీలో చిన్న నాయకుడై వుండి కూడా సమైక్యవాదిని అని ధైర్యంగా చెప్పుకున్నాడు. పార్లమెంటులో ప్లకార్డు పట్టుకున్నాడు. నువ్వు పార్టీ అధ్యక్షుడివై వుండి కూడా ఏమీ చేయలేకపోయావు. తెలంగాణాలో మా ఆస్తులు కాపాడలేదు, అసలు నీకే దిక్కు లేదు' అంటారు. బలహీనుడైనవాణ్ని ఎవరు మన్నిస్తారు? ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు జగన్‌కు పోవచ్చు, చిరంజీవి మేలుకుని కాంగ్రెస్ కౌగిలిలోకి వెళ్లకుండా వుంటే ఆయనకు పోవచ్చు. అంతేగాని బాబుకి ఓట్లు రాలవు.

ఈ లెక్కన చూస్తే టిడిపి యిటు తెలంగాణాలోను, అటు ఆంధ్రప్రాంతంలోనూ తీవ్రంగా నష్టపోవచ్చు. ఇలాటి పరిస్థితుల్లో టిడిపి 'జై సమైక్యం' అంటే నష్టం ఏమిటి?

4

అలా అనగానే తెరాస వాళ్లు 'అదిగో మేం చెప్పాం కదా, బాబు ఆంధ్రా బాబే' అంటారు. అననీయండి. దీనివలన కొత్తగా నష్టపోయేది లేదు. ఆ ముద్ర ఎలాగూ పడింది. దీనివలన మొదటగా ఆంధ్రప్రాంతంలో టిడిపికి ఆదరణ పెరుగుతుంది. డిసెంబరు 31 తర్వాత కేంద్రం తెలంగాణా ఎనౌన్సు చేసినప్పుడు 'మేం అడ్డుకున్నా కాంగ్రెస్ చీల్చింది' అని ప్రచారం చేసి అక్కడ సింపతీ పెంచుకోవచ్చు. హైదరాబాదు తెలంగాణాకే యిచ్చేస్తే 'రాష్ట్రంలో ప్రజలందరికీ సమానన్యాయం జరగాలి.' అనే నినాదంపై నిరసనలు జరిపి మరీ సింపతీ పెంచుకోవచ్చు. దీనివలన ఆంధ్రప్రాంతంలో బలమైన శక్తిగా రూపొందడం ఖాయం. మరి తెలంగాణాలో పరిస్థితి ఏమిటి?

తెలంగాణావాదులందరూ టిడిపిపై తిరగబడతారు. వారి మీటింగులు అడ్డుకుంటారు. ఇప్పుడు జరుగుతున్నదీ అదే. కొత్తగా ఏమీ లేదు. టిడిపి ఆత్మరక్షణదళం ఏర్పడి వారిని వారు కాపాడుకోవలసినదే. వారినే కాదు, తెలంగాణాలో వున్న సమైక్యవాదులందరికీ రక్షణదళంగా వారు వ్యవహరించవచ్చు. తెలంగాణాలో వున్న సమైక్యవాదులు తక్కువ సంఖ్యలో వున్నారని అనుకోవద్దు. జంటనగరాలలోనే కాదు, ఒకటి రెండు జిల్లాలు తప్ప తక్కిన తెలంగాణా జిల్లాలన్నిటిలో యితర ప్రాంతాలనుండి, యితర రాష్ట్రాలనుండి వచ్చి స్థిరపడినవారు

గణనీయమైన సంఖ్యలో వున్నారు. వారందరికీ తెరాస అంటే భయం వుంది.

తెలంగాణా ప్రాంతీయుల్లో కూడా సమైక్యవాదులు చాలామందే వుండి వుంటారు. వారందరికీ టిడిపి క్యాడర్ తాము రక్షణ కల్పిస్తామంటూ తోడుగా నిలబడితే వారి పక్షాన చేరతారు. నిజానికి గ్రేటర్ హైదరాబాదు ఎన్నికలలో టిడిపి ఎన్నికల హామీ యిచ్చింది – 'సెటిలర్లు' (ఆ పదం వాడకుండా వుండాల్సింది)కి రక్షణగా నిలుస్తామని'. అదే అమలు చేయవచ్చు. ఓ పక్క నాగం వంటి వారు పరుషమైన స్టేటుమెంట్లు గుప్పిస్తూ వుంటే సమైక్యవాదులు టిడిపిని ఎలా విశ్వసిస్తారు? టిడిపి తన ప్రస్తుత విధానం మార్చుకుంటేనే విశ్వసనీయత పెరుగుతుంది. ఆలోచించి చూడండి – తెలంగాణాలో నివసిస్తున్న సమైక్యవాదులు ఎవరికి ఓటేయగలరు? తెరాసకు వేయలేరు. కాంగ్రెసే తెలంగాణా ఎనౌన్సు చేసింది కాబట్టి కాంగ్రెస్‌కు వేయలేరు. ఇక మిగిలింది టిడిపియే. టిడిపి తనను తాను సమైక్యవాదిగా నిరూపించుకుంటే వారికే వారి ఓట్లు పడతాయి.

కానీ దీనివలన తెలంగాణాలోని తెలంగాణా వాదులు టిడిపికి ఓట్లేయకపోవచ్చు. కానీ ఎంతకాలం? ఒక టెర్మ్! కాలక్రమేణా తెరాసలో చీలికలు రావచ్చు, ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజలు తెరాస ప్రభుత్వం పట్ల నిరుత్సాహం చెందుతారు. తెరాస ప్రభుత్వం యితర ప్రాంతీయులపట్ల వివక్ష చూపితే టిడిపి వారి తరఫున పోరాడి గుడ్‌విల్ పెంచుకోవచ్చు. అప్పుడు ప్రజలు టిడిపి వైపు వెనక్కి తిరిగి చూడవచ్చు. కానీ ఈ లోపున టిడిపి సంఘర్షణ ఎదుర్కోక తప్పదు. తాము సమైక్యవాదులమని ప్రకటించగానే తెరాస క్యాడర్ దాడులు చేస్తారు. పీఆర్పీపై కూడా చేశారు. కొంతకాలం తర్వాత చప్పబడతారు. ఇప్పుడు చిరంజీవి పార్టీ క్రమంగా పుంజుకుంటోందంటున్నారు. సినిమా యాక్టర్ చిరంజీవికి వున్న అభిమానుల కంటె తెలంగాణాలో సాంఘికచైతన్యం తెచ్చిన టిడిపికి అభిమానులు ఎక్కువ. అందుకని కొన్నాళ్ల గందరగోళం తర్వాత నిలదొక్కుకునే సామర్థ్యం టిడిపికి ఎక్కువ. మేం సమైక్యవాదులం అని బోర విరుచుకుని తిరిగే సిపిఎంను తెరాస వారు ఏం చేయగలిగారు? ఒకటే గుర్తు పెట్టుకోండి – మనసులో ఒకటి పెట్టుకుని, బయటకు యింకోటి చెప్పేవాణ్నే ఆటలు పట్టిస్తారు. ఓపెన్‌గా యిదీ మా పాలసీ అనేసిన తర్వాత నిలదీయడానికి ఏం మిగలదు.

బాబుకి యిలాటి ఆలోచన వచ్చినా నాగం, కడియం, ఎర్రబెల్లి యిత్యాదులు పడనీయరు. అబ్బే తెలంగాణాలో మేం ఓడిపోతే ఎలా? అంటారు. వీళ్లు వుండి ఉపయెన్నికలలో ఉద్ధరించిందేముంది? నాగంను ఉస్మానియాలో పడేసి కొడితే యిప్పటిదాకా దిక్కూ దివాణం వుందా? ఉస్మానియా జాక్ వాళ్లు కూడా దాని గురించి సిగ్గుపడకుండా మొన్న కూడా గుర్తు చేస్తున్నారు – 'నాగం సంఘటన గుర్తు లేదా?' అంటూ. 'మీరు సమైక్యం అంటే మేం పార్టీ బయటకు వెళ్లాల్సి వుంటుంది' అని వీళ్లు బాబును బెదిరించవచ్చు. తెలంగాణా యిస్యూపై బయటకు వెళ్లిన దేవేందర్ గౌడ్ ఏమయ్యారు? వీళ్లు మహా అయితే రెండు, మూడు నియోజకవర్గాలలో ప్రభావం చూపవచ్చు తప్ప బాబును కాదనీ ఏమీ చేయలేరు, కెసియార్‌ను ఎదిరించీ మనజాలరు. మూడు నాలుగేళ్లు పోయిన తర్వాత దేవేందర్‌లాగానే తిరిగి రానూ వచ్చు. లేస్తే మనిషిని కాను అని బెదిరిస్తారు. లేచి చూపించు అంటే చతికిలపడతారు.

ఒకతను చంకలో ఓ పండు పెట్టుకుని అదే చేత్తో చెట్టుమీద పండును అందుకోబోయాట్ట. చెయ్యి ఎత్తితే చంకలో పండు జారి కింద బురదలో పడిపోతుందని భయం. అలా అని చెట్టు మీద పండు ఊరిస్తోంది కాబట్టి చెయ్యి కాస్త కాస్త ఎత్తుతున్నాడు. పండు జారిపోతోంది. చెయ్యి కిందకు జార్చి పండును కాపాడుకుంటున్నాడు. ఇదే పరిస్థితిలో కాస్సేపు గడిచేసరికి చెట్టుమీద పండు పక్షి ఎగరేసుకుపోతుందని, చంకలో పండు జారి బురదలో పడిపోతుందని గ్రహించి చివరకు చంకలో పండు కిందకు వదిలేసి చెట్టు మీది పండును అందుకున్నాట్ట. తర్వాత తీరిగ్గా బురదలో పడిన పండు తీసి కడుక్కుని తిన్నాట్ట. ఇప్పుడు బాబు చేయవలసినది కూడా యిదే. రెండు పళ్ల మీదా ఆశపడితే రెండూ దక్కవు. మొదట ఒకటి జార్చుకుని రెండోది కైవసం చేసుకుని తర్వాత దిద్దుబాటు చర్యల ద్వారా పరిస్థితి సరిదిద్దుకోవాలి.

కమిటీ నివేదిక వచ్చేదాకా ఆగకుండా టిడిపి వెంటనే సమైక్యం అంటే దాని వలన వచ్చే పరిణామాలను ఎదుర్కోవడానికి టైముంటుంది. ఎందుకంటే డిసెంబరు 31 తర్వాత కాంగ్రెస్ ఏదైనా ఎనౌన్సు చేసినా ఆచరణకు సమయం తీసుకుంటుంది. తెలంగాణాలో కెసియార్‌కు దీటైన కాంగ్రెస్ నాయకుడు తయారయ్యేదాకా తాత్సారం చేస్తుంది. ఈ లోపున టిడిపి ఆటుపోట్లకు గురి కావడం, తమాయించుకోవడం కూడా జరిగిపోతాయి. డిసెంబరు 31 తర్వాత యిదే ఎనౌన్సుమెంటు చేసినా ఫలితం వుండదు. గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం అంటారు.

విశ్వసనీయత లేకనే టిడిపి 2009లో ఓటమి పాలైంది. ఇప్పటికైనా దోబూచులాట మాని ఏదో ఒక గట్టు చేరితే మంచిది. లేకపోతే రెండు పడవల ప్రయాణంలో టిడిపి మునగడం ఖాయం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్**

– ముందర వేషం వేద్దామని వచ్చాడు, అది కుదరక, డైరక్షన్ చేస్తానన్నాడు, పోనీ ఫోటోగ్రఫీ అన్నాడు. ఆఖరికి కథలూ, డైలాగులూ రాయసిద్ధపడ్డాడు.

– 'క' అన్నాను. – థలూ, సినేరియోలూ, సాంగులూ గట్రా రిక్షాలమీద వచ్చేశాయి.

– మన కథకు సదుపాయింగా వుంటుందని సెకండు క్లాసులోనే ఎక్కారు.

– సినిమా కథ అనేది డిస్ట్రిబ్యూటర్లమీదా, హీరోయిన్‌ల గార్డియన్‌ల మీద ఆధారపడి వుంటుంది. ఖీ పిక్చరు సగమైనా కాకుండా కథ యేమిటో ఎవరు మాత్రం చెప్పగలరు?

– సినిమా కథలు వారఫలాల వంటివి. గ్రహబలాలను బట్టి మారుతాయి.

సినిమా ఘట్టాల గురించి

– రాజు దెబ్బలు తిన్నాక కాస్సేపటికి స్పృహ వచ్చింది. కళ్లు తెరచి 'నేనెక్కడున్నాను?' అనాలి. కానీ చూస్తే తను టాక్సీలో నరసు భుజం మీ వాలి వున్నాడు. ఇప్పటిదాకా ఏ సినిమాలోనూ అటువంటి ఘట్టాల్లో ఆ డైలాగు అన్న హీరో లేడు. అందువల్ల చాపమీద ఒక చూరు కింద పడుకున్నాననుకున్నాకనే ఆ ప్రశ్న వేశాడు.

ఉపమానాలు –

– టేక్ మధ్యలో డైలాగు మర్చిపోయిన నటుడు తనంతట తనే కట్ అన్నట్టుగా, హఠాత్తుగా అపశ్రుతి పలికేసరికి ఆపి తూ నా బొడ్డు అనుకుంటూ సిగ్గుపడి పాట మానేసిన కొత్త గాయకుడిలా అతను ఆగిపోయాడు.

– బొమ్మ చెంగునున్న బేడకాసుని దొంగతనంగా విప్పి తీసుకోబోయి అమ్మ కంటబడ్డ కుర్రనాగన్నలా సిగ్గుపడి నవ్వాడు.

– డ్యూయట్ సీనులో 'హీరోయిన్ పాట వినుట' ను నటిస్తున్న హీరో లాటి మొహం

**– (సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 16** **ఎమ్బీయస్: విక్రమార్కుడి మార్కు... –8**

మాటల్లో తొట్రుపాటు, మేలప్రాపిజం, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అజ్ఞానం చూపడానికి అనేక ఉదాహరణలున్నాయి –

– 'సింహం మేహంలా అరచింది', 'తెలుసు, మింఘం సేహంలా అర్చింది'

– అర్థాంతరన్యాసం అనబోయి అద్దాంతరసన్యాసం అంటాడు,

– మసిపూసిన పాతర, మట్టిలో మాణిక్యం రెండూ కలిపి మసిపూసిన మాణిక్యం అంటాడు,

– తివిరి ఇసుమున, వెదకి కుందేటి పాదాలు రెండూ కలిపి 'తివిరి కుందేటి' అంటాడు.

– ఇంకో చోట తమిళం, తెలుగు కలిపి 'నాను మొయ్యరే, నేనే మోస్తాంలే' అంటాడు.

– వడ్లగింజలో బియ్యం గింజ అనబోయి 'వడ్లగింజలో ఆవగింజ' అంటాడు.

**నవంబరు 26** **ఎమ్బీయస్: వార్నీ, ఆంధ్రులనుకున్నా..**

కెటసియార్ దుగ్గల్ గారి దగ్గరకు వెళ్లినపుడు చెప్పారట – 'హైదరాబాదు అభివృద్ధిలో ఆంధ్రప్రాంతీయుల పాత్ర చాలా వుంది కాబట్టి వాళ్లకు ఏదోలా కాంపెన్సేట్ చేయాలని చూడనక్కరలేదు. హైదరాబాదు, పరిసర ప్రాంతాల్లో వాళ్ల పరిశ్రమలు పదిశాతమే. తక్కిన తొంభైశాతం తెలంగాణా వారివి, తెలుగేతరులైన గుజరాతీ, మార్వాడీలవి' అని. ఒక్క దెబ్బకి నాకు కళ్లు పచ్చబడ్డాయి.

ఇన్నాళ్లూ కెసియార్ ఒక్కరే కాదు, తెరాస వారు మాత్రమే కాదు, తెరాసేతర తెలంగాణావాదులు మాత్రమే కాదు, నాకు మెయిల్స్ రాసే విభజనవాదులెందరో నాకు చెపుతూ వస్తున్నది –' కోస్తా, సీమ వాళ్లు తెలంగాణావారి నీళ్లు, ఉద్యోగాలు, పరిశ్రమలు దోచుకున్నారని! ముఖ్యంగా హైదరాబాదులోను, చుట్టుపట్లా ఉన్న పరిశ్రమలలో 90% 'ఆంధ్రా'వాళ్లవేట. ఈ పరిశ్రమల పేర వాళ్లు గవర్నమెంటు భూములు కాజేశారట. పక్కనున్న భూములు కబ్జా చేశారట. తెలంగాణా భూమిలో వున్న నీళ్లు వాడేశారట. ఇక్కడి వాతావరణమంతా కలుషితం చేసేశారట. బంగారం లాటి హైదరాబాదు నగరం యింతలా ధ్వంసం కావడానికి కారణం వాళ్లేట. పోనీ యిన్నీ చేసి ఆ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు యిచ్చారా అంటే అదీ లేదట. ఉద్యోగస్తులందరూ ఆంధ్రప్రాంతీయులేట.'

కెసియార్ పరిశ్రమల గురించే కాదు వ్యాపారాల గురించి కూడా మాట్లాడారు. బట్టల వ్యాపారం గురించి మాట్లాడుతూ గతంలో తుంగ సత్తయ్య వంటి తెలంగాణా దుకాణాలు ఎన్నో వుంటే వాళ్లను తోసిరాజని చందనా, బొమ్మన అంటూ ఆంధ్రావాళ్లు వచ్చి తెలంగాణా వ్యాపారస్తుల పొట్టకొట్టారని ఆరోపించారు. ఆ టైములో నేనో ఆర్టికల్ రాశాను కూడా. తుంగ సత్తయ్య వంటి వ్యాపారస్తులు మోడర్నైజ్ కాకపోవడం చేతనే కొత్త వ్యాపారస్తులు వచ్చిపడ్డారేమో చూడండి అంటూ. కెసియార్ కంటికి చందన, బొమ్మన కనబడ్డాయి తప్ప చర్మాస్ కనబడలేదు. బిగ్ బజార్ కనబడలేదు. జనరల్ బజారులో, గంజ్‌లో రకరకాల వ్యాపారాలు చేసే మార్వాడీలు, గుజరాతీలు కనబడలేదు. ఇవన్నీ ఎత్తి చూపాను.

వాళ్ల మేనల్లుడు హరీశ్ రావుకి విద్యాసంస్థలపై కన్ను. ఆంధ్ర విద్యాసంస్థలు యిక్కడకి వచ్చి దోచేస్తున్నాయని, అమాయకపు తెలంగాణా పౌరులు వారి పిల్లల్ని ఆ కాలేజీల్లోకి పంపి దోపిడీకి గురవుతున్నారని వాపోయారు. తాము అధికారంలోకి రాగానే అవన్నీ మూయిస్తానని శపథం చేశారు. ఇక కెసియార్ కూతురు కవితకు సినీపరిశ్రమపై కన్ను. అదంతా ఆంధ్రప్రాంతీయుల గుప్పిట్లో విలవిల లాడుతోందని ఆరోపిస్తూ, షూటింగు ఆపించడంలో, షూటింగు ఎలాగోలా పూర్తిచేసుకున్న సినిమాలను విడుదల కాకుండా అడ్డుకోవడంలో ప్రావీణ్యత సంపాదించారు.

ఈ ఆరోపణలు విన్నపుడు ఏ మాత్రం కామన్‌సెన్సు వున్నవాడికైనా తోచే చిన్న ప్రశ్న ఒక్కటే – తెలంగాణావారిని పరిశ్రమలు

పెట్టవద్దని ఎవరైనా బతిమాలారా? అడ్డుకున్నారా? కెసియార్ (ఒకవేళ) ఓడలమీద పెట్టుబడి పెట్టేబదులు ఆటోమొబైల్ ఫ్యాక్టరీలపై పెట్టవచ్చుగా, హరీశ్‌రావు తనే ఓ విద్యాసంస్థ పెట్టించవచ్చుగా, కవిత తనే ఓ సినిమాను తీయడమో, డిస్ట్రిబ్యూట్ చేయడమో, ప్రదర్శించడమో చేయవచ్చుగా! సంస్థానిర్వహణలో ఫారిన్‌లో తర్ఫీదు అయిన కెటిఆర్ పరిశ్రమలు ఎలా నడపాలో తెలంగాణా ఔత్సాహికులకు నేర్పవచ్చుగా!

పారిశ్రామికాధిపతులు ఆంధ్రావారు కాబట్టి ఆంధ్రావారికే ఉద్యోగాలు యిస్తున్నారని ఆరోపణ. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక వీళ్లనే ఎఱ్ఱ తివాచీ వేసి ఆహ్వానిస్తామంటూ వుంటారు. దేనికి? దోపిడీ కొనసాగించమని చెప్పడానికా? పరిశ్రమలు పెట్టి మరికొందరు ఆంధ్రావారికి ఉద్యోగాలు యిచ్చుకో అనడానికా? అయివుండదు. బహుశా వారి భావం – మీ పెట్టుబడితో యిక్కడ పరిశ్రమలు పెట్టి మేం చెప్పిన మా పార్టీ వర్కర్స్‌కి యివ్వండి అని! పెట్టుబడి పెట్టి రిస్క్ తీసుకుని పరిశ్రమ పెట్టేవాడికి తన కిష్టమైన వాణ్ని ఉద్యోగిగా ఎంచుకునే స్వేచ్ఛ యివ్వకపోతే వాడు యిక్కడకు ఎందుకు వస్తాడు? వాణ్ని పిలిచే పక్కరాష్ట్రాలు పది వున్నాయి. ఎఱ్ఱ తివాచీ దండగ, ఎవరూ రారు, ముడిచి లోపల పెట్టేయండి.

వ్యాపారస్తుడు తన అనుకున్నది సాధించేవాడికోసం చూస్తాడు. వాడు తెలుగువాడా? బెంగాలీయా? పంజాబీయా చూడడు. కొందరు తెలంగాణా నాయకులకు పరిశ్రమలున్నాయి కదా, అక్కడకు వెళ్లి చూడండి, వాళ్లు తెలంగాణావారికే ఉద్యోగం యిచ్చారో, యితరులకూ యిచ్చారో కనుక్కుని చూడండి. తెలంగాణా అనే కాదు, కొందరంటారు బిసిలకు ఉద్యోగాలివ్వాలి, ఎస్సీలకు యివ్వాలి, ఎస్టీలకు యివ్వాలి అని. అనే నాయకులు తమ స్వంత పెట్టుబడితో పరిశ్రమ పెట్టినపుడు కేవలం బిసిలకో, ఎస్సీలకో యివ్వరు. ఎవడి వద్ద సమర్థత, విశ్వాసపాత్రత వుందో వాళ్లకే ఉద్యోగం యిస్తారు.

కెసియార్ పెట్టించిన రాజ్ టీవీలో, పెట్టబోతున్న నమస్తే తెలంగాణా పత్రికలో ఉద్యోగులందరూ తెలంగాణా వారా? వాటి హెడ్ ముస్లిము, డిప్యూటీ హెడ్ దళితుడూనా? (తెలంగాణాను ప్రగతిపథంలో నడిపించడానికి వీళ్లనే ఎంచుకోబోతున్న కెసియార్ తన సంస్థలపై ప్రయోగాలు చేసి చూడాలిగా!) సమాధానాలు తెలంగాణా నాయకులకు తెలియక కాదు. కానీ మామూలు ప్రజల్ని మభ్యపెట్టడానికి చూస్తున్నారు.

నిజంగా వీళ్ల మాట నమ్మితే మరి హైదరాబాదులో తెలంగాణా వారందరూ ఏం చేసి బతుకుతున్నారబ్బా అని అనుమానం వస్తుంది. వీళ్ల లెక్క ప్రకారం వాళ్లకు ప్రభుత్వోద్యోగాలూ లేవు – దొంగ సర్టిఫికెట్లతో ఆంధ్రావారు ఎత్తుకుపోయారు, ప్రయివేటు ఉద్యోగాలూ లేవు – ఆంధ్రా యజమానులు వీరికివ్వరు. పరిశ్రమలు స్థాపించలేదు. వ్యాపారాలు చేయడానికి డబ్బు లేదు. వ్యవసాయం చేద్దామంటే ఆంధ్రావారు భూమి కబ్జా చేసుకుని కూర్చున్నారు. హైదరాబాదు జనాభాలో కోస్తా, సీమల వారి జనాభా 10% మాత్రమే అంటారు కెసియార్. తక్కిన యితర భాషీయులను తీసేస్తే ఆయన లెక్క ప్రకారం 75% మందైనా తెలంగాణావారుండాలిగా. వారందరూ ఏ వ్యాపకమూ లేకుండా వున్నారా? మాట్లాడితే వీరిని దోచుకుంటున్నారంటారు. ఇలా ఏమీలేని వాళ్లని ఏం దోచుకుంటారు? ఎలా దోచుకుంటారు?

కెసియార్ దుగ్గల్ వద్ద చెప్పినదానిలో యింకా కొన్ని విశేషాలున్నాయి. హైదరాబాదు స్లమ్స్‌లో 90% మంది తెలంగాణా నుంచి వలస వచ్చినవారట. (దోపిడీకి గురైనవారిలో వీరూ వున్నారా? వీళ్ల దగ్గర దోచుకోవడానికి ఏముంది చెప్మా?) హైదరాబాదులో కార్మికులెవరూ ఆంధ్రవారు లేరట, ఏదో శ్రీకాకుళం వంటి ఒకటి అర జిల్లాలనుండి కొంతమంది వచ్చారట. ఇది నిజమేనంటారా?

తెలంగాణా భవన్ కట్టించడానికి కూడా తెరాస ఆంధ్రప్రాంతంనుండి కూలీవారిని తెప్పించిందని వార్తలు వచ్చాయి. మామూలుగా కూడా యిళ్లు కట్టేపనివారిలో చాలామంది ఆ ప్రాంతపు పనివారు కనబడుతున్నారు. అదేం తమాషాయో! ముంబయిలో కూలిపనివారిలో తెలంగాణా జిల్లాల వారు పుష్కలంగా కనబడతారు. (బొంబాయి నుండి కథలు రాసే అనేకమంది రచయితలు వీటిపై మరిన్ని వివరాలు యివ్వగలరు) హైదరాబాదు కూలిపనివారిలో ఆంధ్ర జిల్లాల వారు పుష్కలంగా కనబడతారు. అంటే తెలంగాణా కూలీలు తమ తమ జిల్లాల్లో వున్నపుడు పనిచేయరా? హైదరాబాదులో కూలిపనులు ఆంధ్రులకు అప్పగించి తాము మాత్రం మహారాష్ట్రకు వలస వెళతారా? సోషల్ సైంటిస్టులు కారణాలు చెప్పాలి.

కెసియార్ చెప్పినదాని ప్రకారం హైదరాబాదులో ఆంధ్రులంతా వైట్ కాలర్ జాబ్స్‌కోసం వచ్చినవారేట. ఈ మాటే నిజమైతే వైట్ కాలర్ జాబ్స్ వున్నవెన్ని? రాష్ట్రప్రభుత్వోద్యోగాలు ఎన్ని వున్నాయి కనుక? ఒకవేళ కేంద్రప్రభుత్వ ఉద్యోగాలలో, కార్పోరేషన్ ఉద్యోగాలలో, ప్రైవేటు సెక్టార్‌లో కూడా ఆంధ్రులే ఉద్యోగాలు చేసేస్తూ వుంటే వారికే ఉద్యోగాలు ఎందుకు దొరుకుతున్నాయి? (కెసియార్ ప్రకారం) తెలంగాణా వారికి ఎందుకు దొరకటం లేదు? ఇది కూడా సోషల్ సైంటిస్టులచేత కెసియార్ అధ్యయనం చేయించి, తెలంగాణా వారిలో ఉద్యోగార్హత పెంపొందించడానికి వారికి ట్రెయినింగ్ కోర్సులు కండక్ట్ చేయాలి తప్ప ఇండస్ట్రియలిస్టులను బ్లాక్‌మెయిల్ చేస్తే పని కాదు.

ఇలా ప్రాక్టికల్‌గా, రీజనబుల్‌గా అడిగితే విభజనవాదులకు కోపం వచ్చేస్తుంది. టీవీ చర్చల్లో చూస్తాంగా – 'ఇవన్నీ మీకెందుకు? ముందు మీరు మమ్మల్ని వదిలిపొండి. మా బతుకు మేం బతుకుతాం, మా ఛావు మేం ఛస్తాం' అంటారు ఉక్రోషంగా. అందరూ కలిసి భట్టీయం వేసినట్టు నాలుగైదు పాయింట్లు వల్లె వేస్తూ వుంటారు. దానిలో వున్న తర్కం ఏమిటని అడిగామో, అంతే విరుచుకుపడతారు. 'ఇది మాది, మా రాష్ట్రాన్ని మేం పాలించుకుంటాం' అంటూ అరుస్తారు. ఇన్నాళ్లూ వాళ్ల ఎమ్మెల్యేలను, ఎంపీలను వాళ్లు కాకుండా

మరొకరెవరో ఎన్నుకున్నట్టు! ఇలా అడ్డంగా వాదిస్తూ సమైక్యాంధ్రవాది అన్న ప్రతివాడిని హైదరాబాదులో తమ పెట్టుబడులు కాపాడుకోవడానికి చూసే ఆంధ్ర పారిశ్రామికవేత్తగానో, వాడి తొత్తుగానో చూశారు.

కెసియార్ ఒక మాట అంటే చాలు, దానికి మరింత మసాలా వేసి, అతనికంటె ఘనుడు అనిపించుకోవాలనే తపనతో తక్కిన పార్టీల తెలంగాణా లీడర్లు మరింత రెచ్చిపోయారు, ...తున్నారు. అందరూ కలిసి పెట్టుబడిన పెట్టినవాళ్లని అడల గొట్టారు. ప్రత్యేకరాష్ట్రం వచ్చినా మేం మిమ్మల్ని పొమ్మనం అంటూనే వాళ్లు తమకు నచ్చినట్టు ఉద్యోగాలు యిచ్చుకోవడానికి వీల్లేదన్న భావం కలిగించారు. వాళ్లు వెళ్లి కృష్ణ కమిటీకి ఏం చెప్పుకున్నారో ఏమో, వాళ్లు మెహతాగారికి హైదరాబాదు సంగతి తేల్చే బాధ్యత అప్పగించారు. అసలు పెట్టుబడి పెట్టినవారెవరు? వాళ్ల మనోగతం ఏమిటి? తేల్చడం ఆరంభించారాయన. టీవీ చర్చావేదికకు వస్తే ఆయన్నీ ఉతికి ఆరేద్దురుగానీ ఆయన అసలు హైదరాబాదు రాకుండా, ఆంధ్రప్రదేశ్ మొహం చూడకుండా ఢిల్లీలో కూర్చునే అన్ని నివేదికలూ ముందేసుకుని స్టాటిస్టిక్స్ తీసి లెక్కేయడం మొదలెట్టాడు.

ఇది బయటకు పొక్కడంతో కెసియార్ బృందానికి బెదురు పుచ్చుకుంది. కొంపదీసి తమ వాదనలన్నీ తప్పని అంకెలతో సహా తేల్చి హైదరాబాదు లేని తెలంగాణా చేతికిస్తారా? అని. అలాగయితే తనను నమ్ముకున్నవాళ్లందరూ వెంటనే యిదా నువ్వు సాధించింది? అంటారు. గాంధీగారు స్వాతంత్ర్యం సాధించారు కదా అని సంతోషించి వూరుకోలేదు గాడ్సే. పాకిస్తాన్‌ను ఎందుకు విడిపోనిచ్చావ్? అన్న కోపంతో శిక్షించాడు. ప్రజలలో ఆశలు రేకెత్తించడం యీజీ. వాటిని నిభాయించుకోవడం కష్టం. హైదరాబాదు చేజారుతుందన్న భయంతోనే కాబోలు డిసెంబరు 31 తర్వాత అంతర్యుద్ధం అంటూ ప్రకటనలు గుప్పిస్తూ, ఏదో ఒక ఆందోళన పేరిట సైన్యాన్ని రెడీగా వుంచుతున్నారు కెసియార్. పనిలో పనిగా దుగ్గల్‌గారిని కలిశారు.

ఇరిగేషన్ సమస్యలపై కృష్ణ కమిటీ మోహితే గారి అధ్యక్షతన ఓ కమిటీ వేసింది కదా. ఆయన కెసియార్ వాదనను సమర్థించటం లేదులాగుంది. మొదట ఆయనమీద అనుమానాలు వ్యక్తం చేశారు. 'ఆయనకు వాస్తవాలు అర్థం అయినట్టు లేదు' అన్నారట కెసియార్ దుగ్గల్‌తో. ఇరిగేషన్ రంగంలో తెలంగాణాకు నిధులు, నీళ్ల విషయంలో అన్యాయం జరిగిందని కదా యీయన ఆర్గ్యుమెంటు కొట్టేస్తూ 'అబ్బే 1956 తర్వాత తెలంగాణాలో యిన్ని ఎకరాలకు నీళ్లు వచ్చాయి, ఇంత దిగుబడి వచ్చింది. ఇది తక్కిన ప్రాంతాల కంటె ఎక్కువ. తెలంగాణాకు అన్యాయం జరగలేదు' అని కమిటీ రిపోర్టు యిచ్చేస్తే కొంప మునగదూ? అందుకని కెసియార్ ఆయన సామర్థ్యానికే ఎసరు పెట్టారు. 'ఆయన సమర్థుడు. అలాటి అనుమానాలు పెట్టుకోకండి' అని దుగ్గల్ తెగేసి చెప్పారట. ఇంకేమంటారు?

సరే హైదరాబాదు సంగతి తేల్చాల్సిన యీ మెహతా సంగతేమిటో తేలుద్దామని 'హైదరాబాదును డెవలప్ చేశామని ఆంధ్రావాళ్లు చెప్పుకుంటున్నారేమో! డెవలప్ కావడంలో వాళ్ల పాత్ర ఏముంది? నా తలకాయ' అంటూ పైన చెప్పిన అంకెలు (పారిశ్రామిక వేత్తల్లో 10% మాత్రమే ఆంధ్రా వారని) చెప్పారు. 'ఆ 10% మీ అబ్బాయి భాగస్వాములా? బైదివే వారిలో ఉద్యోగులందరూ తెలంగాణావారేనా?' అని దుగ్గల్ అడగలేదు, పాపం మంచాయన.

కెసియార్, దుగ్గల్ సంభాషణ ఈనాడులో హెడ్‌లైన్సులో వచ్చి రెండు,మూడు రోజులైనా కెసియార్ ఖండన రాలేదు కాబట్టి 'అయితే నీళ్లు, స్థలం దొంగిలించి, పర్యావరణాన్ని నాశనం చేసి, స్థానికులకు ఉద్యోగాలివ్వకుండా ఆంధ్రావారికి ఉద్యోగాలిచ్చిన పాపిష్టి పారిశ్రామికవేత్తలలో 90% మంది తెలంగాణావారూ, గుజరాతీ, మార్వాడీలేనన్నమాట! వార్నీ, యిన్నాళ్లూ ఆంధ్రావాళ్లనుకున్నాను సుమా..!' అంటాడేమో కెసియార్‌ను నమ్ముకున్న విభజనవాది! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 28** **ఎమ్బీయస్: జగన్ అబ్సెస్డ్ మీడియా**

చూస్తూండగానే రోశయ్యగారు దిగిపోయారు. మొన్ననే విజయవాడలో ఆర్యవైశ్య మహాసభలో నీరాజనాలు అందుకున్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కులమహాసభకు వెళ్లి వుండకూడదని, అదే ఎమ్మెల్యేయో, మంత్రో అయితే ఫర్వాలేదని (ఈ విచక్షణ దేనికో!) గాలి ముద్దుకృష్ణమ్మ అన్నారు. తెల్లారి లేస్తే కులం, కులం (వెనుకబడిన కులం అనీ, అణగారిన కులం అనీ, అగ్రవర్ణ అహంకారం అనీ..) అని మాట్లాడే నాయకులే యిలా అంటే భలే నవ్వు వస్తుంది. అదే కనక రోశయ్యగారు దళితుడై వుండి, దళిత కుల మహాసభవారు ఆయన్ని సన్మానిస్తే గాలి నోట యిలాటి మాటలు వచ్చేవి కావు. సరే కానీండి. ఆ మహాసభలోనే రోశయ్యగారు చెప్పుకున్నారు – నేను వ్యక్తిగతంగా యిప్పటివరకు ఎవరికీ పనికి రాలేదు, యికముందు పనికి వచ్చే అవకాశం కూడా లేదని. రాష్ట్రానికి కూడా పనికి రారని అధిష్టానం తేల్చేసింది.

ఆ తేల్చడం కూడా మర్యాదరహితంగా తేల్చింది. మీరు దిగాలి సార్ అని ఢిల్లీ నుండి దూత ఎవరైనా వచ్చినా సరిపోయేది, లేదా ఢిల్లీ రప్పించుకుని సోనియాగారు 'ఇప్పటిదాకా కష్టాల వరదల్లో యీతలు కొట్టి కొట్టి చాలా కష్టపడ్డారు, థ్యాంక్స్, యిక గట్టెక్కండి' అని మంచిమాటలతో సాగనంపినా బాగుండేది. అదీ లేదు, యిదీ లేదు. ఢిల్లీ రప్పించారు. సోనియాగారు ఎపాయింట్‌మెంట్ యివ్వలేదు, ఒకవేళ యిచ్చినా రహస్య ఎపాయింట్‌మెంట్ యిచ్చారు. నన్ను కలిసినట్టు ఎవరికీ చెప్పవద్దన్నారు. అదేమి సొగసో! దాంతో రోశయ్యగారు మీడియాకు నేను కలవలేదని చెప్పుకున్నా, 'అబ్బే కలిశారు, కానీ ఐదు నిమిషాలే. అక్కడ చిరంజీవిగారితో కలిసి షేక్‌హేండ్ యిచ్చారు' అని మీడియా కోడి కూసింది.

ఈ 'రాండివూ' అంతా జగన్ పని పట్టడానికే అని మీడియా తనకు కావలసిన అన్వయం చేసేసుకుంది. టార్గెట్ జగన్, హై కమాండ్ గన్ అని ప్రాసలతో హెడ్‌లైన్సు పెట్టి హంగామా చేసింది. మన మీడియాకు కావలసినది – కాంగ్రెస్ ఎలాగైనా చీలి బలహీనపడడం, టిడిపి తిరిగి అధికారంలోకి రావడం. అందువలన అదిగో పులి అంటే యిదిగో తోక అని కాంగ్రెస్ విభేదాలను మరింత రెచ్చగొడతారు.

వారి పాలిట కల్పవృక్షంలా ఆవతరించిన జగన్ ఏం చేసినా వారికి భూతద్దంలో కనబడుతుంది. గత ఆర్నెల్లగా చూస్తే 'జగన్ పని ఫినిష్', 'జగన్‌కి ఉద్వాసన', 'హై కమాండ్ గరమ్ గరమ్' వంటి హెడింగ్స్ ఎన్ని వచ్చాయో చూడండి. హై కమాండ్ చేస్తున్నదల్లా ఏమిట్రా అంటే జగన్ అనే వృక్షం కొమ్మలు కాస్త కాస్త నరుకుతున్నారు, మరీ పక్కింట్లోకి కూడా విస్తరించకుండా! చెట్టునే మొత్తం నరికే సాహసం చేయటం లేదు. దభీలున చూరు మీద పడితే కొంపకే ముప్పు అని.

నాయకుల్లో రెండు రకాలు. కొంతమంది మేధావుల తరహా. మన్‌మోహన్, మణిశంకర్ అయ్యర్, చిదంబరం, ప్రణబ్ ముఖర్జీ టైపు. వీళ్లు ఎంత గొప్పగా రాజ్యం చేసినా ప్రజలకు వీళ్ల గురించి గౌరవం వుంటుంది తప్ప భావావేశం వుండదు. మరి కొంతమంది పాప్యులర్ టైపు. ఇందిరా గాంధీ, ఎన్టీయార్, ఎమ్జీయార్ టైపు – వీళ్లు పొరపాట్లు చేసినా ప్రజలు వీళ్లని వాటేసుకుంటారు. వీళ్ల నియంతృత్వాన్ని, ఒక్కోప్పుడు అవినీతిని కూడా క్షమించేస్తారు. వైయస్సార్ అసమ్మతివాదిగా పాతికేళ్లు చికాకు పెట్టి పెట్టి జీవితంలో చివరి ఆరేళ్లు హఠాత్తుగా పాప్యులర్ లీడర్ అయిపోయారు. ఆ లెగసీ వృథాగా పోకూడదని, తనకు దఖలు పరుచుకోవాలని జగన్ అహరహం కష్టపడుతున్నారు.

ఆ పట్టుదల రాష్ట్రంలోని ఏ కాంగ్రెస్ నాయకుడిలోను కనబడటం లేదు. అంతా ఉపగ్రహాల్లా ఢిల్లీ సూర్యుడి చుట్టు తిరగడం తప్పిస్తే స్వంతంగా జేబులోంచి పైసా తీయరు, జనాల వద్దకు చేరరు. పార్టీ పరంగా యిబ్బందులు వుంటాయనుకుంటే ఏదో చారిటబుల్ ట్రస్టు పేరు పెట్టుకుని కార్యకలాపాలు చేపట్టవచ్చు. లేదా సాంస్కృతిక పరంగా పోతన జయంతి అనో, రుద్రమదేవి పట్టాభిషేక వార్షికోత్సవం అనో, మంజీరా నదికి హారతి అనో, ప్రాణహితకు పుష్కరమనో అనో జనాల్ని పోగేస్తే వాళ్ల కష్టం, సుఖం తెలుస్తుంది. వాళ్ల మధ్య తిరిగి ప్రజా నాయకుడు అని అనిపించుకోవచ్చు. కానీ వీళ్లెవరికీ ఒళ్లు వొంగదు.

వీళ్లకు వచ్చినదల్లా ఢిల్లీ వెళ్లడం (అక్కడ పెద్ద తలకాయలెవరూ వీళ్లను దగ్గరకి రానివ్వరు) మన ఎంపీల యింట్లో నాలుగు రోజులుండి తిరిగి వచ్చి ఇక్కడ ప్రెస్‌ని పిలిచి రాష్ట్ర పరిస్థితి అంతా ఢిల్లీలో చెప్పి వచ్చాను, అమ్మ అబ్జర్వ్ చే...స్తూ వుంది. యిక జగన్ పని ఆఖరే అని చెప్పడం. అవసరానికి మించి పదిరెట్లు వున్న టీవీ వాళ్లు, పత్రికలు ఆ న్యూస్ భుజాన వేసుకుని దానికి స్వంత తాలింపులు వేసి, వ్యాఖ్యానాలు తాము చేసి, నిలయవిద్వాంసులచే చేయించి మనను చావగొడుతూ వచ్చారు. వినివిని 'నాన్నా, పులి' కథలో నాన్నలా అయిపోయాం. జగన్‌ను పార్టీలోంచి తీసేశారని రేపు తెలుగుమీడియాలో స్క్రోలింగ్ వచ్చినా నమ్మక, ఏ ఎన్‌డిటివియో చూసేదాకా నమ్మని పరిస్థితికి తీసుకుని వచ్చారు.

మీడియా గురించి యింత తేలిక భావంతో రాస్తున్నానని అనుకోవద్దు. బుధవారం నాటి పేపర్లు చూడండి, ఒక్కరైనా నాయకత్వ మార్పు గురించి రాశారా? ఎంత ముఖ్యమైన సందర్భం అది! దానికి ముందు ఎంత కసరత్తు జరిగి వుంటుంది! అది పసిగట్టగలిగిన మొనగాడు మన మీడియాలో ఒక్కడు కూడా లేడన్నమాట! ఢిల్లీలో మనవాళ్లకు వున్న కాంటాక్ట్స్ అంత అధ్వాన్నంగా వున్నాయన్నమాట! మరి వీళ్లు నియమించుకున్న ఢిల్లీ ప్రతినిథులందరూ ఏం చేస్తున్నట్టు? వాళ్ల సమర్థత గురించి నేను వ్యాఖ్యానించను కానీ వాళ్లు కళ్లకు కట్టుకున్న గంతలు విప్పాలని మాత్రం కోరుకుంటాను.

మన మీడియాకు ఎంతసేపూ జగన్, జగన్.. జగన్! సిఎల్పీ మీటింగులో జగన్ సంగతి తేల్చేస్తారు అని చెపుతూ మధ్యలో ఎందుకైనా మంచిదని యాక్షన్ తీసుకోకపోవచ్చు కానీ సోనియాపై సాక్షి కథనం ఖండించి వూరుకుంటారు అని కాస్త మోడరేషన్. మన మీడియా యీ జగన్ అబ్సెషన్ వదుల్చుకుంటే తప్ప వార్త కళ్లముందు వచ్చి ఆడినా అందుకోలేని దుస్థితినుండి బయటపడదు.

**– ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 29** **ఎమ్బీయస్: ఈ కిరణం పధ్నాలుగు నెలలు లేటు...**

మన కొత్త సిఎం కిరణ్‌కుమార్ రెడ్డి గురించి కథనాలు వచ్చి పడుతున్నాయి. సహజం. కానీ నేను ఎప్పుడో విన్న న్యూసేమిటంటే – సోనియా మొదటినుండీ కిరణ్‌కుమార్ రెడ్డికి అప్పగిద్దామని చూశారని. వైయస్ పోగానే జయపాల్ రెడ్డి లేదా, కిరణ్ కుమార్ రెడ్డి అనుకున్నారట. జయపాల్ రెడ్డిని అడిగి చూస్తే ఆయన నాకు రాష్ట్ర రాజకీయాలపై యింట్రస్టు లేదు అని చెప్పారట. అలా అంటూనే వుంటారు కానీ వెనక్కాలనుండి చేసేది చేస్తూనే వుంటారు. డిసెంబరు 9 నాటి చిదంబరం ప్రకటన డ్రాఫ్టింగ్ ఆయనదే అని అంటున్నారుగా! అంటే దాని అర్థం ఆయన తెరచాటునుండి సమస్యలు సృష్టించగలరు కానీ తెరముందుకు వచ్చి వాటిని పరిష్కరించరన్నమాట! మేధావులతో వచ్చిన చిక్కే అది!

ఇక కిరణ్‌కుమార్ రెడ్డిని అడిగారో లేదో తెలియదు కానీ ఆయన నియామకానికి రేణుకా చౌదరి అడ్డుపడ్డారని విన్నాను. ఈ పుకార్లు ఎంతవరకు నిజమో యిప్పట్లో తెలియదు. వీటిలో పాల్గొన్నవారు పాతికేళ్ల తర్వాతో ఆత్మకథలు రాస్తే తప్ప! కిరణ్ కుమార్

రెడ్డి వైయస్‌కు అనుయాయి కాబట్టి వైయస్ జగన్ యితని ద్వారా పరోక్షంగా పాలిస్తాడన్న భయం కూడా వేసిందేమో సోనియాగారికి! తెలియదు. ఏది ఏమైనా ఒక రెడ్డి పోయిన తర్వాత మరొక రెడ్డిని పాలకుడిగా తెస్తే యిక కాంగ్రెస్ బొత్తిగా రెడ్డి పార్టీగా ముద్రపడిపోయి తక్కిన కులాలన్నీ దూరమై పోతాయన్న లెక్క కూడా వుందేమో!

ఏది ఏమైనా కిరణాన్ని ఆపేసి రోశయ్యగారిని పెట్టారు సోనియా, అనుభవజ్ఞుడు కదాని. ఆ ఆలోచన వరకు కరక్టే గాని వైయస్ అనుయాయులు ఎంత దూరం వరకు వెళతారో అంచనా వేయలేకపోవడం సోనియా పొరబాటు. వాళ్లు తిరుగుబాటు చేసి రోశయ్యను సిఎంగా గుర్తించము పొమ్మనమని, సెక్రటేరియట్‌కి రాకుండా, కాబినెట్ సమావేశానికి రాకుండా, రాష్ట్రప్రజల సమస్యలు పట్టించుకోకుండా, మొత్తం భారమంతా రోశయ్యగారిపై పడేసి.. యింతకు తెగిస్తారని ఆవిడ వూహించలేకపోయింది. సరే తెగించాకనైనా ఆవిడ వాళ్లకు బుద్ధి చెప్పవలసింది. రోశయ్యగారికి సర్వాధికారాలు యిచ్చి నచ్చనివాణ్ని పీకేయ్, నీ వెంట నడిచినవాడికి పదవులు యిచ్చుకో.. అనేసి వుంటే ఆయనకంటూ ఓ వర్గం ఏర్పడేది.

సోనియా అదీ చేయలేదు. రోశయ్యగారి పరిపాలనంతా కాబినెట్ విస్తరణ, పై వారం, పై నెల అంటూనే గడిచిపోయింది. కాబినెట్టే కాదు, కార్పోరేషన్ పదవులు కూడా నింపనీయలేదు. ఎవరికి కోపం తెప్పిస్తే వాళ్లు వెళ్లి జగన్ దగ్గర చేరిపోతారోనన్న భయంతోనే సోనియా, రోశయ్య బిక్కుబిక్కుమంటూ గడిపారు. జగన్‌కి అంత శక్తి వుందనుకుంటే సోనియా అతన్ని ఏదోలా సామదానభేద దండోపాయాలతో సాధించాల్సింది. అతని పాటికి అతన్ని వదిలేసి, రోశయ్యకు పక్కలో బల్లెంలా వుంచుతూ రోశయ్యను పాలించమంటే ఆయన ఏం పాలిస్తారు? దానికి తోడు, ఒకటా రెండా సమస్యలపై సమస్యలు వచ్చిపడ్డాయి. వరదలు, తుపానులు, ఆర్థిక సంక్షోభాలు, అన్నిటికీ మించి తెలంగాణా సమస్య. రోశయ్యగారు పదవిలో మనశ్శాంతితో వున్న రోజు ఒక్కటీ లేదు.

అది ఆయన వర్క్ స్టయిల్‌పై ప్రభావం చూపింది. ఆయనే చెప్పుకున్నట్టు పని ఒత్తిడి ఆయనలో అసహనాన్ని పెంచింది. దానికి తోడు ఆయనలో నాయకత్వ లక్షణం లేని లోపం కొట్టవచ్చినట్టు కనబడింది. నెంబర్ టూగా వెలిగిపోయిన ఆయన నంబర్ వన్‌గా రాణించలేక పోయారు. నెంబర్ వన్‌లో వుండవలసిన తెగువ ఆయనలో లేదు. అధిష్టానం 'నాకు ఈ పని కావాలి' అంటుంది. దానికి గాను ఎవర్ని లాలిస్తావో, ఎవర్ని బెల్లిస్తావో చూసుకోవలసినది నీవు. రోశయ్యగారు ప్రతిదానికి హైకమాండ్ వైపు దిక్కులు చూడడం వాళ్లను చిర్రెత్తించి వుంటుంది. వరదలు వంటివి సరే, గత ఏడాదిగా మన రాష్ట్రంలో ఎడ్మినిస్ట్రేషన్ సరిగ్గా సాగకపోవడానికి కారణం –రాజకీయ సంక్షోభం, ప్రతి ఛోటా మోటా నాయకుడు మీడియా కెక్కి గోల చేయడం. వీళ్లని అదుపు చేయవలసిన భారం ముఖ్యమంత్రిదే.

రోశయ్య ఆ బాధ్యతను గుర్తించలేదు. అది హై కమాండ్ పని అన్నట్టుగా ప్రవర్తించారు. దారిని పోయే దానయ్యను, పొరబాటునో, గ్రహపాటునో సిఎం అయ్యాను యివన్నీ లీడర్ అనవలసిన మాటలు కావు. వైయస్ వారసుడిగా వచ్చారు కాబట్టి వైయస్‌తో పోలిక వచ్చి తీరుతుంది. 'ఎన్నికలలో గెలుపైనా, ఓటమైనా బాధ్యత నాదే' అని చాటి గోదాలోకి దిగిన వైయస్ లీడర్‌షిప్ ఎక్కడ? 'నాదేముంది, మీరు చెప్పినది ఢిల్లీలో చెప్తా, ఢిల్లీలో చెప్పినది యిక్కడ చెప్తా' అని తనను తను పోస్ట్‌మన్ స్థాయికి దిగజార్చుకునే రోశయ్య ఎక్కడ! వైయస్ వున్నంతకాలం ఢిల్లీకి పని లేకపోయింది. రోశయ్య వచ్చాక చేతినిండా పనే! దాంతో లోకువ కట్టేశారు. డిసెంబరు 9 నాడు రోశయ్యకు చూపించిన స్టేటుమెంటు డ్రాఫ్టు ఆయన విమానం ఎక్కాక మార్చేసి యింకోటి ఎనౌన్సు చేశారంటే ఎంత దురహంకారం! అదే వైయస్ వుంటే అలా చేయగలిగేవారా? వైయస్ రిజైన్ చేస్తానని బెదిరించేవారు కారూ!

వైయస్ బతికి వుంటే ఈ కాకా, కేకే, విహెచ్, పాల్వాయి, మధు యాష్కీ... వీళ్లందరూ యీ స్థాయిలో మాట్లాడేవారా? లీడర్ అన్నవాడు ఎవరికి ఏ మంత్రం వేయాలో ఆ మంత్రం వేసి వాక్ దిగ్బంధం చేయాలి. రోశయ్య ఎవర్నీ ఆపలేకపోయారు. జగన్‌ను కూడా కట్టడి చేయలేకపోయారు. చేయలేక అతని మీద ఢిల్లీకి పితూరీలు చేసే స్థాయికి దిగజారినట్టు కనబడ్డారు. పితూరీలు చేసేవారు బలహీనులే! ఏమైతే అది అయిందని గట్టిగా చర్య తీసుకున్నవాడే మొనగాడు. పరిపాలనాదక్షుడైన రోశయ్యకు అదే లోపించింది. నాకు రోశయ్యగారి మీద గౌరవం వుంది కానీ మొన్నటి ఎస్సయి పరీక్షలు వాయిదా వేయడంతో దెబ్బకు తుడిచి పెట్టుకుపోయింది. వాయిదా వేస్తే ఎన్ని యిబ్బందులు వున్నాయో ఆయనే స్వయంగా చెప్పి గంటలు గడవకుండా వాయిదా వేసేశారు. పైనుంచి ఆజ్ఞ వచ్చిందనే అనుకుందాం. అప్పుడయినా ఆయన చెప్పాలి – 'లేదు, అది అధర్మం. నేను వాయిదా వేయను. దానివలన ఏదైనా పరిణామాలు వస్తే నేను ఎదుర్కొంటాను' అని. అది చెప్పలేకపోతే ఆయన సీటులో వుండడం దండగ అనిపించింది.

ఇప్పుడు కిరణ్‌కుమార్ రెడ్డికి ఆ ధైర్యం వుంటుందని అనుకోవచ్చా? మనం అనుకున్నా అనుకోకపోయినా, హై కమాండ్ అనుకుంది. డిసెంబరు 31 తర్వాతి పరిణామాలు రోశయ్య అయితే ఎదుర్కోలేరని, యీయనైతే ఎదుర్కోగలరని అనుకుంది. నిజంగా హై కమాండ్ అంచనా కరెక్టని జనవరి తర్వాత తేలితే అప్పుడు మనం ఒకటి అనుకోవాలి. కిరణ్ నియామకం 14 నెలలు లేటయిందని. అప్పుడే యితన్ని సిఎంగా పెట్టి, రోశయ్యగారిని డిప్యూటీ సిఎంగా, ఫైనాన్సు మినిస్టర్‌గా పెట్టి వుంటే రాష్ట్రం బాగుపడి వుండేది కదాని! – **ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 30** **ఎమ్బీయస్: తెలంగాణాకు ఆశా 'కిరణం'..? –1**

కిరణ్‌కుమార్ రెడ్డి నియామకం ప్రత్యేక తెలంగాణా యివ్వడానికి సూచన అని తెలంగాణావాదులే కాదు, కొమ్ములు తిరిగిన

ఎనలిస్టులు సైతం అంటున్నారు. దాని వెనుక లాజిక్ ఏమిటంటే – తెలంగాణాకు ముఖ్యమంత్రి పదవి, ప్రత్యేక తెలంగాణా రెండూ యివ్వరు. రెండింటిలో ఏదో ఒకటే యిస్తారు. ఇప్పుడు తెలంగాణాకు సిఎం పదవి యిచ్చి, డిసెంబరు 31 తర్వాత ప్రత్యేక తెలంగాణా కూడా యిచ్చేస్తే ఆంధ్రప్రాంతీయులు రెండిందాలా నష్టపోయినట్లు ఫీలవుతారు. ఇప్పుడు తెలంగాణాకు సిఎం పోస్టు యిచ్చినా డిసెంబరు 31 తర్వాత రాష్ట్రం సమైక్యంగా వుందంటే వాళ్లు చల్లారుతారు. ప్రత్యేకరాష్ట్రం యిచ్చే వుద్దేశం లేని పక్షంలో తెలంగాణా వ్యక్తిని యిప్పుడు సిఎంగా పెట్టి తీరాలి. లేకపోతే తెలంగాణావాళ్లు వూరుకోరు. ఈ వాదనకు కొరొలరీ ఏమిటంటే ప్రత్యేకరాష్ట్రం యిస్తూ వుంటే తెలంగాణా వ్యక్తికి యివ్వవలసిన అవసరం లేదు. ఇప్పుడు సిఎం పోస్టు దక్కలేదు అనే బాధపడే తెలంగాణా ప్రాంతీయులు, ప్రత్యేకరాష్ట్రం ఎనౌన్సు చేయగానే యీ బాధంతా మర్చిపోతారు. ఎవరైతే నేముందిలే యింక కొన్నాళ్లేగా అనుకుంటారు.

ఈ వాదన ప్రకారం యిప్పుడు ఆంధ్రప్రాంతీయుణ్ని సిఎంగా చేశారు కాబట్టి ప్రత్యేక రాష్ట్రం యిచ్చేస్తున్నట్టే అనుకోవచ్చు. అని వీళ్లందరి లైన్ ఆఫ్ థింకింగ్! దీన్ని ఆంధ్రజ్యోతి సమర్థించింది. అంతేకాదు, తెలంగాణా విడగొట్టాక కాంగ్రెస్ అధికారంలోకి ఎలా రావాలో కూడా దారి చూపింది. 60 సీట్లు వుంటే 119 సీట్ల తెలంగాణాలో సింపుల్ మెజారిటీ వచ్చేస్తుంది. కాంగ్రెస్‌కు 50. తెరాసతో చేతులు కలిపితే 11 కలిసి 61. ఒకళ్లు స్పీకర్‌గా వుండవచ్చు. మజ్లిస్ కూడా కలిస్తే రొట్టెమీద నెయ్యి, నేతిమీద రొట్టె! తెలంగాణా కాంగ్రెస్ నాయకుల వేదిక (క్యాఫ్) కూడా యిదే వాదన వినిపిస్తోంది. ఆంధ్రప్రాంతపు సిఎం కాబట్టి తెలంగాణా వచ్చేసినట్టే అంటోంది. తమాషాగా నిన్న మధ్యాహ్నం వీరు వేరే వాదన వినిపించారు. ప్రత్యేక తెలంగాణాకు కట్టుబడిన తెలంగాణా వ్యక్తికి మాత్రమే ఆ పదవి కట్టబెట్టాలని అన్నారు. మరి అలా కట్టబెట్టి వుంటే ప్రత్యేక రాష్ట్రం యిచ్చే వుద్దేశం లేదని ఒప్పుకునేవారా? ఏమో! ఏది ఏమైనా ఈ వాదన ఎంతవరకు కరక్టో చూదాం.

ఈ లాజిక్‌ల మాట ఎలా వున్నా రోశయ్యగార్ని మారుస్తారని వినగానే నేను తెలంగాణా వ్యక్తే సిఎంగా రావాలని ప్రగాఢంగా కోరుకున్నాను. డిసెంబరు 31 తర్వాత కమిటీ నివేదిక ప్రత్యేక తెలంగాణాకు అనుకూలంగా వుండకపోతే తెలంగాణాలో అల్లర్లు చెలరేగుతాయి. వాటిని అదుపు చేయడానికి తెలంగాణా వ్యక్తే ముఖ్యమంత్రిగా వుంటే సౌకర్యంగా వుంటుంది. లేకపోతే ఆంధ్రా సిఎం పోలీసుల చేత కావాలని తెలంగాణా ఉద్యమకారులను కొట్టించాడన్న ఆరోపణ వస్తుంది. ఈ లాజిక్‌తో గీతా రెడ్డిని సిఎం చేయవచ్చని గతంలో కబుర్లలో రాశాను కూడా. అంతేకాదు, ఇంకో పాయింటు కూడా రాశాను. కెసియార్‌తో పాప్యులారిటీతో తూగే తెలంగాణా కాంగ్రెస్ నాయకుడు ఎవరూ లేరని, కనబడేవాళ్లంతా వాళ్ల వాళ్ల జిల్లాలకే పరిమితమని, అందువలన ఎవరినైనా తెలంగాణా వ్యక్తిని సిఎం చేసి అతని పేరు రాష్ట్రమంతా, ముఖ్యంగా తెలంగాణా అంతా తెలిసేట్టు చేసేదాకా కాంగ్రెస్ తెలంగాణా రాష్ట్రం ఏర్పడనివ్వదని ఊహ చేశాను. కానీ అదేమీ జరగలేదు.

నిన్న రోశయ్యగారు దిగుతున్నారనగానే మర్రి శశిధర్ రెడ్డిని చేస్తే బాగుండునని అనుకున్నాను. ఆయన తూకంగా వుండే సౌమ్యుడు. విషయపరిజ్ఞానం వున్నవాడు. చెన్నారెడ్డి కుమారుడిగా రాష్ట్రమంతా తెలిసినవాడు. ఆయన కాకపోతే సురేష్ రెడ్డికి యిచ్చినా బాగే అనుకున్నాను. కిరణ్‌కుమార్ రెడ్డి పేరు వస్తున్నా నమ్మబుద్ధి కాలేదు. హై కమాండ్ తెలంగాణాలో సెంటిమెంటుని పట్టించుకోకుండా వుండదు అనుకున్నాను. తెలంగాణాకు సిఎం పదవి యిచ్చినంత మాత్రాన ఆ ప్రాంతానికి ఏదో ఒరుగుతుందన్న భ్రమలు నాకేమీ లేవు. రాయలసీమ నుండి ఎంతమంది ముఖ్యమంత్రులు లేరు? అయినా అది వెనుకబడే వుంది కదా! అయినా ప్రస్తుతం వున్న ఫీలింగ్స్‌ను లెక్కలోకి తీసుకుని తెలంగాణా వారిని ముఖ్యమంత్రి చేయడం మంచిదనుకున్నాను. అడ్వొకేట్ జనరల్ గా పనిచేయడానికి నమ్మకమైన వ్యక్తి హోల్‌మొత్తం తెలంగాణాలో ఎవరూ యిన్నాళ్లగా దొరకలేదా? అని అడుగుతున్నట్టు ఈ సమయంలో కూడా తెలంగాణా నుండి సిఎంగా పనిచేసేందుకు ఒక్క సమర్థుడైన వ్యక్తి కూడా దొరకలేదా? అని ఫీలయ్యే ప్రమాదం వుంది కదా అనుకున్నాను. డిప్యూటీ సిఎం యిచ్చినా వేస్టు. అది ఆరోవేలు లాటిది. పేరుకే పనికి వస్తుంది.

చివరకు రాయలసీమ వ్యక్తిని సిఎం చేయగానే ఎందుకిలా? అని ఆలోచించాను. హై కమాండ్ పక్షాన్నుండి ఆలోచించి చూస్తే అనుకున్నాను. మనం ఎంతసేపూ తెలంగాణా కోణం నుండే ఆలోచిస్తున్నాం. వి షుడ్ థింక్ ఔట్ ఆఫ్ ది బాక్స్. ఈ మీడియా మనల్ని అలా ఆలోచించనీయకుండా కళ్లకు గంతలు కట్టేసింది. మన మెదడును కండిషన్ చేసి పెట్టేసింది. ఇక్కడే జగన్ అబ్సెస్డ్ మీడియా గురించి నేను రాసిన వ్యాసంపై వివరణ యిస్తాను (కొంతమంది కోరారు) – నేను జర్నలిస్టును కాను, నాకు స్ట్రింగర్స్ లేరు, న్యూస్ సేకరించేవారిని నేను నియమించుకోలేదు. నేను ఓట్టి పాఠకుణ్ని మాత్రమే! కొన్నేళ్లగా రాజకీయాలు గమనిస్తున్నానంతే. మంగళవారం రాత్రి నాకే అనిపించింది – బుధవారం నాటి సమావేశం జగన్ గురించి కాదని, ముఖ్యమంత్రి మార్పు గురించని. జగన్ అంటే హై కమాండ్‌కు మంట లేదని నేను అనను. కానీ నా లాజిక్ ఒకటే! – జగన్‌ను తరమాలంటే తమ వద్ద ఓ ప్రత్యామ్నాయం వుండాలి. జగన్‌ను ఢీకొనేవాడుండాలి. అప్పటివరకు వాళ్లు ఆగుతారు. ఈ పేపర్ టైగర్స్ (అంటే జనంలోకి వెళ్లకుండా మీడియా ముందు చెలరేగి పోయే నాయకులు అని నా తాత్పర్యం) కి జగన్ పీకేస్తే చాలు. వాళ్లకు జీవతృప్తి అయిపోతుంది. దానివలన వాళ్లకు పోయేది ఏమీ లేదు. ఎందుకంటే వాళ్లకు ఏదైనా వుంటే కదా పోడానికి!

కానీ హై కమాండ్ దాని తర్వాత స్టెప్ కూడా కాలిక్యులేట్ చేసుకుంటుంది. పీకాక అతని స్థితి ఏమిటి? మన స్థితి ఏమిటి? అని. ఎందుకంటే జనాదరణ వున్న నాయకుణ్ని వదులుకోవడానికి ఏ పార్టీ యిష్టపడదు. జనాదరణ, పార్టీ పట్ల విధేయత రెండూ వుంటే అస్సలు వదులుకోదు. వాటిలో ఒకటే వున్నపుడే సమస్య వస్తుంది. దేనికి ఎన్ని మార్కులు వేయాలి? ఫైనల్‌గా వుంచుకోవాలా?

తుంచుకోవాలా? అని ఒకటికి నాలుగుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటుంది. అందునా ఆంధ్రప్రదేశ్ వంటి కీలకమైన రాష్ట్రంలో మరింత ఆచితూచి అడుగులు వేయాలి. ఆ అడుగు తప్పుపడితే పడవచ్చు. కానీ అడుగు పడేముందు చాలా తటపటాయింపు వుంటుంది. అందువలన జగన్ నిష్క్రమణ అనేది మన మీడియాకు టాప్ ప్రయారిటీ కానీ, హై కమాండ్‌కి కాదు. వాళ్లకు టాప్ ప్రయారిటీ – డిసెంబరు 31 తర్వాత రాష్ట్రంలో పరిస్థితి! దానికి రోశయ్యగారు చాలరని తేలింది కాబట్టి ప్రత్యామ్నాయం వెతకాలి. ఇదీ హై కమాండ్ మనఃస్థితి అని గెస్ చేశాను. ఎందుకంటే మీడియాను దాటి ఆలోచించాను కాబట్టి!

అలాగే ఇప్పుడు కూడా మీడియా సృష్టించిన తెలంగాణా వలయాన్ని దాటి ఆలోచించాలి.

2

కన్యాశుల్కంలో ఓ బండివాడుంటాడు. గిరీశం వాడికి కాంగ్రెస్ గురించి గంటసేపు లెక్చరిస్తే అంతా విని వాళ్ల వూరి పోలీసు కనిస్టీపు బదిలీ కావాలంటే ఏ పార్టీకి ఓటేయాలని అడుగుతాడు. అంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, రాకపోయినా వాడికి అనవసరం. వాడికి కంటిముందు కనబడుతున్నదీ, భయపెడుతున్నదీ ఆ కనిస్టీపు (కానిస్టేబుల్) మాత్రమే. అందువలన వాడి ఆలోచనలన్నీ వాడి చుట్టూనే తిరుగుతుంటాయి. నేను కూడా ఆ బండివాడిలాగానే ఎంతసేపూ తెలంగాణా చుట్టూనే పరిభ్రమిస్తున్నానన్నమాట! కాస్సేపు అది వదిలేసి ఆలోచిస్తేనే కిరణ్‌కుమార్ రెడ్డి నియామకం సంగతి తెలుస్తుంది.

సాక్షిలో ఓ వార్త వచ్చింది. హై కమాండ్ జయపాల్ రెడ్డిగార్ని సిఎం చేద్దామనుకుని ప్రణబ్ రప్పించి మాట్లాడారట. 'డిసెంబరు 31 తర్వాత తెలంగాణా యిచ్చేటట్టయితేనే నేను సిఎంగా వెళతానన్నారట' ఆయన. ' ఆ సంగతి యిప్పటికిప్పుడు చెప్పలేం' అన్నారట ప్రణబ్. 'అయితే నేను వెళ్లను' అన్నారట జయపాల్. నిజానికి సిఎంగా వెళ్లటం యిష్టం లేని జయపాల్ తెలంగాణాపై హై కమాండ్ ఆలోచనాధోరణి తెలిసే ఆ లింకు పెట్టి వుండవచ్చు. మనకు తెలియదు. అయితే దీనివలన తెలిసే అంశం ఏమిటంటే – హై కమాండ్ తెలంగాణా గురించి యింకా ఏ నిర్ణయం తీసుకోలేదని! ఒక సమైక్యవాది నడిపే పేపరు కాబట్టి 'సాక్షి' న్యూస్ మనం నమ్మకూడదు అనుకుని యింకోలా ఆలోచించి చూదాం.

అసలు నాయకత్వం మార్పు అనేది ఎందుకు అవసరం పడింది? రాష్ట్రంలో అలజడి ఎక్కువై పోయింది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో వుంది. ప్రతీ వర్గమూ ఆందోళన బాట పట్టడం, ప్రభుత్వాన్ని బెదిరించడం. పరీక్ష పేపర్లు దిద్దడానికి వచ్చిన టీచర్లను ఆంధ్రావాళ్లంటూ పట్టుకుని చావగొడితే దిక్కు లేదు. దాడి చేసినవారికి వారి మొహాలు వీడియో కెమెరాల్లో చిక్కినా భయం లేదు. మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకుణ్ని ఉస్మానియా పడేసి తొక్కేసి నెలలు దాటినా యింకా శిక్ష పడలేదు. గ్రూపు 1 పరీక్షలు నిర్వహిస్తే అభ్యర్థులు రెడీ అన్నా కాంగ్రెస్ ఎంపీలు యూనివర్సిటీ గోడలు దూకి పరీక్షలు ఆపించేసినా అడిగేవాడు లేడు. వివాదం వున్న హైదరాబాదులో ఎస్సయి పరీక్షలు జరగడం లేదు, తక్కిన ప్రాంతాల్లో నైనా జరుపుకోనివ్వండి అన్నా వినేవాడు లేడు. విద్యార్థులు బయటకు వచ్చి కార్ల షో రూమ్‌లో కొత్తకార్లను ధ్వంసం చేసినా ఏమీ ఫర్వాలేదు. తెలంగాణా పేరు చెప్పగానే గజగజ వణికి జీ హుజూర్ అని ప్రభుత్వం సాగిలపడుతోంది.

ఈ లోకువ చూసి ఆంధ్రప్రాంతంలోనూ మొదలుపెట్టారు. హైకోర్టు బెంచ్ అంటూ మొదలుపెట్టి అదేదో యిప్పుడే తేల్చాలంటూ జనజీవితాన్ని భగ్నం చేస్తున్నారు. నిన్న ఎస్‌బిఐ ట్రెజరీ ఆఫీసుని అడ్డుకుని 60 కోట్ల రూ.ల కార్యకలాపాలు జరగకుండా చూశారు. ఏం చేసినా ఫర్వాలేదన్న ధీమా ఎక్కువై పోయింది. ప్రభుత్వాధినేత నేనెందుకు పనికి రాను, నాకు ధైర్యం లేదు, నన్ను ఏం తిట్టినా పడి వుంటాను అన్న సందేశం అందిస్తున్నారు. గద్దె నెక్కిన మొదటి రోజుల్లో జగన్ అనుయాయులు నువ్వసలు సిఎంవే కావు పొమ్మన్నారు. సీటులో సరిగ్గా కుదురుకోలేదు అప్పట్లో భరించారు అనుకుందాం. మొన్నటికి మొన్న దామోదరరెడ్డి ఇలాటి సిఎం దొరకడం మా దౌర్భాగ్యం అంటారా? పబ్లిగ్గా! హౌ డేర్ హీ! అంబటి రాంబాబు మాత్రం ఎంత నోరు పారేసుకున్నారు!

అనేకమంది కాంగ్రెస్ నాయకులు మొన్నటిదాకా తాము ఆకాశానికి ఎత్తేసిన వైయస్సార్‌ను అవినీతి పరుడని తెగ తిట్టేస్తూంటే ఆపేవాళ్లు లేరా? వైయస్‌ను అవినీతి పరుడని నువ్వు సాక్ష్యాలతో రుజువు చేసినకొద్దీ అవతల సోనియా పరువుకూడా పోతోందన్న స్పృహ కూడా లేదు వీళ్లకి. అంత అవినీతి సాగిపోతూ వుంటే ఎందుకు ఆపలేదు? అసమర్థతా? లేక భాగస్వామ్యమా? అని ఎవరైనా అడుగుతారన్న యింగితం లేదు. వాళ్లను ఆపే కరుకుతనం లేదు. ప్రభుత్వం నుండి గట్టిగా ఏ అడుగూ పడదు. తెలంగాణా పేరు చెప్పో, జగన్ పేరు చెప్పో ప్రభుత్వాధినేతను యీజీగా బ్లాక్‌మెయిల్ చేసేయవచ్చు.

ఇలాటి పరిస్థితిలో సామాన్యుడు వైయస్‌ను గుర్తుకు తెచ్చుకుంటాడు. ఆయనే వుంటేనా..? అని అనుకుంటాడు. రాజు రాజే, మంత్రి మంత్రే! మంత్రి ఆలోచన చెప్పగలడు, కానీ స్వయంగా యుద్ధభూమికి వెళ్లలేడు. యుద్ధభూమికి వెళ్లి విజయాన్నో, వీరస్వర్గాన్నో మూటగట్టుకునేది రాజు మాత్రమే. అందువలననే అతను రాచభోగాలు అనుభవించగలడు. తెలివితేటలు, నిర్వాహణ దక్షత ఉండడం ఒక యెత్తు కానీ ధైర్యప్రదర్శన అనేది అన్నిటికంటె ముఖ్యం. ప్రతీదానికి లెక్కలు వేస్తూ కూచుంటే విజయం రాదు. ఉంటే వుంది, లేకపోతే పోయింది అన్న ధీమాతో గోదాలోకి దిగాలి. మంత్రి పోస్టు సెక్యూర్డ్. ఈ రాజు పోతే మరో రాజుకి సేవ చేస్తూ తన స్థానాన్ని పదిలంగా వుంచుకోగలడు. కానీ సౌఖ్యాలు కూడా పరిమితమే. రాజంత సుఖాలు పొందలేడు. రిస్క్–ప్రాఫిట్ థియరీ

యిక్కడ వర్కవుట్ అవుతుంది. రోశయ్య గారు మంత్రే, రాజు కాలేకపోయారు. వైయస్ రాజు.

రాష్ట్రంలో పాలన అదుపు తప్పి ఎవరికీ భయం లేకుండా పోయినపుడు – కష్టాలొచ్చినా 'అయితే ఏంటంట?' అనే వైయస్ రకం రాజు కావాలని – కోరుకుంటాడు సామాన్యుడు. వైయస్ వుండి వుంటే అసలు తెలంగాణా సమస్య వచ్చి వుండేది కాదని నూటికి 90 మంది అంటున్నారు. ఎలా మేనేజ్ చేసేవాడే తెలియదు, ఏదో ఒకటి చేసి యీ గొడవలు లేకుండా చూసేవాడుట వైయస్ గురించి ఆలోచించినప్పుడల్లా ఆ బెనిఫిట్ జగన్‌కి పోతుంది. ఎందుకంటే వైయస్ వారసుడిగా జగన్ కంటికి కనబడుతున్నాడు.

ఎమర్జన్సీ పెట్టి దేశాన్ని అతలాకుతలం చేసిన ఇందిరా గాంధీని ఓడించి 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇక ఇందిర ఫినిష్ అనుకున్నారు. అయితే జనతా పార్టీవారు వాళ్లలో వాళ్లు కొట్టుకుని ప్రజలకు విసుగు తెప్పించేశారు. దాంతో మూడేళ్లు తిరక్కుండా జనం ఇందిరా గాంధీని నెత్తిమీద పెట్టుకుని మళ్లీ అధికారంలోకి తెచ్చారు. ఆమె నియంత అనుకుంటే ఆమె కంటె ఘోరమైన వ్యక్తి, ఆమె కొడుకు సంజయ్ గాంధీ వెనక్కాల వున్నాడని తెలిసినా, సరే నీతో బాటు నీ కొడుకుని భరిస్తాం రా అని పిలుచుకుని వచ్చి 1980లో గద్దె కెక్కించారు. అందువల్లనే యింకా మనకు రాజీవ్, సోనియా, రాహుల్... వీళ్లందరి హయాం సాగుతోంది. 1977లో జనతావాళ్లు సరిగ్గా ప్రవర్తించి వుంటే యీ గొడవే వుండేది కాదు.

నిజానికి జనతావాళ్ల పాలన బాగుంది. కానీ మెయిన్ సమస్య ఏమిటంటే మెతకతనం!క ప్రభుత్వాన్ని కాబినెట్ కొలీగ్సే విమర్శించినా ఏమీ అనలేని మెతకతనం! ఇప్పుడు రోశయ్యగారి లాగానే! ఈ మెతకతనమే జనాల్ని జగన్ వైపు చూసేట్టు చేస్తోంది. ఇది అధిష్టానం గ్రహించింది. అందుకనే గట్టి పిండాన్ని కూర్చోబెట్టాలని ఆలోచించింది.

3

ఈ గట్టిపిండం రాష్ట్రవ్యవస్థలోని మెతకతనాన్ని పోగొట్టడమే కాదు, జగన్‌ను టాకిల్ చేయగలగాలి. జగన్ అనగానే 'అదిగో మళ్లీ మీరు మీడియాలాగే జగన్ అబ్సెస్‌డ్' అనకండి. జగన్ యీజ్ ఏ ఫ్యాక్టర్ బట్ నాట్ ది ఓన్లీ ఫ్యాక్టర్ అనేది నా నినాదం. మన మీడియా దాన్ని ఓన్లీ ఫ్యాక్టర్‌గా చేస్తోందని నా ఫిర్యాదు. హై కమాండ్ జగన్‌తో కంఫర్టబుల్‌గా లేదన్న సంగతి అందరూ ఒప్పుకోవలసినదే. ఓపిక పట్టు ఓపిక పట్టు అంటూ కూచోబెట్టి జనాలు వైయస్ మర్చిపోయేట్లా చూస్తే అప్పుడు తమకు పోటీ అధికార కేంద్రంగా ఎదగకుండా వుంటాడన్న ఆలోచన వాళ్లది.

ఆ ఐడియా వున్నవాళ్లు అతనికి చిన్న పోస్టయినా యివ్వాలి. కానీ అతనికి కాస్త అధికారం యిచ్చినా పూర్తిగా పుచ్చేసుకుని అదుపు తప్పుతాడేమోనని వాళ్ల భయం. జగన్‌ను చూడబోతే ఆశ లావు. ఓపిక పడుతూ కూచుంటే మర్రి శశిధర్ రెడ్డి లాగే అయిపోతామని భయం. (ఈరోజు ఆయనకు ఏ చిన్నపదవీ దక్కేట్టు లేదు) అందుకే తన వర్గాన్ని కాపాడుకుంటూ, నేను ఫీల్డులోనే వున్నాను, పారిపోలేదు, మా నాన్న అనుయాయులను కాపాడుతాను అని సంకేతాలిస్తూ తిరుగుతున్నాడు.

రాష్ట్రంలో కాంగ్రెస్ వారికి రెండు ఆప్షన్స్ వున్నాయి. అటు సోనియా.. అదే లెండి.. రాహుల్ గాంధీ. ఇటు జగన్. రాహుల్ గాంధీ తమను గట్టెక్కించగలడని నమ్మకముంటే అతని పక్షానే వుంటారు, లేదా అతనికి ఆ శక్తి లేదు అని తేలితే యిటు దూకేస్తారు. కాంగ్రెస్‌కు దేశమంతా పెర్మనెంట్ ఓటు బ్యాంక్ వుంది. ఆంధ్రలో అది ప్రస్తుతం 25–30% అనుకుందాం. కానీ దాన్ని కన్సాలిడేట్ చేసి, ఏకోన్ముఖం చేసి అదనపు 5–10క ఓట్లు రాబట్టి గెలుపుగా మార్చగల స్థానిక నాయకుడు వుండాలి.

అది ఎవరు అన్నదే ప్రశ్న. సోనియా జాతీయ నాయకురాలు, రాహుల్ గాంధీ జాతీయ (తయారీలో వున్న) యువనాయకుడు. అయితే వారి మ్యాజిక్ దేశమంతా ఒక్కలా పనిచేయదు. స్కూటర్‌లో పెట్రోలు వుంటుంది. స్పార్క్ ప్లగ్ వుంటుంది. కానీ సరిగ్గా కిక్ కొట్టే మొనగాడు వుండాలి. కిక్ సగం సగం కొట్టినా, స్పార్క్ వెలిగే సమయానికి పెట్రోలు చుక్క అందిరాకపోయినా కంబశ్చన్ యింజన్ నడవదు. మిస్‌ఫైరయ్యి, చికాకు పుట్టించే శబ్దం మాత్రం చేసి వూరుకుంటుంది.

ప్రస్తుతం మన రాష్ట్రంలో అటువంటి శబ్దాలే వినబడుతున్నాయి, సరిగ్గా కిక్ కొట్టే చోదకుడు లేక! బిహార్‌లో కూడా యిలాగే వుంటే 'ఏహె, మీకు రాదు చూడండి నేను కొట్టి చూపిస్తాను' అంటూ రాహుల్ గాంధీ తన ఫార్ములాతో దిగారు. ఇన్నాళ్లు సరైన ఔషధం యిచ్చే వైద్యుడు లేక అల్లాడాము. ఇప్పుడు డాక్టరుగారు దొరికారు అంటూ మన విహెచ్ బాపతు వాళ్లు బిహారీ భాషలో కవిత్వాలు చెప్పారు. రాహుల్ గారు పాకలో పాలకోవా తిని, ధాబా చాయిలో రొట్టె ముంచుకుని, హోటల్లో పిజ్జా తిని బిహార్‌ను కొత్త దారి పట్టించారని మీడియా రాసి మన కాంగ్రెస్ నాయకులను ఉబ్బేసింది.

ఫలితాలు వచ్చాయి. కొత్తవి చేరకపోగా ఉన్నవి సగాని కంటె తక్కువ వచ్చాయి. ఐదువేళ్లు చూపించి తిరిగారు కాబట్టి ఐదు సీట్లు వచ్చాయని బాబుగారు అడావుడిగా ప్రకటించారు. ఫైనల్‌గా చూస్తే వచ్చినవి నాలుగే! (అరె, నాకు ఓ మంచి స్లోగన్ తట్టింది. 'ఐదేళ్లూ పాలించే సామర్థ్యం వున్న ఐదువేళ్ల కాంగ్రెస్‌కే మీ ఓటు!' కాంగ్రెస్ వాళ్లెవరైనా దీన్ని వాడుకుని నాకో వెయ్యి కోట్లు చెల్లించవలసినదిగా ప్రార్థన – వాళ్ల స్థాయికి తగ్గట్టుగానే అడగాలి మనం! లేకపోతే బొత్తిగా 'సీపుగా' వుంటుంది)

ఇలాటి రాహుల్‌ను నమ్ముకుని కాంగ్రెస్‌లో వుండిపోవడమా, లేక స్థానికంగా ఎదుగుతున్న జగన్‌ను నమ్ముకుని గోడ దూకడమా? అని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆలోచనలో పడతారన్నది నిర్వివాదాంశం. జగన్ వైపు వెళ్లకుండా వాళ్లకు ఎవరో ఒక నాయకుణ్ని

చూపించాలి. అతడు జగన్ వంటి యువకుడైతే మరీ మంచిది. ఎందుకంటే విహెచ్, కాకా, కేకే, పాల్వాయి వంటి వారు మాట్లాడుతూంటే 'వీళ్లు లేవాలంటే నలుగురు సాయం పట్టాలి, ఈ ముసలాళ్లా (వాళ్లు మర్యాదగా తాము సీనియర్లు అని చెప్పుకుంటూ వుంటే వీళ్లు యిలా వర్ణిస్తారు చూడండి) మా జగన్‌ను విమర్శించేది' అని జగన్ అనుయాయులు విరుచుకు పడుతూంటారు. అందువలన ఓ యువకుడైతే జగన్ లాటి చురుకుతనం ప్రదర్శించగలడు. కొత్త ముఖ్యమంత్రి ఎంపిక సమయంలో యివన్నీ పరిగణనలోకి తీసుకున్నారనే అనిపిస్తోంది.

మరి అలా అయితే జయపాల్ రెడ్డి యువకుడు కాదుగా! అన్ని గుణాలూ ఒకే చోట పోగుపడవు. జయపాల్ రెడ్డి అయితే పరిపాలనా దక్షత వుంటుంది. ఆయన ఒప్పుకోలేదు కాబట్టి ప్రత్యామ్నాయం వెతికి నప్పుడు పరిపాలనా అనుభవం ఫ్యాక్టర్ పక్కకు పెట్టి ఆలోచిస్తే అతను ఏ ప్రాంతానికి చెందినవాడై వుండాలి? అంటే ఆంధ్రప్రాంతం వాడయితే మేలు అనుకున్నారు. ఎందుకంటే ఇమ్మీడియేట్ టార్గెట్ అయిన 2014లో తెలంగాణా ప్రాంతంలో కాంగ్రెస్‌కు పెద్దగా ఓట్లు వచ్చే అవకాశం లేదు. ప్రత్యేక రాష్ట్రం యిచ్చేసినా ఆ లాభం తెరాసకే పోతుంది.

అందువలన కనీసం ఆంధ్రప్రాంతాన్నయినా గట్టిగా చూసుకోవాలి. అతను రాయలసీమ రెడ్డి అయితే వాళ్లందరూ జగన్‌వైపు తిరిగిపోకుండా కాపాడగలడు. వైయస్‌కు విశ్వాసపాత్రుడైతే మరీ మంచిది. ఈ లెక్కల్లో కిరణ్‌కుమార్ రెడ్డివైపు మొగ్గు చూపారనుకోవచ్చు. కిరణ్ కుమార్ గత ఏడాదిగా 6 సార్లు ఢిల్లీ వెళ్లి లాబీయింగ్ చేసుకున్నారట. రాష్ట్రాన్ని ఎలా చక్కదిద్దవచ్చో యాక్షన్ ప్లాన్ వేసి చూపించారట. వద్దు మొర్రో అంటున్న జయపాల్ రెడ్డిని బతిమాలే బదులు యితనైతే బెటరనుకున్నారేమో, మంత్రిగా కూడా చేయని వాణ్ని ఏకంగా ముఖ్యమంత్రి చేసేశాం ఫో అన్నారు.

4

ఈ కిరణ్‌కుమ్మాటతే ఒక సౌలభ్యం వుంది. ఈయన హైదరాబాదీ అన్న పాయింటు కాదు లెండి. హైదరాబాదులో పుట్టినా (ఈయన జన్మస్థలం అంటూ చిత్తూరులో ఓ పల్లెటూరి పేరు రాస్తున్నారు ఒక్కో చోట) పెరిగినా, ఆయన్ని తెలంగాణావాడిగా ఛస్తే ఒప్పుకోవటం లేదు ప్రత్యేకవాదులు. అసలు ఎవరు తెలంగాణావారో నిర్వచనమే యింకా ఫైనలైజ్ కాలేదు. కెసియార్ ఒకటంటే, కెటియార్ మరోటి అంటారు. ఏది ఏమైనా రచయితల సంఘంలో వాటిలో చూస్తాంగా! హైదరాబాదులో పుట్టి, అక్కడే వుద్యోగం చేస్తూ, ఆ నేపథ్యంతోనే కథలు రాసినా తెలంగాణా వాళ్లగా ఒప్పరు. తెలంగాణా కవుల, రచయితల సంఘం సమావేశానికి కూడా పిలవరు.

నేను చెప్పేదేమిటంటే ఆంధ్రప్రాంతపు ఎమ్మేల్యేలందరూ డిసెంబరు 10 న రిజైన్ చేశారు, తాము సమైక్యవాదులమంటూ. ఈయన స్పీకర్ కాబట్టి రిజైన్ చేసే సందర్భం రాలేదు. అందువలన యీయన సమైక్యవాదినని గాని, కాదని గాని చాటుకునే అవసరం పడలేదు. ఎవరికి వాళ్లు తమవాడనే అనుకునే సౌలభ్యం వుంది. (అది ఉపయోగించుకుంటారో లేదో తెలియదనుకోండి) ఈయన యువకుడు. బోల్డంత రాజకీయ జీవితం వున్నవాడు. ఏదో ముక్కు మూసుకుని నాలుగు రోజులు కాలక్షేపం చేస్తే సరిపోతుంది అనుకునేవాడు కాడు. ఇప్పుడేమీ చేయకపోతే, యీ అవకాశాన్ని వినియోగించుకోకపోతే నాలుగేళ్ల తర్వాత నా గతేమిటి? అని వర్రీ అయేవాడు. ఆ వర్రీ లేకపోవడమే రోశయ్యగారిని దెబ్బ తీసింది. ఆయన ఏదో బలవంతపు బ్రాహ్మణార్థంగా సిఎంగిరీ లాక్కుని వచ్చారు. ఈయన ఏదో ఒకటి చేయకపోతే మట్టికొట్టుకు పోతాం అన్న భయంతోనైనా బోల్డు డెసిషన్స్ తీసుకుంటాడు.

బోల్డు డెసిషన్స్ అంటే నా దృష్టిలో శాంతిభద్రతలు నెలకొల్పడంలో పోలీసులకు స్వేచ్ఛ నివ్వడం. ఇటీవలి కాలంలో పోలీసులకు తప్ప తక్కినందరికీ స్వేచ్ఛ ఎక్కువై పోయింది. ఉస్మానియా వర్శిటీలో ఇంటర్వ్యూ వుందంటే ఆ ఉద్యోగాలు యిచ్చే అధికారుల కంటె ముందు ఓయు జాక్ వారు ఇంటర్వ్యూ చేసి వెనక్కి పంపేస్తున్నారు. ఎవరు పేపరు దిద్దాలో ఎవరు దిద్దకూడదో ఓయు జాక్ వాళు నిర్ణయిస్తారు. ఒకవేళ వాళ్ల కళ్లు కప్పి లోపలకి వచ్చేస్తే 'మీతో కలిసి కూచోము' అని ఓయు అధ్యాపకబ ృందంలో కొందరు తీర్మానిస్తున్నారు. ఏమిటిది? అంతా వాళ్ల యిష్టమేనా? ఓ పద్ధతీ పాడూ వుండనక్కరలేదా? ఎప్పుడు పరీక్ష జరపాలో, ఎవరికి జరపాలో నిర్ణయించేది ప్రభుత్వమా? విద్యార్థుల పేరుతో చలామణీ అయ్యే నడివయస్కులా? వారికి వత్తాసు పలికే అధ్యాపకులా!?

అధ్యాపకులంటే గుర్తుకు వచ్చింది. కోదండరామ్ గారు యిలా రాజకీయాల్లో చొరబడడం రూల్సు ప్రకారం సవ్యమేనా? ఈయన కౌంటర్‌పార్ట్ సమైక్య జాక్ కన్వీనర్ శామ్యూల్‌గారు ఆయనా చట్టాన్ని అతిక్రమిస్తున్నారా? లేదా? అక్కడి న్యాయవాదులు రోడ్లపై వంటలు చేసి ట్రాఫిక్ అడ్డుకోవడం వలన జనజీవనానికి భంగం కలగటం లేదా? పౌరహక్కులకు విఘాతం కలగటం లేదా? ఏం చేసినా ఫర్వాలేదన్న ధీమా ప్రబలటం చేతనే కదా యివన్నీ! వీళ్లందరినీ ఓ చూపు చూడాలి. అసలు మొట్టమొదట మీడియాను నియంత్రించాలి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ నాయకుల మాస్కులు తొడిగి వాళ్లచేత డాన్సులు చేయించడమేమిటి? తమాషాగా వుందా? మా.మా. అంటూ ఓ తోలుబొమ్మను పెట్టి మన్‌మోహన్ సింగ్ దగ్గర్నుంచి ప్రతీవారినీ 'అరే, ఒరే' అనడం ఏమిటి? ఈ ఛానెల్స్ ఏం చేసినా చెల్లిపోతుందా? వ్యంగ్యం అనేది ఆమోదయోగ్యం. కానీ వీళ్లు హద్దు మీరారు. గట్టిగా తలచుకుంటే వీళ్లను కట్టడి చేయడం కష్టం కాదు. ఏదో ఒక చోట రూల్సు ఉల్లంఘించే వుంటారు. కావలసినది పొలిటికల్ విల్.

అదే రోశయ్యగారి వద్ద లేకపోయింది. ఆయనను చూస్తే అందరికీ జాలి వేసింది తప్ప భయం వేయలేదు. కాటు వేయకపోయినా బుస కొట్టమన్నారు పెద్దలు. 294 మంది ఎమ్మెల్యేలలో ఒఖ్కడైన ఒక ఎమ్మెల్యే 7 కోట్లకు ప్రాతినిధ్యం వహించే సిఎంను పట్టుకుని దౌర్భాగ్యం అంటాడు, అసమర్థుడంటాడు. లక్షా తొంభై అంటాడు. మా జోలికి వస్తే వూరుకోం అని హుంకరిస్తాడు.

రోశయ్యగారు పోలీసు వాళ్ల చేతులకు బేడీలు వేసి వుంచారు. పోలీసులకు ఫ్రీ హ్యేండ్ యిచ్చి చూడండి. ఎన్టీయార్ పాతబస్తీలో మతకలహాలను ఎలా ఆపేరనుకున్నారు? వాళ్లకు ఫ్రీ హ్యేండ్ యిచ్చారు. దెబ్బకు కర్ఫ్యూ అంటే ఏమిటో తెలియకుండా పోయింది. హిందు ముస్లిములు కొట్టుకోవడం అంటే గతకాలపు గాథ అయిపోయింది. ఇప్పుడు రోజుల తరబడి ఉస్మానియా క్యాంపస్‌లో చెట్లకింద కాపురం చేస్తున్న పోలీసులకు ఫ్రీ హ్యేండ్ యిచ్చి చూడండి. ఉస్మానియాలో ఆత్మహత్యలు ఆగిపోతాయి. అక్కడ యిక పాఠాలు చెప్పడం మాత్రమే వుంటుంది. ఇదే పని ఆంధ్రా వర్శిటీలో, కృష్ణదేవరాయ వర్శిటీలో కూడా చేయాలి. బంతిలో పాలపక్షం కూడదు. ప్రస్తుతం తెలంగాణాలో యిది హెచ్చు మోతాదులో వున్నాయి. రేపు తెలంగాణా యిచ్చేస్తున్నాం అంటే ఆంధ్రప్రాంతంలో యివన్నీ చేస్తారు. గతంలో చేశారుగా – యిక్కడివి కాపీ కొట్టి నిరాహార దీక్షలు, రోడ్డు మీద వంటలు, కబాడీలు...!

అపోజిషన్ లీడరు ఊళ్లు తిరుగుతూంటే ఆయన కాన్వాయ్‌పై రాళ్లేసిన వాళ్లను పట్టుకుని ఉతకండి. మంత్రుల యిళ్లు ముట్టడించేవారు, రిజైన్ చేయమని కార్లు పగలకొట్టేవాళ్లు, నినాదాలు యిమ్మనమని గోల చేసేవారు వీళ్లందరినీ నాలుగురోజులు లాకప్‌లో పడేయండి. ఇక ఇంకోడి స్వేచ్ఛను హరించే ధైర్యం చేయరు. ఇక్కడే కాదు, రాష్ట్రమంతా ప్రభుత్వాన్ని లోకువ కట్టడం ఎక్కువై పోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పని జరగడం లేదు. మంత్రులు రావడం మానేశారు. రోశయ్యగారున్నారుగా, ఆయనే చూసుకుంటాడులే అనుకుంటూ కూచున్నారు. కిరణ్‌కుమార్ అది గుర్తించినట్టున్నారు. వస్తూనే శాంతిభద్రతల గురించి మాట్లాడారు. హైదరాబాదులో అరాచకం ప్రబలితే పెట్టుబడులు రావని గ్రహించే అదనపు బలగాలు తెప్పిస్తానన్నారు. డిసెంబరు 31 తర్వాతే అదుపు చేయనక్కరలేదు, ఆ పని యిప్పటినుండే మొదలు పెట్టవచ్చు.

తెలంగాణా వ్యక్తి సిఎంగా వస్తే బాగుండునని అనుకున్నాను కానీ నాకు ఆలస్యంగా తట్టింది ఓ విషయం. కమిటీ రిపోర్టులో రాష్ట్రం విభజించమని రికమెండేషన్ లేదనుకోండి. ఇక ప్రత్యేకవాదులంతా ఆ సిఎం గారి మీద పడి 'నువ్వు తెలంగాణా అమ్మకు, అబ్బకు పుడితే రిజైన్ చేయాలి' అంటూ పెద్ద గోల చేసేసేవారు. కొత్త సిఎం దానికి లొంగితే నెలరాజే (నెలకాలం పాటు రాజ్యం చేసే రాజే) అయి వుండేవాడు. కమిటీ రిపోర్టు ఏమైనా వుండనీయండి. తెలంగాణా ఇమ్మనమనండి, లేదా కుదరదనమనండి. తక్షణం యివ్వండి, పదేళ్ల తర్వాత యివ్వండి. హైదరాబాదుతో యివ్వండి, లేకుండా యివ్వండి. కలిపి వుంచండి, విడదీసి బతకమనండి. ఏం చేస్తారో ఢిల్లీ వారి యిష్టం. ఇక్కడి పౌరులుగా మనకు కావలసినది – రాష్ట్రంలో కాస్త చట్టం అంటే గౌరవం, ప్రభుత్వం అంటే భయం, పాలకులంటే మర్యాద పెరిగితే చాలు. ప్రతివాడు బ్లాక్‌మెయిలింగ్‌కు దిగకూడదు. ఒకచోట ఒకడిమీద ఉదాసీనత చూపితే రేపు మరో చోట మరొకడు పిలక ఎగరేస్తాడు. తోక ఝాడిస్తే తోక కత్తిరిస్తానని చెప్పాలి.

ఇవన్నీ చేయడానికి హై కమాండ్ సపోర్టు వుండాలి. రోశయ్యగారికి అది దక్కలేదు. దక్కకపోయినా ఆయన సర్దుకుపోయాడు. సర్దుకుపోయాడు కాబట్టే అసమర్థుడని మాటపడి వెళ్లారు. కిరణ్‌కుమార్ సర్దుకుపోకూడదు. నా చేతులు కట్టేస్తే నేను వుండడం వేస్టు. మీరే పాలించుకోండి, ఏ కేకేనో పెట్టుకుని వూరేగ్గండి అని ఢంకా బజాయించి చెప్పి దిగిపోవాలి. ఆ ధైర్యం వుంటేనే వైయస్‌ను మరిపించగలుగుతారు. వైయస్‌ను మరిపించగలిగితేనే జగన్‌ను నియంత్రించగలుగుతారు. అంతేగాని రాయలసీమ పాలిటిక్స్, రెడ్డి కులం పాలిటిక్స్ ఆడి జగన్‌నుండి అనుచరులను యిటువైపు లాక్కువద్దామని చూస్తే లాభం లేదు. బిహార్‌లో నితీశ్‌ను చూడండి. కులం లేదు, గిలం లేదు. శాంతిభద్రతలు, అభివృద్ధి యీ రెండిటిపై దృష్టి పెట్టి లాలూని మరిపిరచారు. కొత్త సిఎం కూడా అదే చేయాలి. మనకు కావలసినవీ ఆ రెండే.

అదే చేయగలిగిననాడు కిరణ్‌కుమార్ గారు తెలంగాణాకే కాదు యావత్ రాష్ట్రానికే ఆశాకిరణం అవుతారు. **(సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 34** **ఎమ్బీయస్: పాచిక విసిరిన జగన్ – 1**

ఎన్నాళ్లగానో మన మీడియా ఊరిస్తూ వచ్చిన ఘట్టం వచ్చేసింది. హై కమాండ్, జగన్ ముఖాముఖీ తలపడ్డారు. జగన్‌కు చెక్, జగన్‌కు మొట్టికాయ, జగన్‌పై గన్.. యిత్యాది కాప్షన్లతో ఏడాది నుండి మీడియా వండుతూ వచ్చిన వంటకం యిన్నాళ్లకు రెడీ అయి టేబుల్‌మీదకు వచ్చింది. మీడియా తనంతట తానే వండిందని అనడానికి లేదు. వెనక్కాలనుండి సో కాల్డ్ సీనియర్లు, ఢిల్లీ పక్షులు, నెత్తిమీద నాలుగు ఓట్లు పెడితే రెండు ఓట్లు కూడా తెచ్చుకోలేని 'టీవీ'రులు.. వీళ్లందరూ కలిసి చేసిన కిచిడీ యిది. చివరి చివరికి వచ్చేసరికి జగన్ ఓ జోక్ అయిపోయారు. 'అందర్నీ ఓదార్చాడు, పాపం తనను ఓదార్చేవారు లేరు' అని ఒకళ్లు కార్టూన్ వేస్తే, 'పార్టీ పెడదామనే వుంది, కానీ పదవులు తీసుకోవడానికి నాయకులే లేరు' అని మరో పత్రిక కార్టూన్.

వైయస్ అనుయాయుడుగా పేరు బడిన కిరణ్ కుమార్ సిఎం అయ్యాక వైయస్ కుటుంబానికి ఓ మాటైనా చెప్పకపోవడం, పైగా వివేకానంద రెడ్డిని కూడా తన బాటే పట్టించడం, వివేకానంద కూడా వదినగారిని సంప్రదించకుండా ఢిల్లీకి వెళ్లి జగన్ తప్పు చేశాడు,

అతని తరఫున నేను క్షమాపణ చెప్తా అంటూ పబ్లిగ్గా స్టేటుమెంటు యివ్వడం – యివన్నీ చూసి జగన్‌కు రోషం వచ్చింది. గొడ్ల కాడ బుడ్డోడి దగ్గర్నుంచి 'జగన్‌ను పీకేస్తారంట' అని చెప్పుకుంటున్నారు అని తన లేఖలో వాపోయారు. తన బాధలన్నీ ఏకరువు పెట్టి పార్టీకి గుడ్‌బై చెప్పేశారు.

అసలు కిరణ్‌ను సిఎం చేసినపుడే జగన్ కంగు తిని వుండాలి. కిరణ్‌ను వైయస్ చేరదీసి పెద్ద చేశారు. 2009లో మంత్రి పదవి యివ్వబోతూ వుంటే జగన్ తన బిజినెస్ పార్ట్‌నర్ అయిన పెద్దిరెడ్డికి యిప్పించారు. ఆయన తన బద్ధశత్రువు కావడంతో కిరణ్‌కు ఒళ్లు మండిపోయింది. ఓ రెండు రోజులపాటు గునిసి, ఆ తర్వాతే స్పీకరు పదవి తీసుకున్నారు. తర్వాత నాగం జనార్దనరెడ్డి పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్ కాకుండా చూడమని వైయస్ అడిగితే అలా కుదరదని చెప్పి వైయస్‌కు ఆగ్రహం తెప్పించారు కూడా కిరణ్. జగన్‌పై ఆయనకు కోపం తగ్గలేదు. అధిష్టానం కూడా అదే ధోరణిలో వుందని తెలిసి గత ఆర్నెల్లగా చిదంబరంతో, తద్వారా రాహుల్‌తో దోస్తీ చేశారు. జగన్‌ను ఎలా అష్టదిగ్బంధం చేయగలరో బ్లూ ప్రింట్ చూపించి ఢిల్లీని ఆకట్టుకున్నారు. జగన్ కుమారస్వామిలా ఊరూరూ తిరుగుతూ ఆయాసపడితే, యీయన వినాయకుడిలా ఢిల్లీలో రాహుల్‌కి ప్రదక్షిణం చేసి రాజ్యాన్ని సంపాదించుకున్నారు.

కిరణ్ బలపడిన కొద్దీ తన రాజ్యంలోకి చొరబడతారని జగన్‌కు భయం వేసినట్టుంది. పైగా తనను దూరం పెట్టడానికి మొదటి రోజునుండి ప్రయత్నించడంతో మండిపడి వుంటారు. ఇక నిర్ణయాత్మకమైన అడుగు వేయాల్సిందే అనుకున్నారు. వేసేశారు. కాబినెట్ ఏర్పడ్డాక రాజీనామా చేస్తారేమో అనుకున్నాను. మంత్రిపదవి దక్కనివారు తనవైపు వస్తారు కదాని. తీరా చూస్తే కాబినెట్ ఏర్పడ్డానికి ముందే కాళ్ల కింద చాప లాగేశాడు. ఇక ప్రతివాడు నేను కోరిన మంత్రిపదవి యిస్తావా, లేక జగన్‌వైపు వెళ్లమంటావా? అని కిరణ్‌ను బ్లాక్‌మెయిల్ చేయడానికి మంచి అనువుగా వుంది. పీఆర్పీతో పొత్తు పెట్టుకుంటే కీలకమైన పోస్టులు వాళ్లకు పోగా వీళ్లకు ఎన్ని దక్కుతాయో తెలియదు. మజ్లిస్, తెరాస కూడా పొత్తు కడితే కాంగ్రెస్ వారికి అడుగూ బొడుగూ మిగులుతాయేమో! వాళ్లలో అసంతృప్తులందరికీ జగన్ దుకాణం తెరిచి పెట్టుకుని కూచుంటారు.

అందరినీ తృప్తిపరచడం కిరణ్‌కు అలవికాని పని. అందుకనే మొదటినుండీ కాంగ్రెస్ తెరాస, పీఆర్పీలను దువ్వుతూ వుంది. మజ్లిస్ అయితే ఎప్పటినుండో బాంధవ్యం. అది పెద్ద యిబ్బంది కాదు. తెరాస చేత కేకే దగ్గరుండి స్టేటుమెంటు యిప్పించారు, ఖబడ్దార్ జగన్ అన్నట్టు. ఇక పీఆర్పీ తనంతట తానే ఎపుడు పిలుస్తారా అని చూస్తోంది. ఈ పీ ఆర్పీ ఎమ్మెల్యే పిల్లల్ని కాంగ్రెస్‌కు అప్పగించేసి హాయిగా సినిమా సెట్స్‌మీదకు వెళదామని చిరు ఐడియా. జగన్ ఎంతమందిని చీలుస్తాడన్నదానిపై వీరి మద్దతు తీసుకోవలసిన అవసరం పడుతుంది.

జగన్ పక్షాన ఓ 20-30 మంది ఎమ్మెల్యేలు వున్నారంటున్నారు. వీరితో ప్రభుత్వం పడగొట్టగలరు కానీ కట్టలేరు. కట్టలేని ప్రభుత్వం వలన ఎవరికి లాభం? మళ్లీ ఎన్నికలకు వెళ్లాలంటే భయం! బోల్డు ఖర్చు అవుతుందని. 2009లో ఖర్చు పెట్టిన నాలుగైదు కోట్లు రాబట్టుకునే అవకాశమే యిప్పటికి చాలామంది ఎమ్మెల్యేలకు రాలేదు. మళ్లీ ఖర్చంటే బాబోయ్ అంటారు. అందుకనే 'ప్రభుత్వాన్ని కూల్చను, ఓ నా అనుచరులారా రాజీనామాలు చేయకండి' అని జగన్ అంటున్నారు. ఈ బుద్ధి ఎంతకాలం కుదురుగా వుంటుందో తెలియదు. ఏదో ఎవరో అన్నారని అలిగి కమాన్, ఫుల్ డౌన్ అనవచ్చు. కిరణ్ సీటులో కుదురుగా కూర్చోనివ్వకుండానే అతని కుర్చీ కాలు విరిచే ప్రయత్నం చేస్తున్నారు జగన్.

ఈ గండంనుండి బయటపడాలంటే తెరాసతో సర్దుబాటు చేసుకోవాలి కాంగ్రెస్. తెరాస ఊరికే మద్దతు చేస్తుందా? అబ్బే, ప్రత్యేక తెలంగాణా యిచ్చేస్తా అని కాంగ్రెస్‌చే ప్రామిస్ చేయించి, పార్లమెంటు సెషన్‌లో బిల్ ప్రవేశపెడతారని ఎనౌన్సు చేయించి అప్పుడు యిస్తుంది. అది లేకుండా సమర్థన యిస్తున్నామంటే తెరాస సమర్థకులు చీల్చి చెండాడతారు. జగన్ ఉపద్రవం తెచ్చిపెడతాడన్న ఆలోచనతోనే కెకె తన యింట్లో కెసియార్‌తో మంతనాలు సాగించి కాంగ్రెస్ తెలంగాణా ఎప్పుడో యిచ్చేసిందని, అందుకే సమర్థిస్తామని స్టేటుమెంటు యిప్పించారు. ఆ స్టేటుమెంటుపై ఎంత గొడవ జరిగిందో అందరికీ తెలుసు. అప్పుడు కెసియార్ వెనుకడుగు వేసి మీడియాను నిందించి పరిస్థితిని అదుపు చేసుకున్నారు. ఇలాటి పరిస్థితుల్లో ఎలాటి గట్టి హామీ లేకుండా కాంగ్రెస్‌తో పొత్తు కడితే తెరాస పరువు పోతుంది.

2

అందువలన కాంగ్రెస్ తెలంగాణా యిస్తామని అనక తప్పదు. అలా అనగానే ఆంధ్రప్రాంతంలో అలజడి ప్రారంభమౌతుంది. కాంగ్రెస్‌పైననే కాదు, కాంగ్రెస్‌ను సమర్థించిన వారందరిపైనా విరుచుకుపడతారు. చిరంజీవి యీ విషయం గుర్తించలేదు కానీ పీ ఆర్పీ ఎమ్మెల్యేలకు మాత్రం బాగా తెలుసు. అందుకే వారు కాంగ్రెస్ కౌగిలిలోకి దూసుకు వెళ్లిపోతున్న చిరంజీవి చొక్కా పట్టుకుని వెనక్కు గుంజారు. కాంగ్రెస్‌వారు చిరంజీవికి వెంటవెంటనే ఎపాయింట్‌మెంట్‌లు యిచ్చి, ప్రణబ్ ముఖర్జీ వంటి వారు స్వయంగా ఫోన్లు చేసి, ఉబ్బేసి, ముగ్గులోకి దింపేయబోయారు.

రాజకీయాలంటే విసుగు, సినిమా అంటే మోజుతో సోలిపోతున్న చిరంజీవి ఎగేసుకుంటూ సోమవారం సాయంత్రం మీటింగు పెట్టారు. నాలుగు మంత్రి పదవులు, ఆరు పదవులు, చిరుకి డిప్యూటీ సిఎం యిత్యాది వార్తలు స్క్రోలింగ్స్‌లో తెగ వచ్చేశాయి.

నాలుగో, ఆరో వుంటే మళ్లీ వాటిల్లో ప్రాంతాల వారీగా, కులాల వారీగా పంపకాలుంటాయి కదా, తెలంగాణా తరఫున నన్ను పెట్టుకో అనడానికి యిన్నాళ్లూ దూరంగా వున్న ఇద్దరు తెలంగాణా పీఆర్పీ ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు ఠంచన్‌గా.

తీరా చూస్తే ఆంధ్రప్రాంతపు ఎమ్మెల్యేలు అమ్మబాబోయ్ అనేశారు. సంఖ్యాపరంగా చూస్తే వాళ్లే ఎక్కువ. రేపు ఆంధ్ర నుండే ఎన్నికవలసినవాళ్లు వారు. కృష్ణ కమిటీ రిపోర్టు వచ్చి, నిజానిజాలు తేల్చి, ఒక మర్యాదపూర్వకమైన విభజన జరిగితే దాని సంగతి వేరే కానీ, యిలా పీక మీద కత్తి పెట్టి తెరాస తెలంగాణా సాధించుకుందంటే దానికి సహకరించిన వారందరికీ ఆంధ్రప్రాంతంలో దేవిడీమన్నా తప్పదు. అందుకే వాళ్లు 'ఇప్పుడు కాదు లెండి' అనేశారు. 'నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా వుంటాం. ప్రభుత్వం పడిపోతూంటే ప్రజలపై ఎన్నికలభారం పడకుండా అప్పుడు కొమ్ము కాస్తాం' అని చెప్పి సమావేశం ముగించారు చిరంజీవి.

పీఆర్పీ తీసుకున్న యీ స్టెప్ కారణంగా సహాయం కోసం కాంగ్రెస్ తెరాసవైపు మరింతగా చూడాలి. లేదా జగన్ వర్గం, టిడిపిలను చీల్చడానికి చూడాలి. మజ్లిస్ సపోర్టు ఎలాగూ తీసుకుంటారు. తెరాసకు, మజ్లిస్‌కు అంత సయోధ్య లేదు. తెలంగాణా విషయంలో యిరువురివీ వేర్వేరు దృక్పథాలు. మరి వాటిని కాంగ్రెస్ ఎలా సమన్వయం చేయగలుగుతుందో చూడాలి. టిడిపిని చీల్చడం అంత 'ఈజీ' కాదు.

నిజానికి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్, జగన్‌ల మధ్య కాంగ్రెస్ ఓట్లు చీలిపోతాయి కాబట్టి టిడిపికే లాభం. 2009 ఎన్నికలలో అపోజిషన్ ఓట్లు చీలిపోయాయి. టిడిపి, లోకసత్తా, పీఆర్పీల మధ్య. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లోకసత్తా బలం పెరిగిన దాఖలా లేదు. గట్టిగా మాట్లాడితే గతంలో కంటె తక్కువ ఓట్లు రావచ్చేమో! ఇక 2009లో ఎన్నో ఆశలు రగిలించిన చిరు యిపుడు వెలిసిపోయారు. స్వతంత్ర ప్రతిపత్తి లేక కాంగ్రెస్‌కు తోకగా మిగులుతున్నారు. అందువలన యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఓట్లు పీఆర్పీకి పడడం కల్ల. అందువలన ఆంధ్రప్రాంతంలో పరిస్థితికి టిడిపికి లాభంగా వుంది.

ఇలాటి స్థితిలో టిడిపి నుండి ఆంధ్ర ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు ఛస్తే రారు. వస్తే గిస్తే తెలంగాణాలో టిడిపి పరిస్థితి బాగా లేదు కాబట్టి అక్కడి టిడిపి ఎమ్మెల్యేలు గోడ దూకవచ్చేమో! అది కూడా కాంగ్రెస్‌లోకి డైరక్టుగా రాకుండా తెరాసలోకి దూకి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమర్థించవచ్చు. ఈ కాలిక్యులేషన్సన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కిరణ్‌కుమార్ సమర్థవంతంగా నిలబెట్టగలరన్న నమ్మకం కుదిరిన నాడే సాధ్యం. నిలబెట్టకుండా పడగొట్టడానికి జగన్ తన ప్రయత్నాలు తాను చేస్తూనే వుంటారు. వెంటనే పడకుండా కొన్నాళ్లు సాగాక పడిపోతే జగన్‌కు లాభం. అతనివైపు ఎమ్మెల్యేలు చేరడానికి సమయం పడుతుంది – జనంలో బలం పుంజుకున్నాడని తేలాలి కదా!

ఆంధ్రప్రాంతంలో బలం పుంజుకోవడానికి జగన్‌కు మంచి అవకాశం వుంది. ఎందుకంటే ఈ రోజు రాష్ట్రం మొత్తంలో సమైక్యవాది అన్న బిరుదు జగన్‌కి ఒక్కడికే వుంది. ఎన్టీయార్ బాట నుండి తప్పుకున్న చంద్రబాబు దాన్ని జారవిడుచుకున్నారు. కాంగ్రెస్‌కు, తమకు యీ విషయంలో తేడా లేదని చాటుకున్నారు. చిరంజీవి మధ్యలో సమైక్యవాదం అన్నారు కానీ యిప్పుడు గోడమీద పిల్లిలాటి కాంగ్రెస్‌తో చేతులు కలిపి తనకు కన్విక్షన్ లేదని చూపుకున్నారు. ఆయన ఎమ్మెల్యేలు అడ్డుకున్నారు కానీ లేకపోతే తెరాసతో చేతులు కలుపుతున్న కాంగ్రెస్ పంచన చేరడానికి ఆయనకు మనసా, వాచా ఏ అభ్యంతరమూ లేదని నిరూపించుకున్నారు.

ఇక మిగిలినది జగన్ ఒక్కడే. ఏ రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీ ధైర్యం చేయని విధంగా పార్లమెంటులో ధైర్యంగా సమైక్యవాదం ప్లకార్డు పట్టుకుని తన విధానాన్ని డిక్లేర్ చేశారు. మెహబూబాబాద్‌కి రాకుండా మధ్యలో ఆపేసి గోల చేసి, తన తరఫున నిలిచిన ఎమ్మెల్యేలను రాళ్లేసి కొట్టినా అతను సమైక్యవాదం నుండి అర యించి కూడా జరగలేదు. ఆ రోజున తెలంగాణా విడిపోవడానికి నేను సుముఖుణ్ని అన్న ఒక్క స్టేటుమెంటు యిచ్చి వుంటే అతను, అతని అనుచరులు అన్ని కష్టాలపాలు అయ్యేవారు కారు. అయినా అతను రాజీ పడలేదు.

ఎన్టీయార్ సమైక్యవాదాన్ని అతని వారసుడు చంద్రబాబు ఓట్ల కోసం తాకట్టు పెట్టేశారు కానీ వైయస్సార్ సమైక్యవాదాన్ని అతని వారసుడు జగన్ తాకట్టు పెట్టలేదు. ఈ విషయం ఆంధ్రప్రాంతంలో చాలా ప్లస్ పాయింట్ అవుతుంది. రాష్ట్రం విడిపోతే జగన్ అక్కడ పెద్ద శక్తి అవుతారు. అధికారంలోకి వచ్చేస్తారని చెప్పలేను కానీ మూడో వంతు సీట్లయినా గెలిచి విస్మరించరాని నాయకుడిగా మారతారు. అప్పుడు శరద్ పవార్‌తో కుదుర్చుకున్నట్లు, మమతా బెనర్జీతో కుదుర్చుకున్నట్లు కాంగ్రెస్ బేరాలు కుదుర్చుకున్నా ఆశ్చర్యపడనక్కరలేదు.

3

ఈ విషయాలు మీకూ, నాకే తడుతున్నపుడు ఎమ్మెల్యేలకు తట్టవా? అందుకని వాళ్లు వెంటనే ఏ స్టెప్పూ తీసుకోకుండా ఏం జరుగుతుందాని ఆతృతగా ఎదురు చూస్తూ వుంటారు. కాబినెట్ కూర్పు అయిన తర్వాత పదవి దక్కనివారు జగన్‌వైపు వెళతారని మొదటినుంచీ అనుకున్నదే. అయితే జగన్ తన పాచిక ముందే విసిరేశారు. దానితో ఎమ్మెల్యేల బార్గయినింగ్ పవర్ మరింత పెరిగింది. నేను కోరిన శాఖ యిస్తావా, అటు వెళ్లనా అని కిరణ్‌ను ముందునుంచే బెదిరిస్తారు.

పొత్తు పెట్టుకుంటే తెరాసకు, మజ్లిస్‌కు కూడా మంచి శాఖలు యివ్వాలి. పొత్తుదారుల కోరికలెప్పుడూ గొంతెమ్మ కోరికలే.

డిఎంకె విషయంలో ఎన్ని బేరసారాలు సాగాయో నీరా రాడియా టేపుల్లో చూశాంగా! ఇక వాళ్లందరికీ యిచ్చాక వీళ్లకు మిగిలేవెన్ని? మిగిలినవాటిలో వీళ్లకు యివ్వగలిగేవెన్ని? ఏం చేసినా ఏడిచి గోల చేసేవారుంటారు. వారందరికీ 'ద్వారము తెరిచియే వున్నది' అని జగన్ కాచుకుని కూచుంటాడు.

కాబినెట్ మొత్తం ఒకేసారి ఎనౌన్సు చేసేస్తే నిరాశ చెందినవారందరూ జగన్ వైపు దూకేస్తారన్న భయంతో దశలవారీగా పదవులు యిస్తారని ఓ న్యూస్. అలా అయితే పరిపాలన కుంటుపడడం ఖాయం. కిరణ్‌కుమార్ ఏదో బాగా పాలిస్తాడని ఆశ పెట్టుకుని కూచున్న నా బోటి వాళ్లందరూ నిస్పృహ చెందడం ఖచ్చితం. దీన్ని టిడిపి సమర్థకులైన మీడియాతో బాటు సాక్షి కూడా దూదేకినట్టు ఏకేయడం నిశ్చయం.

కాంగ్రెస్ యిమేజి యిలా దెబ్బతింటే యిక దాన్ని పట్టుకుని ఎవరు వేళ్లాడతారు? ప్రస్తుతం జగన్ వైపు మహా అయితే 20 మంది వున్నారట. వీళ్లయినా వెంటనే బయటకు వచ్చేసి బావుకునేది లేదు. మధ్యంతర ఎన్నికలు వస్తే ఆంధ్రలో టిడిపి, తెలంగాణాలో తెరాస బాగుపడతాయి. అందువలన కొంతకాలం ఆగితే జగన్, అతని తల్లి ఖాళీ చేసిన స్థానాలకు ఉపయెన్నికలు ఎనౌన్సు చేస్తారు. వాటికి పోటీ చేస్తూ జగన్ పార్టీ ఎనౌన్సు చేస్తాడు. అప్పుడతను నెగ్గాలి. వాటితో బాటు, వాటి కంటె ముందో, వెనుకో స్థానిక ఎన్నికలు రావాలి. అప్పుడు గుడారాలు వేర్పాటవుతాయి. క్రమంగా వీళ్లు 50 మంది అయ్యాక వీళ్లందరిచేతా ఒక్కొక్కరుగా రిజైన్ చేయించాలని జగన్ వ్యూహంట.

వైయస్ చచ్చిపోగానే ఆత్రపడి శవం వుండగానే సంతకాలు చేయంచుకున్నాడని జగన్‌పై రోత పుట్టింది. ఇప్పుడు రోశయ్య తర్వాత తనను సిఎం చేస్తారని ఆశ పెట్టుకుని, కిరణ్‌ను చేయడంతో హతాశుడై, బయటకు వచ్చేసి వాళ్ల నాన్న నెలకొల్పిన ప్రభుత్వాన్ని కూలదోశాడని అంటే యింకా అసహ్యం వేస్తుంది. అందువలన ప్రభుత్వాన్ని కొన్నాళ్లు నడవనిచ్చి స్వయంకృతాపరాధాలతో అది కూలిపోయేట్లు చేయాలని వ్యూహంట. ఈ లోపున జగన్ అనుయాయులు ప్రభుత్వంలో, పార్టీలో వుంటూ విభీషణ పాత్ర పోషించేస్తూ వుంటారు. అసెంబ్లీలో వైయస్ పథకాల అమలు గురించి ప్రభుత్వాన్ని యిరకాటంలో పెట్టే ప్రశ్నలడిగి చికాకు పెడతారు. ఈ విషయంలో పాతికేళ్లపాటు వైయస్ నడిపిన గాథ వాళ్లకి ఆదర్శంగా ఎలాగూ వుంటుంది.

దీనికి ప్రతివ్యూహాలు కాంగ్రెస్ అధిష్టానం రచిస్తూనే వుంటుంది. కానీ అవి ఫలిస్తాయో లేదో చూడాలి. ఇప్పటిదాకా అధిష్టానం ఐడియాలు చీదేశాయి. జగన్‌ను సిఎం చేయాలంటే అనుభవం లేదని చెప్తూ వచ్చారు. మరి ఏ అనుభవం వుందని యివాళ కిరణ్‌ను సిఎం చేశారు? జగన్ ఓపిక పట్టాలి అని హితబోధలు చేశారు. ఓపికంటే ఎన్నాళ్లు? వైయస్ ఇమేజికి పూర్తిగా మసి పూసేసేదాకానా? కాంగ్రెస్ నాయకుల చేతనే వైయస్ అవినీతిపరుడని, ఆస్తులపై విచారణ చేయించాలని డిమాండ్లు చేయిస్తూ వుంటే హై కమాండ్ ఎందుకు ఖండించలేదు?

వైయస్ పోయాక ఒక్కడు కూడా చనిపోలేదని యీ నాయకులంటే ఎందుకు ఖండించలేదు? కొన్నాళ్లు పోయాక వాళ్లే 400 మంది పోయారని తేల్చారంటే ఎంత హాస్యాస్పదంగా వుంది! జగన్‌కు సిఎం పోస్టు యివ్వకూడదనుకున్నారు. మంచిదే. కానీ ఏదో ఒకటి పడేయాలిగా! కనీసం పార్టీ పదవైనా యివ్వాలిగా! అతన్ని నిర్లక్ష్యం చేస్తే తనంతట తానే కృంగి, కృశించి, నశించిపోతాడని కలలు కంటే ఎలా? కాంగ్రెస్ జగన్‌కు ఏమీ యివ్వలేదు. సరి కదా, అతను తమను భుజాన పెట్టుకుని మోయాలని ఆశించింది. సాక్షి పేపరు, టీవీ ఛానెల్ పెట్టినది తమకోసమే అనుకుంది.

వైయస్, జగన్ యిద్దరూ అవినీతిపరులని ప్రతిపక్షాలు ఎలాగూ ప్రచారం చేస్తున్నాయి. తామూ ఓ చేయి వేయాలని అనుకుంది హై కమాండ్. నిజాలు బయటకు వస్తే మంచిదే. తప్పులు సవరిస్తే మంచిదే. కానీ అదేదో జగన్‌ను ఫినిష్ చేయడానికే అన్న ఆరాటం కనబడింది. అవినీతిపరుడు కదాని ఓటర్లు తిరస్కరించిన సందర్భాలు చాలా తక్కువ చూశాను నేను. చెన్నారెడ్డి, జయలలిత, లాలూ, మాయావతి.. వీళ్లందరి అవినీతి గురించి రాసి రాసి పేపర్లు అరిగిపోయాయి, చిరిగిపోయాయి కానీ ప్రజలు వాళ్లను ఎన్నుకున్నారు.

ఓటర్లు అవినీతిని సహిస్తారు కానీ అసమర్థతను సహించరని నాకు అర్థమైంది. అవినీతి అనేది ఎలక్షన్ యిస్యూ కాకపోవడం దురదృష్టకరం కానీ కఠోరసత్యం. అందువలన అవినీతి అనే బూచి చూపిస్తే జగన్‌ను జనం దూరం పెడతారని అనుకోవడం మూర?త్వం.

ఎవరైనా నీతిపరులు ఆరోపణలు చేస్తే కాస్తయినా అందంగా వుంటుంది. వైయస్ ముఖ్యమంత్రిగా వుండి సూట్‌కేసులు అందిస్తున్నంత కాలం యీ అవినీతి కనబడలేదా? ఈ ఎమ్మార్ ప్రాపర్టీస్, ఓబుళాపురం యివాళ్టి యిస్యూలా? అప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదు? పేర్లు బయటకు వచ్చిన కొద్దీ అపోజిషన్ నాయకులకు కూడా దీనిలో వాటా వుందని బయటకు వస్తుంది. అంతా గప్‌చుప్. అవినీతి ఆరోపణలపై శిక్ష పడిన నాయకుడు ఎవరు చెప్పండి చూదాం? లాలూ జైల్లో కొద్దికాలం వున్నారు, కానీ తర్వాత పిలిచి కేంద్రమంత్రిని చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో సుఖ్‌రామ్‌కు శిక్ష పడింది. ఎంతకాలం కఠినశిక్ష అనుభవించారో గుర్తు లేదు. ఇవాళ్టి యెద్యూరప్ప ఉదంతం గుర్తు పెట్టుకోండి. ఐదేళ్ల తర్వాత గుర్తుకు తెచ్చుకుని చూడండి – ఆయన జైలుకి వెళ్లాడో లేదో!

వైయస్ పోయాక జగన్‌ను కాదని అనుభవజ్ఞుడని రోశయ్యగారిని కూర్చోబెట్టారు. అంతవరకూ శభాష్. కానీ రాజకీయంగా వ్యవహరించడానికి ఆయనకు ఫ్రీ హ్యేండ్ యివ్వాలిగా. ఇవ్వలేదు. కాబినెట్ విస్తరించనివ్వరు. ఆయనను తిట్టినవారిపై చర్యలు తీసుకోనివ్వరు. పదవులు భర్తీ చేయనివ్వరు. ఇక ఆయనను చూసి ఎవరు గౌరవిస్తారు? డిసెంబరు 9 నాటి స్టేటు?మెంటు విషయంలో ఆయనకు ఒకటి చూపించి మరొకటి విడుదల చేసి ఆయన లెవెల్ యింతే అని వాళ్లే చాటి చెప్పారు కదా!

పైగా జగన్ ఓదార్పు యాత్ర అడ్డుకో అంటూ ఆయన చేత ఎమ్మెల్యేలకు ఫోన్‌లు చేయించడం. అలా అయితే ఆయన అథారిటీ మరింత పలచన కాదా? ఓదార్పు యాత్రలో వెళ్లినంత మాత్రాన ఏదో ఉపద్రవం జరిగిపోతుందంటే 'అయితే తుమ్మితే ఊడే ముక్కులాటిదన్న మాట మీ సీటు' అనరూ!?

చివరకు రోశయ్యగార్ని తీసేశారు. అప్పుడు జగన్‌ను పిలిచి ఎవర్ని పెట్టాలో సజెస్ట్ చేయి – నీ పేరు తప్ప – అని వుంటే అతని అహం చల్లారేది. అలా చేయలేదు. కిరణ్‌ని సెలక్టు చేశారు. మంచి సెలక్షనే. కానీ జగన్‌ను అణచడమే నీ ఎజెండా అని చెప్పినట్టున్నారు. జగన్ జోలికి వెళ్లకూడదని గట్టిగా చెప్పారు. మామూలు పరిస్థితుల్లో కిరణ్ ఫోన్ చేసి విజయలక్ష్మిగారి ఆశీస్సులు తీసుకుని వుండేవారేమో. కానీ హై కమాండ్‌కు నచ్చదని భయపడి అటువైపు చూడలేదు. అది జగన్‌ను మరీ మండించింది.

ఇది చాలనట్టు గులాం నబీ ఆజాద్ పెద్ద ఐడియా వేసి వివేకానంద రెడ్డిని యిటు లాక్కుని వచ్చి సోనియాతో ఎపాయింట్‌మెంట్ యిప్పించి, జగన్‌ని రెచ్చగొట్టారు. జగన్ హఠాత్తుగా రాజీనామా చేయడానికి కారణం యిదేట. తన తండ్రికి మిత్రుడైన గులాం నబీ తన కుటుంబంలో చిచ్చు పెడతాడా అని! వివేకానందను పట్టుకుని ఏదో పెద్ద తిమింగలాన్ని పట్టుకున్నట్టు బిల్డప్ యిస్తున్నారు. అది తిమింగలమో, జెల్ల చేపో త్వరలో తెలుస్తుంది. ఒకటి మాత్రం మనకు బాగా తెలిసింది, వివేకానంద రాజకీయాలు బొత్తిగా తెలియవని! జగన్ తనను ఎప్పుడూ పెద్దగా పట్టించుకోకపోయినా పెద్ద పుడింగిలా 'సాక్షి కథనానికి జగన్ చేత క్షమాపణ చెప్పిస్తాను' అనడంతోనే ఆయన అవివేకం బయటపడింది. వైయస్‌కు ఆత్మ అనిపించుకున్న కెవిపియే అంత ధైర్యం చేయలేదు. జగన్‌కు సీతయ్య అనీ, ఎవరి మాటా వినడని పేరుంది కదా, తన మాట వినేస్తాడని యిలా అనుకున్నాడో మరి! ఇప్పుడు కాంగ్రెస్‌తో అంటకాగుతున్నారు బాగానే వుంది. రేపు పాల్వాయి, విహెచ్‌ల కోరిక మేరకు వైయస్ కుటుంబీకులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిస్తామంటే సరేనంటారా? వైయస్‌ను కాంగ్రెస్ అప్రదిష్టపాలు చేస్తూ వుంటే సహించి కడప జిల్లాలో వివేకానంద మళ్లీ నెగ్గగలరా? వివేకానంద కు మంత్రి పదవి యిప్పించినదాకా వుండి ఆయన వెనక్కాల ఎమ్మెల్యేలు ఎవరూ లేరని తేలితే గులాం నబీ వెర్రిమొహం వేయాల్సి వస్తుంది.

మరి ఎవరి ఆలోచనో తెలియదు కానీ హై కమాండ్ వారు చిరంజీవిని దగ్గరకు తీశారు. చిరంజీవి మన కొమ్ము కాస్తాడు జగన్‌ను పంపించేద్దాం అని హై కమాండ్‌ను వూదరగొట్టారు. ఆ ధీమా చూసుకుని జగన్‌కు చికాకు పరిచారు. చివరకు ఏమైంది? చిరంజీవికి, అతని ఎమ్మెల్యేలకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ వుందని తెలిసింది. ఆంధ్రప్రాంతం ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు యీ దశలో సమర్థన యివ్వం అని తెగేసి చెప్పడంతో చిరంజీవి సరేననక తప్పలేదు. ఇంతలావు 125 ఏళ్ల ఆల్–పవర్‌ఫుల్ హై కమాండ్‌కు చిరంజీవి వెంట పడి, భంగపడిన అప్రదిష్ట మిగిలింది. అయినవాడికి ఆకుల్లో, కాని వాళ్లకు కంచాల్లో అన్నట్టు.. వైయస్ కొడుకుని తరిమేసి, కాంగ్రెస్‌వాళ్లను పంచెలూడదీసి కొడతాం అన్న చిరంజీవి ముందు సాగిలబడినట్టయింది. జగన్ వర్గం వాళ్లు యీ విషయం పదే పదే వల్లిస్తున్నారు. వ్రతమూ చెడింది, ఫలమూ దక్కలేదు.

ఈ ముచ్చట యిలా తెల్లారింది. మరి రేపు తెరాసతో అనుభవం ఎలా వుంటుందో చూడాలి. చిరంజీవి సారీ చెప్పారు కాబట్టి తాము తప్ప కాంగ్రెస్‌కు వేరే గతి లేదని గ్రహించిన కెసియార్ మరీ కొమ్మెక్కవచ్చు. పొత్తుదారులను ఏడిపించడంలో ఆయన్ను మించినవారు లేరు.

ఈ విధంగా చూస్తే హై కమాండ్‌కున్న సలహాదార్లు వట్టి వేస్టుగాళ్లు అనిపిస్తోంది. రాష్ట్రప్రభుత్వ సలహాదార్లను పీకేసినట్టుగానే వాళ్లనూ పీకేస్తే  దరిద్రం వదిలిపోతుంది. ఇలాటి సలహాదార్లే ప్రభుత్వాధినేతల చుట్టూ దడి కట్టేస్తారు. వాస్తవాలు చూడనివ్వరు. చూడనిస్తే ఇందిరా గాంధీ ఎమర్జన్సీ ఎత్తేయగానే ఎలక్షన్లు పెట్టేవారు కారు, ఘోరంగా ఓడిపోయేవారు కారు.

చంద్రబాబు దగ్గరున్న కంప్యూటర్‌లో అన్నీ – ఏ కొళాయిలో ఎన్ని నీళ్లు కారాయో దగ్గర్నుంచి అన్నీ – కనబడతాయి అనేవారు. కానీ ఆయన అది మాయాబజారులో ప్రియదర్శిని లాటిది. మనకు ప్రియమైనదే అందులో కనబడుతుంది. అందువలన అలిపిరి ఘటన జరగగానే సింపతీతో ఓట్ల వర్షం కురుస్తుందని అనుకుని గడువు కంటె ముందే తన ప్రభుత్వాన్ని తనే రద్దు చేసుకుని ఎన్నికలకు వెళ్లారు. బయట కరువుకాటకాలతో జనం అల్లాడుతున్నారు, మీరు ఎన్నికలకు ఎప్పుడొస్తారా, ఉతికేద్దామా అని చూస్తున్నారు అని ఒక్క సలహాదారు చెప్పాడా? అతిధైర్యంతో చంద్రబాబు 2004 ఎన్నికలకు వెళ్లారు, ఇప్పటికీ అరణ్యవాసంలో వున్నారు.

హై కమాండ్ చేసిన పొరబాటువలన కాంగ్రెస్ చేతినుండి ఆంధ్రప్రదేశ్ జారిపోయే ప్రమాదం ఏర్పడింది. దీన్ని అరికట్టగలిగితే కిరణ్ ఒక్కరే చేయాలి. ఆయనకు ఎంత ఫ్రీ హ్యేండ్ యిస్తారో లేక బ్యాక్‌సీట్ డ్రైవింగ్ చేసి చెడగొడతారేమో! చేసిన తప్పులు గ్రహించి సలహాదారులు యిప్పటికైనా నోరు మూస్తారని, చెవులు కొరకడం మానేస్తారని అనుకోవడానికి లేదు. అయినా చెప్పేవాడికి బుద్ధి

లేకపోతే వినేవాడికి వివేకం వుండాలి. రాహుల్ గాంధీగారికి బాబాయి సంజయ్ గాంధీ లక్షణాలు వచ్చినట్టున్నాయి. వెనక్కాల నుండి చక్రం మహ తిప్పేస్తున్నాడు. బిహార్‌లో కట్టిన బొప్పి తడుముకుని చూసుకుంటే కాస్త తమాయించేవాడు. కానీ దూకుడు ఎక్కువలా వుంది. ఆపరేషన్ ఆంధ్రప్రదేశ్ చేపట్టేశారు. ఆపరేషన్ సక్సెస్‌ఫుల్ అవునో కాదో కానీ పేషంట్‌ను మరణశయ్యమీదకు చేర్చారు. ఇలాటి పరిస్థితుల్లో కొత్త సిఎంగారు ఏం చేయగలరో, ఏం చేస్తారో అంతా అయోమయంగా అయిపోయింది.

చూదాం, కిరణ్‌కుమార్ రెడ్డిగారు ఎంత సమర్థవంతంగా నిభాయించుకు వస్తారో గమనిద్దాం. నా హయాంలో ఎన్నో కష్టాలు వచ్చాయి అని బాధపడుతూ వున్న రోశయ్యగారు ఇదంతా చూసి ఊరడిల్లి వుంటారు. హమ్మయ్య నా వారసుడికి నా కంటె ఎక్కువ యిక్కట్లు అని. జగన్‌కు మనసులోనే ధన్యవాదాలు అర్పించి వుంటారు. ఈ రాజీనామా ఏదో తనుండగా చేయనందుకు!
**– ఎమ్బీయస్ ప్రసాద్**

**నవంబరు 38** **ఎమ్బీయస్: పరధర్మో భయావహ :**

భగవద్గీత చెప్తుంది. స్వధర్మంలో చావైనా ఫర్వాలేదు కానీ పరధర్మానికి వెళ్లవద్దని. ఎందుకంటే పరధర్మం భయం కొల్పుతుందట. ఇక్కడ ధర్మం అంటే మతం అని కాదు. ప్రతివ్యక్తికి తనదైన ధర్మం వుంటుంది. వాళ్లు దానిలో రాణిస్తారు. త్రీ ఇడియట్స్ సినిమాలో ఓ కుర్రాడు చెప్తాడు – ''నాన్నా నేను మీ కోరిక ప్రకారం యింజనియర్‌నే అయితే ఓ థర్డ్ రేట్ యింజనియర్‌ని అవుతాను, కానీ నా యిష్టం ప్రకారం, నాకు నచ్చే వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్‌ను అవనిస్తే ఫస్ట్ రేట్ కాకపోయినా సెకండ్ రేట్ ఫోటోగ్రాఫర్‌నైనా అవుతాను'' అని. అక్కడ ఫోటోగ్రఫీ అనేది అతని స్వధర్మం. ఇంజనీరింగ్ అన్నది పరధర్మం. అందుకే అతను ఆ సబ్జక్ట్ అంటే భయపడుతూ, ముక్కుతూ మూలుగుతూ చదివి, అది వంటబట్టక తను అవస్థపడి, తలిదండ్రులను అవస్థ పెడతాడు.

మన చిరంజీవిగారికి స్వధర్మం నటన. పరధర్మం రాజకీయాలు అని నా అభిప్రాయం. సినిమారంగంలో అయితే ఆయన ఎంత కష్టాన్నైనా ఎదుర్కోగలరు. సిఫార్సులు లేకపోయినా పైపైకి, అగ్రస్థానానికి రాగలరు. నీ పాటలు, డాన్సులు ఎవరూ చూస్తారు, సిగరెట్టు కాల్చుకోవడానికి బయటకు పోతారు అని ఎద్దేవా చేసినా విపరీతంగా ప్రాక్టీసు చేసి కొత్తరకంగా డాన్సు చేసి మెప్పించగలరు. తెలుగు సినిమా రేంజ్‌ను పతాకస్థాయికి తీసుకెళ్లగలరు. తన రంగంలోకి వద్దామనుకున్న తన కుటుంబసభ్యులందరికీ చిరంజీవికి ఫలానా అనే విజిటింగ్ కార్డు చాలన్టే స్థాయిలో ప్రకాశించగలరు. స్వయంకృషితో పైకి వచ్చి, మంచితనంతో, వివాదరహితంగా, నిగర్వంగా అగ్రస్థానాన్ని నిలుపుకోగలరు, యువతకు ఆదర్శంగా నిలవగలరు.

ఇక రాజకీయాల్లో చూడబోతే మాత్రం అడుగడుగునా తప్పటడుగులే. నెలల తరబడి సమాజంలో వివిధ వర్గాలను సంప్రదించి నాగుబాబు తయారు చేసిన వేదికను వినియోగించుకోలేదు. విభిన్న తరహా రాజకీయాలు నడుపబోతున్నారని విద్యాధికులకు, యువతకు ఎన్నో ఆశలు కల్పించి, చివరకు అన్ని రాజకీయ పార్టీలలాగానే వ్యవహరించి నిరాశ కొలిపారు. ఏ అంశంపైన, ఏ సమస్యపైన ఆయన అధ్యయనం చేయలేదు, దృష్టి పెట్టలేదు. ఏదో పైపైన మాట్లాడడమే తప్ప అవగాహనతో, అంకితభావంతో మాట్లాడలేదు. ఊళ్లు పట్టుకుని తిరుగుతూ ఉపన్యాసాలు యివ్వడం తప్ప పార్టీ నిర్మాణం ఎలా వుండాలో తెలుసుకోలేదు. ఆచరించలేదు. తనపై ఆశలు పెట్టుకుని వచ్చిన మేధావులు విసిగి వెళ్లిపోతున్నా వ్యవహారశైలి మార్చుకోలేదు. కరకుగా చెప్పాలంటే రాజకీయాల్లో చిరంజీవిని చూస్తే ఎగ్జిబిషన్‌లో తప్పిపోయిన కుర్రాడిలా బిక్కమొహం వేసుకుని కనబడతారు. సినిమా రంగం నాటి విజేత చిరంజీవి రాజకీయాల్లో పరాజితుడు.

ఎన్నికల్లో పరాజయం పెద్ద విశేషం కాదు. ఆ మాటకొస్తే ఆయనకు వచ్చిన సీట్లు, ఓట్ల శాతం తక్కువేమీ కాదు. ఏం ఆశించి రాజకీయాల్లోకి వచ్చారో కానీ ఆ పాటి చిన్న పరాజయానికే ఆయన కృంగిపోయారు. నిరాసక్తత ఆయనను ఆవహించింది. పార్టీని నిర్మించే ఉత్సాహం ఆయనకు లేదు. జన్మభూమి వంటి కార్యక్రమాలు చేపట్టి, నవసమాజనిర్మాణంలో పాలు పంచుకోమని యువతను అడిగితే ఆయనకోసం కదలి వచ్చేవారు లక్షల్లో వున్నారు. కానీ ఆయన అలాటి పనేమీ చేయలేదు. మామూలు రాజకీయ పార్టీలాగానే ఏదో కాస్త నిరసన, గవర్నరు వద్దకు వెళ్లి నివేదిక యివ్వడం, టీవీ చర్చలకు తమ పార్టీ ప్రతినిథులను పంపడం.. యిదీ వరస. ఆయన ప్రామిస్ చేసిన మార్పు ఎక్కడా కనబడలేదు.

ఇలాటి పరిస్థితుల్లో వైయస్ పోయారు. బాబు వెలిసిపోయారు. వైయస్ వంటి జనాకర్షక నాయకుడు కనుచూపులో లేరు. అప్పుడు ఏర్పడిన శూన్యాన్ని భర్తీ చేసే అవకాశం చిరంజీవికి పుష్కలంగా వుంది. వైయస్ మొదలు పెట్టిన జలయజ్ఞం ప్రాజెక్టులను తన సారథ్యంలో యువత చేత శ్రమదానం చేసి పూర్తి చేయిస్తే చిరంజీవికి ఎనలేని ఖ్యాతితో బాటు ఖచ్చితమైన ఓటుబ్యాంక్ ఏర్పడేది. కానీ ఆయనకు అవన్నీ చేయడం బోరు. అసలు ఆయన టీవీ చర్చల్లో పాల్గొన్నదెక్కడ? తనకు విషయపరిజ్ఞానం వుందని చూపించిన దెక్కడ? తన ఆఫీసులో రాజకీయ సమావేశాల్లో నీరసంగా, నిరుత్సాహంగా, నిరాసక్తంగా, సోఫాల్లో బద్ధకంగా వాలి వున్నట్టు కనబడతారు. అదే సినిమా ఫంక్షన్లో అయితేనా? ఉత్సాహంతో ఉరకలు వేస్తూ వుంటారు. సరే, అవి వ్యక్తిగత యిష్టాయిష్టాలనుకోండి.

కానీ ఓ సారి రాజకీయాల్లోకి వచ్చాక సరైన సలహాలు తీసుకుని సరైన అడుగులు వేయాలి కదా! కాంగ్రెస్‌తో ఆయన స్నేహం చూడండి, ఎంత అపఖ్యాతి తెచ్చిపెట్టిందో! సాయం కావలసినవాళ్లు వాళ్లు, వాళ్లు అడగడానికి ముందే యీయన ఎగేసుకుంటూ ఢిల్లీ

వెళ్లడం దేనికి? అసలు కాంగ్రెస్‌లోనే పది గ్రూపులు. ఒక్కోళ్లు ఒక్కోలా మాట్లాడతారు. ఎవరిదో మాట నమ్ముకుని యీయన వెళ్లడం, కాంగ్రెస్‌వాళ్లు స్టేటుమెంటు యివ్వకుండా యీయనే తొందరపడి యిచ్చేయడం, చివరకు వాళ్లు అబ్బే ఏం లేదనడం! ఇదంతా అవసరమా?

ఆయనకు రాజకీయాలంటే విసుగుపుట్టి చుట్టచుట్టి అటకమీద పారేసి మళ్లీ తెరమీదకు వెళ్లిపోదామని చూస్తున్నారని చిన్నపిల్లాడిని అడిగినా చెప్తాడు. తనను నమ్ముకుని రాజకీయాల్లోకి వచ్చి డబ్బు ఖర్చు పెట్టి ఎన్నికలలో నెగ్గిన ఎమ్మెల్యేలకు ఓ ఆధారం చూపించి వెళ్లిపోదామని ఆయన ఉద్దేశం స్పష్టంగా కనబడుతూనే వుంది. తనను అల్లుకున్న తీగలను జాగ్రత్తగా విడిపించుకుని కాంగ్రెస్ మహావృక్షానికి అల్లించేసి వెళదామని చూస్తున్నారు.

కానీ ఆ క్రమంలో జగన్‌కు వ్యతిరేకంగా చేస్తున్నట్టు యింప్రెషన్ ఎందుకు కలిగించాలి? కాంగ్రెస్ జగన్ వివాదంలో తన పేరు వాడుకోవడాన్ని ఈయనెందుకు భరించాలి? జగన్‌ను చెక్ పెట్టడానికే చిరును తెస్తున్నారు అని ప్రచారంలోకి వస్తే జగన్‌తో కోరి వైరం తెచ్చుకున్నట్టు కాదా? రేపు రాజెవరో, రంగడెవరో ఎవడు చూడవచ్చాడు? కోరి వైరం తెచ్చుకోవడం ఏ కళాకారుడికీ, ఏ పెట్టుబడిదారుకీ మంచిది కాదు.

కాంగ్రెస్‌కు మద్దతు యిచ్చే విషయంలో చిరంజీవి తన ఎమ్మెల్యేల మనసు తెలియకుండానే ముందుకు వెళ్లిపోయారని మొన్న స్పష్టంగా తెలిసింది కదా! జగన్‌ను పార్టీలోంచి వెళ్లగొట్టాక మనం అతని వర్గం స్థానంలో దూరితే ప్రజల్లో చెడ్డపేరు వస్తుందని ఎమ్మెల్యేలు అన్నారట. మరి ఆ ఆలోచన చిరుకి రాలేదా? లేకపోతే హై కమాండ్ యిలా జగన్ కుటుంబాన్ని చీల్చి జగన్ బయటకు వెళ్లేట్లు చేస్తున్నామని ఆయనకు చెప్పలేదా? రెండోదే అయితే కాంగ్రెస్ చిరుకి యిస్తున్న విలువ ఏమిటో తెలుస్తోంది. కిరణ్ కుమార్‌కు చిరుతో చేతులు కలపడం యిష్టం లేదని, హై కమాండ్ చెప్పగా చెప్పగా తప్పదురా అని ఫోన్ చేశారని వార్తలు వచ్చాయి. అసలు కాంగ్రెస్ తరఫునుండి సహాయం కోసం బహిరంగ అభ్యర్థన లేకుండా ఈయనే బయలుదేరడం, ఆ తర్వాత తన టీము వద్దంటే నాలిక కరుచుకోవడం...అదేమైనా నాయకత్వ లక్షణమా? చిరంజీవి స్థాయి వ్యక్తి యిలా నగుబాటు కావడం దురదృష్టం కాదా?

'జరిగినదేదో జరిగింది, కాంగ్రెస్‌కు మద్దతు యివ్వం. మా సిద్ధాంతాలు మాకున్నాయి' అని చెప్పేసి తెర దించేయడానికి బదులు నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వుంటామన్న ప్రకటన ఎందుకు? ప్రభుత్వం కూలిపోతూ వుంటే కాపాడుతాం అని యిప్పుడే చెప్పాలా? చేసేదేదో అప్పుడే చేసి దాని మూల్యం వసూలు చేసుకోవచ్చు. కిరణ్ ప్రభుత్వం ఎలా వుండబోతోందో, ఆయన బాగా పాలిస్తాడో, లేదో తెలియకుండా ముందే చెప్పి చులకన కావడం దేనికి?

ఇవాళ మంత్రుల పేర్లు ప్రకటించారు కదా. కొత్తగా ఏం కనబడింది? అవే పాతమొహాలు. కిరణ్ తెచ్చే మార్పు ఏమీ కనబడలేదు. అంటే హై కమాండ్ ఆయన చేతులు కట్టేసి పాలించమంటోందన్నమాట! ఆయన పేరు ప్రకటించినపుడు నాలో కలిగిన ఉత్సాహం యీ రోజు కలగడం లేదు – ఈ మంత్రులు ఎంతబాగా పాలించారో, రాష్ట్రాన్ని ఏం ఉద్ధరించారో చూశాం కాబట్టి. కొత్తగా వచ్చిన శంకరరావు, డి ఎల్ రవీంద్రా రెడ్డి అర్హత – వైయస్‌ను తిట్టడం మాత్రమే! జానారెడ్డి హెూం మంత్రిగా బాగా చేసినా కెసియార్‌తో కలిసినప్పుడు ఆయన మాట్లాడిన భాష చూసి గౌరవం తగ్గింది.

ఇలాటి టీమ్‌తో కిరణ్ ఎలా పాలించినా సమర్థించి తీరతాననడం చిరంజీవి రాజకీయ దివాలాకోరుతనాన్ని సూచిస్తుంది. ప్రజలపై ఎన్నికలభారం పడకుండా రక్షిస్తారట. నిజమే ఎన్నికలభారం పడకుండా చూడడం మంచిదే. అలాగని ప్రభుత్వం ఎంత అసమర్థతతో పాలించినా సమర్థిస్తారా? పడకుండా నిలబెడతారట. ప్రజలు ఆయనకు ఓట్లు వేసినది యీ పని చేయమనేనా? ఇవన్నీ చూస్తే చిరంజీవి రాజకీయాల్లో ఎంత ఉతుకుప్టంగా ఫీలవుతున్నారో తెలుస్తోంది. ఆయన పరధర్మాన్ని చూసి భయపడుతున్నారు. ఎలాగైనా వదుల్చుకోవాలని చూస్తున్నారు. ఆగి ఆగి ఆచి తూచి రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ప్రజల్లో ఆశలు రేకొల్పారు. ఇక్కడ చెల్లుబాటు కాము అని తెలిసిపోతోంది కాబట్టి మర్యాదగా తప్పుకోవడం మంచిదనుకుంటూ ఈ రోజు అర్థాంతరంగా వదిలి వెళ్లిపోతున్నారు.

చిరంజీవి అంటే గౌరవం వున్న వ్యక్తిగా యిది నాకు సహించటం లేదు. ఆయన ఒక రంగంలో విజేత. ధర్మాన్ని మార్చుకుని పరధర్మానికి వచ్చిన తర్వాత దాన్ని చూసి భయపడకుండా దాన్ని కూడా జయించినప్పుడే, కనీసం జయించడానికి మనస్ఫూర్తిగా ప్రయత్నించినపుడే ఆయనను పరిపూర్ణ విజేతగా భావితరాలు గుర్తుంచుకుంటాయి. ధర్మం మార్చుకోవడం గురించి ప్రస్తావన వచ్చింది కాబట్టి నా గురించి కాస్త చెపుతాను. నేను స్వతహాగా బ్యాంక్ ఆఫీసర్ని. బ్యాంకింగ్ అనేది నా స్వధర్మం. అయితే నడివయసులో నా ధర్మాన్ని నేను మార్చుకుని వేరే ఫీల్డుకి వచ్చాను. "హాసం" మేనేజింగ్ ఎడిటర్‌గా, ఎడిటింగ్ బాధ్యతలతో బాటు మేనేజ్‌మెంట్ కూడా నిర్వహించాను. పెట్టుబడి నా మిత్రుడు వరప్రసాద్‌దే కావచ్చు. కానీ "హాసం"నే నా మనుగడ చేసుకున్నాను.

బాంక్ ఆఫీసరుగా వున్నపుడు కోటీశ్వరులు కూడా నేను ఆఫర్ చేస్తేనే నా ఎదుట సీట్లో కూర్చోగలరు. అటువంటి పదవికి రాజీనామా చేసి కుళ్లు కాలవ పక్కనున్న బడ్డీ కొట్టు యజమాని కిళ్లీ కడుతూ మధ్యలో యిచ్చిన షేక్‌హ్యాండ్ అందుకుంటూ "మా పత్రిక అందరికీ కనబడేట్లా కాస్త తగిలించండి" అని ప్రాధేయపడే పరిస్థితి ఎదుర్కున్నాను. కొత్త ఉత్పాదనను మార్కెట్ చేయాలంటే ఆ అవస్థ తప్పదు. అక్కడ నేను ఒకప్పటి బ్యాంక్ ఆఫీసర్‌ను అని పోజు కొడితే చెల్లదు. అంత కష్టపడినా "హాసం"కు పేరు వచ్చింది కానీ ఆర్థికంగా బలపడలేదు. 78 సంచికల తర్వాత ఆపేయవలసి వచ్చింది. ఇక ముందు ఏం చేయాలన్న ప్రశ్న ఎదురైంది. నాలో

వున్న క్రియేటివిటీని నమ్ముకుని ప్రస్తుతం చేస్తున్న పనిని ఎంచుకున్నాను. దీనిలో ఎంత విజయాన్ని సాధించానన్నది ఇప్పుడు చెప్పలేం. ఇంకో పదేళ్ల తర్వాత కూడా నా వర్క్ నిలబడితే నేను ఎంతో కొంత సాధించినట్టు లెక్క. ఇప్పటికీ బాంక్‌లో కొనసాగి వుంటే ఏ పోస్టులో వుండేవాణ్ని, ఎంత నిశ్చింతగా వుండేవాణ్ని అని నేను ఆలోచించను. అది గతం. దాన్ని కడిగేసి ముగ్గులు పెట్టేశాను. ఏరికోరి యీ వృత్తినే ప్రస్తుత స్వధర్మంగా ఎంచుకున్నాను కాబట్టి దీనిలోనే పైకి రావడానికి ప్రయత్నలోపం చేయకుండా అహరహం శ్రమిస్తున్నాను.

నా బోటి సామాన్యుడు అంతిమంగా జయించినా, విఫలమైనా జనాలకు తెలియదు. నన్ను చూసి ఎవరూ అనుకరించరు. నా జీవితం ఎవరికీ ఆదర్శం కాదు. కానీ చిరంజీవి వంటి ఒక సామూహికశక్తి ప్రయత్నలోపం వలన విఫలం కాకూడదు. ఆయన సిఎం అయితీరాలని నేననటం లేదు. ఆయనకు రాజకీయాల పట్ల శ్రద్ధ లేదని, శ్రమ పడటం లేదని కొట్టొచ్చినట్టు కనబడుతోంది. శ్రమ, శ్రద్ధ లేనిచోట విజయలక్ష్మి వరించదు. ఆయన వైఫల్యం ఆయనను ఆరాధించే యువతకు తప్పుడు సంకేతాలు పంపుతుంది. ప్రస్తుతం ఆయన అర్జంటుగా సినిమాల వైపు చూస్తున్నారు. అది సక్సెసవుతుందన్న గ్యారంటీ వుందా చెప్పండి. నూటికి 90 సినిమాలు ఫెయిలవుతున్నాయి. ఎంత గొప్ప హీరోలున్నా, ఎంత భారీగా తీసినా కొమరం పులి, ఖలేజా ఫెయిలయ్యాయి. ఠాగూర్ లాటి సినిమా తీస్తామని చరణ్ తేజ అంటున్నారు. మీరు తీయవచ్చు, జనాలు చూసి తీరతారని చెప్పగలరా? అయినా ఎన్ని ఠాగూర్లు తీయగలరు? కర్మం చాలక చిరంజీవి నటించిన సినిమా ఫెయిలయితే ఎంత ఎబ్బెట్టుగా వుంటుంది? చిరంజీవిని చూసి మురిసిపోయేవారి కంటె జాలిపడేవారే ఎక్కువై పోతారు. అది అభిలషణీయమా?

మంచికో, చెడుకో చిరంజీవి పరధర్మానికి వచ్చారు. దానికి దడిసిపోయి, దాని అంతు చూడకుండా, విఘ్నాయాస సంత్రస్తులైన మధ్యముల్లా వెనక్కి మరలడం మంచిది కాదు. వైకుంఠపాళి ఓపిగ్గా ఆడితేనే పరమపదానికి చేరతారు. మధ్యలో పామును చూసి భయపడుతూంటే కాస్సేపటికి నిచ్చెనలు కూడా పాముల్లా కనబడతాయి. చిరంజీవికి తనదంటూ వ్యక్తిగత యిష్టాయిష్టాలున్నా యింతమంది ఆరాధకులకు ఆదర్శమూర్తిగా అవతరించారు కాబట్టి యువతకు పాజిటివ్ దృక్పథాన్ని అలవర్చవలసిన ఒక సామాజిక బాధ్యత ఆయనకు వుంది. అది ఆయన విస్మరించరాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**డిసెంబరు 02** **ఎమ్బీయస్: అధిష్టానం ఓ అత్తగారు – 1**

మన కుటుంబాలలో అత్తగారి అథారిటీ గురించి వేరే చెప్పనక్కరలేదు. ఓ ముష్టాడు బిచ్చానికి వస్తే కోడలు పొమ్మందట. అత్తగారు అది విని ముష్టాణ్ని వెనక్కు పిలిచిందట. ఈవిడేమైనా వేస్తుందేమోనని వాడు ఆశగా తిరిగి వచ్చి ఐదు నిమిషాలు నిలబడ్డాడట. అప్పుడు అత్తగారు బయటకు వచ్చి 'ఇప్పుడు ఫో. పెట్టాలన్నా, పొమ్మన్నాలన్నా ఆ ముక్క నేను చెప్పాలి గానీ అదెవత్తి చెప్పడానికి..' అందిట! ఇదే తంతు మన కాంగ్రెస్ అధిష్టానంతో కూడా!

నిజానికి ఆ కోడల్ని ఆ అత్తగారు ఏరికోరి తెచ్చుకున్నదే. సమర్థురాలు, వంశాన్ని వృద్ధి చేయగలదు, కుటుంబం పేరు ప్రతిష్టలు నిలబెట్టగలదు అని నమ్మకం కుదిరిన తర్వాతనే కొడుక్కిచ్చి పెళ్లి చేసింది. అయినా సరే తాను వున్నంత కాలం ఆ సమర్థతంతా పక్కనపెట్టి తాను చెప్పినట్టు తలాడించాలి. స్వంత తెలివితేటలు ఉపయోగించరాదు. తనంటే భయభక్తులతో వుంటూ చచ్చినట్టు పడివుండాలి. తను ఆయ్ అంటే గజగజ వణకాలి. తనకు నచ్చని నిర్ణయమైనా సరే కోడలు స్వతంత్రించి (ముష్టాణ్ని పొమ్మనడం లాటిది) చేసిందో పెళ్లయిందే! అవతలివాడి ముందు పరువు తీసిందే! అడుగడుగునా తన అథారిటీ కనబరుస్తూనే వుంటుంది అధిష్టానం.

కొత్త సిఎంగా కిరణ్‌ని తీసుకుంది. 14 నెలల క్రితమే అనుకున్న పేరు. గత 6 నెలలుగా పెళ్లిచూపులు జరుగుతున్నాయి. సకల పరీక్షలు చేసి, సమర్థుడని తేల్చుకుని రోశయ్యగారిని అవమానకరంగా పక్కకు నెట్టేసి, నలుగురు ఢిల్లీ ప్రతినిథులను సిఎల్పీ మీటింగుకి పంపి, యీయన్ను గద్దెమీద కూర్చోబెట్టి ఇతను నా కాండిడేట్, ఏమైనా అడ్డుపడ్డారో, అతన్ని యిబ్బంది పెట్టారో ఖబడ్దార్ అనే హెచ్చరికను దయచేయించి, యిక చూసుకోండి మీ రాష్ట్రానికి పండగే పండగ అని ఉబ్బేశారు.

నా బోటి వాళ్లు రాష్ట్రానికి మంచి రోజులు వచ్చినట్టున్నాయి అని చంకలు గుద్దుకుంటూండగానే ఒక్కోటి బయటకు వచ్చాయి. కొత్త కోడలికి వాళ్లు యిచ్చిన ఎజెండా రాష్ట్రాన్ని ఎంత బాగా పాలించాలని కాదు, జగన్ ఉధృతిని ఎలా అరికట్టాలో చూడడం అని తెలిసిపోయింది. కిరణ్ ఆలోచనలన్నీ జగన్ చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. లేకపోతే జగన్ పార్లమెంటు నియోజకవర్గం నుండి ముగ్గురు మంత్రులేమిటండి? లోకమంతా గొడ్డుపోయిందా? జగన్‌ను, వైయస్‌ను తిట్టినవాళ్లను వెతికి పట్టుకుని పదవులు యివ్వడం తప్ప కిరణ్ పొడిచేసినదేముంది?

మాది ట్రాన్స్‌పరంట్ గవర్నమెంటు అని చెప్పుకున్న కిరణ్ అవినీతి, అసమర్థత అనే యిమేజి వున్నవాళ్లని తీసేయాలన్న చాదస్తం పెట్టుకోలేదు. కొత్తగా ఎన్నికైన 74 మంది యువ ఎమ్మెల్యేలలో ఎవర్నీ తీసుకోలేదు. కాబినెట్‌లో అవే పాత మొహాలు, రెడ్ల సంఖ్య పెంచడం తప్ప యీయన చేసిందేముంది? రెడ్లందరూ జగన్ వెంట వెళ్లిపోతారన్న భయంతో వాళ్లందరికీ పిలిచి పీట వేసినట్టయింది. బొత్స యిచ్చిన లిస్టు చూస్తే నిజమే అనిపిస్తుంది. వైయస్ కూర్చిన కాబినెట్‌లో బిసిలకు యిచ్చిన ప్రాముఖ్యతంతా కిరణ్ ఎగరగొట్టేసారు.

అన్నీ రెడ్లకు కట్టబెట్టారు. కులాభిమానం కాకపోవచ్చు. జగన్‌భీతి కావచ్చు. ఏమైతేనేం అందరికీ తప్పుడు సంకేతాలు వెళ్లాయి.

పొద్దున్న ప్రమాణస్వీకారం జరిగింది, సాయంత్రానికల్లా అసమ్మతి బావుటా ఎగిరింది. పోర్టుఫోలియోలు ప్రకటించగానే ఒక్కో వికెట్ పడిపోవడం మొదలైంది. ఎన్నడూ లేనిది పది పదిహేనుమంది మంత్రులు ఓ చోట గుమిగూడి రాజీనామాల గురించి సమాలోచనలు చేశారు. సాయంత్రం కాబినెట్ సమావేశం జరుగుతుందో లేదో తెలియదు. కిరణ్‌కు ఆదిలోనే హంసపాదు పడింది. తప్పు ఆయనది అనడానికి లేదు. హంసపాదు వేయించింది అధిష్టానం కాబట్టి. పరిగెట్టు, ఉరకలు, పరుగులు తీస్తున్న జగన్‌ను అందుకోవాలి అని ఓ పక్క హుషారు చేస్తూ మరో పక్క ఆయన కాళ్లకు, చేతులకు బేడీలు వేసిన అధిష్టానానిదే తప్పు.

అధిష్టానంతో చెప్తాను, శాఖలు మారుస్తాను, మొట్టమొదటి కాబినెట్ సమావేశానికి రండి బాబూ అని కిరణ్ అసంతృప్త మంత్రులతో మొత్తుకున్నా వాళ్లు వినలేదు. నీ మాటమీద మాకు నమ్మకం లేదు, అధిష్టానం వారే స్వయంగా మాతో మాట్లాడాలి అన్నారు. చివరకు కాబినెట్ సమావేశానికి ఎవరూ రావటం లేదు బాబోయ్ అని అధిష్టానంతో కిరణ్ మొర పెట్టుకుంటే అప్పుడు అహ్మద్ పటేల్, గులాం నబీ, మొయిలీ టెలి కాన్ఫరెన్సు నిర్వహించి 'మొదట సమావేశానికి రండి. తర్వాత మీ బాధలు తీర్చడానికి పైన కొండ మీద మేం వున్నాం కదా' అని హామీ యిచ్చాక అప్పుడు వీళ్లు కదిలారు.

దీనివలన తేలుతున్నదేమిటి? హై కమాండ్ అడుగడుగునా రాష్ట్ర వ్యవహారాల్లో కెలుకుతోంది. ఈ విధంగా వారే స్వయంగా మంత్రులతో మాట్లాడడం వలన ముఖ్యమంత్రి అథారిటీ అండర్‌మైన్ అవుతోంది. ఇక ఈయన్ని లక్ష్యపెట్టేదెవరు? ఎప్పుడైనా ఏ కంపెనీలో నైనా ఎండీ వచ్చి ఓ క్లర్క్‌తో చెప్పి స్వయంగా పని చేయించాడంటే యిక ఆ కంపెనీలో హెయిరార్కీకి నూకలు చెల్లినట్టే! రేపు ఆఫీసరు ఆ క్లర్క్‌ని ఏమయ్యా పని కాలేదా? అని అడిగితే 'ఎండీగారికి చెప్పానండి..' అంటాడు క్లర్క్. 'నీకు చెప్పేదేముందిలే, నీ పని చూసుకో చాలు' అనే అర్థంలో.

ఆ పని జరగకపోతే ఎండీగారు మళ్లీ అదే ఆఫీసరుని పిలిచి తిడతారు. 'పని చేయించలేక పోయేవేమ'ని. 'ఛానెల్సన్నీ బైపాస్ చేసి మీరే స్వయంగా డీల్ చేయడం మొదలెడితే మా మాట ఎవరు వింటారండి?' అని ఆఫీసరు ఎండీకి చెప్పలేడు. మౌనంగా తిట్లు పడతాడు. ఇలా ఏడాది పాటు తిట్టి తిట్టి ఆ తర్వాత 'వీడు అసమర్థుడండి. తీసేద్దాం, వేరే ఎవరినైనా చూడండి' అంటాడు ఎండీ, జనరల్ మేనేజర్‌తో.

2

ఇదే కథ జరిగింది – రోశయ్యగారితో. ఆయనను కాబినెట్ విస్తరించనీయ లేదు. వైయస్ తాలూకు మంత్రులు ఆయన అథారిటీని ప్రశ్నించినా, ఆయనను సిఎంగా గుర్తించం పొమ్మనమని అన్నా వాళ్లమీద చర్య తీసుకోనివ్వలేదు. 14 నెలల్లో కనీసం 14 సార్లు పుకార్లు వచ్చాయి – కాబినెట్ మారుస్తున్నారట అని. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ ఆశావహులు పుల్లారెడ్డి స్వీట్స్ కొనుక్కు పెట్టుకోవడం, రోశయ్యగారు తిరిగి వచ్చి పెదాలు చప్పరించడంతో అవి పనివాళ్లకు యిచ్చేయడం!

ఇప్పుడు హై కమాండ్ కిరణ్‌తో ఈ ఆట మొదలెట్టారు. జగన్‌ను ఏం చేశావ్, అతని పాప్యులారిటీని కుదించావా లేదా? అని రోజురోజూ ఫోన్లు చేసి చంపుకు తింటారేమో! అసలు పరిపాలన బాగా చేస్తూ వుంటే జనం దృష్టి జగన్‌వైపు ఎందుకు మరలుతుంది?

దుర్యోధనుడు చాలా గొప్ప రాజుట. ప్రజలు పాండవులను మర్చిపోవాలన్న లక్ష్యంతో చాలా చక్కగా పాలించేవాడట. అక్కడితో ఆగితే బాగుండును. కానీ అతనికి పాండవులంటే అబ్సెషన్. మాయాజూదంలో వాళ్ల రాజ్యం లాక్కుని అడవుల పాలు చేసినా, వాళు పదమూడేళ్లపాటు తిరిగి రారని తెలిసినా వాళ్ల ఆలోచన అతన్ని వదలలేదు. అజ్ఞాతవాసంలో వుండగా వాళ్ల గురించి వెతికి, వాళ్లను బయటపెట్టడానికి ఉత్తరగోగ్రహణం చేశాడంటే అర్థం వుంది.

కానీ అరణ్యవాసంలో కూడా వాళ్లు ఏం చేస్తున్నారో, ఏం తింటున్నారో చూద్దామని ఉబలాటం. ఆ ఉబలాటంతోనే ఘోషయాత్ర పెట్టుకోవడం, గంధర్వుడి చేతిలో ఓడిపోవడం, పాండవుల చేత రక్షింపబడడం, ధర్మరాజు చేత హితోక్తులు చెప్పించుకుని రావడం జరిగింది. దానిపై అవమానంతో రగిలి చివరకు కురుక్షేత్రం తెచ్చి పెట్టి జనక్షయానికి కారకుడయ్యాడు. అప్పుడు కూడా పాండవుల బంధువుల మీదే కన్ను. పాండవుల మేనమామ శల్యుణ్ని ఏమార్చి, ఆశ చూపి తనవైపుకి లాక్కువచ్చాడు. ఆ శల్యుడే సేనాధిపతి కర్ణుడి చావుకి కారకుడయ్యాడు. మరి పాండవ బంధువులను లాక్కుని వచ్చి దుర్యోధనుడు ఏం బావుకున్నట్టు?

మన అధిష్టానంది కూడా అదే తంతు. (వివేకానంద శల్యసారథ్యం చేస్తారో లేదో యింకా తెలియదనుకోండి) జగన్ పాటికి జగన్‌ను వదిలేస్తే అతను ఏదో ఒకటి అయ్యేవాడు. ఆ ఓదార్పు యాత్రను ఓ జిల్లాకు అనుమతించి, మరోదానికి అనుమతించక, ఎమ్మెల్యేలు వెళితే ఓ సారి వూరుకుని, మరోసారి వూరుకోక, వైయస్ చనిపోయినప్పుడు ఎవరూ పోలేదని అనిపించి, మళ్లీ పోయారని ప్రకటించి, ఆ యిచ్చేదేదో మేమే యిస్తామని మొదలు పెట్టి, నాలుగైదు జిల్లాలయ్యాక దాన్ని ఆపేసి... కంపు కంపు చేసుకున్నారు.

ఇప్పుడు కిరణ్‌కి కూడా ఆదేశాలిస్తారు కాబోలు – జగన్ చిత్తూరు జిల్లాకు వెళ్లినపుడే నువ్వూ వెళ్లు.అతను వైయస్ విగ్రహం పెట్టేసి వెళ్లిపోతే నువ్వు వెళ్లి రంగులేసేసి అది నేను పెట్టిందే అని చెప్పేసుకో.. యిలా! రోశయ్యగారు యిలాటి ఆదేశాలను తూచ తప్పకుండా ఆచరించి మెతకమనిషి అనిపించుకున్నారు. కిరణ్ భిన్నంగా వుంటాడని ఆశించాను కానీ అప్పుడే ఆ ఛాయలు కొద్దిగా

పొడసూపుతున్నాయి. దానికి నిందించాల్సింది అధిష్టానాన్నే! ఇలాటి అధిష్టానాన్ని ఎదిరిస్తాడనే జగన్‌ను నేను అభిమానిస్తున్నాను – ప్రస్తుతం! రేపు ఆయన వాళ్లతో రాజీపడి సాగిలపడితే ఈ అభిమానం అడుగంటుతుంది.

ఈ సందర్భాన్ని ఉపయోగించుకునే నా రాజకీయ యిష్టాయిష్టాల గురించి కాస్త చెపుతాను. నేను వైయస్ కుటుంబానికి వీరాభిమానినని, వాళ్ల 'పే రోల్'లో వున్నానని, వారి మోచేతి నీళ్లు తాగుతున్నానని కొందరు ఆరోపిస్తూ వుంటారు. 'తొందరపాటుతో ఏదో తీర్మానించుకోకండి, నేను రాసిన వాక్యాలను ఎత్తి చూపి ఫలానా చోట తర్కబద్ధంగా రాయలేదు అని చూపండి' అని జవాబిస్తూ వుంటాను. వాళ్ల మనసులో ఏదో పెట్టుకుని దాన్ని నాకు ఆపాదిస్తే నేను ఏమీ చేయలేను. తండ్రి శవం పక్కన పెట్టుకుని సిఎం పోస్టుకై జగన్ తాపత్రయపడడం జుగుప్సాకరంగా వుందనీ, సిఎంగా అతని కంటె రోశయ్య ఎంపికే కరక్టనీ, ఓ ఫ్యాక్షనిస్టు కొడుకైనప్పటికీ చదువుపై శ్రద్ధ పెట్టిన వైయస్ కొడుకై వుండి కూడా అన్ని అవకాశాలూ వున్నా విద్యాధికుడు కాలేదనీ.. యిలా జగన్‌పై నేను ఎన్నో విమర్శలు చేసినవి వాళ్ల కంటికి ఆనవు. అది వాళ్ల సమస్య, నాది కాదు.

రాజకీయంగా నేను అభిమానించే అంశాలు చెప్తున్నాను. గుర్తుంచుకోండి. ఇది యివాళ్టివి. ఎల్లకాలమూ యిలాగే వుండిపోదు. ఈ నాయకుల భవిష్యత్ ప్రవర్తన బట్టే నా అభిప్రాయమూ మారుతుంది. ప్రస్తుతం వున్నవారిలో నేను నాయకుడిగా ఎదగాలని కోరుకునేది చిరంజీవిని. ఎందుకంటే ఆయనకు అవినీతి ముద్ర లేదు. రాజకీయంగా గతం లేదు. ఎవరి ప్రాపు లేకుండా కష్టపడి పైకి వచ్చినవాడిగా, సౌమ్యుడిగా, పెద్దమనిషిగా, మంచివాడిగా పబ్లిక్‌లో గుడ్‌విల్ వుంది. ఉపకారి కాకపోవచ్చు కానీ ఎవరికీ అపకారం చేసినట్టు కూడా లేదు. పిసినారి కావచ్చు కానీ ఎదుటివాడిది కొట్టేసే లక్షణం కనబడలేదు. సినిమారంగంలో అహంకారంగా ప్రవర్తించలేదు, ఎవరితో పేచీ పడలేదు. మోహన్‌బాబు వంటి వారు ఎంత కవ్వించినా రెచ్చిపోలేదు. సినిమారంగంలో తారస్థాయికి వెళ్లి అక్కడ చాలాకాలం వున్నారు కాబట్టి ఆయనంటే పడిచచ్చేవాళ్లు లక్షల్లో వున్నారు. ఆ సైన్యంతో ఎన్నో మంచిపనులు చేయగల అవకాశం ఆయనకు వుంది.

ఇన్ని వుండి కూడా ఆయన పైకి రాలేకపోవడానికి కారణం ఏమిటంటే రాజకీయాలు అధ్యయనం చేయకపోవడం, ఉత్సాహంతో కార్యక్రమాలలో పాల్గొనకపోవడం. రాజకీయాలంటే ఊరూరూ తిరిగి ఉపన్యాసాలిస్తే చాలనుకుంటున్నారు. ఆయన చెప్పే ప్రసంగాలలో కన్విక్షన్ లేదు, అంకితభావం లేదు. తప్పనిసరి తద్దినం అన్నట్టు ప్రవర్తిస్తున్నారు. ఎలక్షన్లంటే ఏదో సినిమా రిలీజ్ అన్నట్టు చూస్తున్నారు. పైగా అల్లు అరవింద్‌పై ఆధారపడడం ఆయనకు ఒక పెద్ద గుదిబండ. ఈయన ఒట్టి అమాయకుడని, ఆయన గడసరి అని, ఈయన రాజైతే ఆయనే చక్రం తిప్పుతాడని అందరూ చెప్పుకుంటూ వుంటే ఈయన్ని నాయకుడిగా కాక తోలుబొమ్మగా చూస్తారు.

ఎన్టీయార్ సంగతి వేరు. ఆయన నటుడే కాదు, రచయిత, దర్శకుడు కూడా. సినిమా రంగంలో అన్ని కళలలోనూ ప్రావీణ్యం వుంది. చిరంజీవి ఒట్టి నటుడు మాత్రమే. తక్కినదేదీ రాదు. రాజకీయాల్లోనూ అలాగే వున్నారు. ప్రత్యేక తెలంగాణా అన్నారు, సామాజిక తెలంగాణా అన్నారు, బిసి సంక్షేమం అన్నారు, ఏది ఎలా చేస్తారో బ్లూప్రింట్ లేదు. ఇన్నీ చెప్పి, మేధావులలో, మధ్యతరగతి వర్గాల్లో ఆశలు రేకెత్తించి మామూలు పార్టీల కంటె అన్యాయంగా ఆఖరి క్షణంలో టిక్కెట్లిచ్చి, వాటిని మార్చేసి కంగాళీ కంగాళీ చేసేశారు. ఎందుకు మార్చారంటే రాత్రికి రాత్రి సర్వే చేయించామన్నారు. నవ్వుల పాలయ్యారు. ఈ రంగానికే కట్టుబడి తన లోపాలు సవరించుకుంటే చిరంజీవికి మంచి భవిష్యత్తు వుందని నా అభిప్రాయం.

3

ఇక లోకసత్తా జెపి. ఆయన మీద నా పాఠకులలో చాలామందికి అకుంఠిత విశ్వాసం, ఏదో చేసేస్తారని. ఆయన నిజాయితీని, విజ్ఞానాన్ని గౌరవిస్తాను కానీ నాకైతే ఆయన పార్టీ మీద నమ్మకం ఏమీ లేదు. రాసలీలలో కృష్ణుడిలా ఎక్కడ చూసినా ఆయనే కనబడితే క్యాడర్ ఎలా ఎదుగుతుంది? పైగా ఆయన చెప్పే ఆదర్శాలు ఆచరణయోగ్యంగా అనిపించవంటే తప్పు నాది కాదు, యీనాటి రాజకీయాలవి. మార్పు సాధ్యమే అని నాబోటి వాళ్లను నమ్మించాలంటే పంచాయితీ లెవెల్లో మొదలుపెట్టాలి. ఒక్కో పంచాయితీ, ఒక్కో మునిసిపాలిటీలో గెలుస్తూ వచ్చి వాళ్ల ఆదర్శాలను అమలు చేసి చూపించాలి. ఆ తర్వాత ఏ పదేళ్ల తర్వాతనో రాష్ట్రస్థాయిలో పోటీ చేయాలి.

ఈయన 2009లోనే ఏకంగా అసెంబ్లీకే పోటీ చేసి, తన అభిమానులను నిరాశ పరిచారు. ఆదర్శాలు ఎవరైనా వల్లిస్తారు, ఆచరణలో ఏం చేస్తారన్నదే చూడాలి. కాంగ్రెస్‌వాళ్లు ఎటువంటి పొరబాట్లు చేసినా సర్దుకుపోతాం, వాళ్ల తీరే అంత అని. కానీ లోకసత్తా వాళ్లు దానిలో పదోవంతు చేసినా ఫీలవుతాం. ఎందుకంటే వాళ్లు నీతులు చెపుతున్నారు కాబట్టి! జెపిగారు మార్గదర్శి విషయంలో వేసిన కప్పగంతుతో నాకు గౌరవం తగ్గింది. తర్వాత ఎలక్షన్ సమయంలో ఆఖరి నిమిషంలో విజ్ఞాన్ రత్తయ్యగారికి టిక్కెట్ యివ్వడంతో యీయనదీ కాంగ్రెస్ సంస్కృతే అనిపించేసింది.

అయితే ఆయనకున్న నాలెజ్ అపారం. ఆయన వద్ద ఆలోచనలున్నాయి. చిరంజీవి వద్ద అమలు చేయగల సైన్యం వుంది. వీళ్లిద్దరూ కలిస్తే బాగుంటుంది. ఇదీ నా భావన.

ఇక నా తరువాతి ప్రాధాన్యం టిడిపి. ఆ పార్టీ పుట్టిన దగ్గర్నుంచి నేను అభిమానిని. నా ఓటు ఎప్పుడూ వారికే. ఎన్టీయార్

అహంభావి కావచ్చు, నియంత కావచ్చు. కానీ ప్రజలకు ఏదో చేయాలన్న తపన కలవాడు. మేధావులను చేరదీసి, వాళ్లను ఇంప్రెస్ చేసి వాళ్ల చేత రాష్ట్రానికి సేవ చేయించినవాడు. కొత్తరకంగా ఆలోచించి, కొత్త పథకాలను పెట్టి, సమాజంలో అనేక వర్గాలను చైతన్యపరచి, అధికారాన్ని పంచి, తెలుగువారంతా ఒక్కటే అనే భావనను పెంపొందించి, భాషాభివృద్ధికి ఎంతో చేసినవాడు. జాతీయస్థాయిలో తెలుగువాడి బావుటాను ఎగరేసినవాడు. ఎన్నికల్లో ఓడిపోయినపుడు మళ్లీ సినిమారంగానికి పారిపోలేదు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యతలు నిర్వర్తించారు. లక్ష్మీపార్వతి అనే గ్రహణం పట్టకుండా వుంటే ఇంకో పదేళ్లు దుర్నిరీక్ష్యంగా వెలిగ్గివుండేవారు.

చంద్రబాబు వచ్చిన తర్వాత సిద్ధాంతాలలో షిఫ్టు వచ్చింది. ప్రాధాన్యాలు మారిపోయాయి. కర్షకపరిషత్తులు మూలపడ్డాయి ఫ్లయిఓవర్లు వెలిసాయి. గ్రామాలు పాడుపడ్డాయి. వ్యవసాయం దండగమారిదైంది. రాష్ట్రం అంటే ఓ కార్పోరేట్ అనీ, తను దానికి సిఇఓ అని చంద్రబాబు నమ్మి, మనల్నందర్నీ నమ్మించి, యిదే ప్రగతి, యిలాగే నడవాలి అని మనల్ని భ్రమింపచేశారు. కాబోలంటే కాబోలనుకున్నాం. హైదరాబాదులో అట్టహాసం చూసి రాష్ట్రమంతా యిలాగే వుందనుకున్నాం. ఉందని మీడియాచే చెప్పించారు.

అందుకే 2004లో కూడా టిడిపికే ఓటేశాను. కాంగ్రెస్‌కు ఓటేసినవారిని చూసి అసహ్యించుకున్నాను. తర్వాత గణాంకాలు బయటపడసాగాయి. అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం విషయంలో నెగటివ్ గ్రోతా? ఏమైనా అంటే కరువంటారా? అన్నీ బాగుంటే మీ ప్రజ్ఞేముంది? దశాబ్దాల పాటు కరువుండే రాజస్థాన్ వంటి రాష్ట్రాలు ఏం చేస్తున్నాయో చూసి అలా చేసి వుండాల్సింది. చంద్రబాబు గ్రౌండ్ రియాలిటీని విస్మరించారు. క్యాడర్‌ను అలక్ష్యం చేశారు. మంత్రివర్గ సహచరులు చెప్పినది పట్టించుకోలేదు. అన్నీ నాకే తెలుసు అని అహంభావంతో వ్యవహరించారు కాబట్టే ఓడిపోయారు.

ఓడిపోయాక ఆయన పరిస్థితి మరీ చెడింది. తను యిదివరకు తూష్ణీభావంతో చూసిన పోరాటపద్ధతులనే అవలంబించారు. నేను మారాను, మారాను అంటారు ఆ మార్పేమిటో ఆయనకూ, ఆయన పార్టీకి తెలియాలి. పోను పోను అసహనం మరీ పెరిగింది. ఎలాగైనా 2009 నాటి ఎన్నికలలో గెలవాలని తహతహ లాడారు. ఎన్టీయార్ విధానాలకు మంగళం పాడి రాష్ట్రవిభజనకు సై అన్నారు. అప్పుడే నాకు బాబు మీద గౌరవం తుడిచి పెట్టుకుపోయింది.

ఇంకా ఏమైనా అడుగూ బొడుగూ వుంటే ఆయన సిటియస్ పథకం (పనిచేయకుండా కాళ్లుచాపుకుని కూర్చుంటే 2 వేల రూ.లు యింటికి పంపించే పథకం) విన్నాక ఊడ్చి పెట్టుకుపోయింది. చేపను యివ్వడం కాదు, చేపలు పట్టే విద్యను నేర్పాలి అన్న చంద్రబాబంటే గౌరవం వుంది కానీ ఆల్ ఫ్రీ (కాంగ్రెస్ పావలా వడ్డీ అంటే పదిపైసల వడ్డీ అన్నాడు) బాబుపై గౌరవం లేదు. బాబు విస్మరించిన రైతులను ఆదుకునేందుకు జలయజ్ఞం పథకం పెట్టిన వైయస్‌కు, బాబు వదిలేసిన ఎన్టీయార్ సమైక్యవాదానికి నిలబడినందుకు (తన పార్టీ పరిమితుల్లోనే) వైయస్ అంటే గౌరవం పెరిగి ఆయన కోసమే 2009లో మొట్టమొదటిసారి కాంగ్రెస్‌కు వేశాను. 2014లో గాని, మధ్యంతర ఎన్నికలలో గాని కాంగ్రెస్‌కు ఓటేస్తానన్న నమ్మకం లేదు.

నేను యింకా టిడిపిని అభిమానిస్తాను. కాస్త పద్ధతి, క్రమశిక్షణ, క్యాడర్ వున్న పార్టీ అని. అయితే వాళ్లు తమ నాయకుణ్ని మార్చుకోవాలి. బాబు రిటైరయి పోవాలి. ఆయన స్థానంలో లోకేష్ వచ్చినా ఫర్వాలేదు. బాబు వ్యవహారశైలి యీ తరానికి పనికి రాదు. నాకే అన్నీ తెలుసన్న (తెలిసినా సరే) బింకం పనికిరాదు. జనంలో కలిసిపోవాలి. నాయకుడు మారితే టిడిపికి నేను ఓటేయవచ్చు.

4

ఇక తర్వాతి స్థానంలో జగన్. అతని గురించి నాకేమీ తెలియదు. అతని రాజకీయ అవగాహన ఎటువంటిదో, దృక్పథం ఎటువంటిదో, అనుభవం ఎటువంటిదో ఏమీ తెలియదు. తెలిసినదల్లా వైయస్ కుమారుడనే! వైయస్ ఫ్యాక్షనిజాన్ని వదిలేసినా యితనిలో తాతగారి పోలికలు వచ్చి ఫ్యాక్షనిజపు పోకడలు వున్నాయంటారు. ఎంతవరకు నిజమో, ఎంతవరకు అబద్ధమో తెలియదు. మనకు కనబడుతున్నదల్లా అతని దూకుడు, సాహసం.

సినిమానటుడు కృష్ణ నా దృష్టిలో పెద్ద నటుడు కాదు. ఆయన వేసిన వందలాది సినిమాల్లో ఆయన నటన నచ్చినది ఏ పదో, పదిహేను సినిమాల్లోనే! అయితే ఆయన సాహసం నాకు యిష్టం. ఆయన లేకపోతే తెలుగు సినీరంగానికి 'మోసగాళ్లకు మోసగాడు' వంటి విభిన్న తరహా సినిమా వచ్చేది కాదు. ఎంతసేపూ సెంటిమెంటల్ సినిమాల్లో పడి కొట్టుకుంటూ వుండేవాళ్లు. కృష్ణ లేకపోతే 'అల్లూరి సీతారామరాజు' వచ్చేది కాదు. అల్లూరిపై సినిమా తీస్తే ఆడుతుందా లేదా అని ఎన్టీరామారావుగారు గుణకారాలూ, భాగారాలూ వేస్తూ కూర్చునేవారు. ఆయన అలాగ లెక్కలు వేసి వేసి స్క్రిప్టులు 20 ఏళ్ల పాటు దాచి దాచి చివరకు ముదిమి వయసులో మూడు, నాలుగు పౌరాణిక సినిమాలు తీసి చేతులు కాల్చుకున్నారు.

అందువలన సాహసవంతులుండాలి. వాళ్లు సమర్థులు కానక్కరలేదు, ఎల్లవేళలా వాళ్లను విజయం వరించకపోవచ్చు. కానీ కొత్త రక్తం, ఉడుకురక్తం రావాలి. భగత్ సింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ను ఎదిరించడం ఆ రోజు చాలామంది హర్షించకపోయి వుండవచ్చు. గాంధీగారిని అందరూ సమర్థించలేదు. వీరేశలింగంగారిపై ఎంతోమంది విరుచుకుపడ్డారు. కానీ వాళ్లు పూనుకోబట్టే మార్పు వచ్చింది.

జగన్‌లో వీళ్లందరి లక్షణాలూ వున్నాయని నేను చెప్పటం లేదు. అతను మార్పు కోరుకోలేదు. వైయస్ యింకా పాలించాలని,

తను యువరాజుగా వెలగాలని కోరుకున్నాడు. వైయస్ పోయాక వేరే ఎవర్నీ తేకుండా తననే పెట్టాలని కోరుకున్నాడు. వైయస్ పథకాలలో మార్పు వుండకూడదని, ఆ యిమేజి మారకూడదని, ఆ అధికారం తనకు అలాగే అందిరావాలని కోరుకున్నాడు. అలా వచ్చి వుంటే అతనికి ఢిల్లీపాలనలో తప్పులు కనబడేవి కావు. కానీ అవేమీ జరగకపోయేటప్పటికి తిరగబడ్డాడు. ఆ తిరుగుబాటులో స్వార్థం వుంది. ప్రజాస్వామికంగా దక్కవలసిన అధికారం అనువంశికంగా దఖలు పడాలని కోరుకుని, అది జరగకపోవడంతో భంగపడి, ఆక్రోశపడి వీధిన పడ్డాడు.

ఈ క్రమంలో అతను అధిష్టానాన్ని ధిక్కరించాడు. ఆ ధిక్కారమే నాకు నచ్చింది. రాష్ట్రనాయకులు వట్టి పనికిమాలిన వాళ్లని, మేం పాలించకపోతే ఎందుకూ కొరగానివాళ్లని, తేలికభావంతో వుండే ఢిల్లీని గడగడలాడించిన ఎన్టీయార్ అంటే నాకు మహా ప్రీతి. మెహబూబాబాద్ సంఘటన రోజున ఆ అంశ జగన్‌లో కనబడింది. అందుకే మెచ్చుకున్నాను. అంతమాత్రం చేత ఎన్టీయార్ లక్షణాలన్నీ జగన్ పుణికి పుచ్చుకున్నాడని కాదు. ఆ మాటకొస్తే ఎన్టీయార్ సంతానంలోనే ఆ లక్షణాలు కనబడవు.

ఆ తర్వాత నుండి జగన్‌కి అధిష్టానానికి 'సీ సా' ఆట సాగింది. చివరకు జగన్ బయటకు వచ్చేశారు. జగన్ భవిష్యత్తు ఏమవుతుందో యిప్పటికిప్పుడు ఎవరూ చెప్పలేరు. అతను అర్జంటుగా సిఎం కావాలని కూడా నేను కోరుకోవడం లేదు. అతని రాజకీయవిధానం ఏమిటో తేలాలిగా! ఒకవేళ విధానం గొప్పదైనా అధికారం సాధించే సామర్థ్యం వుండాలిగా.

అతని పోరాట పటిమ చూసి నాలాగే కొందరు ముచ్చట పడితే ఆంధ్రప్రాంతంలో మూడోవంతు సీట్లు అంటే 60 సీట్లు దాకా అతను గెలుచుకోవచ్చు. ఎందుకంటే టిడిపికి బలం వుంది, కాంగ్రెస్‌కూ వుంది. ఈ 60 సీట్లతో అతను 294 సీట్ల రాష్ట్రానికి సిఎం కాలేడు. ఎవరినైనా సమర్థించగలడంతే! ఈ అంకె యివాళ్టిదనుకోవచ్చు. అది పెరగవచ్చు, దుస్సాహసం చేస్తే తరగవచ్చు, కిరణ్ బాగా పాలిస్తే కాంగ్రెస్ పుంజుకోవచ్చు, కాకపోతే టిడిపి పుంజుకోవచ్చు.

ఏదైనా యివాళే చెప్పడం కష్టం. ఒకటి మాత్రం ఖచ్చితం. రాష్ట్రంలో విస్మరించరాని శక్తి. అతని చేతిలో "సాక్షి" పేపరు, టీవీ ఛానెల్ వున్నాయి. టీవి ఛానెల్‌కు పెద్ద పాప్యులారిటీ లేకపోయినా పేపరు మాత్రం ఈనాడుకి దీటుగా నిలబడింది. ఈనాడు ఏకపక్షంగా చేసే వాదనలను సమర్థవంతంగా తిప్పికొడుతోంది. జగన్‌ను మొనగాడిగా ప్రొజెక్టు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో జగన్ ధైర్యాన్ని మెచ్చుకోవడం తప్ప అతనికి ఓటేస్తానని చెప్పను. అతని సిద్ధాంతాలు, కాండిడేట్లు ఎలా వుంటారో వేచి చూడాలి.

ఇక మిగిలినది కాంగ్రెస్. 2009 వరకు కాంగ్రెస్‌కి ఓటేయలేదు. ఆ ఏడాది కూడా వైయస్సార్ సమైక్యవాదం చూసి వేశాను. ఇకపై వేయను. తెలంగాణా అంశం విషయంలో కాంగ్రెస్ దాగుడుమూతలు చికాకు కలిగిస్తున్నాయి. హై కమాండ్ పోకడలు అసహ్యం వేస్తున్నాయి. కిరణ్ కుమార్ పనితీరుపై నా ఆలోచన ఆధారపడుతుంది. నిజాయితీపరుడు, ధైర్యవంతుడు అన్నారు. సంతోషించాను. కానీ అధిష్టానం చేతులు కట్టేస్తే ఎంతటివాడు మాత్రం ఏం చేయగలడు?

ఆయన మెతకతనం చూపిస్తే మాత్రం మోజు పోతుంది. ఢిల్లీని ఎదిరించి నిర్ణయాలన్నీ యిక్కడ తీసుకున్న రోజునే సిఎం అంటే గౌరవం పెరుగుతుంది. పరిస్థితుల ఒత్తిడి కొంత వుంటుందని అందరికీ తెలుసు. కానీ అదే పరిస్థితుల్లో ఒక్కొక్కరు ఒక్కోలా ప్రవర్తిస్తారు. రోశయ్యగారు కెరియర్ అంతా మంచి పేరు తెచ్చుకుని, చివర్లో మెతక మనిషిగా పేరుబడడానికి కారణం అధిష్టానం కొంత కారణమైతే, ఆయన మరికొంత కారణం. కిరణ్ తెగువతో వ్యవహరించి, జగన్ విషయం కొన్నాళ్లు మర్చిపోయి రాష్ట్రాన్ని బాగా పరిపాలిస్తే అప్పుడు పునరాలోచిస్తాను.

ఏతావాతే తేలేదేమిటంటే హై కమాండ్ అత్తగారిలా వ్యవహరించడం వల్లనే యింత అనర్థం జరుగుతోందని. అత్తగారిలా వ్యవహరించినప్పుడు పనులు ఎలా వుంటాయో పివిఆర్‌కె ప్రసాద్‌గారి పుస్తకంలో నుండి పివి నరసింహారావు గారినాటి సంఘటన ఒకదాన్ని తీసుకుని వివరిస్తాను.

## 5

అధిష్టానం ఎలా ప్రవర్తిస్తుందో 1973 నాటి ఉదంతం ఒకటి చెప్తున్నాను. ఇది పివిఆర్‌కె ప్రసాద్‌గారు రాసిన 'అసలేం జరిగిందంటే..' అనే పుస్తకం నుండి తీసుకుని రాస్తున్నది –

'1972 అక్టోబరు చివరల్లో ఎయూ, ఎస్‌వియూ విద్యార్థుల సభ నిరవధిక సమ్మెకి పిలుపు నివ్వటంతో ఆరంభమైన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం 1973 వచ్చేసరికి పతాకస్థాయి చేరుకుంది. నెలల తరబడి విద్యార్థులు క్లాసులు బహిష్కరించారు. ఎన్‌జిఓలు ఆఫీసులకు వెళ్లడం మానేశారు. న్యాయవాదులు కోర్టుల్ని బహిష్కరించారు. రైళ్లు, బస్సులు ఆగిపోయాయి. (అప్పటి మంత్రి మజ్జి తులసీదాసుగారు తమ శ్రీకాకుళం జిల్లా వెళ్లటానికి హైదరాబాదు నుండి రైల్లో నాగపూర్– రాయపూర్ మీదుగా వెళ్లాల్సి వచ్చింది) ఒక ఊరినుండి మరో వూరికి వెళ్లాలంటే నడిచి వెళ్లాలి లేదా ఎడ్లబండి మీద వెళ్లాలి. లారీలు చెదురుమదురుగా నడిచినా దారిలో జై ఆంధ్ర కార్యకర్తలకి 'విరాళాలి'చ్చుకుంటూ వెళ్లాలి. (డిసెంబరు 31 తర్వాత రాష్ట్రంలో కొంతభాగంలో యీ పరిస్థితి వస్తుందేమోనని భయం వేస్తోంది)

ఆ టైములో పివి నరసింహారావుగారు ముఖ్యమంత్రి. పివిఆర్‌కె ప్రసాద్‌గారు ఆయన వద్ద కార్యదర్శిగా చేసేవారు. పివి కాబినెట్‌లో

కొంతమంది బయటకు వచ్చి అల్లర్లు, అలజడి చేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడాలంటే వెంటవెంటనే నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం వుంది. తెన్నేటి విశ్వనాథం, కాకాని వెంకటరత్నం – యిలాటి వారిని, విద్యార్థి నాయకుల్ని ఎరెస్టు చేయడానికి పోలీసులకు ఫ్రీ హేండ్ యివ్వాలి. ఇవ్వాలంటే సిఎం ఆదేశాలు యివ్వాలి. కానీ ఆయన యివ్వటం లేదు.

ప్రతిరోజూ చీఫ్ సెక్రటరీ వికె రావుగారు, ఐజీ నారాయణరావుగారు, ఇంటెలిజెన్సు ఐజీ, పొలిటికల్ సెక్రటరీ వచ్చి సిఎంగారికి పరిస్థితి చేయిదాటిపోతోందండోయ్ అని చెప్పడం, సిఎం గారు కాస్త ఆలోచించి 'సరే, రేపు నిర్ణయం తీసుకుందాం' అని చెప్పి వాళ్లని పంపించేయడం జరుగుతోంది. ఇలా నాలుగు రోజులు గడిచాయి. సిఎంగారు ఏమీ తేల్చరు. అవతల పుట్టి మునుగుతోంది. ఐదోరోజు పొద్దున్న వీళ్లందరూ వచ్చి ప్రసాద్‌గారి గదిలో కూచున్నారు. సిఎంగారి గదిలో పదిమంది మంత్రులు, సీనియర్ లీడర్లు ఉదయం నుంచి వచ్చి కూచున్నారు. వెళ్లేవాళ్లు వెళ్తున్నారు, వచ్చేవారు వస్తున్నారు. వాళ్లు వస్తే వీళ్లని పంపాలి.

కాచుకుని కూచున్నపుడు వీళ్లందరూ వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటున్నది ప్రసాద్‌గారు విన్నారు – 'ఇలా అయితే కష్టమే. వందమందినైనా నాలుగురోజుల క్రితమే అరెస్టు చేసి వుండాల్సింది. లిస్టు సిఎంగారి దగ్గర పెండింగులో వుంది. జిల్లాల్లో అధికారులు అశాంతిగా వున్నారు. కంట్రోలు చేయలేమంటున్నారు. ఏదైనా జరిగితే అది కూడా సిఎం గారిమీదకు వస్తుంది. రేపు రేపు అంటున్నారు. ఇవాళ నిర్ణయం తీసుకోకపోతే రేపు నిర్ణయం తీసుకోవడానికి ఆయన ఆ పదవిలో వుండొద్దూ?..రాష్ట్రపతి పాలన వస్తుందంటున్నారు. ఇక అప్పుడు ఆయన నిర్ణయం ఎటూ తీసుకోనక్కరలేదు..'

ప్రసాద్‌గారు చెప్పగా చెప్పగా చివరకు పివి గారు విసుగ్గా తనే యీ ఆఫీసర్లు కూర్చున్న ప్రసాద్‌గారి గదికి వచ్చారు. అవతల నాయకులు ఎంతకీ వదలటం లేదని యిలా వచ్చారన్నమాట. వీళ్లంతా చెప్పినది విని 'సరే రేపు నిర్ణయం తీసుకుందాం' అన్నారు. అది వింటూనే అధికారులు ఏమనాలో తెలియక నిశ్శబ్దమై పోయారు. అప్పుడు ప్రసాద్‌గారు ఏదో ఆవహించినట్లు – 'ఇవాళ నిర్ణయం తీసుకోకపోతే, రేపు నిర్ణయం తీసుకోవడానికి మీరు సిఎంగా వుండకపోవచ్చనుకుంటున్నారు సార్ వీళ్లు..' అనేశారు. చీఫ్ సెక్రటరీ ప్రసాద్‌గారి చేయి నొక్కి ఆపాలని ప్రయత్నించినా లాభం లేకపోయింది.

అంతా విని పివిగారి ముఖం పాలిపోయింది. తమ మాటలు ఆయనకు తెలిసిపోవడంతో అధికార్లందరూ చేష్టలుడిగి వుండిపోయారు. అలా కొన్ని క్షణాలు గడిచాక పివిగారు ప్రసాద్‌గార్ని 'ప్రసాద్ నాతో రా' అంటూ మేడపైన ఆయన పడకగదిలోకి తీసుకెళ్లి 'వాళ్లేమనుకుంటున్నారో వివరంగా చెప్పు' అన్నారు. ఈయన చెప్పేశారు. అప్పుడు పివిగారు తన ఆవేదనను ఆయనతో పంచుకున్నారు –

''నాకూ తెలుసు, వీళ్లంతా మన మంచికే చెపుతున్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం శాంతిభద్రతలకు ఎంతైనా అవసరం. మూడు రోజుల క్రితమే చేయవలసినది. కాని నేనేం చేయను? హై కమాండ్ నుండి ఆదేశాలు లేవు. గంట గంటకు మాట్లాడుతున్నాను. ఆ మహాతల్లి (ఇందిరా గాంధీ) ఎప్పుడోగాని డైరక్ట్‌గా మాట్లాడదు. చుట్టుపక్కల వాళ్లకి చెప్తే 'తొందరపడొద్దు, ఆవిడకు చెప్పాం, వెయిట్ చేయమంటున్నారు' అంటున్నారు. అరెస్టు చేయాలని మూడురోజుల క్రితమే చెప్పాను. అరెస్టు చేయవలసిన వారంతా కాంగ్రెస్ నాయకులే. విశ్వనాథంగారు నాకు చాలా స్నేహితుడు కూడా. అయినా నేను నిర్ణయం తీసుకుని, ఇది రాజకీయవిషయం కనుక ఆవిడ క్లియరెన్సు కోసం ఎదురు చూస్తున్నాను...'

'...రాష్ట్రపతి పాలన విధించేముందు శాంతిభద్రతల వైఫల్యం కారణం చెప్పి, మీరేమీ చర్య తీసుకోలేదని బాధ్యత అంతా మీపైన వేయవచ్చుగదా సర్'

'తప్పకుండా వేస్తారు. హై కమాండ్ ఎప్పుడూ తప్పుచేయదు. తప్పు జరిగినప్పుడల్లా నాబోటివాడెవడో ఒకడుంటూనే వుంటాడు.'

'మరి మీకు ఉచితమనుకున్న నిర్ణయం మీరు తీసుకోవచ్చు కదా సర్'

'రాజకీయబలం, స్తోమత వుంటే తీసుకోవచ్చు. నామినేటెడ్ ముఖ్యమంత్రుల పని హై కమాండ్ చెప్పినట్టు చేయడమే. ఏదైనా తప్పు జరిగితే బాధ్యత తీసుకోవడమే.. అంతే' అని వేదాంత ధోరణిలో అన్నారు పివి.

స్వర్ణాక్షరాలతో చెక్కదగిన మాటలివి. ప్రస్తుతం బంగారం ధర పెరిగిపోవడం వలన జస్ట్ బోల్డు చేసి వదిలేస్తున్నానంతే!

## 6

అత్తగారు ఎప్పుడూ తప్పు చేయదు. ఆవిడ కుండ పగలుకొడితే చేజారిపోయినట్టు లెక్క. అదే కోడలు చేతిలో పగిలితే అది పొగరుబోత్తనంతో, అత్తగారి మీద అక్కసుతో కావాలని పగలకొట్టినట్టు లెక్క. హై కమాండ్ తప్పు చేయదు, చేయలేదు. తప్పు జరిగితే సిఎంగారిదే బాధ్యత. మంచి జరిగితే అవన్నీ హై కమాండ్ వారి దూరదృష్టివలన, వారిచ్చిన స్ఫూర్తి వలన, గైడెన్సు వలన జరిగినట్టు!

పివిఆర్‌కె చెప్పినది 1972 నాటి కథ. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత కూడా యిదే కథ నడుస్తోంది కదా. ఇవాళ రోశయ్యగారు ఎచ్ఎంటివిలో 'మనసులో మాట' చెపుతూ ''ఎస్సయి రిక్రూట్‌మెంట్ పరీక్ష జరపడం న్యాయం. హైదరాబాదులో రిక్రూట్‌మెంట్ జరగనప్పుడు, తక్కినవారికి పరీక్ష జరిపి తీరాలి. అదే విషయం నచ్చచెప్పడానికి చూశాను. కానీ పరీక్ష వాయిదా వేశాం. నాకు తెలిసి నేను చేసిన పెద్ద తప్పు ఏదైనా వుందంటే అది వాయిదా వేయడమే!'' అని చెప్పారు. అంటే ఆయన మీద హై

కమాండ్ ఒత్తిడి వచ్చిందనే అర్థం కదా.

కిరణ్‌ను సిఎం చేసినపుడు నేను రాసిన వ్యాసంలో – ''నాకు రోశయ్యగారి మీద గౌరవం వుంది కానీ మొన్నటి ఎస్సయి పరీక్షలు వాయిదా వేయడంతో దెబ్బకు తుడిచి పెట్టుకుపోయింది. వాయిదా వేస్తే ఎన్ని యిబ్బందులు వున్నాయో ఆయనే స్వయంగా చెప్పి గంటలు గడవకుండా వాయిదా వేసేశారు. పైనుంచి ఆజ్ఞ వచ్చిందనే అనుకుందాం. అప్పుడయినా ఆయన చెప్పాలి – 'లేదు, అది అధర్మం. నేను వాయిదా వేయను. దానివలన ఏదైనా పరిణామాలు వస్తే నేను ఎదుర్కుంటాను' అని. అది చెప్పలేకపోతే ఆయన సీటులో వుండడం దండగ అనిపించింది.'' అని రాశాను.

ఆయన సీటులో వుండడం దండగ అని నేననుకోవడంలో అర్థం వుంది. నేను అనుకున్న ప్రకారం ఆయన ప్రవర్తించలేదు కాబట్టి. కానీ తమాషా ఏమిటంటే హై కమాండ్ కూడా అలాగే అనుకుంది – వాళ్లు అనుకున్న ప్రకారం ఆయన ప్రవర్తించినా! విచిత్రంగా లేదూ?. ఇది జరిగిన కొన్ని రోజులకే ఆయనను తీసేసింది. ఆయనకు ఆయన హఠాత్తుగా వార్ధక్యం, అనారోగ్యం అన్నీ గుర్తుకు వచ్చేట్లా చేసింది. నాకు ఓపిక లేదు అని చెప్పించింది.

దిగిపోయాక ఆయన రోజుకో ఫంక్షన్‌కు వెళ్తున్నారు. మరి ఓపికెలా వస్తోందో? అంటే యిదంతా హై కమాండ్ నాటకం. తీసేయాలనుకున్నపుడు ఎంత అవమానకరంగా తీసేశారు! సోనియా ఎపాయింట్‌మెంట్ యిచ్చిందో లేదో కూడా తెలియనంత నాటకం. మొన్నటిదాకా రోశయ్యాజీ ఎంతో కష్టపడుతున్నారు పాపం అని జాలిపడినట్టుగా వార్తలు. హఠాత్తుగా ఆయన అంటరాని వ్యక్తి అయిపోయారు.

'ఇప్పటిదాకా సిఎంగా చేశారు కదా, మన పార్టీవాడే కదా, ఎవరి సామర్థ్యం ఏమిటో, ఎవరి లోపాలేమిటో, ఇన్నేళ్లుగా కాబినెట్‌లో వున్న రోశయ్య గారితో సంప్రదించి కాబినెట్ కూర్చుకో' అని కిరణ్‌కు అధిష్టానం చెప్పిందా? లేదే! రోశయ్యెవడు చెప్పడానికి, మేం వున్నాంగా అన్ని రకాల గైడెన్సులు, డైరక్షన్లు యివ్వడానికి అని అహంభావం. మీరు సక్సెసయితే మీ గైడెన్సు గొప్పదని ఒప్పుకుంటాం. కానీ ప్రతీవాణ్నీ ఎందుకూ పనికిరానివాణ్నిగా చేస్తున్నారే! అదీ మా బాధ.

ఉత్తరోత్రా దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేసి, అతి సమర్థుడైన పిఎంగా పేరు తెచ్చుకున్న పివిగారు అసమర్థ సిఎంగా పేరు బడ్డారంటే తప్పు ఆయనదా? లేక అధిష్టానందా? ఆయన అసమర్థుడు కాడు, అధిష్టానమే ఆయన్ను అసమర్థుణ్ని చేసింది. అదీ మనం గ్రహించాలి.

నలభైయేళ్ల క్రితం జరిగినదే యిప్పుడూ జరుగుతోంది. రోశయ్యకు 'ముసలివాడు, చేతకానివాడు' అని స్టాంపు కొట్టి పక్కకు తోసేశాక కిరణ్‌ను పట్టుకొచ్చారు. కిరణ్ రాగానే నా బోటివాళ్లు చాలా ఆశపడ్డారు, శాంతిభద్రతలు అదుపులోకి తెచ్చి రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారని. కానీ ఏదీ, ఆ ఆశను మొగ్గలోకి తుంపేశారు. కొత్త సిఎం వచ్చిన వారం రోజుల దాకా చాలామంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయనేలేదు. ఇది స్పీడు యుగం. ప్రపంచం ఎంత వేగంగా పరిగెడుతోందంటే గంటల్లో నిర్ణయం తీసుకోవాలి. అలాటిది వారం రోజులైనా మంత్రులు సీటుల్లో కుదురుకోలేదు. ఓ పక్క వానలొస్తున్నాయి. ఎన్ని ఊళ్లు మునుగుతాయో, ఎన్ని రోడ్లు కొట్టుకుపోతాయో తెలియదు. మంత్రులంతా ఢిల్లీలో కూచున్నారు. గదులు నచ్చలేదని, ముహూర్తం కుదరలేదని బాధ్యతలు తీసుకోలేదు. ఎందుకు తీసుకోలేదని అడగడానికి సిఎం గారు మాత్రం యిక్కడుంటేనా? కాబినెట్ కూర్పు అంటూ కొన్ని రోజులు, మార్పులంటూ కొన్ని రోజులు, బుజ్జగింపులంటూ మళ్లీ.. ప్రస్తుతం ఢిల్లీలోనే వున్నారు.

మంత్రులు లేకుండా అధికారులు నిర్ణయాలు తీసుకుంటారా? అందునా శంకర్రావు లాటి మంత్రులుండగా! ఏమిటండీ ఆ శంకర్రావు? తనకు కావలసిన చాంబర్ ఎలాట్ చేయలేదని సీనియర్ ఐయేయస్ ఆఫీసర్ గోనెల గార్ని బూతులు తిడతాడా? ఆయన వాలంటరీ రిటైర్‌మెంట్ అడిగేటంత మనస్తాపం చెందే లెవెల్లో తిడతాడా? ఇలా అయితే అధికారులెవరైనా కొత్త ప్రభుత్వానికి సహకరిస్తారా? ప్రభుత్వం సక్రమంగా నడిచేనా?

అసలు యీ శంకర్రావుగారికి కావలసినది వైద్యశాఖట. మొన్నో ఫంక్షన్లో 'దేవుడే వైద్యుడు' అని అనవసరంగా మాట్లాడి గవర్నరుగారి చేత తలారా చివాట్లు తిన్నాడు. ఇటువంటి 'ప్రజ్ఞావంతుడు' ఎందుకు మంత్రిగా సెలక్టయ్యాడంటే వైయస్‌పై నోరు పారేసుకున్నాడు కాబట్టి! నిజానికి కాబినెట్ కూర్పు అంతా యిలాటి సిల్లీ కారణాలమీదనే జరిగింది. వైయస్‌ను తిట్టగలరా? జగన్‌ను అరికట్టగలరా? అనే లెక్కలు. సమర్థుడు, నిజాయితీపరుడా – యిటువంటివాటి గురించి ఆలోచించినవాడే లేడు.

జగన్‌ను అణచాలంటే రెడ్లను తీసుకుని వచ్చి అందలం ఎక్కించాలి అన్న ఏకైక అభిప్రాయంతో రెడ్లకు పెద్దపీట వేశారు. మామూలు పెద్దది కాదు, తక్కినవాళ్లందరికీ చిన్న పీటలు కాదు కదా చింకి చాపలు కూడా వేయనంత!

7

బొత్స సత్యనారాయణ వాదనకు కౌంటర్‌గా కిరణ్ గత కాబినెట్‌లో వున్న కులాల సంఖ్యకు యీ కాబినెట్‌లో సంఖ్యకు పెద్ద తేడా లేదని వాదిస్తున్నారట. అన్నిరకాల మంత్రిత్వ శాఖలను కలిపి లెక్కవేస్తే కుదరదు, కీలకమంత్రిత్వ శాఖలనే లెక్కలోకి తీసుకుని వెయ్యాలి అని బొత్స సమర్థవంతంగా వాదించి, 'ఈ సిఎం రెడ్డి పక్షపాతి' అన్న ముద్ర బాగా నాటుకునేట్లు చేశారు.

ఇంకో పక్కనుండి రాయపాటి అందుకుని 'కమ్మలు ఎలా పోయినా మాకు లెక్కలేదు అని కాంగ్రెస్ చాటి చెప్తోంది' అని నమ్మదగే వాదన వినిపిస్తున్నారు. 'టిడిపి ప్రభుత్వంలో పదిమంది దాకా రెడ్లు వుండేవారు. కమ్మ పార్టీ అని పేరు పడినా బిసిలను, యితరులను కూడా కలుపుకు పోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ అలాటి ప్రయత్నం చేయడం లేదు' అంటున్నారు విశ్లేషకులు.

రెడ్లు ఒక్కరే మాకు ఓట్లేస్తారు, వాళ్లకు సేవ చేయడానికే మేం వున్నాం, తక్కినవారు ఎలా మట్టికొట్టుకుపోయినా ఫర్వాలేదు అనే సందేశాన్ని ప్రస్తుత సిఎం యిస్తున్నట్టుగా అందరూ భావిస్తున్నారు. ఇది ఆత్మహత్యాసదృశమైనది. జగన్ వెంట రెడ్లందరూ వెళ్లిపోతారన్న భయంతోనే యిలా చేసి వుంటే అంతకంటె హాస్యాస్పదమైనది మరోటి వుండదు. అవతల జగన్ వెంట తిరిగే ముఖ్యులలో అంబటి రాంబాబు, సబ్బం హరి, కొండా సురేఖ, గోనె ప్రకాశరావు – వీళ్లెవరూ రెడ్లు కాదు. మాకినేని పెద రత్తయ్యను తన పార్టీలోకి ఆహ్వానించి గుంటూరు జిల్లా మీరు చూసుకోండి అని జగన్ అంటున్నారని వార్తలు వస్తున్నాయి. అంటే జగన్ అందర్నీ కలుపుకు పోతూ వుంటే, వీళ్లు మాత్రం జగన్ ఫోబియాతో రెడ్లనే పట్టుకుని వేళ్లాడి, తమ గొయ్యి తామే తవ్వుకుంటున్నారన్నమాట.

వీటినిపట్టి కిరణ్‌గారు రెడ్డి పక్షపాతి అని అనవచ్చా? అన్న ప్రశ్న సహజంగా వస్తుంది. ఇంగ్లీషులో ఓ సామెత వుంది. జస్టిస్ నాట్ ఓన్లీ షుడ్ బి డన్, బట్ షుడ్ ఎప్పియర్ టు బి డన్ ఆల్సో అని. న్యాయం జరగగానే సరికాదు, న్యాయం జరిగినట్లుగా కనబడాలి కూడా. పాలు యిచ్చేటప్పుడు నవ్వుతూ యివ్వకపోతే పాలలో ఏమైనా కలిపారేమో అని అనుకునే ప్రమాదం వుంది. తాటిచెట్టు కింద కూచుని పాలు తాగినా కల్లు తాగాడను కుంటారనుకుంటారని సామెత.

ఈ మధ్య పెద్ద ఎడ్మినిస్ట్రేటర్ ఒకాయన చెప్పారు – 'ఉద్యోగస్తుల్లో ఏదైనా ఒక టీమును ఫారిన్‌కో, ట్రెనింగ్‌కో పంపాలనుకోండి. అప్పుడు పూర్తిగా మెరిట్ ప్రకారమే జాబితా తయారుచేసుకోవాలి. అది మొదటి అడుగు. తర్వాతి దశలో ఆ టీమును అన్ని కోణాలనుండి పరిశీలించాలి. దానిలో మహిళలు వున్నారా లేదా? (ఒకరే వుంటే యింకోర్ని చేర్చాలి, మన భారతీయ సంప్రదాయ ప్రకారం ఒక్కత్తే మహిళను యింట్లోవాళ్లు పంపించరు) అన్ని కులాలవారూ ఉన్నారా లేదా? (ఎవరైనా ఆ కోణంలో నుండి చూసి అందరూ ఒకే కులం వాళ్లనో మరోటో ఎత్తి చూపవచ్చు) అన్ని ప్రాంతాలవారూ ఉన్నారా లేదా? అందరూ సీనియర్లే వున్నారా? జూనియర్లు ఒకరిద్దరైనా వున్నారా లేదా? అందరూ ఒకే ఆఫీసు వాళ్లా? ఇటువంటి కోణాల్లోంచి చూసుకుని మార్జిన్‌లో వున్నవారిని కలపడమో, తీసివేయడమో చేయాలి. ఇదే ఫైన్ ట్యూనింగ్. మొదటే యీ లెక్కలు వేసుకుని మెరిట్‌ను బలిచేయకూడదు. అలాగే నాకు మెరిటే ముఖ్యం, యివన్నీ పట్టించుకోను అన్నా కుదరదు. తీసివేసేవారు గాని, కలిపేవారు గాని మార్జిన్‌కి మరీ దూరంగా వుండకూడదు. ఉంటే వదిలేయడమే! ఆ కోణంలో లోపం వుంటే వుంటుంది, ఏం చేయలేం! ఇదీ నా ఫిలాసఫీ' అన్నారు.

న్యాయం జరిగినట్టు కనబరచడం వలన జరిగే మేలు గురించి చిన్నప్పుడు ఓ కథ చదివాను. ఓ మునసబుగారు ఓ రాత్రి కరణం గారింటికి వెళ్లారు. కరంటు లేని రోజులవి. ఆయన ఓ కొవ్వొత్తి పెట్టుకుని రికార్డులు రాసుకుంటున్నాడు. ఈయన్ని చూడగానే రండి రండి అంటూ ఆ కొవ్వొత్తి ఆర్పేసి, ఇంకో కొవ్వొత్తి వెలిగించాడు. మునసబుగారు అడిగాడు – 'ఆ కొవ్వొత్తికేం వచ్చింది?' అని. 'అది గ్రామపంచాయితీ డబ్బుతో కొన్నది. ఇది నా స్వంత డబ్బుతో కొన్నది. ఇప్పుడు మీరు నా స్నేహితుడుగా వచ్చారు కాబట్టి ఆ కొవ్వొత్తి వెలుగులో కబుర్లు చెప్పుకోవడం భావ్యం కాదు' అన్నాడు కరణం. మునసబు 'ఏమిటో చాదస్తం' అని నవ్వుకుని వూరుకున్నాడు.

తర్వాత కొన్ని రోజులకు కరణంమీద ఆరోపణలు వచ్చాయి, పంచాయితీ డబ్బు తినేశాడని. అప్పుడు మునసబుకి యీ సంఘటన గుర్తుకు వచ్చింది. 'వెధవ కొవ్వొత్తి దగ్గరే అంత జాగ్రత్తగా వుండే ఆయన, మంది సొమ్ముకోసం ఆశ పడతాడా?' అంటూ కరణం పక్షాన నిలబడ్డాడు. కొన్ని రోజులకు నిజం బయటపడి కరణం నిర్దోషిత్వం కూడా రుజువైంది. కరణం కనుక ఆ రోజు 'మునసబు కబుర్లు చెప్పేది మహా అయితే ఓ పావుగంట, యీ భాగ్యానికి అది ఆర్పి, యిది వెలిగించాలా' అనుకుంటే కథే లేదు. మరీ యింత పక్కాగా వుంటే ఆషాఢభూతులనుకుంటారేమో అనే భయం లేకుండా ఒక గట్టి నమ్మకంతో, ఒక కన్విక్షన్‌తో చేస్తే మంచి అభిప్రాయం కలిగి ఒక యిమేజి ఏర్పడుతుంది.

అందువలన కిరణ్‌గారికి మనసులో ఏముందో మనకి తెలియదు కానీ యీ చర్యల వలన యిటువంటి పక్షపాత ముద్ర పడింది. ఇది తప్పయితే యితని చేత యీ తప్పు చేయించినది హై కమాండ్ కాదా? ఇతనేదైనా మంచి పనులు చేస్తే అది హై కమాండ్ గైడెన్సు గొప్పా? పొరబాటు చేస్తే స్వంత తప్పా? కాబినెట్ కూర్పుకు ముందే యివన్నీ కాస్త జాగ్రత్తగా చూసుకో, తెలియకపోతే ఎవరినైనా పెద్దవాళ్లను అడుగు అని చెప్పి వుండద్దా? ఏం చెప్పారో ఏం పాడో కానీ కాబినెట్ మొదటి సమావేశానికే పెద్ద హడావుడి. ఆ తర్వాత వట్టి వసంతకుమార్ సోనియాతో భేటీ తర్వాతే తన ఛాంబర్‌కు రావడం... ఏతావాతా తెల్లారి లేస్తే ఢిల్లీకి పరిగెట్టే పరిస్థితి తెచ్చారు.

టిడిపి హయాంలో ఢిల్లీలో ఆంధ్రా భవన్ ఖాళీగా వుండేదిట. నిర్ణయాలన్నీ యిక్కడే తీసుకుంటూ వుంటే అక్కడి కెందుకు వెళ్లడం? వైయస్ హయాంలో మరీ అంత యిది కాదు కానీ ఢిల్లీ వెళ్లి చెప్పుకున్నా లాభం లేకపోయేది. అందుకని వెళ్లేవారు కారు. కెసియార్ తెలంగాణా గురించి ఢిల్లీలో లాబీ చేస్తున్నా అంటూ అక్కడే తిష్ట వేశారు. వేసి ఏం సాధించారు? ఇక్కడ ఉద్యమాన్ని మురగబెట్టారు. ఢిల్లీలో జరిగినదీ లేదు. చివరకు హైదరాబాదుకి వచ్చిపడ్డారు. ఇలా నడిస్తే ఢిల్లీ అంటే అదెక్కడ? అని అడిగే రోజులొస్తాయని ఢిల్లీవారు తెగ బెంగపడ్డారు. కొడుకు పెళ్లి జరిగిన తర్వాత పెత్తనమంతా కోడలు చేతిలోకి వెళ్లిపోతే అత్తగారు ఎంత తల్లడిల్లిపోతుందో అంత తల్లడిల్లారు.

8

ఈ పరిస్థితుల్లో కోడలు హఠాత్తుగా పోయినట్లు, వైయస్ పోయారు. ఇక కొడుకు మళ్లీ 'అమ్మా' అంటూ తన దగ్గరకే వస్తాడని ఎదురు చూసినట్లే ఢిల్లీవారు ఎదురు చూశారు. జగన్‌కు అప్పుడే అధికారం కట్టబెట్టి, రెండో స్థానంలో రోశయ్యను కూర్చోబెట్టి, పైన కెవిపిని మేకులా పెట్టి, చుట్టూ అష్టదిగ్బంధం చేస్తే, నిధులివ్వకుండా బిగబడితే జగన్‌కు ప్రాణం చాలొచ్చి తనంతట తానే రిజైన్ చేసి పోయేవాడేమో!

కానీ ఆ ఛాన్సు కూడా తీసుకోలేదు. రాష్ట్రాన్ని బాగు చేయడానికేమో అనుకున్నాం వెర్రివాళ్లం. రాష్ట్రం బాగు కోరి వుంటే డిసెంబరు 9 నాటి అయోమయ ప్రకటన చేసి, గత ఏడాదిలో రాష్ట్రానికి 6 వేల కోట్ల ఆదాయానికి గండి కొట్టేవారా? ఇదంతా మనమీద ప్రేమ కాదు. నూట ఏభై మంది ఎమ్మెల్యేల మద్దతుతో ఓ సిఎం గద్దె నెక్కితే తల ఎగరేసి తన మాట వినడేమోనన్న బెంగ! అంతే!

సరే, జగన్ యిప్పుడు పార్టీలోంచి బయటకు వచ్చేశారు. అంటే కోడల్ని అత్తగారు యింట్లోంచి తరిమేసినట్టు అనుకుందాం. అదేమిటమ్మా, అవేం పనులు అని ఏ యిరుగమ్మయినా, పొరుగమ్మయినా అంటుందేమోనని తక్కిన కోడళ్ల చేత 'అసలు మా అత్తగారు ఎంతో మంచివారు, దాన్ని నెత్తిన పెట్టుకుని చూశారు. మా తోటికోడలుకే తలబిరుసు' అని అనిపిస్తుంది. వీళ్లంతా పాఠం వప్పచెప్పినట్టు అదే వల్లిస్తారు, తాళం చెవులు అత్తగారి చేతిలో వున్నంత వరకు!

జగన్ విషయంలో కాంగ్రెస్ నాయకులందరూ ముక్తకంఠంతో కొన్ని వున్నాయి –

మొదటిది – కాంగ్రెస్ హై కమాండ్ వైయస్ కుటుంబానికి ఎంతో చేసింది. ఆయనకు టిక్కెట్టిచ్చింది, కొడుక్కి యిచ్చింది, ఆయన పోతే భార్య కిచ్చింది, ఇప్పుడు తమ్ముడికి మంత్రి పదవి యిచ్చింది. (ఈ పదవి వైయస్ పోయినప్పుడే యిచ్చి వుండవచ్చుగా, జగన్ని మండించడానికి యిప్పుడు యిచ్చారు కానీ) జగన్‌కు 20 సూత్రాల అమలు కమిటీలో సభ్యత్వం యిచ్చింది. (అదో పెద్ద పోస్టు!)

రెండోది – వైయస్ కాంగ్రెస్ ఆస్తి, ఆయన రాజకీయవారసత్వంపై కాంగ్రెస్‌కు హక్కు వుంది. ఫ్యూడల్ మోడల్లో జగన్ వారసత్వం కోరుకోవడం తప్పు. వైయస్ కాంగ్రెస్ ఆస్తి అయితే మరి వైయస్‌పై దురద జల్లేవారిని హై కమాండ్ ఎందుకు అరికట్టదు అనే ప్రశ్న వస్తుంది. వైయస్‌ను తిట్టేవాళ్లను జగనే ఎదుర్కుంటున్నారు తప్ప వీళ్లెవరూ ఎదుర్కోవటం లేదేం? కిరణ్ యిప్పుడు వైయస్‌ను తిట్టవద్దు అని సలహా చెప్పారు. ఆచరణ ఎలా వుంటుందో వేచి చూడాలి.

రాజకీయవారసత్వంగా జగన్ వైయస్ సిఎం గద్దె కోరడం తప్పు అనే మాట కరక్టు. కానీ అదే తప్పు రాజీవ్ గాంధీ సైతం చేశారు. ఇందిర పోయినపుడు సీనియర్ మంత్రిగా ప్రణబ్ అది కోరుకుంటే రాజీవ్ పడనీయలేదు కదా! తన మెడలో రాజీవ్ తాళి కట్టాడని తప్ప (నాటకీయత కోసం అంటున్నాను తప్ప తాళి కట్టలేదని నాకూ తెలుసు) సోనియాకు కాంగ్రెస్ వారసత్వం ఎలా దఖలు పడింది? ఇందిరా గాంధీ అయితే కనీసం చిన్నప్పుడైనా కాంగ్రెస్ వాలంటీరుగా పనిచేసింది. కాంగ్రెస్ ఆధ్యక్షురాలిగా చేసింది. అందువలన నెహ్రూ తర్వాత వారసత్వానికి ఎంతో కొంత అర్హత సంపాదించుకుంది. మరి సోనియాకున్న అర్హత ఏమిటి? ఇందిరా గాంధీ కొడుకుతో జీవితం పంచుకోవడం తప్ప!

అదే విధంగా ఎంపీ కావడానికి రాహుల్ గాంధీ అర్హత ఏమిటి? ప్యారడైజ్‌లో బిర్యానీ బోల్డుమంది తింటున్నారు, ఫారిన్ అమ్మాయిలతో డేటింగ్ చేసేవాళ్లకూ తక్కువ లేదు. వాళ్లందరినీ దేశానికి మార్గదర్శకత్వం వహించమని కాంగ్రెస్ ఎంపీలు బతిమాలుతున్నారా? సచిన్ పైలట్‌లు, జ్యోతిరాదిత్య సింధియాలు చుట్టూ కనబడుతుండగా రాజకీయ వారసత్వం కోసం కలలు కనరాదంటూ మాట్లాడే అర్హత కాంగ్రెస్ వారికి లేదు.

అంతమాత్రం చేత తక్కినవారికి వుందని కాదు. ఎన్టీయార్ అల్లుడు కాకపోతే బాబు టిడిపిలో అన్ని మెట్లు ఎక్కేవారా? ఎక్కాక ఆయన సిటియస్ వంటి అతి గొప్ప స్కీము నా కొడుకు లోకేష్‌దే అని మురిసిపోలేదా? లోకేష్ బాబు కొడుకు కాకపోతే టిక్కెట్ల పంపిణీలో ప్రధానపాత్ర వహించేవారా? ఎన్టీయార్ కొడుకు కాకపోతే హరికృష్ణ మాటలు ఎవరైనా వినేవారా? ఎన్టీయార్‌ను ఆకట్టుకుని, రెండవ భార్యగా అవతరించకపోతే లక్ష్మీపార్వతిని టీవీ చర్చలకు పిలుస్తారా?

వీరందరూ పొందుతున్న వారసత్వలాభం జగన్ పొందకూడదని ఎవరు అనగలరు? ఎటొచ్చీ జగన్ పెట్టే పార్టీ అన్న ఎన్టీయార్ పార్టీ, ఎన్టీయార్ టిడిపి లలా అవుతుందా? మరోలా అవుతుందా అన్నది వేచి చూడాలి.

ఇక హై కమాండ్ పక్షంగా చేసే మూడో ఆరోపణ – జగన్ కూడా తండ్రిలాగ ఓ పాతికేళ్లు ఓపిక పట్టాలి కానీ తిరగబడకూడదు అనేది! ప్రతీవాళ్లూ తండ్రిలాగో, తల్లి లాగో ఉండాలనుకుంటే దేవుడు ఆ యా మనుష్యులను పుట్టించేవాడే కాదు. తండ్రికి, తల్లికి ఆయుర్దాయం పెంచి వూరుకునేవాడు. జవహర్‌లాల్ విధానాలకు దూరంగా వెళ్లారు ఇందిరా గాంధీ. తల్లి ప్రొటెక్షనిజంకు దూరంగా, సరళీకరణవైపు వెళ్లారు రాజీవ్ గాంధీ.

'నెహ్రూ పోగానే మీ అమ్మకు పట్టం కట్టలేదు కదా, లాల్ బహదూర్ శాస్త్రికి పట్టం కట్టి, ఆ తర్వాత ఆయన అనుకోని రీతిలో చనిపోతే అప్పుడు మీ అమ్మను చేశారు కదా, అప్పుడూ మీ అమ్మంటే ఏ మాత్రం గౌరవం లేని మొరార్జీ లాటి మొండిశిఖండిని పక్కలో బల్లెంలా ఉపప్రధానిని చేశారు కదా. మీ అమ్మ చచ్చిపోయాక నువ్వా తొందర పడకుండా ఇంకోణ్ని పదవిలో కూచోబెట్టి వాడు

ఎప్పుడు ఛస్తాడా అని చూసి, అప్పుడు క్లెయిమ్ చేయవచ్చుకదా!' అని రాజీవ్ గాంధీకి యీ పెద్దలంతా సలహా యిచ్చారా?

ఎప్పటి పరిస్థితులు అప్పటివే. చైనా వెనుకబడి వున్నపుడు వాళ్లు నల్లమందు తిని పడుకుంటున్నారో, కప్పలు తిని త్రేనుస్తున్నారో మనం పట్టించుకోలేదు. వాళ్లు యిప్పుడు పెద్ద శక్తిగా ఆవిర్భవించాక వాళ్లు ఏం చేస్తున్నారో అనుక్షణం గమనిస్తూ దానికి పోటీగా మనను మనం మలచుకుంటున్నాం.

ఒకప్పుడు ఇండియాలో బెంగుళూరు వుందో, మంగుళూరు వుందో అమెరికాలో ఏ రాజకీయ వేత్తయినా మాట్లాడాడా? అసలు ఇండియా వుందో లేదో కూడా వాళ్లు పట్టించుకోలేదు. ఈ రోజు తెల్లారితే ఒబామాగారికి బెంగుళూరు కుర్రాళ్లు తెగ చదివేసి అమెరికావాళ్ల ఉద్యోగాలు లాగేసుకుంటున్నట్లు కలలు వస్తున్నాయి. ఇండియాను పట్టించుకోను, ఐసెన్ హొవార్ నాటి పద్ధతులే పాటిస్తాను అంటే ఒబామాగారిని పాతరాతి యుగం మనిషి అంటాం.

9

ఆలాగే పాతికేళ్ల క్రితం వైయస్‌లాగే జగన్ వుండవలసిన అవసరం లేదు. ఈనాడు అతని ఆశలు వేరు, అంతస్తు వేరు. రాజకీయ ఒత్తిళ్లు వేరు. పాతికేళ్ల క్రితం వైయస్ చేతిలో యింత బలగం వుందా, మూకబలం వుందా? రూకబలం వుందా? జగన్‌కు అన్నీ వున్నాయి. తెగింపు వుంది, గుండెధైర్యం వుంది. అందువలన యుద్ధరంగంలోకి దిగుతున్నాడు. జయం సాధిస్తాడో లేదో అది తెలియదు. కానీ చేతిలో ఎకె 47 వుండగా, తప్పు అది వాడకు, మీ నాన్న వాడి పడేసిన పిట్టల తుపాకీ వుంది, అదే తెచ్చుకో అని సలహా యివ్వడం హాస్యాస్పదంగా వుంది.

జగన్‌ను తిట్టడానికి వైయస్‌ను ఊహూ పొగిడేస్తున్నారు కానీ వైయస్ మాత్రం అధిష్టానానికి జీ హుజూర్ అంటూనే వున్నాడా? తనకు లాభం లేదన్నపుడు అధిష్టానాన్నే మార్చి పారేశాడు. అవును! రెడ్డి కాంగ్రెస్ సభ్యుడైన వైయస్ దానికి భవిష్యత్తు లేదని గ్రహించగానే 'నా హై కమాండ్ యిక నువ్వు కాదు' అంటూ బ్రహ్మానందరెడ్డికి చెప్పేసి ఇందిరా కాంగ్రెస్‌కు మారిపోయాడు.

ఈ రోజు జగన్ చేస్తున్నదీ అదే. నా హై కమాండ్ ఢిల్లీలో లేదు, జనాల మధ్య వుంది అంటున్నాడు. అననీయండి. మీకు నష్టమేముంది? నష్టపోతే అతనే పోతాడు. అయినా తండ్రిలా వుండు తండ్రిలా వుండు అని పద్దాకా జగన్‌కే చెప్పేబదులు శశిధర్ రెడ్డికీ చెప్పవచ్చుగా! వాళ్ల నాన్న చెన్నారెడ్డి పదేపదే పార్టీలు మారారు. కాంగ్రెస్‌ను విడిచి వెళ్లిపోయారు. హై కమాండ్‌తో అనేకసార్లు తలపడ్డారు.

పోనీ నాదెండ్ల మనోహర్‌కు చెప్పవచ్చుగా! ఆయన తండ్రి నాదెండ్ల భాస్కరరావు, ముఖ్యమంత్రి చెన్నారెడ్డితో విభేదించి, పార్టీలోంచి బయటకు వెళ్లిపోయి రాజకీయాలంటే తెలియని ఓ సినిమా నటుణ్ని లాక్కుని వచ్చి ఆయన చేత పార్టీ పెట్టించి, కాంగ్రెస్‌ను కొన్నేళ్లపాటు శంకరగిరి మాన్యాలు పట్టించారు!

అబ్బే, అలా చెప్పరు! వాళ్లు తండ్రి బాట పట్టకూడదు. ండ్రిలా వుండకూడదు. కానీ జగన్ మాత్రం తండ్రిలాగానే ప్రవర్తించాలి! ఇదంతా దేనికంటె తమకు ఎలా వీలుగా వుంటే అవతలివాళ్లు అలా ప్రవర్తించాలనే ఆశ!

వాళ్లు హెచ్చరించే యింకో పాయింటు వుంది - కాంగ్రెస్ నుండి బయటకు వెళ్లిన వారెవరూ బతికి బట్ట కట్టలేదని! ఇది పాక్షిక సత్యమే! బతికి బట్ట కట్టనివాళ్లూ వున్నారు. వెలిగి పట్టుబట్ట కట్టినవాళ్లూ వున్నారు. అలాటి పట్టుబట్టల వారితో కాంగ్రెస్ వారు మడిబట్ట విప్పేసి, వాటేసుకుని పొత్తులు పెట్టుకున్న సందర్భాలూ వున్నాయి. శరద్ పవార్, మమతా బెనర్జీ ప్రస్తుతం అలాటి వాళ్లే.

మొరార్జీ దేశాయి, చరణ్ సింగ్, చంద్రశేఖర్, వి పి సింగ్ - బయటకు వెళ్లాకనే ప్రధానమంత్రులు కాగలిగారు. కాంగ్రెస్‌లోనే వుండి వుంటే డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్‌కి మించి కాలేకపోయేవారు. కేరళలోని యుడిఎఫ్ కూటమిలో కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకున్న అనేక పార్టీలు మాజీ కాంగ్రెస్‌వాదులు నడిపినవే.

కాంగ్రెస్‌తో అంటకాగిన వాళ్లందరూ పరసువేది తాకి పసిడి అయిపోయిన రాగి ముక్కలనీ, విడిగి వచ్చిన వాళ్లందరూ హఠాత్తుగా సత్తువ వుడిగి సత్తుముక్కలయిపోతారనీ గ్యారంటీ లేదు. కాంగ్రెస్‌కు స్థిరమైన ఓటుబ్యాంక్ వుందనేది వాస్తవం. కానీ అది ఫోకస్డ్ కాదు. ఓ మధ్యేమార్గ పార్టీగా వుండి అన్ని వర్గాలవాళ్ల ఓట్లూ కొద్ది కొద్దిగా ఆకర్షిస్తుంది. పైగా కాంగ్రెస్‌కు బలం - స్థానిక నాయకుల చాకచక్యం. ఏ పార్టీ అధికారంలో వున్నా వీళ్లు నిరంతరం ప్రజలతో టచ్‌లో వుంటూ తమ ఇమేజితో పనులు చేసిపెడుతూ, ఓటింగు సమయంలో ఓట్లు వేయించగల నిర్వహణాసామర్థ్యం కలిగి వుంటారు. అక్కడ ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షులుగా 'అమ్మలగన్న యమ్మ' సోనియా గాంధీ వున్నా, ఇప్పుడందరూ మర్చిపోయిన సీతారాం కేసరి వున్నా యీ శాతం (25 నుంచి 30%) ఓట్లు ఖచ్చితం.

అయితే దీన్ని గెలుపుగా తర్జుమా చేయాలంటే ఓ బలమైన స్థానిక నాయకుడు కావాలి. అతడు ఆ తక్కిన 7-8% ఓట్లు తెస్తాడు. ఫిక్సెడ్‌గా పడే ఓట్లు గిలకబావిలో పడి వున్న నిక్షేపం లాటిదనుకుంటే ఈ 7-8% ఓట్లు గిలక లాటివి. ఇవి వుంటేనే ఆ నిక్షేపాన్ని పైకి లాగి అనుభవించగలం. లేకపోతే కిందే పడి వుంటుంది.

ప్యారడైజ్ బిర్యానీ తిన్నా, రెండో తరగతి రైల్లో రోజంతా ప్రయాణం చేసి, బీదవాడి గుడిసెలో దూరి చాయ్ తాగినా నూతిలోకి దిగి నెత్తికి ఎత్తుకుని శక్తి రాదని గ్రహించాలి. ఈ గిలకలు లేకనే కాంగ్రెస్ అనేక రాష్ట్రాల్లో గిలగిల లాడుతోంది. గిలక లేని చోట గిలక

ఏర్పాటు చేయగల స్నేహితులు నిక్షేపాన్ని పైకి లాగి ఆ సొత్తును పంచుకుంటున్నారు. మహారాష్ట్రలో శరద్ పవార్, బెంగాల్‌లో మమతా బెనర్జీ, తమిళనాడులో డిఎంకె, ఒక్కోప్పుడు ఎడిఎంకె యిదే పని చేస్తున్నాయి. ఈ గిలక ప్రాధాన్యాన్ని తక్కువ చేసే మాట్లాడేవారు – సింపుల్‌గా చెప్పాలంటే – మూరు?లు. భజన చేసే హడావుడిలో తాళాలుండాలన్న విషయాన్ని మర్చిపోయేవారు. వైయస్ బతికున్నంతకాలం ఆయన గిలకగా పనిచేసేరు. అందుకని పని నడిచిపోయింది.

కోడళ్లు తలో చేయీ వేస్తేనే యింటి పని సాగుతుంది. ఒంటి చేత్తో బండెడు సంసారం లాక్కుని వస్తున్నానని అత్తగారు గొప్పలకు పోవచ్చు. గొప్పలు చెప్పుకోవచ్చు కానీ తను గొప్పదాన్నని అనుకుని కోడళ్లను తక్కువ చూపు చూడబోయినప్పుడే వస్తుంది చిక్కు. కోడళ్లకు ఓ సారి తిక్కరేగి కళ్లాపి చల్లకపోయినా, కసవు వూడ్చకపోయినా యిల్లంతా తుక్కు చేరుకుంటుంది. ఆ తుక్కు చూసి యిల్లంతా నిండి వుందని అత్తగారు వుబ్బిపోతే అంతకంటె పిచ్చితనం వుండదు.

ప్రస్తుతం ఢిల్లీ అమ్మ యిలాగే ఉబ్బిపోతోంది. వంది మాగధులు ఆమెను ఊదరగొట్టేస్తున్నారు. క్షేత్రంలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు వీలు లేకుండా దడి కట్టేస్తున్నారు. దానికి తోడు అహంకారపు పొరలు ఒకటి. బిహార్ ప్రయోగం చీదేసింది. అత్తగారి ప్రయోగాలకు ఇప్పుడు ఆంధ్రప్రదేశే లాబరేటరీ అయింది. 2014 వరకు యీ ప్రభుత్వం వుంటే కనీసం యింకో యిద్దరు సిఎంలను మనం చూడవచ్చనే నా అనుమానం. కిరణ్ ప్రభుత్వం పడిపోతే ఆ ఖ్యాతి జగన్‌కు దక్కనక్కరలేదు. పైనుండి పడుతున్న బరువు భరించలేకనే ప్రభుత్వం కూలవచ్చు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్**

**డిసెంబరు 24** **ఎమ్బీయస్: జగన్, కెవిపి.. మధ్యలో ఓ లేఖ – 1**

కొన్ని నెలల క్రితం నేను ఓ వ్యాసంలో జగన్ యిలా చేసి వుండాల్సింది, అలా చేసి వుండాల్సింది అని రాస్తే జగన్ వ్యతిరేకి అయిన ఒక పాఠకుడు నన్ను తిట్టాడు – 'నువ్వు జగన్‌కు కెవిపిలా వున్నావే!' అని. అంటే సలహాలు చెప్పేసి జగన్‌ను ఓ దారిలో పెట్టేసి, అతన్ని ఓ మహానాయకుణ్ని చేసేస్తానేమోనని అతని బెంగ, పాపం!

నేను ఒక ఓటర్ని. రాష్ట్రపౌరుణ్ని. ఇంతమంది నాయకులలో ఎవరైనా మనకు మేలు చేస్తారేమోనని ఆశగా ఎదురుచూసే అభాగ్యుణ్ని. నా ఆశను వెలిబుచ్చుతానంతే, అంతమాత్రం చేత వాళ్లు వింటారా, పెడతారా? అసలు యీ కాలమ్ చదువుతారా? చిరంజీవి యిలా చేస్తే బాగుండును.. అని రాస్తే అల్లు అరవింద్‌ను అయిపోను. అనుకోకుండా లాటరీ తగిలింది, కిరణ్ సరిగ్గా పాలిస్తే బాగుండును అని అంటే రఘువీరా రెడ్డిని అయిపోతానా? కానే కాను. జగన్ విషయంలోనూ అంతే!

అయితే అక్కడ ఆ పాఠకుడు పోలిక విషయంలో తప్పటడుగు వేశాడు, అది ఎత్తి చూపాలనే అతణ్ని ప్రస్తావించాను. జగన్‌కు సలహా లిచ్చేది కెవిపి అని అనుకోవడమే అతని పొరబాటు. 'నువ్వేమైనా అంబటి రాంబాబువా!' అంటే సమంజసంగా వుండేది. ఎందుకంటే కెవిపి వైయస్‌కు సలహాదారు తప్ప జగన్‌కి కాదు. కెవిపి వైయస్ కుటుంబానికి ఆత్మీయుడు కాబట్టి జగన్‌కు కూడా ఆటోమెటిక్‌గా కెవిపి సలహాదారు అనుకోవడం పొరబాటు.

ఇక్కడ మనం గుర్తించాల్సిన అంశాలు కొన్ని వున్నాయి. మీ బెస్ట్ ఫ్రెండ్ మీ ఆవిడకు నచ్చుతాడని గట్టిగా చెప్పగలరా? అసలు ఎందుకు నచ్చాలి చెప్పండి. మీరు ఆవిడకి ఎలాట్ చేయవలసిన టైమంతా అతనికి కేటాయిస్తే ఆవిడ అతన్ని తన సవతిగా చూడదూ? రోజూ మీరు అతనితో కనీసం ఓ రెండు గంటలు హస్కు కొట్టి, వారానికో సినిమా వెళ్లి, ఇంటికి వచ్చినప్పుడల్లా మీ ఆవిడ చేత కాఫీ, టిఫిన్లు చేయించి, మీరు ఎమోషనల్‌గా డిస్టర్బ్ అయినప్పుడల్లా అతనితో కష్టసుఖాలు చెప్పుకుని, అతని కేదైనా అవసరం పడితే, మీ ఆవిడకు నగ కొనడం వాయిదా వేసి, వడ్డీ లేకుండా అతనికి డబ్బు అప్పిచ్చి.. యివన్నీ చేస్తే ఆవిడ ఆనందించేస్తుందా? వీడంటూ లేకపోతే మా ఆయన నాతో యింకా ఆత్మీయంగా వుండేవాడు కదా! అనుకుంటుంది. అదే విధంగా మీ తమ్ముళ్లు, మీ సంతానం కూడా ఫీలవుతారు.

అసలు ఈ కెవిపి అంటూ లేకపోతే అన్నయ్య విషయాలన్నీ నేనే చూసేవాణ్ని కదా, అందరూ నా చుట్టూ తిరిగేవారు కదా అనుకుంటారు వైయస్ తమ్ముళ్లు. ఇక ఆయన కొడుకైతే చెప్పనే అక్కరలేదు. 'అమ్మా, నాన్న వట్టి వెర్రిబాగులాడు. ఆయన చెప్పినదంతా వింటాడు. ఈయన పేరు చెప్పి ఆయన ఎంత వెనకేస్తున్నాడో నీకేం తెలుసు. మా ఫ్రెండ్సంతా చెప్తున్నారు. ఈయన చూస్తే ప్రతీదానికీ మాకెవిపి అంటాడు. నువ్వేనా చెప్పవచ్చుగా' అని తన తల్లి వద్ద గునుస్తూ వుండవచ్చు. కెవిపి ద్వారా ప్రయత్నించి, బేరాలు కుదరక విఫలమైనవాళ్లు జగన్ వద్దకు చేరి 'మీ అంతా వుండగా మీ నాన్నగారు ఆయన్ని దగ్గరకు రానిస్తారేమిటండీ..' అని ఎక్కేసి వుంటారు. ఇది సహజం. ఇటువంటివి మీ యింట్లోనూ, మా యింట్లోనూ కూడా జరుగుతాయి. వైయస్ యింట్లో భారీ ఎత్తున జరుగుతాయి. ఆయన అపోజిషన్‌లో వుండి అల్లాడుతున్నపుడు సణిగి వూరుకున్నా, అధికారంలోకి వచ్చి కొన్ని వేల కోట్ల లావాదేవీలు కెవిపి చేతులమీదుగా జరుగుతున్నపుడు ఆ సణుగుడు, రణగొణధ్వనిగా మారడంలో అసహజం ఏమీ లేదు.

అయినా వైయస్ మొండివాడు కాబట్టి, అందర్నీ నోరు మూయించి వుంటారు. తను చేయాలనుకున్నది చేశారు. కొడుకు ఎక్కివచ్చాక కూడా కెవిపి ప్రాముఖ్యతను తగ్గించలేదు. కొడుకుని ఎప్పుడు రాజకీయాల్లోకి తేవాలి, ఎన్ని దశల్లో ఎలా తేవాలి అన్నదానిపై ప్రతి తండ్రిలాగ ఆయనకు ఓ ప్రణాళిక వుండి వుంటుంది. నాలుగు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో జగన్ అధికారలాలసపై వ్యాసం రాస్తూ

ఓ కాలమిస్టు రాశారు –

పాలిటిక్స్‌లోకి వచ్చేయాలన్న ఉబలాటం చేత జగన్ ఓ రాజకీయపరమైన ఫంక్షన్‌లో బెంగుళూరునుండి వచ్చి పాల్గొన్నారట. వైయస్ అతన్ని చూసి చికాకు పడ్డాడట. కొడుకుని డైరక్టుగా అనలేక భార్యను పిలిచి తిట్టాడట – 'వాణ్ని బెంగుళూరులోనే వుండి వ్యాపారం చూసుకోమంటే చూసుకోకుండా యిక్కడకి ఎందుకు వచ్చాడు? నువ్వెందుకు రానిచ్చావ్?' అని. ఈవిడ ఓ సీనియర్ మంత్రి వద్ద వాపోయిందట – 'వాడు చూస్తే మాట వినడు. ఈయన నన్ను తిడతారు. మధ్యలో నేను ఛస్తున్నాను. బిడ్డను రావద్దని ఎలా చెప్తాను?' అని.

చిన్నప్పుడేమో కానీ, ఓ పదహారేళ్ల వయసు వచ్చేసరికి పిల్లలు తల్లిదండ్రుల మాట వినరు. తల ఎగరేస్తారు. ఇక వాళ్లకు నచ్చచెప్పే భారాన్ని ఏ తమ్ముడికో, బావమరిదికో, కుటుంబస్నేహితుడికో అప్పగిస్తారు. దాంతో వాళ్లను చూస్తే ఆ పిల్లలు మరింత ముడుచుకు పోతారు. వైయస్ తరఫున కెవిపి జగన్‌కు హితోక్తులు చెప్పే వుంటారు. అందరు పిల్లల్లాగే అతనూ పెడచెవిన పెట్టి వుంటాడు. (చిలక్కి చెప్పినట్టు చెప్పా, కానీ మనిషి విన్నట్టు విన్నాడు – అని ఛలోక్తి విసిరేవాడు మా స్నేహితుడు యిలాటి సందర్భాల్లో)

ప్రతి మనిషీ డిఫరెంటు. రాజారెడ్డి రాజారెడ్డే. వైయస్ వైయస్సే. జగన్ జగనే. ఫ్యాక్షనిస్టు కుటుంబం నుండి వచ్చినా తను చదువుకుని డాక్టరైనట్టు, తన కుమారుడు కూడా తనని మించి చదవాలని అందరు తండ్రుల్లాగానే వైయస్ ఆశించి వుండవచ్చు. అనుకున్నంత చదువు అబ్బకపోతే సరే అని వ్యాపారంలో పెట్టి వుండవచ్చు. పాతికేళ్లనుండి పడి కొట్టుకుంటున్నా ఎక్కడా అంతూ, దరీ కనబడకుండా వుంది కాబట్టి యీ రాజకీయాల్లోకి కొడుకు రాకుండా వుంటే బాగుంటుందని అనుకునీ వుండవచ్చు.

సరే, ఎట్టకేలకు అధికారం చేజిక్కిన తర్వాత తనో పదేళ్లు పాలించి (చంద్రబాబు రికార్డును అధిగమించాలని వుందని ఎన్నోసార్లు చెప్పుకున్నారు) ఆ తర్వాత కొడుకుని ఓ క్రమపద్ధతిలో తీసుకువద్దామని ప్లానేసి వుండవచ్చు. రాజకీయాల్లో ఎటుపోయి ఎటు వచ్చినా మొదట డబ్బు చేసుకుంటే మంచిది కదా, అప్పటిదాకా వ్యాపారంపై దృష్టి పెట్టు అని చెప్పవచ్చు. 'రాజకీయంగా నా మొహమాటాలు ఎలాగూ వుంటాయి, ఇక నువ్వు కూడా సిఫార్సులు పట్టుకు రావద్దు, ఎకామడేట్ చేయలేక ఛస్తున్నాను' అని విసుక్కునీ వుండవచ్చు.

2

ఈ విధంగా తండ్రీకొడుకుల మధ్య వుండే సమీకరణాలు వుండగా, వాటిని సర్దుబాటు చేయడానికి వైయస్ పక్షాన కెవిపి జగన్‌కు నచ్చచెపుతూ వుండవచ్చు. 'అసలు యీయనంటూ లేకపోతే నాన్న నా మాటే వినేవాడు కదా' అని జగన్ కెవిపిపై కోపం పెంచుకునీ వుండవచ్చు. ఇలాటి పరిస్థితుల్లో జగన్‌కు కెవిపి అంటే గతంలో ప్రేమ, గౌరవం కారిపోతూ వుండేవనీ, వైయస్ మరణం తర్వాతనే అవి చెడ్డాయని నేను అనుకోవడం లేదు.

వైయస్ మరణం తర్వాత కెవిపి పాత్ర గురించి చూడబోతే – ఆయన మొదట జగన్‌నే ముఖ్యమంత్రి చేయడానికి చూశారన్నది నిర్వివాదాంశం. వైయస్ శవం ఉండగానే సంతకాలు సేకరించినది కెవిపి ఆదేశాల మేరకే అయివుంటుంది. జగన్‌కు అంతకంటె కావలసినది మరేముంది? అందుకే అతను మిన్నకున్నాడు. వైయస్ పోగానే పగ్గాలు మనచేతికి వచ్చినట్టే అని ఉవ్విళ్లూరుతున్న అధిష్టానానికి యీ చర్య విపరీతంగా కోపం తెప్పించింది. ఠక్ ఎన్నుకోవడానికి ఎమ్మెల్యేలెవరు, ఎన్నుకోబడడానికి జగనెవడు? మేం చెప్పందే అక్కడ ఆకైనా కదలడానికి వీల్లేదు అంటూ హై కమాండ్ యీ సంతకాల కాగితాన్ని తీసి పక్కన పడేసింది.

హై కమాండ్ మూడ్‌ను పసిగట్టిన కెవిపి వెంటనే ప్లేటు ఫిరాయించారు. ఎందుకంటే జగన్ 'సీతయ్య' అనీ, ఎవరిమాటా వినడనీ ఆయనకు తెలుసు. అటు ఢిల్లీ చూడబోతే తను కూర్చోమంటే చతికిలపడి, లేవమంటే ఓపిక లేకపోయినా లేచికూచునే వ్యక్తి కావాలని చూస్తోందనీ తెలుసు. తను తగ్గితేనే మంచిదని అనుకున్నారు. జగన్‌కు చెప్పిచూడవచ్చు కదా అని హై కమాండ్ అంటే మొహమాటానికి చెప్పినా జరిగే వ్యవహారం కాదని అనుకుని నేపథ్యంలోనే వున్నారు. రోశయ్యను ఎప్పుడైతే సెలక్టు చేశారో, క్రమంగా ఆయనకు దగ్గరయ్యారు. సలహాలు ఆయనకీ అవసరమే కాబట్టి, ఆయనకూ చెప్పారు.

వైయస్ భౌతిక వారసుణ్ని దూరంగా పెట్టి, వైయస్ రాజకీయప్రాచుర్యాన్ని క్రమంగా అణిచివేయాలని చూసిన అధిష్టానం వైయస్ 'ఆత్మ' అయిన కెవిపిని మాత్రం దూరం చేసుకోకపోవడం విచిత్రంగా అనిపిస్తుంది కానీ యిది కఠోరవాస్తవం. ఆయన గతానికి, వర్తమానానికి లింకు. వైయస్ చేత పనులు చేయించుకోదలచినవారు ఎంత యిచ్చారో, ఏమి బేరం కుదిరిందో, ఎంత యింకా యివ్వాలో – ఆ వివరాలు చెప్పగలిగినది కెవిపి మాత్రమే. ఆ వివరాలు లేకపోతే రోశయ్య ఆ పనులు పూర్తి చేయకపోతే, కసితో వారు రచ్చకెక్కవచ్చు. పార్టీకి నిధులప్రవాహం ఆగిపోవచ్చు. అందువలన కెవిపిని కంటిన్యూ చేయడానికే వాళ్లు యిష్టపడ్డారు.

మనం యింకో విషయం గుర్తు పెట్టుకోవాలి. ఇంద్రసభలో ఇంద్రుళ్లు తరచు మారుతూంటారు. పుణ్యఫలం వలన కొన్నేళ్లపాటు ఇంద్రపదవి దక్కుతుంది. ఆ పుణ్యం ఖర్చు అయిపోవడం వల్లనో, శాపగ్రస్తుడు కావడం వల్లనో అతడు దిగిపోతూ వుండాల్సివస్తుంది. ఈ లోగా ఎవరో ఘోరతపస్సు చేసి ఇంద్రపదవికి అర్హత సంపాదించుకుంటారు. వాళ్లు వచ్చి ఆ గద్దె ఎక్కి కూచుంటారు. అదీ వాళ్ల కంటె ఎవడో కఠోరతపస్సు చేసి వీళ్ల కుర్చీకి ఎసరు పెట్టేవరకూ మాత్రమే!

ఇంద్రపదవి యింత టెంపర్'వరీ' అయినా రంభ పదవి మాత్రం పదిలం. ఇంద్రుళ్లు వస్తారు, పోతారు కానీ రంభ మాత్రం

రిటైరవదు. ఆమె పని ఎవడు ఇంద్రుడైతే వాడి ముందు డాన్సు చేసి మెప్పించడం! ఏ ఇంద్రుడికి ఏ టైమ డాన్సు కావాలో అది మాత్రం చేస్తూ పోతే చాలు ధోకా లేకుండా పదికాలాల పాటు మన్నగల కాండిడేట్ రంభ!

రోశయ్యగారు దిగిపోయారు. కిరణ్ కుమార్ వచ్చారు. కానీ కెవిపి పదవి మారలేదు. ఆయన ఛాంబర్ ఎవరికీ ఎలాట్ చేయలేదు. ఎడ్వైజర్స్‌ను తీసేస్తున్నామని అట్టహాసంగా ప్రకటించగానే 'సలహాల రావుని యిక చాలన్నారు' అంటూ మన మీడియా మహా కులికేసింది కానీ ఏవీ జరగలేదు. దీర్ఘాలోచన చేస్తూ మంతనాలాడుతున్న కెవిపి ఫోటోలు వస్తూనే వున్నాయి. సురేఖ ఆయనపై దుర్లేఖ సంధించగానే మంత్రులు సైతం ఆయన యింటికి పరుగులు పెట్టి ఓదార్చారు. ఆయన చిదానందరూపంలా ఓ చిరునవ్వు నవ్వి చూదాం అన్నారట కానీ ఆందోళన పడలేదు, నా పని అయిపోయింది అనుకోలేదు. ఆయన ఎటువంటి పరిసరాలలోనైనా యిమిడి పోగలరు. విడిగా గుర్తుపట్టడానికి వీలుపడని ఊసరవెల్లి వంటివారు.

హై కమాండ్ ఆగ్రహానికి గురై తను యిలా శంకరగిరి మాన్యాలు పట్టి తిరుగుతూంటే తన తండ్రి ఛాయగా ప్రాముఖ్యంలోకి వచ్చి, ఆయన పోయినా నిలదొక్కుకుని పోయి, వెలిగిపోతున్న కెవిపిని చూసి మండిపడుతున్నారు జగన్. తనలాగే ఆయనా అవస్థలు పడుతూ వుంటే, సాక్షితోబాటు ఆయన యింటిపైనా ఆదాయపు పన్ను వారి దాడులు జరిగి వుంటే, ఆయన ఆస్తులపైనా పాల్వాయి, విహెచ్ విరుచుకు పడి వుంటే జగన్ సంతోషించి వుండేవారు.

వీళ్లంతా వైయస్‌ను మూర్తీభవించిన అవినీతిగా చూపిస్తూ కెవిపిని పరిశుద్ధాత్మగా భావిస్తూ అంటుకోకుండా వుండడం అతనికి రుచించలేదు. (శరీరానికి మాలిన్యం అంటుతుంది కానీ ఆత్మ ఎప్పుడూ స్వచ్ఛమైనదే కదా! క్రిస్టియన్ ఫిలాసఫీ ప్రకారం ఫాదర్, సన్, హోలీ స్పిరిట్ అనేవి ముఖ్యమైనవి. ఇక్కడ వైయస్, జగన్ – ఫాదర్, సన్ అవునో కాదో కానీ హోలీ స్పిరిట్ మాత్రం కెవిపి – కాంగ్రెస్ సీనియర్ల దృష్టిలో!)

కాంగ్రెస్ హయాంలో జరిగిన మంచినంతా సోనియాకు అంటగట్టి, చెడునంతా వైయస్‌కి పులుముతున్న సీనియర్లను చెక్ చేయడానికి కెవిపి ఏ మాత్రం ప్రయత్నించలేదు. జంధ్యాల రవిశంకర్ వంటి వాళ్లు 'ఆయనెప్పుడైనా మైకు పట్టుకుని ఖండించారా?' అని వాదిస్తారు. అందరూ మైకు పట్టుకోనక్కరలేదు. కార్యసాధనకు సామదానభేదదండోపాయాలని పెద్దలు ఎప్పుడో చెప్పారు. అందునా ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకున్న కెవిపికి యివి ఒకరు నేర్పాలా? మనసుంటే మార్గం వుండదా? ఆయన యిది కిట్టుబాటు కాదనుకున్నాడు, ఊరుకున్నాడు. అంతే!

3

ఈ 'పాసివ్' స్వభావమే ఢిల్లీవాళ్లకు నచ్చింది. రోశయ్యగారిని తీసేద్దామనుకున్నపుడు సిఎల్‌పి మీటింగులో ఎంపీ అయినా కెవిపిని వుండమని చెప్పి ఆయనకు తాము యిచ్చే ప్రాధాన్యాన్ని చాటి చెప్పారు. జగన్‌కు చెక్ పెట్టాలంటే సిఎంగా కిరణ్‌ను పెట్టాలని నిర్ణయంలో కెవిపి పాత్ర చెప్పలేం కానీ కనీసం యిన్‌పుట్స్ విషయంలో మాత్రం ఆయన సహకరించి వుండవచ్చు.

గత ఏడాదిగా హై కమాండ్ వద్ద జగన్ ప్రతిష్ఠ నానాటికీ తీసికట్టు నాగంభొట్లుగా ఎలా మారుతోందో స్వయంగా చూసిన కెవిపి తన చర్మాన్ని తాను కాపాడుకోవడంలో ఆశ్చర్యం లేదు. తన మాట అంటే జగన్‌కి ఎటూ లెక్కలేదు. అధిష్టానంతో చెడగొట్టుకుని వచ్చినా జగన్ తనను సలహాదారుగా పెట్టుకోడు. ఆ భోగం వైయస్‌తోనే పోయింది. ఇద్దరి మధ్యా తరాల అంతరం వుంది. దృక్పథాలలో వ్యత్యాసం వుంది.

జగన్ వద్దకి వెళితే ఓ 'హేజ్ బీన్'గా మిగలాలి. ఢిల్లీని అంటిపెట్టుకుంటే అధికారపీఠానికి దగ్గరగా వుంటే వుండే కిక్ కంటిన్యూ అవుతుంది. మీరైనా, నేనైనా అదే చేస్తాం. కెవిపిని తప్పుపట్టవలసిన అవసరం లేదు. వైయస్‌కు ఆయన స్నేహితుడే తప్ప సూరీడులాగ స్వయంప్రకాశం లేని ఛత్రధారి కాదు కదా!

కెవిపి 'పాసివ్' గా వున్నంతకాలం జగన్ అర్థం చేసుకుని ఊరుకున్నారు. కానీ ఆయన ఎప్పుడైతే యాక్టివ్ అయ్యారో అతనికి మండింది. రోశయ్య కాలంలో జగన్‌పట్ల నిర్లిప్తత చూపుతూ, యాత్ర జోలికి వెళ్లకపోతే ఏదోలా సహిస్తామని సంకేతాలు పంపుతూ వచ్చిన హై కమాండ్, కిరణ్ శకం వచ్చేసరికి జగన్ అణచివేత కార్యక్రమాన్ని చేపట్టింది. దానిలో భాగంగా వైయస్ లెగసీకి వారసుడిగా జగన్‌ను కాకుండా వైయస్ వివేకానందను చేద్దామని ప్రణాళిక రచించారు.

ఇన్నాళ్లూ పేరు కూడా తెలియని అగస్త్యభ్రాతగా వున్న వివేకానంద హఠాత్తుగా లక్ష్మణస్వామి అయిపోయారు. (ఈ పోలికతో వైయస్ రావణుడు కాదు, రాముడని ఒప్పుకున్నట్టవుతుందని తోచలేదా?) వైయస్ కుటుంబం కోసం త్యాగం మీద త్యాగం చేసి అన్యాయం అయిపోయిన శిబి, బలి, దధీచి బాపతు మనిషిగా ప్రొజెక్టు చేస్తున్నారు. పులివెందులలో నా కంటె మా వివేకానందయే ఎక్కువ పాప్యులర్ అని వైయస్ చెప్పిన మాటలు గుర్తు చేస్తున్నారు. వైయస్ కాలంలో మాదాపూర్‌లో రూల్సుకి వ్యతిరేకంగా యీయన కట్టిన యింటి గురించి మాత్రం ఎవరూ గుర్తు చేసుకోవడానికి యిష్టపడడం లేదు. వైయస్ లాగా ఈయనా రైతు పక్షపాతి అనీ, వ్యవసాయం ఆయన అభిమాన అంశమని, అందుకే ఆ మంత్రిత్వం కావాలని అడిగి తీసుకున్నారని పేపర్లో కథనాలు వచ్చేస్తున్నాయి.

వివేకానందను యిలా తెరమీదకు తెచ్చి జగన్‌ను యిబ్బందిలోకి నెట్టింది కెవిపి అని మాచెడ్డ పుకారుగా వుంది. జగన్–వివేకానంద

భేటీలో ఆ విషయం బయటపడిందేమో తెలియదు. ఏమైతేనేం, ఆ తర్వాత జగన్ కెవిపిపై పగబట్టినట్లు అనిపిస్తోంది. దాని ఫలితమే కొండా సురేఖ లేఖ కావచ్చు. ఆ లేఖ వెనుక జగన్ వున్నారా లేదా అన్నది ప్రస్తుతానికి తెలియక ఊహాగానాలు చెలరేగుతున్నాయి. తన లేఖకు, జగన్‌కు సంబంధం లేదని సురేఖ చెప్తున్నారు కానీ ఆ మాటలు నమ్మవలసిన అవసరం లేదు. మనంతట మనమే ఆలోచించుకోవాలి.

కొండా మురళికి, కెవిపి కి పడకపోవడం వలన ఆయనే సురేఖ పేర లేఖ రాయించారని ఒక గెస్. జగన్ సమైక్యవాది కాబట్టి డిసెంబరు 31 తర్వాత జగన్‌ను అంటిపెట్టుకుని వుండడం ఓ తెలంగాణావాదిగా అంత కిట్టుబాటు వ్యవహారం కాదు కాబట్టి సురేఖ జగన్‌ను యిలాగ డౌన్ చేసేసి, తెరాసలో చేరిపోతారని ఓ వైల్డ్ గెస్. ఆమె కార్యక్షేత్రం వరంగల్ జిల్లాయే. అక్కడ ఆమె ప్రత్యర్థి పొన్నాల లక్ష్మయ్య. తెలంగాణా ఉద్యమానికి పట్టుగొమ్మ అయిన రెండు జిల్లాలలో వరంగల్ ఒకటి. కృష్ణ కమిటీ నివేదిక తెలంగాణా యివ్వకపోతే అక్కడ సమైక్యవాది జగన్ మనిషిగా మనుగడ సాగించడం, జనాలను కూడగట్టుకోవడం కష్టం.

కమిటీ నివేదిక రాష్ట్రవిభజనకు అనుకూలంగా లేకపోతే ఉద్యమంలో పాల్గొంటానని సురేఖ ఎప్పణ్నుంచో చెపుతున్నారు. అందువలన ఆమె ఏదో ఒకటి చేయాలి. తెరాసలో చేరితే చేరావచ్చు. ఆమెలాటి ఫైర్ బ్రాండ్ వాళ్లకూ ఉపయోగకరమే. జగన్‌కు వున్న బలాన్ని సమూలంగా నాశనం చేయడం, అదే చేత్తో పొన్నాలకు బురద పూసి వెళ్లడం యీ రెండు పిట్టల్ని ఒక్క లేఖతో సాధించబోయారని ఓ పుకారు వచ్చింది. సురేఖలో యిలాటి రాజకీయచతురత కంటె సూటిగా ఎదుర్కునే లక్షణమే కనబడుతుంది నాకు. స్వయంగా కంకరరాయి తీసి తన ప్రత్యర్థులపై విసిరిన స్వభావం ఆమెది. తెరాసతో చేతులు కలిపి జగన్‌కు మసిపూస్తుందని అనుకోను.

కాంగ్రెస్సే జగన్ శిబిరంలో గందరగోళం సృష్టించడానికి స్ట్రాటజీలో భాగంగా యీ లేఖ తయారుచేయించిందని, ఓ ఎంపీ దానికి సహకరించాడని అని మరో పుకారు. కాంగ్రెస్ వాళ్లు చెపితే సురేఖ ఎందుకు వినాలి? పైగా కెవిపిపై యింత బురద ఎందుకు చల్లిస్తారు వాళ్లు, అందునా ఆయన తమవైపు వుండగా! ఇదీ నమ్మనక్కరలేదు.

ఇక మిగిలినది జగనే రాయించారన్నది. లేఖపై ఆయన యింకా వ్యాఖ్యానించలేదు. కృష్ణాజిల్లా ఓదార్పు యాత్రలో ఉత్తరం చదివే టైము లేదట. చిటికేస్తే సాక్షి రిపోర్టరు, టీవీ కెమెరా వచ్చి వాలతాయి. ఆయన పక్షాన పార్టీ ఎప్పుడు ప్రారంభమవుతుందో ప్రకటించేసిన అంబటి రాంబాబు 'నేను గాని, సురేఖ గానీ మాట్లాడితే జగన్‌గారు మాట్లాడినట్టు కాదు. ఆయనను చెప్పనివ్వండి' అంటున్నారు. వైయస్‌పై వ్యతిరేక ప్రకటనలను కెవిపి ఖండించకపోవడం ఎంత విడ్డూరమో, కెవిపిపై వ్యతిరేక ప్రకటనలను జగన్ ఖండించకపోవడం కూడా అంతే విడ్డూరం.

ఆ లేఖలో వైయస్‌ను అమాయకుణ్ని చేసి కెవిపి దోచేసినట్టు రాశారు. 7 కోట్ల మంది తమను పాలించగల సమర్థుడని ఎన్నుకున్న వ్యక్తి తన అమాయకత్వంతో ఇంకో వ్యక్తిని వేల కోట్లు దోచుకోనిస్తే అతడు సిఎంగా వుండడానికి తగడు. సీనియర్లు పూసిన బురద కంటె యిది ఎక్కువ ప్రమాదకరం. మరి జగన్ యిటువంటిది ఎందుకు రాయనిచ్చారు? అంటే సమాధానం లేదు. కోపావేశాలకు లోనయినప్పుడు మహా మహా మహర్షులే ముందూ వెనకా చూసుకోకుండా శాపాలిచ్చేశారు. ఇప్పటిదాకా గారాబంగా పెరిగిన జగన్ అనగా ఎంత! ఈ దుందుడుకు చర్య ఫలితాన్ని జగన్ తప్పక అనుభవిస్తారనే నా నమ్మకం. లేఖ ఐడియా యిచ్చిన మిత్రులు, దాన్ని అమలు చేసిన సురేఖ దగ్గర వుండగా జగన్ వేరే శత్రువులను వెతుక్కోనక్కరలేదని నా అభిప్రాయం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్**

**డిసెంబరు 37** **ఎమ్బీయస్ దమ్మిడీకి మూడు దీక్షలు...1**

రాష్ట్రంలో చలి ఓ పక్కన చంపుతోంది. మరో పక్క దీక్షలంటూ నాయకులు చంపుతున్నారు. చస్తాను చస్తాను అన్న నా సవతే తప్ప చచ్చిన నా సవతి లేదు అన్నదట వెనకటికి ఒకామె. వీళ్లంతా ఆమరణ దీక్షలంటూ కూచుంటారు. అంటే చచ్చేవరకూ దీక్షే నన్నమాట. నిజమేమోనని మనం ఆశపడతాం. వాళ్లకు ఆశకురుపులు వేస్తాయో ఏమో, రెండు రోజులు కుదురుగా కూర్చొనేసరికి ఏవేవో యిబ్బందులు వస్తాయి. తెగ కదులుతారు. ఇక అక్కణ్నుంచి నాయకుడి ప్రాణం గాలిలో కలిసిపోతుందంటూ అనుచరుల గోల. నిరసనలు. ట్రాఫిక్ ఆపేయడాలు. రైళ్లు నిలిపివేయడాలు. దాంతో నాయకుడి చావు మాట ఎలా వున్నా మనకు చావు మూడుతుంది.

వీళ్లందరూ ఆమరణ, ఆమరణ.. అంటారు కానీ నిజంగా చావుకి సిద్ధమై వస్తారా అని నాకు పెద్ద సందేహం. 'సర్ పే కఫన్ బాంధ్‌కర్ అయేఁ హైఁ' (శవాలకు కప్పే వస్త్రానికి తలకు చుట్టుకుని వచ్చాను) 'ఉరికొయ్యకు ఉయ్యాలలాడడానికి వచ్చాను' వంటి కవిత్వం ఎంతైనా చెప్పవచ్చు. నాకు వాళ్ల దగ్గరకి వెళ్లి "కఫన్ మాట అలా వుంచండి, విల్లు రాశారా?" అనో, "సార్, ఎలాగూ పోతున్నారు కదా, మీ బట్టలు పేదలకు దానం చేసేయవచ్చు కదా" అనో, "అగ్నికి ఆహుతి చేయబోయే మీ శరీరంలో జస్ట్ ఓ కిడ్నీ యిప్పుడే దానం చేసేయకూడదా?" అనో అడగాలని వుంటుంది. వాళ్ల సెక్రటరీ వద్దకు వెళ్లి "సార్ వచ్చేవారం ఎపాయింట్‌మెంట్స్ ఎవరికైనా యిచ్చారా? ఢిల్లీకి ఎయిర్‌టిక్కెట్లు బుక్ చేశారా?" అని అడగాలని వుంటుంది.

నేను వాళ్ల చావు కోరుతున్నానని అనుకోకండి సుమా. వీళ్ల చావు నాటకం చూసి నవ్వి వూరుకుందును. కానీ యిదంతా నిజమని నమ్మి ఎవరో అమాయకుడు మా నాయకుడు రెండు కిలోలు తగ్గిపోయాడట అని గుండె పగిలి చస్తాడు చూడండి అప్పుడు కోపం

వస్తుంది. సరే మన కోపతాపాలు ఎవడికి కావాలి కనుక. వాళ్ల అవసరాలు వాళ్లవి. మూడు దీక్షల గురించి చెప్పుకుందాం. సీనియారిటీలో మొదటిది బాబుగారు, రెండోది జగన్, మూడు మరియు తాజాది – తెలంగాణా ఎంపీలది. వ్యాసం పూర్తయేలోపున కొత్తవారెవరైనా ప్రారంభిస్తే (చెప్పలేం, దీక్షలు మహా చవకైపోయాయి. దమ్మిడీకి మూడు) పనిలోపనిగా వాళ్ల గురించీ చెప్పుకుందాం.

బాబుగారు దీక్షకు దిగడంలో సీనియరే కానీ యీసారి రైతుల గురించి దీక్ష ఐడియా ముందుగా ప్రకటించింది మాత్రం జగనే! ఆ విషయం రోశయ్యగారు గుర్తు చేసి బాబుగారికి మనోవ్యథ కలిగించారు. ఇంతోటి పెద్ద ఐడియా జగన్‌కు తప్ప వేరెవరికీ రాదా ఏం? గాంధీగారి కాలం నుండి మనకు వచ్చిన విద్య యిదే కదా! బాబు, జగన్ చేసినది రైతుల గురించిట! వీళ్లు అన్నం మానేస్తే రైతులకు మెతుకు పుడుతుందా? మెతుకు పుట్టక వాళ్లు వారంలో ఐదు రోజులు నిరాహారమే! కానీ పాపం వాళ్లను యింటర్వ్యూలు అడిగేవారు లేరు, ఫోటోలు తీసేవారు లేరు. గంటగంటకీ హెల్త్ రిపోర్టులు యిచ్చేవారు లేరు, మానమని బతిమాలేవారు లేరు.

బాబు, జగన్ రైతులకోసం ప్రస్తుతం చేసినదేమిటి? పరిహారం పెంచమని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం. ఎంతిచ్చినా చాలలేదనవచ్చు. లక్ష రూపాయలిస్తే 'లక్ష ఏ మూలకు? లక్షపైన వందైనా యిమ్మనమ'ని పట్టుబట్టవచ్చు. అధికారంలో వుంటే ఆ లక్షే కోటిలా కనబడుతుంది. అమ్మో చాలా యిచ్చేసి రైతులను బద్ధకస్తుల్ని చేసేస్తున్నామని దిగులు వేస్తుంది. ఇలా అయితే దేశ ఉత్పాదకశక్తి ఏమవుతుంది? యువతకు పనిచేసే ఉత్సాహం నాశనమైపోదా? కావాలని వాళ్లంతట వాళ్లే గట్లు తెగ్గొట్టేసుకుని పరిహారం అడుగుతున్నారేమో, కుళ్లిపోయిన ధాన్యం మాత్రమే చూపిస్తున్నారేమో అన్న కుశంకలు ధారాళంగా పుట్టుకుని వచ్చేస్తాయి. అపోజిషన్‌లో వున్నారు కాబట్టి రైతు దేశానికి వెన్నెముక వంటి సామెతలు పెదాల్లోంచి దూసుకు వస్తాయి. (మరుసటి నెల ప్రభుత్వోద్యోగుల జీతాలు పెంచాలంటూ నిరశన దీక్ష పట్టినప్పుడు ఆ నెలకు వెన్నెముక వాళ్లవుతారు)

నిజంగా జగన్‌కి కాని, బాబుకి కాని, మరొకరికి కాని రైతు సంక్షేమం పట్ల, గ్రామసంక్షేమం పట్ల ధ్యాసవుంటే ఏం చేసి వుండాలో ఏ పల్లెటూరివాడి నడిగినా, ఏ వ్యవసాయనిపుణుడిని అడిగినా చెప్తారు. వరదలు, భారీ వర్షాల సమస్య వుంది. చెరువులు కబ్జా చేయడం వలననే కదా యీ సమస్య వచ్చింది. చెరువులు పునరుద్ధరించండి, పూడిక తీసి లోతు పెంచండి, కాలువలలో మేట వేసుకుని పోయిన చెత్త తీసేయండి, మరింత లోతుగా తవ్వండి, కొత్త కాలువలు తీసి, కొత్త చెరువులు తవ్వి నీటిని స్టోర్ చేయండి. అతివృష్టి అనేది సమస్యే కాకుండా పోతుంది. ఏం యీ పనులు మీ పార్టీ కార్యకర్తల చేత చేయించలేరా? జన్మభూమి కార్యక్రమాలు అధికారంలో వుంటేనే చేయాలా? ట్రస్టు అంటూ పెట్టి రక్తదానాలు చేయించి, స్కాలర్‌షిప్స్ యిప్పించి ఎన్నారైల నుండి విరాళాలు సంపాదిస్తున్నారు కదా, యీ పనులంటే వాళ్లు డబ్బివ్వరా?

ఊరూరా జలవినియోగ కమిటీలు పెట్టవచ్చు. ఎవరు అధికారంలో వున్నా నీటి వినియోగంపై, విద్యుత్ వినియోగంపై వీళ్లు నిఘా వేయవచ్చు. నకిలీ విత్తనాలు అమ్మేవారిని, కల్తీ ఎరువులు అమ్మేవారిని నిలదీయవచ్చు. రైతులను ఎడ్యుకేట్ చేసి కన్స్యూమర్ కోర్టుల్లో కేసులు వేయించవచ్చు. బెంగుళూరులో మహళ్లు, సింగపూరులో సెవెన్‌స్టార్ హోటళ్లు కట్టడం కాస్త ఆపి గోదాములు కట్టి చవకగా అద్దె కివ్వవచ్చు. కొత్తగా వస్తున్న వ్యవసాయ విజ్ఞానంపై రైతులకు పాఠశాలలు పెట్టి అవగాహన కల్పించవచ్చు. కర్షక పరిషత్‌లు ప్రభుత్వమే నడపాలని లేదు, పార్టీ తరఫున కూడా నడపవచ్చు. పార్టీ నాయకులలో ఒకరి చేత స్వచ్ఛంద సంస్థ పెట్టించి వారి చేతనైనా చేయించవచ్చు. ఎవరూ దండించరు.

అసలు ఆగ్రో బేస్‌డ్ యిండస్ట్రీస్ (ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ ప్రోడక్ట్స్ యిత్యాదివి) గ్రామాల్లో నెలకొల్పితే మన సమస్యలలో నూటికి 90 సమస్యలు మటుమాయం. 'బస్తీకు పోవద్దురా డింగరీ' పాట నాకు అత్యంత యిష్టమైన పాట. గ్రామాలను పాడుపెట్టి నగరీకరణ చేసుకుంటూ పోవడం వలననే యిన్ని సమస్యలు వచ్చిపడ్డాయి. గ్రామాల్లో స్థలం ఎక్కువ, జనాభా తక్కువ. నగరంలో ఎటు చూసినా జనాభా. అన్నిటికీ కొరతే. కాలుష్యమే. అనారోగ్యమే. సంఘవ్యతిరేక శక్తులే. ఎన్ని ఫ్లయిఓవర్లు, ఎన్ని మెట్రోలు చాలవు. మహా నగరం అయినకొద్దీ మాదంటే మాదని తగాదాలు.

2

కేరళలో యిలాటి సమస్య ఎప్పటికీ రాదు. అక్కడ అన్నీ పల్లె, పట్టణం కానీ ఊళ్లే. మనదీ అలాగ చేయవచ్చు. కానీ చేయలేదు. నగరానికి ఎందుకు వచ్చిపడ్డాం? గ్రామాల్లో ఏ పరిశ్రమా పెట్టకపోవడం వలన? చిన్న రాష్ట్రాలు ప్రగతి సాధిస్తాయంటూ హర్యాణా, పంజాబ్‌లను చూపిస్తారు. చిన్న రాష్ట్రం చేసేయగానే బాగుపడిపోదు. ఆ రాష్ట్రాల్లా వ్యవసాయంలో విప్లవాలు తీసుకురావాలి. పరిశ్రమలను గ్రామాల్లోనే పెట్టాలి. పంజాబ్ రైతు తలసరి ఆదాయంతో పోల్చి చూస్తే ఆంధ్ర రైతు ఆదాయం ఏ మూలకు?

ఇదేమీ ఆలోచించకుండానే వున్నారా మన మహానేతలూ యువనేతలూ? అన్నీ తెలుసు వారికి. మనకంటె ఎక్కువగా! కానీ అవన్నీ చేపట్టాలంటే నిర్మాణాత్మకంగా వుండాలి. అమ్మో, అది పెద్ద పని. సులభంగా అయిపోయేదేమిటంటే ప్రభుత్వాన్ని తిట్టడం. అన్నదాతను ఆదుకోని ప్రభుత్వం ఓ ప్రభుత్వమే కాదు వంటి స్లోగన్లతో శాపనార్థాలు పెట్టి రైతులను ఉద్ధరించినట్టు పోజు కొట్టి, చరిత్రలో ఓ పేజీ ఆక్రమించేద్దామన్న దుగ్ధ తప్ప నాలుగు కాలాలపాటు రైతుకు పనికి వచ్చే పని చేద్దామన్న ఆలోచనే వుండదు.

అందువలన బాబు, జగన్ దీక్షలు రెండూ తమ తమ ప్రయోజనాలకై చేసినవే తప్ప రైతులకోసం చేసినవి కావు. ఏమిటా

ప్రయోజనాలు?

బాబుగారికి అర్జంటుగా యిమేజి మారిపోవాలి. రైతు బాంధవుడై పోవాలి. తన కాలంలో జరిగిన నెగటివ్ గ్రోత్‌ను జనాలు మర్చిపోవాలి. రైతుల పట్ల ఆయన హృదయం ఎలా ద్రవిస్తోందో మనం గుర్తించాలి. అందుకని ఆయన ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడానికి ముందే దీక్ష చేయడానికి నిశ్చయించుకున్నారు. ఆయన యివాళ అడిగినదంతా ప్రభుత్వం ప్రకటించేసినా ఆయన ఒప్పుకునేవారు కారు. దానికి రెట్టింపు యిమ్మని అడిగేవారు. ఎమౌంట్ ఎంత అన్నది ప్రశ్న కాదు, అల్లరి పెట్టామా లేదా అన్నదే పాయింటు. నిరాహారదీక్ష చేశారు. అయితే సాక్షి, జగన్ 'నిరాహార' అన్న పాయింటుపై అనుమానాలు రేప్పెట్టారు.

అసలు ఏడాది క్రితం కెసియార్ నిరాహారదీక్షలో నిమ్స్ డాక్టర్ల పాత్ర గురించే యిప్పటిదాకా అనుమానాలు విచ్చిపోలేదు. ఆ గోనె ప్రకాశరావు రికార్డులు బయటపెడతానని చెపుతూనే వున్నారు. మధ్యలో బాబుగారిది వచ్చింది. ఇంకేముంది ఆయన కొలాప్స్ అయిపోతారని చెప్పి శిబిరంలోనుండి లాక్కుని వచ్చి, యీడ్చుకుంటూ ఆసుపత్రిలో పడేసి, మందివ్వకుండా యింకో రెండు రోజులుంచినా కొలాప్స్ కాలేదు. మొదటిదైనా అబద్ధం అవ్వాలి, రెండోదైనా అబద్ధం అవ్వాలి.

ఇక సోడియం, పొటాషియం లెవెల్స్ సంగతి నాకు తెలియదు కానీ షుగరు సంగతి బాగా తెలుసు. డయాబెటిసు రానంతకాలం ఫర్వాలేదు, ఉపవాసం చేసినా, విందులు కుడిచినా శరీరమే కావలసినంత గ్లూకోజు గ్రహించో, విడుదల చేసో సరిపెట్టేస్తుంది. కానీ ఒకసారి ఆ వ్యవస్థ పాడయ్యాక, షుగరుందని ఖరారయ్యాక లాభం లేదు. అందుకే డయాబెటిషియన్స్ స్పష్టంగా చెప్తారు – నో ఫాస్టింగ్, నో ఫీస్టింగ్ అని. తగుమాత్రంగా ఎక్కువసార్లు ఏదో ఒకటి తింటూవుండాలని. బాబు జాతీయ నాయకులకు విందులు ఏర్పాటు చేసినపుడు కూడా స్వీటు తీసుకోరని, తక్కిన ఆహారం కూడా చాలా మితంగా తీసుకుంటారని చాలాసార్లు పేపర్లలో వచ్చింది. పైగా యిప్పుడు డయాబెటిక్ అని పేపర్లో కూడా వచ్చేసింది. ఇటువంటి పరిస్థితిలో ఆరురోజుల పాటు ఉపవాసం ఎలా చేశారో అని అనుమానం రావడం తప్పు లేదు. దాని మీద మరీ తర్కించడమూ బాగుండదు. అక్కడికి అలా వదిలేద్దాం.

దీక్ష జరిగేటప్పుడు ఈయన ఎంత మొండిగా వున్నారో, కిరణ్‌గారూ అంతే మొండిగా వున్నారు. ఎలాగైనా దీన్ని నెగ్గనివ్వను అని. క్రెడిట్ బాబుకు యిసుమంతైనా దక్కనివ్వను అని పట్టుబట్టి కూర్చున్నారు. కానీ టిడిపి నాయకులు మాత్రం ఆశపడ్డారు – కేంద్రం నుంచి ఎవరినో పంపి వాళ్ల చేత హామీ లిప్పించి నిమ్మరసం యిప్పించి తమ నాయకుడి పరువు కాస్తారని! మీడియావారు కూడా దానికి అనుగుణంగా రాశారు. చివరికి చూస్తే కేంద్రం అటువంటి కార్యక్రమం ఏదీ పెట్టుకోలేదు. బలవంతంగా దీక్ష భగ్నం చేయించారు. తన దీక్ష పూర్తయేదాకా చూసి అప్పుడు చేయించారని, యిదంతా వాళ్లిద్దరూ కలిసి వేసిన స్కెచ్ అనీ జగన్ ఆరోపణ. తనగురించి సోనియా, బాబు కూర్చుని ఆలోచించే స్థాయి జగన్ కింకా రాలేదని మనకు తెలుసు కానీ పాపం ఆయనకు తెలియదు.

బలవంతంగా వాళ్లు ఓ సారి దీక్షను చెరిచిన తర్వాత స్వచ్ఛందంగా బాబుగారు భగ్నం చేసుకున్నారు. దాని గురించి ఢిల్లీనుంచి నాయకుల్ని ప్రత్యేక విమానంలో రప్పించుకుని హంగు ఆర్భాటాలతో ఆ కార్యక్రమం జరిపించుకున్న తర్వాత ఆ యిమేజి చెదిరిపోకుండా రైతు మహాసభ పెట్టారు. అదీ తమకు మంచి పట్టున్న గుంటూరు జిల్లాలో! అది ఎలాగూ సక్సెసవుతుంది కానీ యీ లోపున బాబు యింకో విధంగా సక్సెసయ్యారు.

కొన్ని సినిమాల్లో భార్యాభర్తా కొట్టేసుకుని విడిపోదామనుకుంటారు. అంతలో భార్యకో, భర్తకో ఏక్సిడెంటు అవడమో, లేదా మావగారికో, తండ్రికో రోగం ముంచుకు రావడమో జరుగుతుంది. అప్పుడు భార్యో, భర్తో, ఇద్దరూ కలిసో వాళ్లకు సేవచేస్తారు. నోట్లో థర్మామీటరు పెట్టడం, నుదుటిపై పట్టీ తీయడం, పళ్లరసం తీయడం, రాత్రివేళ నిద్రకు ఆగలేక బల్లమీద తల పెట్టుకుని వాలిపోవడం, అది అవతలివాళ్లు చూసి దిండు తెచ్చి పెట్టడం – యిలాటి షాట్స్ కొన్ని వుంటాయి. ఆ తర్వాత హీరో, హీరోయిన్ కలిసిపోతారు.

ఇప్పటివరకు టిడిపి నాయకులు ప్రాంతాలవారీగా చీలిపోయి వున్నారు. మాట్లాడుకోవడం లేదు. అలాటిది వారి పార్టీ పెద్ద మంచం ఎక్కేసరికి వాళ్లు విభేదాలు మరిచి ఆయన ప్రాణం గురించి అల్లాడారు. కాంగ్రెస్‌ను తిట్టడంలో ఏకమయ్యారు. తెలంగాణాపై రాబోయే కమిటీ నివేదిక గురించి గాని, విద్యార్థులపై కేసుల గురించి కాని మాట్లాడే తీరికే చిక్కలేదు. 30 న రైతు మహాసభ విజయవంతమై బడలిక తీర్చుకునేసరికి నివేదిక ఎలాగూ వచ్చేస్తుంది. ఈ లోపున ఓ పదిరోజుల పాటు రెండు ప్రాంతాల నాయకులు భుజం భుజం కలిపి పనిచేశారు. అది చాలు బాబుగారికి ఆనందం కలిగించడానికి!

ఇక జగన్ దీక్ష గురించి చెప్పుకుందాం.

## 3

జగన్ దీక్ష ప్లాను చేసినపుడు తెలివిగా చేశారు. ఏ కడపలోనో ఆ దీక్ష చేసి వుంటే పెద్ద చెప్పుకునేవాళ్లం కాదు. విజయవాడలో వేరే పార్టీకి బలం వున్నచోట దుకాణం పెట్టడం ద్వారా రాయలసీమ రెడ్లకు మాత్రమే నాయకుడు అనే పేరును తుడిపేసుకోగలిగారు. చుట్టూ వున్న నాయకులలో కూడా రెడ్డి–యేతరులు ఎక్కువుండేలా చూసుకున్నారు.

ఈ దీక్ష రైతులకోసం చేశారన్న భ్రమ ఎవరికీ వుండనవసరం లేదు. రైతులకు దీనివలన ఒరిగింది లేదు. దీక్ష పూర్తవగానే

క్రిస్‌మస్ వేడుకలకు వెళ్లిపోయారు జగన్. ఆ తర్వాత అక్కణ్నుంచి కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్ పవార్‌ను కలిసి ఓ కాగితం యిచ్చారు. ప్రధానమంత్రిని కలవడానికి యిష్టపడలేదు. వ్యవసాయమంత్రి కూడా కాంగ్రెసేతర మంత్రి కాబట్టే కలిసేరేమో అనుకోవడంలో తప్పు లేదు. అది కూడా ఏ డిఎంకె మంత్రో కాకుండా కాంగ్రెస్‌లోంచి బయటకు వెళ్లి పార్టీ పెట్టిన శరద్ పవార్. పైగా వైయస్‌కు మిత్రుడు కూడా. ఆయన జగన్‌కి పార్టీ ఎలా పెట్టాలో సలహాలు కూడా యిచ్చి వుండవచ్చు. అందువలన రైతులకోసం చేసిన దీక్ష అనేమాట పక్కనపెట్టి రాజకీయకోణంలో నుండే దీన్ని చూడాలి.

ఇది ఒక బలప్రదర్శన. తమ ఎమ్మేల్యేల విశ్వసనీయత గురించి కాంగ్రెస్ పార్టీకి గుబులు పుట్టించే ప్రయత్నం. బలప్రదర్శన విషయంలో నూటికి 50-60 మార్కులు పడ్డాయనుకోవచ్చు. మొదటిరోజు జనం బాగానే వచ్చారు కానీ రెండో రోజు పలచబడ్డారు. పొద్దున్న చలి అని, మధ్యాహ్నం ఎండ అని కారణాలు చెప్తే నవ్వు వస్తుంది. జగన్ జనాన్ని ఆకర్షించగలరు అన్నమాటను కాస్త క్వాలిఫై చేయాలి. అంటే ఆయన వాళ్లింటి ముంగిట వెళితే వాళ్లు తొంగి చూస్తారన్నమాట! శేషశాయిలా వేదిక మీద పడుక్కుని జనాలను వచ్చి దర్శనం చేసుకోమంటే కుదరదన్నమాట! పైగా నీరసంగా పడుక్కుని వున్నవాణ్ని ఎంతసేపు చూస్తారు, ఏం చూస్తారు? ఈ విషయం నిర్వాహకులు ఆలోచించి వుండాల్సింది.

రైతుల గురించి దీక్ష అన్నారు కాబట్టి రైతు సమస్యల గురించి వర్క్‌షాప్స్, నిపుణుల చేత ఉపన్యాసాలు, డాక్యుమెంటరీలు, రైతుల పట్ల జగన్ పార్టీ దృక్పథం జనాలకు విడమరిచి చెప్పేలా బుర్రకథలు, హరికథలు - యిలాటివి ఏవో పెట్టాల్సింది. కానీ నాకు తెలిసి అలాటివి ఏవీ లేవు. సోనియాను తిడుతూ ఉపన్యాసాలు దంచి కొట్టారు. ప్లస్ సోనియాను వెక్కిరిస్తూ పాటలు. వచ్చినవాళ్లు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు. జగనయితే వెంటనే పంచెకు పట్టిన చీపురు పుల్లల్ని దులిపేసుకున్నట్టు కాంగ్రెస్ అభిమానాన్ని దులిపేసుకున్నారు కానీ వాళ్లు అలా కాదు కదా! చాలా ఉతుకుష్టంగా ఫీలయి రెండో రోజు మొహం చాటేశారట.

జగన్ యిప్పటిదాకా సాధించింది ఏమీ లేదు కాబట్టి అతని భజన ఆపి, సమస్యలపట్ల అతని అవగాహనను సులభగ్రాహ్యమైన భాషలో చెప్పిస్తూంటే యిలాటి సభలు రక్తి కడతాయి. జనాల్ని ఆకర్షిస్తాయి. తెలంగాణా సభలన్నిటిలోనూ మొదటి రెండు గంటలూ కంబళీలు కప్పుకున్నవారి పాటలు తప్పనిసరిగా వుంటాయి. వాటిలో చాలాభాగం అన్నీ ఒకే దరువులో వుంటాయి. ఇదే ఫార్ములా జగన్ సభలో కూడా ప్రయోగించి చూశారు... వంగపండు పాటతో సహా! ఇవి సభ గాంభీర్యాన్ని పెంచవు. సమస్యను తీవ్రంగా తీసుకున్నట్లు స్ఫురింపజేయవు. రెండో రోజు సభకు జనం పలచబడడంతో జగన్‌కు నోట మాట పెగలలేదని, సాయంత్రం దాకా ఉపన్యాసం యిచ్చే మూడ్‌లోకి రాలేదని కొన్ని పత్రికలు రాశాయి.

ఇక రెండో లక్ష్యమైన కాంగ్రెస్‌ను అదలగొట్టడంలో మాత్రం నూటికినూరు మార్కులు పడ్డాయి. పాతికమంది వచ్చారు, ముప్ఫయి మంది వచ్చారు అన్న లెక్కలు ముఖ్యం కాదు. ఎవరు వెళతారో, ఎవరు వెళ్లరో తెలియక కిరణ్‌కి, హై కమాండ్‌కి ముచ్చెమటలు పట్టించడంలోనే వుంది ఘనత. పేర్ని నాని వంటి వాళ్లు ముందు రోజు వెళ్లబోతూ వుంటే ఫోన్ చేసి ఆపేశాం కదా అని చంకలు గుద్దుకుంటూ వుంటే మర్నాటి సాయంత్రానికి న్యూస్ - వెళ్లిపోయారని! మల్లాది విష్ణు వెళ్లలేదు కదా అని సంతోషించబోతే ఆయన తప్ప వాళ్ల కుటుంబసభ్యులు యావన్మందీ అక్కడ తేలారన్న వార్త! అదేమిటని అడిగితే 'అబ్బే కార్యకర్తలు పట్టుబడితే ..జస్ట్, వూరికే.. అలా చూసి వచ్చేశామండి' అని సంజాయిషీ. ఎంతవరకు నమ్మాలో తెలియదు. పక్కనున్న భార్య తెల్లారేసరికి పక్కలో వుంటుందో, ఎదురింటివాడితో జంప్ జిలానీ అంటుందో తెలియనప్పుడు మొగుడికి నిద్ర పడుతుందా?

హై కమాండ్‌ని, వాళ్లు కోరి కూర్చోబెట్టిన కిరణ్‌ను యిలాటి దిక్కుమాలిన పరిస్థితిలోకి నెట్టినందుకు జగన్ కాలరెగరేసుకోవచ్చు. మీరు యిదంతా కోరి తెచ్చుకున్నారు అని హై కమాండ్‌ను వెక్కిరించవచ్చు. కానీ యీ గేమ్ ఎంతకాలం సాగుతుందో తెలియదు. ఈ ఎమ్మేల్యేలు కూడా తెలివిమీరినవారు. జగన్‌తో కలిసి వూరేగుతూనే కిరణ్‌తో కలిసి వస్తారు. అత్తతో అమ్మి, కోడలితో కొనడం అంటే యిదే కాబోలు. అదేమిటని అడిగితే 'నియోజకవర్గంలో పనులు చేయించుకోవాలి కదండీ' అని జగన్‌కి చెప్తారు. ఈ రోజు జగన్‌తో వెళ్లినవాళ్ల ఆశలు ఏమిటో తెలియదు. వాళ్లలో కొంతమంది మళ్లీ వెనక్కి గెంతేయవచ్చు. తనతో బాటు వున్నవాళ్లలో కూడా అందరికీ జగన్ రేపు టిక్కెట్లు యివ్వకపోవచ్చు. కిరణ్‌ను చికాకు పెట్టడానికి వీళ్లను వుపయోగించుకున్నారు తప్ప వీళ్లకు ఎన్నికలలో నెగ్గే సత్తా వుందో లేదో అన్న ఆలోచన వచ్చినపుడు వీళ్లకు ఛాన్సు దక్కకపోవచ్చు. వాళ్ల నియోజకవర్గంలోనే ఇంకో నాయకుణ్ని దువ్వవచ్చు.

ఏది ఏమైనా అధికారంలో వున్నవారిని చికాకు పెట్టడం అనే లక్ష్యం సాధించింది జగన్ లక్ష్యదీక్ష! ఆ దీక్షలో పాల్గొన్న వారిపై చర్య కూడా తీసుకోలేని దుస్థితిలో వుంది హై కమాండ్. వాళ్లు పార్టీని ధిక్కరించినట్టు సాక్ష్యాధారాలు దొరికాక చర్య తీసుకుంటామని ఢిల్లీలో అధికార ప్రతినిధి అన్నారు. డియస్ అయితే మరీ అన్యాయం. దాని విషయం తెలియనట్టే మాట్లాడతారు. జగన్ యింకా వేరే పార్టీ పెట్టలేదు కాబట్టి అక్కడికి వెళ్లడం క్రమశిక్షణారాహిత్యం కాదన్న లైను తీసుకుంటున్నారు. రేపు ఫిబ్రవరిలో పార్టీ పెట్టాక ఏ లైను తీసుకుంటారో తమాషా చూడాలి. ఒకప్పుడు అంబటి రాంబాబుపై ఉత్తిపుణ్యానికి చర్య తీసుకున్న కాంగ్రెస్ హై కమాండ్ కాదిది. అక్కణ్నుంచి చాలా మెట్లు దిగింది. రేదర్ దిగాల్సి వచ్చింది. ఇదంతా స్వయంకృతం.

4

ఇక మూడో దీక్ష క్యాష్ట్‌వారిది! అనగా తెలంగాణా కాంగ్రెస్ నాయకులిది. విద్యార్థులపై కేసులు పూర్తిగా ఎత్తివేయాలనే డిమాండ్‌తో కూర్చున్నది. అలా ఎత్తివేయడం సాంకేతికంగా కుదరని పని అని అందరికీ తెలుసు. వ్యవహారం కోర్టుదాకా వెళ్లిపోయింది. కోర్టు కెళ్లాక మేజిస్ట్రేటులు ఎలాగైనా వ్యవహరించవచ్చు. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తులు తగలబెట్టడం, ధ్వంసం చేయడం, ప్రభుత్వోద్యోగులపై దాడి చేయడం – వంటివి సహించడం ఏ న్యాయమూర్తికైనా ఒంటికి పడని విషయాలు.

విద్యార్థులు అమాయకులు, భావావేశంతో చేశారు వంటి కబుర్లు చెల్లవు. అలా అయితే ప్రియురాలిపై యాసిడ్ పోసినవాడూ విద్యార్థే. వదిలేశారా? అయినా దాడి చేసిన ప్రతీవాడూ విద్యార్థి అని గ్యారంటీ వుందా? నాగం జనార్దనరెడ్డిగారిని ఉస్మానియాలో పడేసి తొక్కేసిన కేసులో పట్టుబడ్డవాడు విద్యార్థి కాదు, లాయరు అని తేలిందిగా! ఇలా కేసులు ఎత్తేయమని కోరడం, యిటువంటివి యింకా చేయవచ్చని ప్రోత్సహించడమే!

రంగా హత్యానంతరం, రాజీవ్ హత్యానంతరం జరిగిన దాడుల విషయంలో కేసులు ఎత్తేశారు కదా, వీటికి మాత్రం అభ్యంతరాలు ఎందుకు అనడం అసమంజసం. అవి ఎత్తేయడమే తప్పు. అవి చూపించి యింకా తప్పులు చేయాలా? కాంగ్రెస్‌వాళ్లే ఆ దాడులు చేశారు కాబట్టి, తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి ఆ కేసులు ఎత్తేయించుకున్నారు. వీళ్లు ఎత్తేయమన్నా కొన్ని తీవ్రమైన కేసుల్లో కోర్టులు విచారణ సాగించాయి. ఆ విషయం యీ నాయకులకు తెలియదో, గుర్తు లేదో, గుర్తు చేసుకోరో మనకు అర్థం కాదు. కేసులు ఎత్తేయాలి, ఎత్తేయాలి అన్న డిమాండ్ ఒక్కటే పట్టుకుని కూర్చున్నారు.

కేసులు ఎత్తేస్తామని చిదంబరం పార్లమెంటులో యిచ్చిన హామీ విలువ ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. అసలు చిదంబరం యీ విషయంలో చేసినదే చాలా తప్పు. శాంతిభద్రతలు స్టేట్ సబ్జెక్ట్. దానిలో ఆయనెవడు వేలు పెట్టడానికి? తమిళనాడు విషయంలో యిటువంటిది ఏదైనా చేసి చూడమను, ముక్కు పగులుతుంది. కరుణానిధి వెంటనే రాష్ట్రహక్కుల ఆందోళనోద్యమం అని మొదలుపెట్టి వుండేవాడు. తెలంగాణా యిద్దామనుకుంటున్నాం అని ప్రకటించడమే తొందరపాటు అన్న విషయంలో రెండు అభిప్రాయాలు వుండవచ్చు. కానీ కేసుల విషయం ఎవడు అడిగాడు? దాడులు చేసిన విద్యార్థులు కానీ, వారి తలిదండ్రులు గానీ 'పొరపాటు చేశాం, మన్నించండి' అని అడిగారా? మళ్లీ చేయం అని హామీ యిచ్చారా? అవేమీ లేకుండా నీ అంతట నీవే కేసులు ఎత్తేయడం దేనికి?

సరే చిదంబరం కేసులెత్తేయమన్నారు. మళ్లీ అదే హై కమాండ్ రాష్ట్రప్రభుత్వాన్ని 'గో స్లో' అన్నట్టుంది. కేసులు ఎత్తివేయనే లేదు. చిన్నా చితకా కేసులు ఎత్తేయడానికి కూడా ఏడాది పట్టడమేమిటి అర్థరహితంగా! కొత్తగా యింకా ఏమైనా దాడులు చేస్తారేమో, అవి కూడా కలిపి ఎత్తేద్దామని ఆగారట. చిదంబరం చెప్పినది డిసెంబరు 9 వరకు రిజిస్టరైన కేసుల గురించి. అవి చేస్తే చాలు కదా. ఆ తర్వాత పరీక్ష పేపర్లు దిద్దడానికి వచ్చిన అయ్యవార్లను పట్టుకుని కొట్టిన కేసులు, నాగం వంటి ప్రజాప్రతినిథులను తన్నిన కేసులు ఎత్తేయమని ఆయన చెప్పలేదు కదా! అవన్నీ లపడంలో లేటైంది అని చెప్పడం ఎంత హాస్యాస్పదం! కాంగ్రెస్‌వారికి ప్రతీదీ నానబెట్టడం, దాన్ని పెద్ద యిస్యూ చేయడం, అప్పుడు మేమే దాన్ని పరిష్కరించాం అని క్లెయిమ్ చేయడం – ఓ అలవాటు.

కృష్ణ కమిటీ నివేదిక తర్వాత తెలంగాణాలో ఉద్రిక్తతలు చెలరేగుతాయి కాబట్టి, వాళ్లని చల్లార్చాడానికి ఈ పాతకేసులను ఎత్తేసి, వాళ్లకేదో ఫేవర్ చేసినట్టు పోజు కొట్టి ఆ యిస్యూని తామే ఓ కొలిక్కి తెచ్చిన ఘనత కొట్టేద్దామని హై కమాండ్ ప్లాను వేసుకుని కూర్చున్నారేమో. కానీ యీ లోపున తెరాస అసెంబ్లీ సెషన్‌లో యిదే పెద్ద యిస్యూగా చేసుకుని నానా యాగీ చేసింది. కేసులు ఎత్తివేయకపోతే అప్రతిష్టపాలయి పోతామన్న బెంగ పట్టుకుంది కాంగ్రెస్‌కు. తెరాస కోరగానే ఎత్తేస్తే ఆ క్రెడిట్ వాళ్లకు పోతుంది. ఏడాదిగా వాసెన కట్టి దాచిపెట్టి వుంచిన ముల్లె వాళ్ల ఎదాన పోసినట్టవుతుంది. అందువలన అసెంబ్లీలో తెరాస వారి డిమాండ్‌ను నిర్దాక్షిణ్యంగా తోసి రాజని, ఆ చేసేదేదో మేమే చేద్దాం అనుకున్నారు. అందుకనే వాళ్ల ఎంపీలను దీక్షకు కూర్చోబెట్టారు.

కమ్యూనిస్టులు ప్రభుత్వవ్యతిరేకంగా చీటికి మాటికీ నిరసనలు, ప్రదర్శనలు చేస్తూ వుంటారు. జీతాలు పెంచమంటారు, ధరలు తగ్గించమంటారు. లక్షాతొంభై అంటారు. నేను చిన్నప్పటినుండీ వీళ్లను ప్రతిపక్షంలోనే చూస్తున్నాను. అందుకని అడగడమే చూస్తున్నాను. వీళ్లే ప్రభుత్వంలో వుంటే..? అన్న సందేహం వచ్చి ఓ సారి ఓ కమ్యూనిస్టు నాయకుణ్ని అడిగాను. "బెంగాల్‌లో కూడా యిప్పుడు మీ ప్రభుత్వం ఏర్పడింది కదా! మరి అక్కడా యిలాటి ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు చేస్తారాండి?" అని.

"చేయాలి కదండీ, లేకపోతే పోరాటస్ఫూర్తి చచ్చిపోతుంది. మా అంతట మేమే జీతాలు పెంచేశామనుకోండి. కార్మికులలో పోరాడి సాధించే అలవాటు తప్పిపోతుంది. రేపు మా ప్రభుత్వం పడిపోయి వేరే ప్రభుత్వం వచ్చినపుడు అడగడం మర్చిపోయి, బాధలు సహించే గుణం అబ్బుతుంది. ఇన్నేళ్లగా మేం బిల్డప్ చేస్తూ వచ్చిన స్పిరిట్ చచ్చిపోతుంది. అందుకని జీతాలు పెంచాలని మా ప్రభుత్వం నిర్ణయించినా, మా కార్మికోద్యమ నాయకుల చేత లాంఛనంగా ఓ సమ్మె చేయించి, డిమాండ్ చేయించి అప్పుడు ఔనంటాం. దేనికైనా ఓ పద్ధతి వుండాలి కదా.." అని సమాధానం యిచ్చారాయన.

"ఒకవేళ వాళ్లు మీరు సిద్ధపడినదాని కంటె ఎక్కువ అడిగేస్తే..?"

"అలా ఎలా అడుగుతారు? మేం ముందే చెప్పి పంపేస్తాంగా! మరీ వెర్రివేషాలేస్తే ఆ నాయకుణ్ని పీకేసి మరోణ్ని పెడతాం."

ఆయన చెప్పినది అక్షరాలా జరుగుతున్నట్టు నేను బెంగాల్ వెళ్లాక గమనించాను. ధరలు తగ్గించాలి అనో, శాంతి వర్ధిల్లాలి అనో

ఏదో ఒక ర్యాలీ నెల్లాళ్లకోసారి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిచేది. ప్రభుత్వమే ఆఫీసులు, స్కూళ్లు మూసేసి బంద్ సక్సెస్ అనిపించేది. ఈ ఎఱ్ఱజెండాల వాళ్లు నినాదాలిచ్చేది ఎవరికి వ్యతిరేకంగా? ధరలు తగ్గించాలని ఎవరు ఎవర్ని అడుగుతున్నట్టు? విశ్వశాంతి వద్దు అని ఎవరన్నారు? అన్న సందేహం వచ్చేది మా బోంట్లకు. త్వమేవాహం అన్నట్టు అడిగేదీ నేనే, అడగబడేదీ నేనే! నేను పోరాడేది నాతోనే! అనేది ఆ ప్రభుత్వం. తర్వాత తర్వాత యీ పద్ధతి అనేక రాష్ట్రప్రభుత్వాలు అవలంబించగా చూశాననుకోండి.

5

చెప్పవచ్చేదేమంటే మొన్న క్యాఫ్ట్‌వాళ్లు కూడా 'ఆమరణ నిరాహారదీక్ష' చేపట్టినది వారి ప్రభుత్వానికి వ్యతిరేకంగానే! ఇలాటి ప్రభుత్వంలో వున్నందుకు సిగ్గు పడుతున్నాం అన్నారు సర్వే! ఆయనలాటి వాళ్లను ఎన్నుకున్నందుకు మేమెంత సిగ్గుపడుతున్నామో ఎవరికి చెప్పుకో్?లి! డిసెంబరు 25 వరకు డెడ్‌లైను యిచ్చాం. కేసులు ఎత్తేయలేదు కాబట్టి సోమవారం నుండి దీక్షకు కూర్చున్నాం అన్నారు, పెద్ద అన్నీ టైమ్‌టేబుల్ ప్రకారం నడిచేట్లే! అలా అయితే జనవరి 1 నాటికి రిజైన్ చేసేయాలి, తెలంగాణా యింకా ప్రకటించలేదు కాబట్టి. కేసులు ఎన్ని ఏ స్టేజిల్లో ఎత్తేయాలో ముందే ప్రభుత్వంతో ఫిక్స్ చేసుకుని వీళ్లు దీక్షకు కూర్చున్నారని అందరికీ తెలుసు. దానికి కారణమూ తెలుసు.

తెలంగాణా యివ్వాల్సి వస్తే ఆ ఘనత తెరాసకు పోకూడదని వీళ్ల రోదన. సోనియమ్మగారు అడిగి వుంటుంది. 'మీరడిగినట్లు తెలంగాణా యిస్తే మాత్రం ఏం లాభం? మన మెడలు వంచి యిప్పించాడన్న ఫీలింగుతో కెసియార్‌కే పట్టం కడతారు తప్ప' అని. 'మీకెందుకమ్మా, ఆ ఉద్యమాన్ని మా చేతిలోకి తీసుకుని మేం కూడా లీడర్లుగా తయారై వస్తాం' అని కేకే చెప్పి వుంటారు.

సర్వే వంటి మెజారిటీ నాయకులకి అంత ఓపిక లేదు. తెరాస కారు తాము ఎక్కేసి కెసియార్ చేతనే ఆ కారును 10, జనపథ్‌కి నడిపించేద్దామని ప్లాను. సర్వే కెసియార్‌ను వేదికమీద ఓపెన్‌గా ప్రాధేయపడ్డారు – 'మీరు కాంగ్రెస్‌లో చేరి మమ్మల్ని నడిపించండి, మేము మీ వెంట నడుస్తాం' అని. అలా అయితే వాళ్లు కెసియార్‌ను ఎదిరించి, పోటీపడి, తమ కమిట్‌మెంట్ గురించి ప్రజల్ని నమ్మించి కష్టపడనవసరం లేదు. ఆ అవస్థలన్నీ కెసియారే పడతారు. తాము వున్నచోటే వుండి హాయిగా తెలంగాణా ఫలాన్ని అందుకోవచ్చు. దీనిలో సర్దుకోవాల్సింది ఎవరైనా వుంటే అది సోనియా, కెసియార్ మాత్ర?మే!

ఈ ఆఫర్ అందుకోవడానికి కెసియార్ తెలివితక్కువ వారా? కాంగ్రెస్‌లో సోనియా కింద పనిచేయడం ఎంత కష్టమో ఆయనకు తెలియదా? కూచోమంటే కూచోవాలి. దిగమంటే దిగాలి. ఇప్పుడున్న పరిస్థితిలో కెసియార్ సర్వంసహా నాయకుడు. ఆయన ఎంత పిచ్చి స్టేటుమెంటు యిచ్చినా అదేమిటనే సహనాయకుడు లేడు. గట్టిగా మాట్లాడితే 'నేనొక్కణ్నే ఒంటిచేత్తో, ఒంటి వూపిరితో యింతదూరం లాక్కుని వచ్చాను' అంటారు. ఆయనను ఎదిరించినవాళ్లందరూ మట్టిగొట్టుకు పోయారు. లేదా తోకముడిచి మళ్లీ పంచన చేరారు. పార్టీలో ఆయనా, కొడుకూ, కూతురు, మేనల్లుడు యింత మంది పరివేష్టించి వుండగా, తెలంగాణా ఫలం పక్వానికి వచ్చి ఒళ్లో పడే దశలో తన స్వేచ్ఛాస్వతంత్రాలు వదులుకుని వెళ్లి సోనియా పాదాల నాశ్రయించడం కెసియార్‌కు నచ్చే ప్రతిపాదనయేనా?

అందుకే ఆయన సర్వేకు సభాముఖంగానే సమాధానం చెప్పాడు. 'మీరు కాంగ్రెస్‌కు రాజీనామాలు చేసి రండి. మా పార్టీ ద్వారా లక్షల మెజారిటీతో గెలిపించే భారం నాది' అని. అంటే అర్థం ఏమిటి? నేను మీ నాయకురాలి పాదాల వద్దకు రాను. మీరే నా కాళ్ల దగ్గరకు రండి అని. కాళ్ల దగ్గరకు వచ్చాక కెసియార్ ఎలా ట్రీట్ చేస్తారో ఆయనతో పాటు నాయకత్వం వెలిగించిన ఎవర్ని అడిగినా చెప్తారు. కెసియార్‌కు ఒకదానికి కట్టుబడి వుంటారని లేదు. ఆయనకు చిత్తం ఎలా తోస్తే అలా చేస్తారు. మీరు రండి, మీరు రండి అనుకుంటూ సర్వే, కెసియార్ అనుకుంటూ వున్న రోజుల్లోనే ఢిల్లీనుండి కేకే గారు దిగారు, కెసియార్‌పై సొద్దేద్దాం రండి అంటూ. ఢిల్లీనుండి పెద్ద ప్లాను వేసుకుని వచ్చి తమను గట్టెక్కిస్తాడనుకుంటూ వీళ్లంతా ఆయన చుట్టూ చేరారు.

సోమవారం గన్‌పార్క్ వద్ద ఆమరణ నిరాహారదీక్ష మొదలుపెట్టారు. పోలీసులను కోరి తెచ్చుకున్న గడువు దాటిపోయినా కదలలేదు. టీవీ కెమెరాల సాక్షిగా పోలీసులతో ఘర్షణ పడ్డారు. పోలీసులు కొత్త యెత్తు ఎత్తారు. 'న్యూ ఎమ్మెల్యే క్వార్టర్సులో కాంటీను బాగుంటుంది. మీ నిరాహారదీక్షకు అనువైన చోటు' అని ఆశ పెట్టారు. వీళ్లు భలే భలే అనుకుని అక్కడకు కదిలి వెళ్లారు. వెళ్లాక ఒక్కోళ్లు వంతులవారీగా గంటా రెండు గంటలు మిస్సయ్యారని సాక్షి రాసింది. సాక్షి రాసేది అన్యాయం. కదలకుండా కూచుంటే 'డయాబెటిస్‌వాళ్లు అన్ని గంటలసేపు ఏమీ తినకుండా ఎలా కూర్చున్నారు?' అని సందేహాలు రేకెత్తించేది వాళ్లే. పోనీ అలా అని ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటే తప్పు పట్టేదీ వాళ్లే.

తారీకు మారేలోపున వాళ్లు ప్రభుత్వాన్ని దుయ్యబట్టడం, హెూం మంత్రిని నానా తిట్లూ తిట్టడం, మా ప్రాణాలు గడ్డిపోచ అని డిక్లేర్ చేయడం (మేమూ అదే అనుకుంటున్నాం సుమండీ) పనిలోపనిగా పోలీసు బెటాలియన్లు వెనక్కి వెళ్లిపోవాలని బెదిరించడం (మర్నాటి కల్లా యీ డిమాండ్ మర్చిపోయి దీక్ష విరమించేశారు), డిసెంబరు 31 తర్వాత యిదే స్ఫూర్తితో తెలంగాణాకై రాజీనామాలు చేస్తాననడం (తెలంగాణా రాలేదు, వీళ్లింకా రిజైన్ చేయలేదు) – యిలాటి డ్రామాలన్నీ ఆడేశారు. వీళ్లిక్కడేదో ప్రాణత్యాగం చేసేస్తున్నట్లు జిల్లాలలో వీళ్ల అనుయాయులు సంఘీభావదీక్షలు మొదలు పెట్టారు. మంగళవారం పొద్దున్న కల్లా 'లా వొక్కింతయు లేదు' అనే పద్యాలు వినపడ్డాయేమో ప్రభుత్వం వారు కేసులన్నీ ఎత్తేస్తూ ప్రకటన రెడీ చేసేసి పెట్టుకున్నారు. ఏనొన్ను చేసేయమంటారా? అని

కేకేను అడిగారు.

అయితే కేకేగారు దీన్నుంచి మాగ్జిమమ్ పబ్లిసిటీ రాబట్టాలనే యావలో వున్నారు. (ఇన్నాళ్లకు యిలా ఓ రోజు దీక్ష చేస్తున్నాం, మళ్లీ యిప్పట్లో ఏం చేస్తాం, వచ్చే ప్రచారం అంతా యిప్పుడే రావాలి అని ఆయన లెక్క) 'కాస్త ఆగండి, జిల్లాలనుండి మన కార్యకర్తలు తరలి వస్తున్నారు, వాళ్లు వచ్చేసరికి మేమేదో బలిపీఠం ఎక్కబోతున్నట్టుగా బిల్డప్ యివ్వాలి తప్ప, అప్పటికే దీక్ష విరమించేసి హాయిగా అన్నీ ఆరగిస్తూ కనబడితే బాగుండదు. వాళ్లు వచ్చి వెళ్లాక మీరు ప్రకటన యిచ్చి, మా చేత దీక్ష మాన్పించండి' అన్నారు కేకే. సరే కానీయండి అంది కిరణ్ ప్రభుత్వం. అసలే చలికాలం. కాంగ్రెస్ కార్యకర్తలు నిద్ర లేచి హైదరాబాదుకి తరలి వచ్చేసరికి కొంత టైము పట్టింది. ఈ లోపునే అనర్థం జరిగింది.

## 6

స్క్రీన్‌ప్లే రైటర్స్‌కి తెలియకుండా ఓ పాత్ర రంగప్రవేశం చేసింది. ఛట్ ఎందుకు వచ్చావ్? అని తరిమేయడానికి అది మామూలు లాకాయి లూకాయి పాత్రకాదు. కెసియార్! దీక్షా శిబిరానికి మిట్టమధ్యాహ్నం పలకరించడానికి వచ్చారాయన. రెడీ సినిమాలో తను ఉత్తుత్తి పాత్రలు కల్పిస్తే అవి జీవం పోసుకుని రక్తమాంసాలతో సాక్షాత్కరించేసరికి తికమక పడిన బ్రహ్మానందంలా వీళ్లు కెసియార్‌ను చూసి కంగారు తిన్నారు. కెసియార్ తనను యావత్తు తెలంగాణాకు ప్రతినిధిగా ప్రొజెక్టు చేసుకుంటూ 'నాలుగు కోట్ల తెలంగాణా ప్రజలకు ప్రాతినిథ్యం వహిస్తూ నేను వచ్చాను. మీ దీక్షకు అండగా నిలుస్తున్నాను. ఈ ముష్కర ప్రభుత్వం సాయంత్రం లోగా కేసులు ఎత్తివేయకపోతే దీని పని ఎలా పట్టాలో నేను సాయంత్రం వచ్చి ప్లాను చెప్తాను. అలా చేయండి' అని మార్గనిర్దేశం గట్రా చేసి వెళ్లారు.

సపోజింగ్ కురుక్షేత్రంలో అర్జునుడు విషాదయోగం అభినయించకుండా గతంలో ఉత్తర గోగ్రహణ వేళ తన పాటికి తను యుద్ధం చేసుకున్నట్లే యిప్పుడూ చేసుకుంటున్నాడనుకోండి. మధ్యలో కృష్ణుడు ప్రత్యక్షమై 'నువ్వేమిటి చంపేది నీ మొహం, చంపేది నేనే, చంపించేది నేనే' అని హడావుడి చేసి అందరి ఎదుటా గీతోపదేశం చేస్తే ఫల్గుణుడు చిన్నబోడూ? కేకేకూడా చిన్నబోయారు. 'ప్రభుత్వం ఏమీ చేయకపోవడమేమిటి? అన్ని ఏర్పాట్లూ చేసుకునేగా మేము కూర్చున్నది!" అని ఓపెన్‌గా చెప్పలేరు కదా పాపం! తలకాయ వూపారు. ఈ వ్యవహారం కిరణ్‌కి తెలిస్తే 'కెసియార్ వచ్చి, ఫెయిలయి, భంగపడిన తర్వాతనే కేసులు ఎత్తివేసే ఆర్డర్ రిలీజ్ చేద్దాం. కావాలంటే ఎమ్మెల్యే క్వార్టర్స్ కాంటీన్‌లో మెనూ పెంచుదాం, మరో రోజుకు దీక్ష పెంచండి'. అని చెప్పివుండేవారేమో!

ఈ కెసియార్ గొడవేమీ తెలియక ప్రభుత్వవర్గాలు కేకే గారు ముందుగా చెప్పిన టైముకి ఆర్డరు రిలీజ్ చేసి పడేశారు. ఒక యింట్లో నలుగురు కోడళ్ల మధ్య అత్తగారు పనివిభజన చేసిందట. ఫలానా యిన్నింటికి పెద్ద కోడలు విస్తళ్లు వేయాలి, యిన్నింటికి రెండో కోడలు పీటలు వేసి మంచినీళ్లు పెట్టాలి, యిన్నింటికి మూడో కోడలు వడ్డించాలి, యిన్నింటికి నాలుగో కోడలు విస్తళ్లు ఎత్తేయాలి అని. అంతా రెగ్యులర్‌గా చేసేసేవారట. ఒకవేళ మగవాళ్లు టైముకి భోజనానికి రావడం కుదరక ఆలస్యమైనా సరే, నాలుగో కోడలు ఠంచన్‌గా విస్తళ్లు ఎత్తి పారేసేదట, ఆ పాటికి తింటున్నా, తినకపోయినా సరే, టైమంటే టైమే! మన కిరణ్‌గారి ప్రభుత్వమూ అలాగే యీ ఆర్డర్ రిలీజ్ పడేసింది – కెసియార్ ఫ్యాక్టర్‌ను పరిగణనలోకి తీసుకోకుండా!

దాంతో మన క్యాఫ్‌వాళ్ల దీక్షంతా యీనగాచి నక్కలపాలైంది. కెసియార్ వచ్చి వార్నింగ్ యివ్వడంతో ప్రభుత్వం కేసులు ఎత్తేసింది అన్న పేరు వచ్చింది. అమర్చినదానిలో అత్తగారు వేలెట్టింది అని సామెత. అంటే కోడలు కష్టపడి అన్నీ ఏర్పాటు చేసి పెడితే ఆఖరిలో అత్తగారు వచ్చి ఆ పూలకూజా యిటు మార్చో, యీ కుర్చీ అటు జరిపో మొత్తం క్రెడిట్ కొట్టేసిందట. కెసియార్‌కూడా అలా మన ఖ్యాతి తన్నుకుపోయేరేమిటి అని కిరణ్ క్యాఫ్‌వాళ్లను నిలదీశారట. ఆయన వస్తాడని మాకు తెలియదండీ అన్నారట వీళ్లు. 'ఆళ్లూ, ఆళ్లూ ఒకటే. కెసియార్ చెప్పినట్టే ఆడతారు యీళ్లు. తెలియకుండా వుంటుందా, మన పార్టీ పేరును డౌన్ చేసి కెసియార్‌ను పైకెత్తేస్తున్నారు యీళ్లు' అంటారు ఆంధ్రప్రాంతపు కాంగ్రెస్ నాయకులు.

తనకింత క్రెడిట్ అయాచితంగా వస్తున్నా కెసియార్ తీసుకోవడం లేదు. ''అబ్బే నాదేముంది? అంతా క్యాఫ్‌వారి ఘనతే! మేం అసెంబ్లీ ఆరురోజులు స్తంభింపజేసినా పనైందా? లేదు కదా! అదే వాళ్లు ఓ రోజు కూర్చోగానే ప్రభుత్వం దిగి వచ్చింది. దీన్ని బట్టి తేలేదేమిటి? తెలంగాణా రాలేదని మమ్మల్ని తప్పుపట్టి ప్రయోజనం లేదు. ఆ కాంగ్రెస్‌వాళ్లనే గట్టిగా ఓ పట్టు పట్టండి. వాళ్లు మళ్లీ నిరాహారదీక్షకు కూర్చుంటే తెలంగాణా యిచ్చి మాన్పిస్తారు. తెలంగాణా రాలేదంటే అర్థం – వీళ్లకు చిత్తశుద్ధి లేదని! అంథా వాళ్లలోనే వుంది. డిసెంబరు 31 తర్వాత వాళ్లు రాజీనామాలు చేస్తే నిమిషాల్లో వస్తుంది. మేం చేసి ప్రయోజనం లేదు" అని.

దీన్ని ఔననలేని, కాదనలేని పరిస్థితి క్యాఫ్ వాళ్లది. దీన్నే హార్న్స్ ఆఫ్ డైలమా అంటారు. 'మీ ఆవిణ్ని కొట్టడం మానేశారా?' అని ఎవరైనా అడిగారనుకోండి. 'అవును' అంటే ఇంతముందు కొట్టేవాడన్న అర్థం వస్తుంది. 'లేదు అంటే యింకా కొడుతున్నారన్న అర్థం వస్తుంది. పెళ్లాన్ని ఎప్పుడూ కొట్టనివాడు సమాధానం చెప్పలేని స్థితి యిది. 'అబ్బే మేం ముందే అనుకుని కూర్చున్నాం కాబట్టి కానీ లేకపోతే మా మాట వినేదెవడు?' అని వీళ్లు గట్టిగా చెప్పుకోలేరు కదా. అలా అని 'తెలంగాణా యివ్వకపోతే మేం రిజైన్ చేసేస్తాం. మళ్లీ దీక్ష పట్టేసి, తెలంగాణా తెచ్చేస్తాం' అని గట్టిగా అనలేని పరిస్థితి కదా! ఆయనే వుంటే మంగలాడెందుకు అన్నట్టు వాళ్లకే అంత సత్తా వుంటే కెసియార్ వెంబడి తిరగడం దేనికి? అందువల్ల కెసియార్ యిచ్చిన కిరీటాన్ని ధరించకుండా పుచ్చుబఠాణీ నమిలిన

వేదాంతిలా ఓ వెర్రి నవ్వు నవ్వి 'మాదేముంది లెండి, మా చేతిలో వున్నది మేం చేశాం. అంతా పై వారి దయ' అని వూరుకున్నారు.

కానీ కెసియార్ వూరుకుంటారా? కేంద్ర బలగాలను వెనక్కి పంపించేయాలన్న డిమాండ్‌ను వీళ్లు మర్చిపోయిన విషయం గుర్తు చేస్తూ 'పోలీసు బెటాలియన్లు వచ్చి కూర్చున్నాయి, మరి వీళ్ల పొలిటికల్ బెటాలియన్లు ఏం చేస్తున్నాయి?' అంటూ కవ్విస్తున్నారు. వీళ్లు కిమ్మనకుండా పేరంటానికి వచ్చిన ముత్తయిదువుల్లా కూర్చున్నారు. అసలు ఆ డిమాండే అర్థరహితం. ''మేం ప్రయివేటు, పబ్లిక్ ఆస్తులు ధ్వంసం చేస్తాం, అడ్డువచ్చిన ప్రభుత్వాధికారులను కొడతాం, మామీద కేసులు పెట్టకూడదు, పెట్టిన కేసులు ఎత్తేయాలి, మేం నేరం చేయకుండా అడ్డుకోవడానికి ఏ బలగాలూ వుండకూడదు" అని ఎవరైనా పబ్లిగ్గా డిమాండ్ చేయగలరా?

కానీ తెలంగాణావాదులందరూ చేస్తున్నారు. ప్రతిపక్షంలో వున్నవాళ్లు చేసినా చెల్లిపోతుంది. కానీ ప్రభుత్వంలో వుంటూనే ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని అడ్డుకోవద్దని డిమాండ్ చేయడం చాలా కష్టం. ఇలాటి యిరకాటపు స్థితిలోకి క్యాష్ట్‌వాళ్లు పోయి పోయి యిరుక్కున్నారు. అందువలన వారి దీక్షను ఫ్లాప్ షో అనే చెప్పాలి. కేసులు ఎత్తేశారు కాబట్టి దీక్ష సక్సెసనుకోవడానికి వీల్లేదు. దాని వలన వీళ్లు బావుకున్నది ఏమీ లేకపోగా కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. అందుకని ఫ్లాప్ అంటున్నాను.

ఇదీ మూడు దీక్షల కథ. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2011)**